ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

హైదరాబాద్ 8-10-2024 మంగళవారం సిటీ సంపుటి 51. సంచిక 59

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



విక్టర్ ఆంబ్రోస్



గ్యారీ రవ్‌కున్

మైక్రోఆర్ఎన్ఏ ఆవిష్కర్తలకు ‘వైద్య’ నోబెల్

- అమెరికన్ శాస్త్రవేత్తలు ఆంబ్రోస్, రవ్‌కున్‌కు పురస్కారం
- క్యాన్సర్ చికిత్సకు కొత్త దారిచూపిన పరిశోధన

13లో

మూసీ సంరక్షణ ఎంతో అవసరం

- నిర్వాసితులకు న్యాయం చేస్తాం
- ఇకపై ఆక్రమణలు లేకుండా చూస్తాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి వ్యాఖ్యలు

ఈనాడు, హైదరాబాద్: ‘మూసీ నది పునరుజ్జీవం మన అందరి ధ్యేయం. గ్లోబల్ నగరంగా మారుతున్న హైదరాబాద్‌కు ఇది ఎంతో అవసరం’ అని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. మూసీ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని ...మిగతా 2లో



హైదరాబాద్‌లో గత పదేళ్లలో చెరువుల ఆక్రమణలపై ఉపగ్రహ చిత్రాల సాయంతో వివరిస్తున్న భట్టివిక్రమార్క

వరద నష్టం పనులకు రూ.11,713 కోట్లివ్వండి

రాష్ట్ర పునర్విభజన సమస్యలను పరిష్కరించండి

- వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల జాబితాలో మరో మూడింటిని చేర్చండి
- 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించండి
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, మరమ్మతుల కోసం వెంటనే రూ.11,713 కోట్లు ఇవ్వాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. సోమవారం ఇక్కడ అమిత్‌షా ఆధ్వర్యంలో జరిగిన వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సులో రేవంత్ పాల్గొన్నారు. అనంతరం కేంద్రమంత్రి నివాసానికి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని హోంమంత్రికి వివరించి.. సాయం కోరారు. ...మిగతా 2లో



అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మూడు ప్రధాన ప్రాజెక్టులకు నిధులివ్వండి

- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అభ్యర్థన

2లో

నేడే కౌంటింగ్

- హరియాణా, జమ్మూ కశ్మీర్ ఫలితాలపై ఉత్కంఠ

13లో

ఎన్ఐసీ చేతికి ధరణి

6లో

- మంత్రి పొంగులేటి ఆదేశాలతో అప్పగింత

ధరలున్నా... రైతుకు దగా!

వినియోగదారులు చెల్లిస్తున్న దాంట్లో అధికభాగం ఇతరులకే

- మధ్యవర్తులు, ఖర్చుల వాటా ఏకంగా 67%
- అన్నదాతకు దక్కుతోంది 33 శాతమే
- కూరగాయల ద్రవ్యోల్బణంపై ఆర్‌బీఐకి నిపుణుల బృందం నివేదిక
- సరఫరా వ్యవస్థలో లోపాలను సరిచేయాలని సూచన



ఎవరికి ఎంత శాతం దక్కుతోందంటే	టమాటా	ఉల్లి	ఆలు
రైతు	33.5%	36.2%	36.7%
తొలి ట్రేడర్	21.3%	17.6%	16.2%
హోల్‌సేల్ వ్యాపారి	16.1%	15%	16.1%
రిటైలర్	29.1%	31.2%	31%
	2022లో క్వింటా రూ.1229 నుంచి రూ.3671 మధ్య	2022లో క్వింటా రూ.1089 నుంచి రూ 3009 వరకు	2022లో క్వింటా రూ.1049 నుంచి రూ.2856 మధ్య

ఈనాడు - హైదరాబాద్

దేశంలో ప్రజలు అత్యధికంగా ఉపయోగిస్తున్న టమాటా, ఉల్లి, ఆలుగడ్డల ధరలు ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లోనూ ఆకాశాన్నంటుతున్నాయి. వీటికి వినియోగదారులు ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. అంటే వాటిని ఉత్పత్తి చేస్తున్న రైతులకు అధిక మేలు జరగాలి. కానీ, మధ్యవర్తులే లాభాలు గడిస్తున్నారు. ఎండనక, వాననక ఆరుగాలం శ్రమించి, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని చెమటోడ్చి పండిస్తున్న అన్నదాతలకు రూపాయిలో 33 నుంచి 37 పైసలు మాత్రమే దక్కుతోంది. ఈ నేపథ్యంలో కూరగాయల ద్రవ్యోల్బణంపై... రైతు నుంచి రిటైలర్ వరకు ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి నిపుణుల బృందం రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కోసం అధ్యయనం చేసింది. తన నివేదికను ఇటీవల సమర్పించింది. దీన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్ పాలసీ రీసెర్చ్ విభాగం ప్రచురించింది. అనేక ఆటుపోట్లను తట్టుకొని సాగు చేస్తున్న రైతుకు రూపాయిలో మూడోవంతు కూడా దక్కడం లేదని ఈ నివేదిక తేల్చింది. రూపాయిలో 63 నుంచి 67 పైసల వరకు... రైతు నుంచి వ్యవసాయ మార్కెట్‌లో దిగుబడులు కొనుగోలు చేసే ట్రేడర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటెయిలర్ల కమీషన్లు, రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్, నిల్వ ఛార్జీలు రూపంలో పోతోంది. ఈ కారణంగా ధరలు పెరిగి... వినియోగదారుడిపై మోయలేని భారం పడుతోంది. ...మిగతా 2లో

2026 మార్చికల్లా నక్సలిజం నిర్మూలన

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటన
- మావోయిస్టులే మానవహక్కుల అతిపెద్ద ఉల్లంఘనులని విమర్శ
- గత పదేళ్లలో హింసాత్మక ఘటనలు గణనీయంగా తగ్గాయని వెల్లడి
- నక్సల్ ప్రభావిత రాష్ట్రాల సీఎంలు, మంత్రులతో సదస్సు

5లో



బతుకమ్మ ఆడుతున్న కాల్వ సుజాత, శోభారాణి, శివానీ, కొండా సురేఖ, సీతక్క, మైనంపల్లి వాణి, నేరెళ్ల శారద తదితరులు

రెండేసి పూలేసి చందమామ.. రెండు జాములాయె చందమామ!

బతుకమ్మ ఆడిపాడిన మహిళా మంత్రులు, నేతలు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మైనంపల్లి స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అధ్యక్షతన నిర్వహించిన మన ఇంటి బతుకమ్మ సంబరాల్లో మంత్రులు కొండా సురేఖ, సీతక్కతోపాటు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శోభారాణి, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కాల్వ సుజాత, మైనంపల్లి వాణి, శివానీ తదితరులు బతుకమ్మ ఆడారు. గాయని మంగ్లీ ఆటపాటలు ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ధరలున్నా... రైతుకు దగా!

(మొదటి పేజీ తరువాయి)

టమాటా, ఉల్లి, ఆలుగడ్డల సాగు, ఉత్పత్తి, రవాణా, నిల్వ, విక్రయాలు, ధరలు... ఇలా అన్ని అంశాలపై 2012 నుంచి 2022 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ మార్కెట్లు, హోల్‌సేల్ మార్కెట్ల నుంచి తీసుకొని నిపుణుల బృందం ఈ నివేదికను రూపొందించింది. సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపింది. రైతు చేతికి దిగుబడి వచ్చినప్పటి నుంచి వినియోగదారుడిని చేరే వరకు అవసరమైన వాల్యూచెయిన్ సరిగా లేకపోవడంతో దళారులకు దోచుకోవడానికి అవకాశం ఏర్పడిందని వెల్లడించింది. ఫలితంగా రైతు నుంచి వినియోగదారు చేతికి వచ్చేటప్పటికి అనేక పరిణామాలు చోటు చేసుకొంటున్నట్లు తెలిపింది. అంటే అటు ఉత్పత్తిదారు... ఇటు వినియోగదారు ఇద్దరూ నష్టాలే ఎదుర్కొంటున్నారు.


ఆలు... అంతా సన్నకారు రైతులే


ఆలుగడ్డల ఉత్పత్తి 2014-15లో 48 మిలియన్ టన్నులుండగా... 2022-23 నాటికి 60.1 మిలియన్ టన్నులకు చేరింది. సాగు విస్తీర్ణం 20.7 లక్షల హెక్టార్ల నుంచి 23.3 లక్షల హెక్టార్లకు పెరిగింది. మొత్తం ఉత్పత్తిలో ఉత్తర్‌ప్రదేశ్‌లోనే రబీలో 32% వస్తుంది. పశ్చిమబెంగాల్‌లో 24%, బిహార్‌లో 16%, గుజరాత్‌లో 7% ఉంది. వీటిని పండించే వారిలో 86.7% మంది సన్నకారు రైతులే. ఏపీఎంసీ మార్కెట్లలోని కోల్డ్ స్టోరేజీ ప్లాంట్ల వద్ద వ్యాపారం జరుగుతుంది. రవాణా, లేబర్ ఛార్జీలతోపాటు స్టోరేజీకి క్వింటాకు రూ.250 నుంచి రూ.260 వరకు రైతులు చెల్లించాల్సి ఉంటుంది.

ఉల్లిలో రబీ నిల్వలే కీలకం

ఉల్లి ఉత్పత్తి 2014-15లో 18.9 మిలియన్ టన్నులుండగా... 2022-23 నాటికి 30.2 మెట్రిక్ టన్నులకు పెరిగింది. సాగు విస్తీర్ణం 11.7 లక్షల హెక్టార్ల నుంచి 17.4 లక్షల హెక్టార్లకు పెరిగింది. మొత్తం ఉల్లి ఉత్పత్తిలో 80% మహారాష్ట్ర, గుజరాత్; రాజస్థాన్‌లలోనే ఉంది. ఉత్పత్తిలో 77% రబీలోనే వస్తుంది. రబీలో వచ్చే ఉల్లిని మాత్రమే నిల్వ చేయగలరు. ద్రవ్యోల్బణం కట్టడిలో ఈ నిల్వలు చాలా కీలకం. ప్రభుత్వం నాఫెడ్ ద్వారా సేకరించి, పంట తక్కువ వచ్చినప్పుడు విడుదల చేస్తుంది. ఉల్లి క్వింటా దిగుబడికి ఖర్చు అతి తక్కువగా మధ్యప్రదేశ్‌లో రూ.341.07. తమిళనాడులో అతి ఎక్కువగా రూ.2305. ఆంధ్రప్రదేశ్‌లో రూ.965.27 ఖర్చవుతుంది. ఉల్లిని ఎక్కువగా ఏపీఎంసీ మార్కెట్‌లో బహిరంగ వేలం ద్వారా రైతుల నుంచి వ్యాపారులు కొంటారు. లేబర్ ఛార్జీలు, మండీలకు రవాణా ఛార్జీలను రైతులే భరించాల్సి ఉంటుంది. వేలం ద్వారా కమీషన్ ఏజెంట్ల సాయంతో వ్యాపారులు తెచ్చుకొంటారు. మండి ఛార్జీలు 1%, కమీషన్ ఛార్జీలు 4%, లోడింగ్, అన్‌లోడింగ్ ఛార్జీలు క్వింటాలుకు రూ.9.02 చెల్లించాల్సి ఉంటుంది. ప్యాకింగ్, బరువు తగ్గితే వచ్చే నష్టం అధికం. ఇలాంటి నష్టం ఖరీఫ్‌లో 10%, రబీలో 5% ఉంటుంది.

◆ ఉల్లి ఎగుమతులు కూడా ఎక్కువే. 2022-23లో 2.6 మిలియన్ టన్నులు ఎగుమతి చేశారు. ఇది మొత్తం ఉత్పత్తిలో 8.6%. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, సింగపూర్ తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. టమాటా, ఆలుగడ్డల ఎగుమతి మాత్రం రెండు శాతమే.






రాష్ట్రాల వారీగా ఉల్లి ఉత్పత్తి (శాతం) 2022-23

ఒడిదొడుకుల టమాటా

టమాటాను ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో ఎక్కువగా పండిస్తారు. మొత్తం ఉత్పత్తిలో 67% రబీలోనే వస్తుంది. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో ఏడాదంతా పండిస్తారు. పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో మాత్రం నవంబరు-జనవరి మధ్య పంట వస్తుంది. మొత్తంగా 2014-15 నుంచి 2022-23కు మధ్య హెక్టారుకు దిగుబడి 21.3 టన్నుల నుంచి 24 టన్నులకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో హెక్టారుకు 27.3 టన్నుల నుంచి 43.3 టన్నులకు దిగుబడి పెరిగింది. ఇతర ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల్లో మాత్రం దిగుబడి తగ్గింది. నిపుణుల బృందం సభ్యులు దిల్లీలోని అగ్‌మార్కెట్‌లో 2021-22లో జరిగిన విక్రయాల రిటైల్ ధరలపై అధ్యయనం చేశారు. వినియోగదారుడు చెల్లించే ధరలో టమాటా రైతుకు 33.5% మాత్రమే దక్కుతున్నట్లు తేలింది. అంటే కిలోకు రూపాయి వస్తే... రైతుకు దక్కేది 33.5 పైసలు మాత్రమే. ఇందులో రవాణా, లేబర్ ఛార్జీలు కలిసే ఉన్నాయి. రైతు శ్రమ అదనం.



కర్ణాటక 9%

రాష్ట్రాల వారీగా టమాటా ఉత్పత్తి (శాతం) 2022-23

మూసీ సంరక్షణ ఎంతో అవసరం

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయంలో ఆయా కుటుంబాలు ఎలాంటి అపోహలకు గురికావద్దని హామీ ఇచ్చారు. నగరంలోని చెరువులు మరింత అన్యాక్రాంతం కాకుండా చూడటమే తమ లక్ష్యమని వివరించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లి లబ్ధి పొందాలని చూస్తున్నాయని విమర్శించారు. మూసీ నదిలో ఆక్రమణలు, హైడ్రాలపై సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఒకప్పటి హైదరాబాద్ అంటే రాక్స్, పార్క్స్, లేక్స్

''హైదరాబాద్ అంటే ఒకప్పుడు రాక్స్, పార్క్స్, లేక్స్ అని చెప్పుకొనేవారు. కాలక్రమంలో రాక్స్ అంతరించిపోగా.. పార్కులు, చెరువులు కబ్జాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా మేల్కొనకపోతే వీటిని కూడా కాపాడుకోలేం. సమాజానికి మేలు చేయాలన్న సదుద్దేశంతో మూసీ నది పునరుజ్జీవం, చెరువుల్లో ఆక్రమణల నిరోధానికి ప్రభుత్వం బృహత్ ప్రయత్నం చేస్తోంది. ఇందులో ఎవరి వ్యక్తిగత ఎజెండా లేదు. మధ్య తరగతి వారికి ఇల్లు కట్టుకోవడం ఎంత కష్టమో, దాన్ని కూల్చివేస్తే కలిగే బాధ ఏంటో నాకు తెలుసు. ఎవరికీ నష్టం కలిగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయమే తీసుకుంటాం.

అపోహలు సృష్టిస్తున్నారు..

మూసీ నది పునరుజ్జీవం పనులన్నీ ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నప్పటికీ టెండర్లు పిలిచినట్లు, రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు అపోహలు సృష్టిస్తున్నారు. ఇదే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఒకప్పుడు మూసీ నదిపై ఆక్రమణలను నిర్ద్వంద్వంగా కొట్టేయాల్సిందేనని చెప్పిన విషయాన్ని గుర్తుచేసుకోవాలి. మూసీలో పట్టాలు లేకుండా గుడిసెలు వేసుకున్న వారికి కూడా పునరావాసం కల్పిస్తాం. పునరావాసం విషయంలో సూచనలు కోరుతూ త్వరలోనే ప్రతిపక్ష పార్టీలు, నాయకులకు లేఖలు రాస్తా'' అని భట్టి వివరించారు.

చెరువుల ఆక్రమణలు ఇలా..

2014, 2023లో ఉపగ్రహం తీసిన హైదరాబాద్ పరిసరాల్లోని చెరువుల చిత్రాలను చూపుతూ.. వాటిలో గత పదేళ్లలో జరిగిన ఆక్రమణలను రిమోట్ సెన్సింగ్ సమాచారం ద్వారా భట్టి వివరించారు. ''హైదరాబాద్‌లో మొత్తం 920 చెరువులు ఉండగా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే (2014లో) నాటికి వాటిలో 225 చెరువులు పూర్తిగా, 196 పాక్షికంగా ఆక్రమణలకు గురయ్యాయి. 499 చెరువులు ఎలాంటి ఆక్రమణలకు గురికాలేదు. 2014 నాటికి ఏమాత్రం ఆక్రమణలు లేని చెరువుల్లో 20, పాక్షికంగా ఆక్రమణలకు గురైన చెరువుల్లో 24 కలిపి మొత్తం 44 చెరువులను గత పదేళ్లలో పూర్తిగా ఆక్రమించేశారు. ఇక 2014 నాటికే పాక్షికంగా ఆక్రమణలకు గురైన వాటిలో 127 చెరువులు గత పదేళ్లలో ఇంకాస్త ఎక్కువ అన్యాక్రాంతమయ్యాయి.

ఓఆర్ఆర్ లోపల..

ఓఆర్ఆర్ లోపల ఉన్న 695 చెరువుల్లో 2014 నాటికి 196 పాక్షికంగా అన్యాక్రాంతమయ్యాయి. ఇక్కడ 2014 తర్వాత 171 చెరువులు కబ్జాకు గురయ్యాయి. 2014 నాటికి ఏమాత్రం ఆక్రమణలు లేని చెరువుల్లో 20 పూర్తిగా, 57 పాక్షికంగా ఆక్రమణలకు గురయ్యాయి. అప్పటికే ఆక్రమణల్లో ఉన్న వాటిలో 24 పూర్తిగా, 70 ఇంకాస్త ఎక్కువ అన్యాక్రాంతమయ్యాయి. మొత్తం 386.71 ఎకరాలు ఈ పదేళ్లలో కబ్జాకు గురయ్యాయి. ఇవన్నీ ఎఫ్‌టీఎల్ పరిధిలోవే. బఫర్ జోన్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఆక్రమణలు ఇంకా ఎక్కువ ఉంటాయి'' అని భట్టి వివరించారు.

మూడు ప్రధాన ప్రాజెక్టులకు నిధులివ్వండి

- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

ఈనాడు, దిల్లీ: హైదరాబాద్ నగర ముఖచిత్రాన్ని మార్చే మూడు ప్రధాన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులిచ్చి మద్దతుగా నిలవాలని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. నక్సల్ ప్రాబల్య రాష్ట్రాల సీఎంల సదస్సులో పాల్గొనడానికి దిల్లీకొచ్చిన రేవంత్.. సోమవారం ఇక్కడ కేంద్ర మంత్రిని కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు.

◆ ''హైదరాబాద్ సమగ్ర మురుగునీటి పారుదల మాస్టర్‌ప్లాన్ (కాంప్రహెన్సివ్ సీవరేజ్ మాస్టర్‌ప్లాన్-సీఎస్ఎంపీ)ని అమృత్ 2.0 పథకంలో చేర్చండి. వీలుకాకపోతే ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టండి. నగర ప్రజల జీవనప్రమాణాలు ప్రపంచస్థాయిలో ఉండాలంటే నగరంతో పాటు సమీప మున్సిపాలిటీల నుంచి వెలువడే ద్రవ వ్యర్థాలను 100 శాతం శుద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు సమీప 27 పురపాలక సంఘాలను కలిపి 7,444 కి.మీ. మేర మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి రూ.17,212.69 కోట్లతో డీపీఆర్ రూపొందించాం. దీన్ని అమృత్ 2.0లో చేర్చి ఆర్థిక సాయం చేయాలి.

◆ హైదరాబాద్ నగరం గుండా ప్రవహించే మూసీ నదిలో మురుగు చేరకుండా ఉండేందుకు ప్రధాన మురుగు కాలువలు, కొత్త మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో రూపొందించిన డీపీఆర్‌ను ఆమోదించడంతో పాటు పనులకు అనుమతించాలి.

◆ హైదరాబాద్ మెట్రో రెండోదశ విస్తరణకు రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశాం. దీన్ని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం 50:50 నిష్పత్తిలో సంయుక్తంగా చేపట్టడానికి అనుమతివ్వాలి. త్వరలోనే ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను సమర్పిస్తాం. నగర అవసరాల దృష్ట్యా ఈ ప్రాజెక్టు త్వరగా కార్యరూపం దాల్చేందుకు సహకరించాలి'' అని కేంద్ర మంత్రి ఖట్టర్‌ను రేవంత్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జి.వంశీకృష్ణ, దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.



కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

అత్త చెవిని కొరికేసిన కోడలు

- కుటుంబ కలహాల నేపథ్యంలో దారుణం
- ఊడిపడిన చెవిని అతికించలేమన్న వైద్యులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ కోడలు అత్త చెవిని అతి దారుణంగా కొరికేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన మేరకు గుంటూరు జిల్లా తుళ్లూరులో నివసిస్తున్న కంభంపాటి శేషగిరి, పావని(30) దంపతులకు ఇద్దరు కుమారులు. కొన్ని రోజులుగా కోడలు పావనికి అత్తగారు నాగమణి(55)కి కుటుంబ కలహాల కారణంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గొడవ జరిగింది. ఆ సమయంలో కోడలు.. అత్త చెవిని కొరికేయడంతో ఆ మొత్తం భాగం ఊడిపోయింది. అనంతరం తెగిన చెవిని, నాగమణిని స్థానికులు తుళ్లూరు పీహెచ్‌సీకి, అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆలస్యం కావడంతో తెగిన చెవి అతుకోవడం కష్టమని వైద్యులు చెప్పినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు వాపోయారు. బాధితులు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

వరద నష్టం పనులకు రూ.11,713 కోట్లివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

''రాష్ట్రంలో సంభవించిన వర్షాలు, వరదల కారణంగా 37 మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షకుపైగా పశువులు, ఇతర మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రహదారులు, కల్వర్టులు, కాజ్‌వేలు, చెరువులు, కుంటలు, కాలువలు ధ్వంసమయ్యాయి. వరదల సమయంలో తక్షణ సాయం కోసం రూ.5,438 కోట్లు విడుదల చేయాలని సెప్టెంబరు 2న లేఖ రాశాం. ఆ తర్వాత పంట, ఇతర నష్టాలపై కేంద్ర బృందం పర్యటించి.. రూ.11,713 కోట్ల మేర నష్టం వాటిల్లిందని సెప్టెంబరు 30న నివేదిక సమర్పించింది. ఆ నిధులను వెంటనే విడుదల చేయించండి. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎస్‌డీఆర్ఎఫ్ మొదటి, రెండో విడతల కింద తెలంగాణకు రూ.416.80 కోట్లను కేంద్రం విడుదల చేసింది. దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతు పనులకు విడుదల చేసే నిధులను ఎస్‌డీఆర్ఎఫ్ నిధులతో ముడిపెట్టొద్దు'' అని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సీఆర్పీఎఫ్ జాయింట్ టాస్క్‌ఫోర్స్ క్యాంపులు ఏర్పాటు చేయండి

వామపక్ష తీవ్రవాద ప్రభావిత(ఎల్‌డబ్ల్యూఈ) జిల్లాల జాబితాలో నుంచి తొలగించిన ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలను తిరిగి ఆ జాబితాలో చేర్చాలని అమిత్‌షాను రేవంత్‌రెడ్డి కోరారు. తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతో తెలంగాణకు సరిహద్దు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం సరిహద్దు భద్రతపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. అంతర్గత భద్రతను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామాల్లో సీఆర్పీఎఫ్ జాయింట్ టాస్క్‌ఫోర్స్ క్యాంపులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీవోలకు చెల్లించాల్సిన నిధుల్లో కేంద్రం వాటా 60% నాలుగేళ్ల నుంచి పెండింగ్‌లో ఉందని, ఆ మొత్తం రూ.18.31 కోట్లు విడుదల చేయాలని కోరారు. 1,065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలను సడలించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సరిహద్దుల్లోని ములుగు జిల్లా పేరూరు, ములుగు, కన్నాయిగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల, మహాముత్తారం, కాటారం వంటి పోలీస్ స్టేషన్లను బలోపేతం చేయాలని కోరారు. కొత్తగా నియమితులైన పోలీసు సిబ్బందికి తీవ్రవాద వ్యతిరేక వ్యూహాల్లో (గ్రేహౌండ్స్) ద్వారా శిక్షణ ఇప్పించడానికి 2024-25 సంవత్సరంలో రూ.25.59 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా పోలీసు దళాలను తీర్చిదిద్దే పనులకు ఉద్దేశించిన ప్రత్యేక మౌలిక వసతుల పథకం(ఎస్ఐఎస్) కింద తెలంగాణకు కేవలం రూ.6.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, అదనంగా రూ.23.56 కోట్లు విడుదల చేయాలని సీఎం కోరారు.

ఆ సమస్యల పరిష్కారానికి సహకరించండి

పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని అమిత్‌షాను ముఖ్యమంత్రి కోరారు. 9వ షెడ్యూల్‌లోని (చట్టంలోని 53, 68, 71 సెక్షన్ల ప్రకారం) ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, పదో షెడ్యూల్‌లోని సంస్థల (చట్టంలోని 75 సెక్షన్ ప్రకారం) వివాదం సామరస్యపూర్వక పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పునర్విభజన చట్టంలో ఎక్కడా పేర్కొనని ఆస్తులు, సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకుంటున్నందువల్ల వాటిలో తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన సమయంలో తెలంగాణకు కేవలం 76 మంది ఐపీఎస్ అధికారులను మాత్రమే కేటాయించారని, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు మరో 29 పోస్టులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి పాల్గొన్నారు.




ఆనందమంటే విజయంతో దక్కేది కాదు

ఆనందం అనేది విజయం ద్వారా లభించే అనుభూతి కాదు. అది మీ ఆలోచనా విధానాన్ని బట్టి ఏర్పడే ఓ మానసిక స్థితి. మీరు ఆనందంగా ఉండాలని నిర్ణయించుకుంటేనే ఆ స్థితిని సాధించగలరు తప్ప ఇంకెవ్వరూ, ఏ పరిస్థితులూ మిమ్మల్ని సంతోషంగా ఉంచలేవు. ఎంత సంపాదించినా, ఎన్ని విజయాలు సాధించినా ఆనందంగా లేకపోవడానికి కారణం వారిలో ఈ ఆలోచనా విధానం లోపించడమే. ఇంకా కావాలని ఆశించినన్నాళ్లూ ఆనందం మీ దరి చేరదు. ఇక చాలు అనుకొని సంతృప్తి చెందినప్పుడే అది మీ సొంతమవుతుంది.

– అంజనా శర్మ, మార్కెటింగ్ స్పెషలిస్ట్

ఇదీ సంగతి!

అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయీ సోరెన్‌తో ప్రధాని మోదీ సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మోదీకి కృతజ్ఞతలు తెలిపిన చంపయీ.. త్వరలోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అవుతానని ఆశాభావం వ్యక్తం చేశారు.



గ్రహం అనుగ్రహం

8-10-2024 మంగళవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం

పంచమి: ఉ. 6-58 తదుపరి షష్ఠి

జ్యేష్ఠ: రా. 12-48 తదుపరి మూల

వర్జ్యం: ఉ. 7-09 వరకు

అమృత ఘడియలు: మ. 3-33 నుంచి 5-14 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-15 నుంచి 9-02 వరకు తిరిగి రా. 10-34 నుంచి 11-23 వరకు

రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు

సూర్యోదయం: ఉ. 5.54; సూర్యాస్తమయం: సా.5.42

తిరుమల శ్రీవారి గరుడోత్సవం

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.5	25.0
నిజామాబాద్	35.8	24.9
ఆదిలాబాద్	34.3	24.7
ఖమ్మం	34.0	24.0
హనుమకొండ	33.5	24.0
రామగుండం	33.2	25.4
మెదక్	33.2	21.4
సూర్యాపేట	32.5	26.0
హైదరాబాద్	31.6	22.3
కరీంనగర్	31.0	22.0
తిరుపతి	30.7	25.6
మహబూబ్‌నగర్	30.1	23.2
నల్గొండ	29.5	24.0








Hero
GIFT
Grand Indian Festival of Trust
GLAMOUR
SIMPLY MAGNETIC
ఎల్లప్పుడు
ఇష్టమైన డిజైన్
80 LAKH GLAMOUR
ఆన్ రోడ్ ధర
₹94999**
పూర్తిగా డిజిటల్ కన్సోల్
రియల్ టైమ్ మైలేజ్ ఇండికేటర్
USB ఛార్జర్ పోర్ట్
తక్కువ డౌన్ పేమెంట్ ₹1999^
ఎంపిక చేసిన కార్డులపై క్యాష్‌బ్యాక్ ₹5000~
వడ్డీ రేటు 7.99%^
Toll Free Number:
1800 266 0018
INDIA'S FIRST 5 YEAR WARRANTY *Conditions apply
$ADDITIONAL CASH DISCOUNT AVAILABLE ON
Flipkart
amazon
~CASHBACK AVAILABLE ON
HDFC BANK
pine labs PAY LATER
Special offers for CSD/CPC/Corporate employees. Reach us at: institutionalsales@heromotocorp.com
Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or CALL TOLL-FREE 1800 266 0018 or visit us on www.heromotocorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. **Festive on-road price of Glamour in Hyderabad, it is inclusive of applicable offers on respective models. On-road price includes Ex-showroom, Insurance and Registration charges. Offer is for a limited period or till stock lasts. Offer amount may vary for model/variant and states. For more details, please visit your nearest authorised Hero outlet. ~The 5% cashback upto ₹5000/- is applicable on minimum transaction of ₹40,000, subject to the credit card company's, T&Cs. ^Finance offer is at the sole discretion of the Financier, subject to its respective T&Cs. Available at select dealerships. $Flipkart and Amazon offers are subject to the sole discretion & T&Cs of respective organisations.
AUTHORISED DEALERS – Hyderabad: Geetha Hero, Suchitra: Ph: 9289923134. Taduband Ph : 9515408055. Sri Lakshmi Hero, Malakpet: Ph: 9289922155. Saroornagar: Ph: 9246223479, Vanasthalipuram: 9246223423. Bhanu Hero, Erragadda: Ph: 9289922148. Kukatpally: Ph: 9392525886. Miyapur: 9392525885. Phoenix Hero, Habsiguda: Ph: 9289922515.Ramanthapur: Ph: 9246394475. Nagole: Ph: 9246394476. Kushaiguda: Ph: 9246824193. Dealwel Hero, Nampally: Ph: 9289922827. Asifnagar: Ph: 7013367531. Narsingi: Ph: 8712314565, Bibinagar: 7993119099, Attapur: 7995852452 . Sri Venkanna Hero, Patancheru: Ph: 9289922150. Serilingampally: Ph :9640515185. Sowjanya Hero, Bahadurpura: Ph: 9289923133. Phoenix Hero, Hi-tech City: Ph: 9289922759. Hafeezpet: Ph: 7799017976, ToliChowki: Ph: 7799960345. Chandanagar: Ph: 9100189997. Krishna Sai Hero, Malkajgiri: Ph: 9289922972. Lakshmi Hero, Somajiguda: Ph: 9289922147. Venkateshwara Hero, Narayanguda: Ph: 9289922145, 7799884320, Pragnapur: 8886642271. Prudhvi Hero, Sangareddy Ph: 9821697396 Associate Dealer: MEDAK: PH:93468 48532. CHINTAL: PH: 9246562269. HAYATNAGAR : PH:92465 55683, IBBRAHIMPATNAM: PH:9703394833. KPHB: PH:9246566605. MEDCHAL: PH:9949881116. SEETHAFALMANDI: PH:9848868671. SHAMSHABAD: PH:7893812758. TURKAYAMZAL: PH:9014250111. ZAHEERABAD: PH:9440953602. BALAPUR: PH: 7396284446 KOTHUR: PH:9989660055. SHADNAGAR:PH:9849408227. MANIKONDA: 9453912345 MALLAPUR: 9849362062 SANTOSHNAGAR:9885307031 Also Available at: CHEGUNTA: PH:8019134280. DUBBAK: PH:9866663089. JOGIPET: PH:9849417030. NARAYANKHED: PH:8019134280. NARSAPUR: PH:9701685551. RAMAYAMPET: PH:9912475028. SADASIVPET: PH:9395383939. VANTIMAMIDI: PH:7659084449. ALWAL: PH:8019011555. BACHUPALLY: PH:9505268989. CHEVELLA: PH:9550024062. GACHIBOWLI: PH:7799238866. GHATKESAR: PH:9866825296. JAGDEVPUR: PH:9346072111. KANDUKUR X ROAD: PH:9290874477. KATTEDAN: PH:8790467659. KUKNURPALLE: PH:9912433300. KULKACHERLA: PH:9866594434. MAJIDPUR: PH:9440249174. MALL: PH:7729991772. MEDIPALLY: PH: 9951128704. MOINABAD: PH:9966492929. NAGARAM: PH: 9391043316. PARIGI: PH:9603773334. SHANKERPALLY: Vaishno Motors- PH:9849095545. TANDUR: PH:9701942955. THUKKUGUDA: PH:9014250111. THUMKUNTA: PH:9440028414. VIKARABAD: PH:9966213333.
FCB INTERFACE/6878/OCT2024/TEL



New GT Line Virtus and Taigun
Styled to Wander
VIRTUS GT LINE
TAIGUN GT LINE
Range starts at
₹10.89 Lakh#
Sporty black exterior and interior theme | 1.0 TSI engine | Manual and Automatic transmission options
6 airbags as standard | Digital cockpit | Electric sunroof | 25.65cm touchscreen infotainment
Volksfest
Volkswagen for everyone
GLOBAL NCAP
4 EVER CARE**
4 year Standard Warranty
4 year Road Side Assistance
3 Free Services
Exchange through
Certified Pre-Owned
Volkswagen PRIME
volkswagen.co.in
Call 1800 102 0909
Terms and conditions apply. Images are for representation purpose. Features and accessories shown may not be a part of standard equipment and are subject to change without prior notice. The actual car colour may vary. The dark shade on the glass is due to the lighting effect. # The offer price mentioned is a special offer price for Taigun Comfortline and Virtus Comfortline inclusive of all benefits. All applicable benefits at the sole discretion of the authorised dealer. 1% cess extra for Kerala. To know more on the schemes, please visit your nearest Volkswagen dealership. ** 3 Free services applicable on 1 000 kilometers, 7 500 kilometers and 15 000 kilometers. In service, only labour charges are free.
Authorised Dealers: Volkswagen Hitec City: 8588821702; Volkswagen Deccan (L B Nagar): 9160680000; Volkswagen Hyderabad (Banjara Hills): 9121391213; Volkswagen Hyderabad (Gachibowli): 8588821702; Volkswagen Himayatnagar: 9160680000; Volkswagen Mehdipatnam: 9160680000; Volkswagen Secunderabad: 9873484014; Volkswagen Somajiguda: 9873484014; Volkswagen SP Road: 9121391213; Volkswagen Visakhapatnam: 9160680000; Volkswagen Vijayawada: (0866) 2454524, 8886691748; Volkswagen Guntur: (0863) 2330001, 7799711129; Volkswagen Tirupati: 8929478576; Volkswagen Nellore: 7799711102; Volkswagen Karimnagar: 8929482330; Volkswagen Warangal: 8929482330; Volkswagen Khammam: 8929482330; Volkswagen Bhimavaram: 8886691749; Volkswagen Ongole: 7799711125; Volkswagen Rajahmundry: 9160680000; Volkswagen Kukatpally City Store: 7799996272; Volkswagen Anantapur: 8929478576; Volkswagen Kurnool: 8929478576.
Volkswagen Mahbubnagar - 8247213110.

నిస్తేజంగా ఐరాస!

పశ్చిమాసియాలో ఏడాది కిందట అంటుకున్న యుద్ధజ్వాలలు- నిండు జీవితాలెన్నింటినో నిలువునా దహించివేస్తున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పరం కత్తులు దూసుకుంటుండటంతో ఇప్పుడు అఖిల శాంతి అగమ్యగోచరమవుతోంది. మరోవైపు, రెండున్నరేళ్లుగా రావణకాష్ఠంగా రగులుతున్న రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం అనేక విపరిణామాలకు కారణమవుతోంది. ప్రపంచం గుండెలపై పెనుకుంపట్లుగా పరిణమించిన ఈ యుద్ధాలను నివారించడంలో ఐక్యరాజ్య సమితి (యూఎన్) ఘోరంగా విఫలమవుతోంది. యూఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌పై ఇజ్రాయెల్ తాజాగా నిషేధాజ్ఞలు విధించడం- కాగితంపై పులిగా మిగిలిపోయిన సమితి దయనీయావస్థకు అద్దంపడుతోంది. గాజాలో తక్షణ కాల్పుల విరమణకు పిలుపిచ్చిన గుటెరస్- ఇజ్రాయెల్ ఒంటెత్తు పోకడలను ఖండిస్తున్నారు. ఆయనపై టెల్ అవీవ్ ఆగ్రహానికి అదే కారణం కావచ్చు. కానీ, వట్టి మాటలే తప్ప ఆయా దేశాల నడుమ ఉద్రిక్తతలను చల్లార్చి శాంతిని పునరుద్ధరించడంలో ఐరాస సదా చేతులెత్తేస్తోంది. కాలానుగుణమైన సంస్కరణలకు దూరంగా ఉండిపోవడం- సమితి అస్తిత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తోంది!

రెండో ప్రపంచయుద్ధ నివారణలో నానాజాతి సమితి దారుణ వైఫల్యం తరవాత అలాంటి మారణ ఉత్పాతం మళ్లీ తలెత్తకుండా చూడటమే ప్రధాన ధ్యేయంగా 1945 అక్టోబరు 24న ఐక్యరాజ్య సమితి ఏర్పాటైంది. తదనంతర కాలంలో పర్యావరణం, మానవ హక్కుల పరిరక్షణ తదితర అంశాల్లో విశ్వజన వాణిగా అది విస్తరించింది. అంతర్జాతీయ శాంతిభద్రతలు, దేశాల నడుమ స్నేహపూర్వక సంబంధాల వృద్ధి తదితర మేలిమి లక్ష్యాలెన్నింటినో సమితి భుజాలకెత్తుకుంది. కానీ, వాటి సాధనలో అది అనేక సార్లు చతికిలబడింది. ప్రచ్ఛన్న యుద్ధం మొదలు పలు దేశాల్లో లక్షల మందిని కబళించిన అంతర్యుద్ధాలు, దురాక్రమణలను సమితి నిలువరించలేకపోయింది. కొవిడ్‌పై యుద్ధంలోనూ అది తడబడింది. 51తో మొదలైన ఐరాస సభ్య దేశాల సంఖ్య నేడు 193కు చేరింది. అనాటితో పోలిస్తే- ప్రపంచ భౌగోళిక రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో ఎన్నో మార్పులొచ్చాయి. అవేవీ సమితిలో, ముఖ్యంగా అందులోని కీలక విభాగమైన భద్రతామండలిలో ప్రతిఫలించడం లేదు. అందుకే ఐరాసను ఒక పాత కంపెనీతో సరిపోల్చిన కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్- నిస్తేజమైన సమితి తీరును తాజాగా గర్హించారు!

భద్రతామండలిలో శాశ్వత సభ్యదేశాలైన అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా, చైనా- దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా ఐరాసలో పెత్తనం చలాయిస్తున్నాయి. స్వప్రయోజనాలు, తమ మిత్రులకోసం వీటో అధికారాన్ని అవి యథేచ్ఛగా వాడుకొంటున్నాయి. ఈ నేపథ్యంలో మండలిని ప్రజాస్వామ్యీకరించి ఆరు దేశాలకు కొత్తగా శాశ్వత హోదా కల్పించాలని ఇండియా గట్టిగా పట్టుబడుతోంది. తాత్కాలిక సభ్య దేశాల సంఖ్యను పెంచాలని వాదిస్తోంది. ఆ మేరకు భద్రతా మండలి పునర్ వ్యవస్థీకరణ సాధ్యపడకపోతే- ప్రపంచ సవాళ్లను పరిష్కరించలేని అసమర్థ సంస్థగానే సమితి మిగిలిపోతుంది. అత్యధిక జనాభాకు నెలవైన భారత్- త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోంది. వర్ధమాన దేశాలకు నాయకత్వం వహిస్తూ, విశ్వశాంతి పరిరక్షణకు బలంగా గళమెత్తుతోంది. ఈ క్రమంలో మండలిలో ఇండియా శాశ్వత సభ్యత్వానికి అనేక దేశాలు మద్దతు పలుకుతున్నప్పటికీ చైనా మాత్రం మోకాలడ్డుతోంది. సమర్థ దౌత్యనీతితో డ్రాగన్ కుయుక్తులకు భారత్ కట్టడిచేయాలి. విశ్వమానవాళి శ్రేయానికి నిజమైన జవాబుదారుగా, అందరి సంస్థగా ఐరాస వెలుగులీనాలంటే- అందులో సంస్కరణలు అత్యావశ్యకం!



ప్రజలకూ పత్రికలకూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేనప్పుడు, సమాజంలో పౌరహక్కులు లోపించినప్పుడు దాన్ని పేరుకు ప్రజాస్వామ్యం అనవచ్చేమో కానీ, ప్రజల ప్రజాస్వామ్యం మాత్రం కాదు.


– లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్

తార్కిక బుద్ధి

మతం వేరు, తత్వచింతన వేరు. రెంటికీ మధ్య స్పష్టమైన తేడా ఉంది. మతవిశ్వాసం ప్రశ్నలకు అతీతమైంది. తత్వచింతన అలా కాదు, 'కళ్లు విప్పి ప్రశ్నించు' అంటుంది. సంశయమే తత్వచింతనకు పునాది. ప్రశ్నించే బుద్ధిని మతవిశ్వాసం సంతృప్తి పరచలేదు.

మనకు మతం, తత్వచింతన కలగలసి పోయాయి. సకలాతీత శక్తి ప్రమేయం లేకుండా భారతీయ దృక్పథం లేదు. ఐహికం కన్నా పరలోకం వైపు ఆత్మ ఔన్నత్యం వైపు మన ప్రయాణం సాగింది. 'జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునః పునః సంసారం సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రతో జాగ్రత' అంటూ ఈ దుఃఖమయ ప్రపంచం నుంచి త్వరగా విముక్తి పొంది జన్మరాహిత్యం వైపు పయనించాలని మన తత్వవేత్తలు అభిలషించారు.

మనిషి సహజంగా ఆలోచనాపరుడు. ఇహలోకంలో ఈదులాడుతున్నప్పటికి అంతరంగంలో- నేనెవరిని? ఎక్కడ నుంచి వచ్చాను? జననానికి ముందు నేనున్నానా? మరణం తర్వాత ఉంటానా... ఉంటే ఏ రూపం? స్వర్గం, నరకం, పూర్వజన్మ, పునర్జన్మ ఉంటాయా... ఈ ప్రపంచం ఏంటి? పాపపుణ్యాలేంటి... ఇలా రకరకాల ప్రశ్నలు వేసుకుని తార్కికంగా ఆలోచించాడు. క్వాంటం థియరీని ప్రతిపాదించిన జర్మన్ శాస్త్రవేత్త మ్యాక్స్‌ప్లాంక్ కూడా 'నేను ఎక్కడి నుంచి వచ్చాను, ఎక్కడికి వెళ్తాను' అన్నది సమాధానం దొరకని గొప్ప ప్రశ్నగా చెప్పుకొన్నాడు.



అంతర్యామి

ఎవరి ఆనతి వల్ల ఈ మనసు ఆలోచిస్తుంది... ఎవరి ప్రేరణ వల్ల కళ్లూ నోరూ పనిచేస్తున్నాయి అనే ప్రశ్నల పరంపరని ప్రశ్నోపనిషత్ అడిగింది. భౌతిక అభివృద్ధితో సంతృప్తి చెందని మానవుడు ఇంకా ఏదో ఉందని పరలోక చింతన వైపు సాధన సాగించాడు. తనలో తాను ప్రశ్నలు వేసుకుని అన్వేషించి, దొరికిన సమాధానాలతో కొంత తృప్తిపడి, కొన్నిటికి తృప్తిపడక తిరిగి అన్వేషిస్తూ వస్తున్నాడు.

అన్ని ప్రశ్నలకు సైన్స్ సమాధానం చెప్పలేదు. మతం, తత్వచింతన కూడా అన్ని ప్రశ్నలకు సంతృప్తికర సమాధానాలు ఇవ్వలేవు. సైన్స్, మతం, తత్వచింతన మూడు కలగలిసి పోయిన ఒక విభిన్న దృక్పథం భారతీయుల్లో కనిపిస్తుంది. కానీ అంతిమ సత్యం వైపు అన్వేషణ అనంతంగా కొనసాగాల్సిందే. 'లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన తుది అలోకంబగు పెంజీకటి కవ్వల నెవ్వండేకాకృతి వెలుగు అతనినే సేవింతున్' అని పోతన భాగవతంలో ఉంది. అంతకన్నా ఎన్నో శతాబ్దాలకు పూర్వమే శ్వేతాశ్వతరోపనిషత్‌లో 'తమస్సుకు ఆవలితీరాన ఆదిత్యవర్ణంలో ప్రకాశించే మహా పురుషుణ్ని, పరమ సత్యాన్ని నేను దర్శించాను' అని భారతీయ రుషి సగర్వంగా ఎలుగెత్తి చాటాడు.

మానవులంతా ఒకటే కానీ, ఆలోచనల్లో తేడా ఉంటుంది. అన్ని ఆలోచనలు కలుపుకొని విశ్వం అభివృద్ధి చెందుతుంది. మనసులో సంకుచిత భావనలకు చోటు ఇవ్వకుండా తార్కికబుద్ధితో ఆలోచిస్తే, లోకంలో మతం పేరుతో ఘర్షణలు, యుద్ధాలు, అధికార దాహం, పీడనలు ఉండవు. ప్రపంచ శాంతి వెల్లివిరుస్తుంది.

– శివలెంక ప్రసాదరావు



సాగు 4.0 నగరాలకు అండాదండా!

పట్టణాలూ నగరాలు సైతం ఇప్పుడు వ్యవసాయానికి వేదికలవుతున్నాయి. సాంకేతికత దన్నుగా విస్తరిస్తున్న 'అర్బన్ ఫార్మింగ్'- తక్కువ సమయంలో తక్కువ వనరులతో ఎక్కువ దిగుబడితో పాటు ఇతర ప్రయోజనాలనూ అందిస్తోంది.

వ్యవసాయం అనగానే మనకు పల్లెలు గుర్తొస్తాయి. సారవంతమైన నేలలూ సాగునీటి వనరులూ రసాయన ఎరువులూ క్రిమిసంహారక మందులూ ఆరుగాలం చెమటోడ్చే రైతులూ... అన్నీ కలిస్తే సంప్రదాయ సేద్యమవుతుంది. అయితే రోజులు మారాయి. పైన చెప్పినవేవీ లేకుండా కూడా సాగు సాధ్యమే ఇప్పుడు. అన్నిరంగాలనూ ప్రభావితం చేసినట్లే ఆధునిక సాంకేతికత సాగు రంగాన్నీ ప్రగతిబాట పట్టిస్తోంది. వ్యవసాయం 4.0గా పేర్కొంటున్న ఈ విధానంలో- కొన్నిచోట్ల రైతులు ప్రిసిషన్ ఫార్మింగ్ పేరుతో రకరకాల యాప్స్‌నీ, నానో సాంకేతికతనూ, డ్రోన్లూ సెన్సార్ల లాంటి పరికరాలనూ వాడుతున్నారు. ఇక, నగరాల్లో అర్బన్ ఫార్మింగ్ పేరుతో సాగులో కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయంలో విద్యావంతుల పాత్రను పెంచుతున్న అర్బన్ ఫార్మింగ్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఇందులో మిద్దెతోటలు(రూఫ్‌టాప్ గార్డెనింగ్), నీటిలో సాగు(హైడ్రోపోనిక్స్), వర్టికల్ గార్డెన్స్, కమ్యూనిటీ గార్డెన్స్ అని చాలా రకాలున్నాయి.

మిద్దెతోటలకు గిరాకీ

ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లూ ఖనిజ లవణాలూ అందాలంటే- ప్రతి వ్యక్తీ రోజుకు కనీసం 280గ్రాముల కూరగాయలు తినాలని ఐసీఎంఆర్ చెబుతోంది. కానీ జనాభాకి తగినట్లుగా కూరగాయల దిగుబడి లేదు. నగరానికి దూరంగా పల్లెల్లో పండించిన కూరగాయలు వినియోగదారులను చేరే క్రమంలో రవాణాలో శీతల గిడ్డంగుల్లో సమస్య వల్ల తాజాదనాన్ని, పోషకాలను కోల్పోతున్నాయి. దీనికేమిటీ పరిష్కారం అంటే- నగరాల్లోనే సాగు చేయడం. నగరాల్లో చోటెక్కడిదీ అంటారా... ఉంది! కేవలం ఒక్క హైదరాబాద్ నగరంలో అనువుగా ఉన్న భవనాల పైకప్పులను మొక్కలు పెంచడానికి వినియోగిస్తే దాదాపు 15 ఎకరాల పొలం అందుబాటులోకి వచ్చినట్లు అవుతుందని నిపుణుల అంచనా. నామమాత్రపు పెట్టుబడితో కుండీలలో కూరగాయలూ ఆకుకూరలూ పండించుకునే మిద్దెతోటల విధానం విస్తృత ఆదరణ పొందుతోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యానవన శాఖ సైతం ఆసక్తి గల ఇంటి యజమానులకు అవసరమైన సామగ్రిని సరఫరా చేస్తూ సాగులో మార్గదర్శకత్వం వహిస్తూ వేలల్లో పైకప్పులను పచ్చని తోటలుగా మారుస్తోంది. బెంగళూరులో అయితే మూడు దశాబ్దాలుగా ఇదొక ఉద్యమంగా సాగుతోంది. 60 వేలకు పైగా రూఫ్ గార్డెన్లు ఉన్నాయక్కడ. మిద్దెతోటల్ని ఏర్పాటు చేసిపెట్టే వ్యాపార సంస్థలున్నాయి, ఉద్యోగంతో మొక్కల్ని చూసుకోవడం కుదరనివారి కోసం రోజూ వచ్చి నీళ్లు పెట్టి, ఇతరత్రా అవసరాలు చూసి వెళ్లే సహాయకులూ అందుబాటులో ఉన్నారు. టెక్నాలజీ ప్రియులు కొందరు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికతను వినియోగించి రిమోట్ కంట్రోల్‌తో తోటల్ని నిర్వహిస్తున్నారు. మిద్దెతోటల రైతులంతా ఒక సంఘంగా ఏర్పడి తమ ఉత్పత్తులతో మాల్స్‌లో ప్రత్యేకంగా రైతుబజార్ నిర్వహిస్తున్నారు.

మట్టిలేకుండా కేవలం పోషకాలు కలిపిన నీటితో పైపుల్లో మొక్కల్ని పెంచే హైడ్రోపోనిక్స్ విధానం నగరాల్లో ఊపందుకుంటోంది. పైకప్పు అందుబాటులో లేనివాళ్లు బాల్కనీల్లోనే హైడ్రోపోనిక్స్ యూనిట్‌ని నిర్మించుకునే వెసులుబాటు ఉంది. ఇంటి అవసరాలకోసం చిన్న యూనిట్స్ లభిస్తాయి. కాస్త చోటు ఉంటే పెద్దయెత్తున సాగు చేసి వ్యాపారమూ చేయవచ్చు. ఈ యూనిట్లను తయారుచేసి పెట్టే అంకురాలు మన దేశంలో చాలానే ఉన్నాయి. ఈ సంస్థలు హైడ్రోపోనిక్స్ యూనిట్లతో పాటు వర్టికల్ ఇండోర్ ఫార్మ్స్‌నీ, గ్రీన్‌హౌసుల్నీ తయారుచేసిస్తాయి. వీటిల్లో ఎక్కువగా కూరగాయలు, ఆకుకూరలు, స్ట్రాబెర్రీలాంటి పండ్లనూ పండిస్తున్నారు. హైడ్రోపోనిక్స్ విధానంలో చుక్క నీరు వృథా కాదు. నీటిలోనే పోషకాలు కలుపుతారు కాబట్టి అదనంగా ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదు. సురక్షిత వాతావరణంలో మొక్కల్ని పెంచడం వల్ల చీడపీడల బెడద ఉండదు. దాంతో క్రిమిసంహారకాలను వాడక్కర్లేదు. అన్నిటికన్నా ముఖ్యంగా దిగుబడి దాదాపు పదిరెట్లు ఎక్కువ. ఇవేవీ కాకుండా మట్టిలో సంప్రదాయ సేద్యం చేయడానికి ఆసక్తి చూపేవారి కోసం నగరాల చుట్టుపక్కల పొలాలను అద్దెకిచ్చే విధానం కూడా జోరందుకుంటోంది. ఉద్యోగులు వారాంతాల్లో వెళ్లి తమ పొలాన్ని చూసుకోవచ్చు.

విదేశాలలో అయితే మరొకడుగు ముందుకేసి ఆఫీసుల్లో గదుల మధ్య గోడల స్థానంలో వర్టికల్ గార్డెన్లనో, హైడ్రోపోనిక్ సిస్టమ్స్‌నో ఏర్పాటుచేస్తున్నారు. ఉద్యోగులే వాటిని నిర్వహించి ఫలసాయాన్ని తీసుకెళ్లవచ్చు. మాల్స్, హోటళ్లు తమ పైకప్పులమీద మిద్దెతోటల సాగు చేపడుతున్నాయి, అలా చేయలేనివారు స్థలాన్ని అద్దెకిస్తున్నారు. కాలనీలలో ఖాళీగా ఉన్న స్థలాలను పేదలకోసం కమ్యూనిటీ గార్డెన్స్‌గా తీర్చిదిద్దుతున్నారు.

ఇంటిసాగులో లాభాలెన్నో!

నగరాల్లో ఉండేది చాలావరకూ చిన్న కుటుంబాలే. వాటికి సరిపోయే కూరగాయలను ఇంటి దగ్గరే బాల్కనీలోనో, డాబా మీదో పండించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. దీనివల్ల ఉత్పత్తికి వినియోగానికి మధ్య సమయం తగ్గి కూరగాయలు తాజాగా ఉంటాయి. కావాల్సినప్పుడే చెట్టునుంచి కోసుకోవచ్చు. రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు వాడని, పోషకభరితమైన తాజాకూరలకు తోడు వాతావరణమూ పచ్చదనంతో ఆహ్లాదభరితమవుతుంది. అర్బన్ ఫార్మింగ్ ఏ రూపంలో చేపట్టినా నగరాల్లో పచ్చదనం పెరిగి గాలి నాణ్యత మెరుగుపడుతుంది. భూతాపం తగ్గడానికి దోహదపడుతుంది. రవాణా ఖర్చు, శిలాజ ఇంధన వినియోగం తగ్గుతాయి. వ్యక్తులకు శారీరక వ్యాయామాన్నిచ్చి ఒత్తిడి తగ్గించే మంచి వ్యాపకం కూడా. ఇంకా, నగరాలు స్వయంపోషకాలుగా మారతాయి. అర్బన్ ఫార్మింగ్ వల్ల ఆహార వ్యర్థాలు చాలామటుకు తగ్గుతాయని నిపుణుల అంచనా. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్ వారు ఆ మధ్య చేపట్టిన అధ్యయనంలో- నగరాల్లో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయం బాగా ప్రజాదరణ పొందుతూ సమాజం మీద ప్రభావమూ చూపుతోందని వెల్లడైంది. నగరాల భవిష్యత్తుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనీ తేలింది.

– డి.పద్మశ్రీ



టీమ్ స్పిరిట్... మీకుందా?

ఒకరోజు మెదడుకు శరీరంలో ఏ భాగం ఎక్కువ పనిచేస్తుందనే సందేహం వచ్చిందట. అన్నీ కలిసి ఓ మీటింగ్ పెట్టుకుని మేమంటే మేమని వాదించుకున్నాయి. చివరకు 'పొట్టకే పని లేదు, మహా బద్ధకిస్టు' అని తేల్చాయి. 'దాని తిక్క కుదర్చాలంటే మనం కూడా పనిచేయకూడదు' అని ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నాయి. ఇంకేముంది... అన్నీ గప్‌చుప్. కాసేపటికే పొట్టకి ఆకలేసింది. ఏవీ సహకరించలేదు. రెండురోజులకి పొట్ట ఎండిపోయింది. దాంతోపాటు అన్ని అవయవాలూ నీరసించాయి. మెదడు కూడా ఆలోచించ లేకపోయింది... అప్పుడు తెలిసొచ్చింది ఎవరూ ఎక్కువా తక్కువా కాదని.

టీమ్ అయినా అంతేకదా! కొందరు పొట్ట మాదిరిగానే తక్కువ పనిచేస్తున్నట్లు కనిపించవచ్చు. కానీ ఎవరి ప్రాధాన్యం వాళ్లదే. వచ్చిన ఆహారాన్ని అది జీర్ణం చేస్తేనే కదా అన్ని భాగాలకూ శక్తి లభించేది. కాబట్టి అందరూ కలిసి పనిచేస్తేనే ఫలితం బాగుంటుంది.... అదే బృందస్ఫూర్తి అని చెబుతారు వ్యక్తిత్వ వికాస నిపుణులు.

మీరెప్పుడైనా గమనించారో లేదో... పక్షులు గుంపుగా వెళ్లేటప్పుడు 'వి' ఆకారంలోనే ఎగురుతాయి. అలా ఒకదాని వెనుక ఒకటి ఉండటంతో వాటికి గాలి తాకిడి తగ్గుతుంది. దాంతో డెబ్బై శాతం శక్తిని ఆదా చేసుకుంటూ సునాయాసంగా ఎంత దూరమైనా ఎగరగలవు. చిన్నప్పటినుంచీ ఇలాంటివి వింటూనే పెరిగాం. కాలేజీ వరకూ కొంత నయం. తెలియనివి ఒకరికొకరు చెప్పుకుంటూ చదువుకుంటాం. ఉద్యోగాల్లోకి వచ్చేసరికే ఈగోలు రాజ్యమేలతాయి. సహకరించుకోవడం మానేస్తాం. ఫలితం... స్ట్రెస్సూ బర్నవుటూ. ఈమధ్య తరచూ వినిపిస్తున్న మాటలివేగా. అయితే ఎవరికి వాళ్లు ఒంటరిగా పని చేసినప్పుడే ఈ సమస్యలు ఎక్కువని వార్‌విక్ యూనివర్సిటీ అధ్యయనం చెబుతోంది. 'టీమ్‌గా చేసినప్పుడు ఆనందంగా ఉంటున్నారు. భిన్నాభిప్రాయాల వల్ల కొత్త ఆవిష్కరణలు వెలుగుచూస్తున్నాయి' అంటారు 'ద మెడిసీ ఎఫెక్ట్' రచయిత ఫ్రాన్స్ జోహాన్సన్.

టీమ్ అంటేనే 'టుగెదర్ ఎవ్రీ వన్ ఎచీవ్స్ మోర్' అని అర్థం. టీమ్‌లో అందరికీ ఒకేలాంటి నైపుణ్యాలు ఉండవు. మన చేతి వేళ్లలాగే వ్యక్తుల్లోనూ ఎవరి ప్రత్యేకతలు వాళ్లవి. వాసన బాగుందని బిర్యానీలో జాపత్రి ఒక్కటే వేయం కదా. లవంగం, చెక్క, జాజికాయ... ఇలా అన్నీ తగుపాళ్లలో కలిస్తేనే ఆ ఘుమఘుమలు. బృందంలో సభ్యులూ అంతే. తెలియనివి అడగడానికి మొహమాటపడకూడదు. తెలిసినవి చెప్పడానికీ వెనకాడకూడదు. ఇచ్చిపుచ్చుకోవాలి. ఒకరినొకరు నమ్మాలి. గాసిప్స్‌కీ అసూయలకీ తావులేకుండా సానుకూల దృక్పథంతో మెలగాలి. అలాంటి టీమ్... ఎంత కష్టమైన టాస్కునైనా సులభంగా పూర్తిచేయగలదు. అది సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్... క్రికెట్, చెస్... అని కాదు. రంగం ఏదైనా బృందస్ఫూర్తి ఉంటేనే ఒత్తిడికి ఆస్కారం ఉండదు. ఆరోగ్యం బాగుంటుంది. సంస్థలూ అభివృద్ధి చెందుతాయి.

– సాహితి



స్వచ్ఛ ఇంధనం దిశగా...

శిలాజ ఇంధనాల వల్ల భూతాపం పెరుగుతోంది. పర్యావరణ మార్పులు తీవ్రతరం అవుతున్నాయి. వాటిని నివారించాలంటే పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం తప్పనిసరి. ఈ నేపథ్యంలో 2015-2023 మధ్యలో శిలాజ, పునరుత్పాదక ఇంధన వనరులపై ప్రపంచ దేశాలు ఎంతెంత పెట్టుబడులు పెట్టాయంటే... (బిలియన్ డాలర్లలో)

	పునరుత్పాదక ఇంధనాలు	శిలాజ ఇంధనాలు
2015	1074	1319
2016	1132	1105
2017	1129	1114
2018	1137	1109
2019	1225	1066
2020	1259	839
2021	1408	914
2022	1617	1002
2023	1740	1050

ఆధారం: అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) వెబ్‌సైట్

వన్యప్రాణులను కాపాడుకుందాం!



జీవవైవిధ్య పరిరక్షణకు, సుస్థిర అభివృద్ధికి అడవులు, వన్యప్రాణులు ఎంతో కీలకం. కాబట్టి, వన్యప్రాణుల పట్ల ప్రజలకు అవగాహన పెంచడంతోపాటు సంబంధిత చట్టాలను సమర్థంగా అమలు చేయాలి. జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు నేటితో ముగుస్తున్న సందర్భంగా...

సహజ వనరులు, జీవవైవిధ్య పరిరక్షణలో అటవీ జంతువుల పాత్ర ఎనలేనిది. మన దేశంలో బ్రిటిష్ హయాంలో వన్యప్రాణులకు తీవ్రనష్టం వాటిల్లింది. ఆంగ్లేయులు ఆటవిడుపుగా, మాంసం, చర్మం కోసం జంతువులను విచ్చలవిడిగా వేటాడేవారు. అలా వేలాది పులులు, సింహాలు, ఏనుగులు, జింకలను వారు హతమార్చారు. కొందరు రాజులు, నవాబులు సైతం వన్యప్రాణులకు తీరని నష్టం కలిగించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ప్రభుత్వం స్వపరిపాలనపై దృష్టి పెట్టడంవల్ల అడవులు, వన్యప్రాణుల పరిరక్షణపై అంతగా శ్రద్ధ వహించలేకపోయింది. ఆ దిశగా చర్యలు చేపట్టడానికి సుమారు పాతికేళ్ల సమయం పట్టింది. బ్రిటిష్ పాలకులు తీసుకొచ్చిన 'అటవీ రక్షణ చట్టం-1927' స్వతంత్ర భారతావనిలోనూ కొనసాగింది. 1956లో ప్రభుత్వం తొలిసారిగా అటవీ విధానాన్ని ప్రకటించినప్పటికీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని 1972లో తీసుకొచ్చింది. ఇదో మైలురాయి వంటిది. అటవీ జీవులతో పాటు మొక్కల పరిరక్షణకూ ఇందులో పెద్దపీట వేశారు. వన్యప్రాణులు, వాటి శరీర భాగాల నిల్వ, రవాణా, వ్యాపారాన్ని నిషేధించారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించే వారికి మూడు నుంచి ఏడేళ్ల జైలుశిక్ష లేదా జరిమానా, లేదంటే రెండూ విధిస్తారు.

ప్రాజెక్ట్ టైగర్ విజయం

వన్యప్రాణులను వాటి ప్రాధాన్యం, జనాభాను బట్టి వివిధ షెడ్యూళ్ల కింద వర్గీకరించి రక్షణ కల్పిస్తున్నారు. అరుదైన, అంతరించిపోతున్న పులులు, సింహాలు, ఎలుగుబంట్లు, ఏనుగులు, కొండచిలువలు వంటి జాతులను ఒకటో షెడ్యూల్‌లో చేర్చారు. నాగుపాము, కట్లపాములను రెండో షెడ్యూల్‌లో; జింకలు, దుప్పులు వంటివాటిని మూడో షెడ్యూల్ కింద పేర్కొన్నారు. మారుతున్న సామాజిక, పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి సవరణలు చేపట్టి 2023 నుంచి అమలు చేస్తున్నారు. అడవిలో ఒక పులి బతకాలంటే అక్కడి పర్యావరణ వ్యవస్థ మొత్తం సజీవంగా ఉండాలి. పులులకు ఆహారమైన జింకలు, దుప్పులు వంటివి సమృద్ధిగా లభించాలి. ఆ జీవులకు అవసరమైన గడ్డి, పశుగ్రాసాన్నిచ్చే వృక్ష జాతులు, నీటి వనరులు పుష్కలంగా ఉండాలి. అందువల్లే కేంద్ర ప్రభుత్వం పులులను పర్యావరణ వ్యవస్థలో ఉన్నతమైన జాతిగా గుర్తించడంతో పాటు అటవీ ఆవరణ వ్యవస్థలను కాపాడే లక్ష్యంతో 1973లో 'ప్రాజెక్ట్ టైగర్'ను ప్రారంభించింది. తొమ్మిది పులుల సంరక్షణ కేంద్రాలతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు కింద ప్రస్తుతం 55 కేంద్రాలు ఉన్నాయి. ప్రపంచంలోని సుమారు మూడొంతుల పులులు వీటిలోనే ఉండటం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్-శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రం; తెలంగాణాలోని అమ్రాబాద్, కవ్వాల్ సంరక్షణ కేంద్రాలు ఈ ప్రాజెక్టు కింద ఏర్పాటైనవే. 1973లో దేశంలోని మొత్తం పులుల సంఖ్య 1,811. నిరుడు అది 3,682కి చేరుకుంది. ఇలా పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణ వెనక అటవీ అధికారులు, సిబ్బంది కృషి ఉంది. క్లిష్టమైన పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తూ ఎంతోమంది అటవీ ఉద్యోగులు అమరులయ్యారు.

సంరక్షణలో సవాళ్ల మేట

వన్యప్రాణుల సంరక్షణలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. చాలాచోట్ల పులుల ఆవాసాలు విచ్ఛిన్నమవుతున్నాయి. వన్యప్రాణులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరించే మార్గాలు (కారిడార్లు) కనుమరుగవుతున్నాయి. మనుషులకు-వన్యప్రాణులకు మధ్య ఘర్షణలు తలెత్తుతుండటంతో ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు సంభవిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా వన్యప్రాణుల వేట, రవాణా కొనసాగుతోంది. మానవ కార్యకలాపాలవల్ల కాలుష్యం, వాతావరణ మార్పులు ప్రమాదకరంగా మారుతుండటంతో అటవీ ప్రాణుల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. మరోవైపు వన్యప్రాణుల సంరక్షణకు అవసరమైనన్ని నిధులు, సిబ్బంది లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఇటువంటి సవాళ్లను అధిగమించడం అత్యావశ్యకం. ప్రజలకు వన్యప్రాణుల పట్ల అవగాహన పెంచడంతోపాటు స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థల సహకారంతో జంతువుల సంరక్షణకు ప్రభుత్వాలు నడుం బిగించాలి. వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలు సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకోవడానికి ఇటీవల అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. ప్రకృతి సంపదను కాపాడుకుని, భావితరాలకు వాటిని వారసత్వంగా అందివ్వడానికి ఇటువంటి చర్యలే అవసరం!



దెందులూరి నళినీ మోహన్

విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి, ఏపీ రాష్ట్ర పూర్వ ముఖ్య వన్యప్రాణి సంరక్షణాధికారి

నక్క అత్యాశ!

అనగనగా ఓ అడవిలో నక్క జీవించేది. ఆ వనం పక్కనే రామాపురం అనే గ్రామం ఉండేది. నక్క అప్పుడప్పుడు ఊళ్లోకి వెళ్లి, కోళ్లను చంపుకొని తినేది. దానికి ఎలాగో ఆ ఊళ్లోని పిల్లితో స్నేహం ఏర్పడింది. కానీ కాలం కలిసిరాక, కొన్ని రోజులుగా సరైన ఆహారం దొరక్క నక్క చాలా ఇబ్బంది పడింది. ఈ విషయాన్నే పిల్లితో చెప్పుకొని అది చాలా బాధపడింది. 'అవునా.. నక్కబావా! అయితే నాతో రా. ఇక్కడికి దగ్గర్లోని ఓ ఇంట్లో విందు జరుగుతోంది. ఎవరూ చూడకుండా వెళ్లి, భోజనం చేసి వద్దాం' అంది పిల్లి.



నక్క ఒప్పుకోవడంతో రెండూ కలిసి ఇంటి గుమ్మానికి, తలుపునకు మధ్య ఉన్న చిన్న సందులోంచి నెమ్మదిగా ఇంట్లోకి దూరాయి. అక్కడ చాలా ఆహార పదార్థాలు ఉన్నాయి.

హాయ్! బుజ్జీ!!

వాటిని చూడగానే ఆ రెండింటికీ నోట్లో నీళ్లూరాయి. పిల్లి కాసేపు తిన్న తర్వాత.. ఇక అక్కడి నుంచి వెళ్లాలనుకుంది. ఇదే విషయాన్ని నక్కకు చెప్పింది. అది మాత్రం పిల్లి వెంట వెళ్లకుండా, అత్యాశతో అక్కడున్న ఆహారాన్నంతా తినాలనుకుంది. కాసేపటి తర్వాత దాని బొజ్జ నిండిపోయింది. ఇక ఏ మాత్రమూ తినలేకపోయింది. దీంతో అక్కడి నుంచి వెళ్లాలనుకుంది.

పొట్టపగిలేలా తినడంతో ఆ సందులో ఇప్పుడు నక్క పట్టడం లేదు. ఈలోగా దానికి ఏదో అలికిడి వినిపించింది. ఇంతలోనే ఆ ఇంటివాళ్లు వచ్చి, తలుపు నెట్టారు. లోపల నక్కను చూసి బెంబేలెత్తిపోయారు. వారిని చూడగానే ఏం చేయాలో నక్కకు అర్థం కాలేదు. ప్రాణభయంతో వారి మీద దాడి చేయాలనుకుంది. 'పాడు నక్క.. మేం వండుకున్న ఆహారాన్నంతా నాశనం చేయడమే కాకుండా, మమ్మల్నే కరవాలని చూస్తోంది' అని, చేతికి దొరికిన వస్తువులతో ఒక్కసారిగా దాని మీద దాడి చేశారు. చావుదెబ్బలు తిన్న నక్క బతుకు జీవుడా అనుకుంటూ.. అతి కష్టం మీద అక్కడి నుంచి పారిపోయింది. ★

పట్టికల్లో పదం!

ప్రతి చతురస్రంలో ఒక్క అక్షరం తప్ప, మిగతావి రెండుసార్లు ఉంటాయి. ఆ ఏకాకి అక్షరాలను ఓచోట చేరిస్తే అర్థవంతమైన పదం వస్తుంది.

1

యం	మ	మా
మం	మా	య
మ	య	యం

2

చూ	చై	చి
చు	చీ	చు
చీ	చై	చూ

3

నే	ను	నే
నీ	ని	నై
నై	ని	ను

4

రూ	రై	రూ
రి	రీ	రు
రీ	రి	రై

పీఎంఏవై కింద తెలంగాణకు 6 లక్షల ఇళ్లు కేటాయించాలి

స్థాయీ సంఘ సమావేశంలో ఎంపీ చామల డిమాండ్

ఈనాడు, దిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ) కింద తెలంగాణకు ఈ ఆర్థిక సంవత్సరంలో 6 లక్షల ఇళ్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఇక్కడ తెదేపా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలోని కేంద్ర గృహ, పట్టణాభివృద్ధిశాఖ పార్లమెంటు స్థాయీ సంఘం తొలి సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆ వివరాలను విలేకరులకు వెల్లడించారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేవలం 1.58 లక్షల ఇళ్లు మాత్రమే ఈ పథకం కింద కేటాయించిందని చెప్పారు. గత భారాస ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేయలేకపోయిందని, రాష్ట్ర హక్కులకోసం పోరాడటంలోనూ విఫలమైందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సేకరించిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని పట్టణ పేదలకోసం 33.88 లక్షల ఇళ్లు అవసరం ఉందని, అందులో భాగంగా ఈ ఏడాది కేంద్రం 6 లక్షల ఇళ్లు కేటాయించాలని తాను కోరినట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్రం సాయం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.

మూసీ మూటల లెక్కలు చెప్పేందుకే దిల్లీకి సీఎం: కేటీఆర్



ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రాజెక్టు మూటల లెక్కలు చెప్పేందుకే సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనలు చేస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. పేద ప్రజల గూడు చెదరగొట్టేందుకు దిల్లీలో తన బాసులతో మంతనాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం దిల్లీ పర్యటనలతో ప్రజలకు ఏం ప్రయోజనం ఒనగూరిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "పది నెలల కాలంలో రేవంత్‌రెడ్డి 23 సార్లు దిల్లీకి వెళ్లారు. ఇదే లెక్కలో రానున్న కాలంలో మరో 125 సార్లు వెళ్లే అవకాశం కనిపిస్తోంది. రేవంత్‌రెడ్డి పాలనపై కాంగ్రెస్ అధిష్ఠానం సంతోషంగా లేనందునే.. పదేపదే పిలుస్తూ చీవాట్లు పెడుతున్నట్లుంది. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దిల్లీ పెద్దల ముందు తాకట్టు పెట్టడమే. ఎంతమంది కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి ఎన్ని రూ.వేల కోట్లు తెచ్చారో చెప్పాలి. ఇకనైనా దిల్లీ పర్యటనలు పక్కనపెట్టి. . ప్రజలకు మంచి చేయడంలో నిమగ్నం కావాలి" అని కేటీఆర్ సూచించారు.

బీసీ ఉపకార వేతనాలకు రూ.1502 కోట్ల విడుదల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని బీసీ, ఈబీసీ విద్యార్థుల ఉపకారవేతనాలు, బోధన ఫీజుల కోసం ప్రభుత్వం రూ.1502.83 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా వర్గాల విద్యార్థులకు 2024-25 ఏడాదికి ఉపకారవేతనాలు, బోధన ఫీజులు చెల్లించేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1890.34 కోట్లు కేటాయించింది. ఆ నిధుల్లో ఇప్పటికే రూ.387.51 కోట్లు విడుదల చేయగా.. తాజాగా మిగిలిన రూ.1502.83 కోట్లు ఇచ్చింది.

దివ్యాంగుల కార్పొరేషన్‌లో నిధులు పక్కదారి: ముత్తినేని వీరయ్య

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్‌లో గత పదేళ్లలో నిధులు పక్కదారి పట్టాయని, ఉపకరణాల కొనుగోలుకు సంబంధించిన దస్త్రాలు మాయం చేశారని ఆ కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం ఇచ్చిన రూ.30 లక్షల నిధులను కార్యాలయాల ఆధునికీకరణకు ఖర్చు చేశారని విమర్శించారు. ఉపకరణాలను అన్ని జిల్లాలకు సమానంగా కేటాయించాల్సి ఉండగా.. అప్పటి మంత్రులు మాత్రం తమ సొంత నియోజకవర్గాల్లో 500కు పైగా వాహనాలను పంపిణీ చేసి నిబంధనలు ఉల్లంఘించారన్నారు. అక్రమాలకు పాల్పడిన మాజీ మంత్రులు, కార్పొరేషన్ ఛైర్మన్‌తో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కొండపోచమ్మ సాగర్‌పై విజిలెన్స్ దృష్టి

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌పై విజిలెన్స్ విభాగం దృష్టిసారించింది. ఇక్కడి రిజర్వాయర్‌తో పాటు అప్రోచ్ ఛానల్, పంపుహౌస్ తదితర పనులను 14వ ప్యాకేజీగా చేపట్టారని, ఇందులో భారీగా అవకతవకలు జరిగాయని ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు అందింది. ఈ పని అంచనా విలువ మొదట రూ.1332 కోట్లు కాగా, తర్వాత రూ.2,281 కోట్లకు పెంచారని, మళ్లీ రూ.2,898 కోట్లకు సవరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నీటిపారుదలశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయానికి వచ్చిన విజిలెన్స్ అధికారులు సంబంధిత రికార్డులన్నీ ఇవ్వాలని కోరారు. ఉన్నత స్థాయి కమిటీ తీసుకొన్న నిర్ణయాలు, నిర్మాణ స్థలాన్ని పరిశీలించి ఇచ్చిన నివేదికలు, రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీలో చర్చించి తీసుకొన్న నిర్ణయాలు, ఆడిట్ అభ్యంతరాల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేశారు.



ఈ పంచసూత్రాలు.. బతుకు పాఠాలు

1. పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందొచ్చు, కానీ పోయిన సమయం ఎప్పటికీ తిరిగిరాదు. 2. మీరెవరన్నది చెప్పేది మీరు చేసే ఉద్యోగం కాదు, మీ వ్యక్తిత్వం. 3. మీకు విలువైన పాఠాలు నేర్పే ఉత్తమ గురువు ఎవరంటే మీరు చేసిన చివరి తప్పు. 4. మీ సంబంధాలను విస్తృతం చేసుకోవాలంటే ఎక్కువ ఇవ్వండి, తక్కువ ఆశించండి. 5. మీరు ఈ ప్రపంచంలోనే అత్యంత అదృష్టవంతులు కావాలంటే, మీ పనిని ఇంకెవ్వరికీ సాధ్యం కానంత ఉత్తమంగా చేయండి. అప్పుడు కోరిన అవకాశాలన్నీ మీ ఒళ్లో వాలతాయి.

– డేవిడ్ లవ్‌జాయ్,
బిజినెస్ గ్రోత్ మెంటార్

2026 మార్చికల్లా నక్సలిజం నిర్మూలన

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటన



దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన నక్సల్ ప్రభావిత రాష్ట్రాల సదస్సులో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో కేంద్రమంత్రులు నిత్యానందరాయ్, జుయెల్ ఓరం, జేపీ నడ్డా, మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ శిందే, రేవంత్ రెడ్డి, మోహన్ యాదవ్, విష్ణుదేవ్ సాయ్

ఈనాడు, దిల్లీ: దేశంలో 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. మావోయిస్టులే మానవహక్కుల అతిపెద్ద ఉల్లంఘనులని విమర్శించారు. దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో సోమవారం నక్సల్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోంమంత్రుల సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. "వామపక్ష తీవ్రవాద నిర్మూలనకు మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చింది. ఆ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం 'భద్రతా సంబంధ వ్యయం' కింద 2004-14 మధ్య రూ.1,180 కోట్లు ఖర్చు చేస్తే.. 2014-24 మధ్య మేం రూ.3,008 కోట్లు చేశాం. అన్ని పథకాల కింద గత పదేళ్లలో ఈ ప్రాంతాల్లో రూ.14,977 కోట్లకు ఆమోదం తెలిపాం. అందులో రూ.12 వేలకోట్లు ఖర్చు చేశాం. అంతకు ముందు పదేళ్లలో 64 పోలీసుస్టేషన్లు ఏర్పాటుచేస్తే గత పదేళ్లలో 544 నెలకొల్పాం. గతంలో 2,900 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మిస్తే, మా హయాంలో 11,500 కిలోమీటర్లు నిర్మించాం. పదేళ్లలో 15,300 మొబైల్ టవర్లు ఏర్పాటుచేశాం. అందులో 5,149 టవర్లను 4జీ నెట్‌వర్క్ అందించేలా తీర్చిదిద్దాం" అని షా వివరించారు.

ఛత్తీస్‌గఢ్ ఫలితాలు ఉత్సాహాన్నిచ్చాయి

ప్రభుత్వ చర్యలతో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు గత పదేళ్లలో 16,463 నుంచి 7,700కు తగ్గాయని షా తెలిపారు. పౌరులు, సాయుధ బలగాల మరణాలు 70% తగ్గాయన్నారు. "హింసాత్మక ఘటనలు నమోదయ్యే జిల్లాల సంఖ్య 94 నుంచి 42కు పడిపోయింది. ఇప్పటికీ ఈ జిల్లాల సంఖ్య ఎక్కువగా కనిపిస్తుండటానికి కారణం- వాటిలో 21 కొత్తగా ఏర్పడినవి కావడమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయడం వల్లే మెరుగైన ఫలితాలు వచ్చాయి. తీవ్రవాద నిర్మూలనలో ఛత్తీస్‌గఢ్ సాధించిన ఫలితాలు అందరికీ ఉత్సాహాన్నిచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అక్కడ 100% సంతృప్తికర స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం వల్లే ప్రతి గ్రామానికీ ప్రభుత్వ ఫలాలు చేరాయి. వామపక్ష తీవ్రవాదుల ఆర్థిక మూలాలు దెబ్బతిన్నాయి" అని కేంద్ర హోంమంత్రి చెప్పారు.

ముఖ్యమంత్రులు సమీక్షించాలి

రాష్ట్రాల్లో మావోయిస్టు కేసుల విచారణ త్వరగా పూర్తి చేయడానికి ముఖ్యమంత్రులు చొరవ తీసుకోవాలని షా పిలుపునిచ్చారు. ఎన్ఐఏ బృందాలను రాష్ట్రాలకు పిలిపించి ప్రాసిక్యూషన్‌పై శిక్షణ ఇప్పించాలని కోరారు. ''టెలిఫోన్, రహదారులు, విద్య, వైద్య సౌకర్యాల కల్పనలో రాష్ట్రాల సహకారం చాలా ముఖ్యం. అందువల్ల ముఖ్యమంత్రులు నెలకోసారైనా ఈ కార్యక్రమాల అమలును సమీక్షించాలి. అటవీ అనుమతుల విషయంలో ఇబ్బందులను తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. రోడ్డు, మొబైల్‌ఫోన్, పోస్టాఫీసు, బ్యాంకు అనుసంధానం, ఆర్థిక సమ్మిళత్వం వంటి విషయాల్లో దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి, మానవ జాతికి అతిపెద్ద వ్యతిరేకి నక్సలిజమే. మావోయిస్టులే మానవ హక్కుల అతిపెద్ద ఉల్లంఘనులు. 8 కోట్లమంది గిరిజనులకు ప్రాథమిక సౌకర్యాలు అందకుండా చేయడానికి మించిన మానవహక్కుల హననం ఇంకోటి ఉండదు. మావోయిస్టులు పెట్టిన మందుపాతరలకు వేలమంది ఆదివాసీ అమాయకులు బలయ్యారు. ముఖ్యమంత్రులు నెలలో ఒకవారం అక్కడి అభివృద్ధి, నక్సల్ నియంత్రణ కార్యకలాపాలను సమీక్షించాలి. డీజీపీలు ప్రతి పక్షం రోజుల్లో ఒకసారి నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలపై సమీక్ష జరపాలి" అని షా పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ పరిధిలోని సాయుధ బలగాల సామర్థ్యాలను పెంపొందించడంలో చాలా బాగా పనిచేశాయని ఆయన కితాబిచ్చారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ నక్సల్ ప్రభావిత రాష్ట్రాలు. సదస్సుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు హాజరయ్యారు. మిగతా రాష్ట్రాల తరఫున మంత్రులు హాజరయ్యారు.

పరిశ్రమలు వస్తున్నా పెరగని కార్మికుల నమోదు

- మూడేళ్లలో తెలంగాణలో కార్మికుల సగటు 16.7 నుంచి 12.90 మందికి తగ్గుదల
- ఈఎస్ఐసీ యాజమాన్యాలు, కార్మికుల గణాంకాల్లో వెల్లడి



రెగ్యులర్ విధానానికి దూరంగా కార్మికుల నియామకం!

ఈఎస్ఐసీ ప్రకారం కార్మిక గణాంకాలిలా..

సంవత్సరం	యాజమాన్యాలు	చందా చెల్లిస్తున్న సంస్థలు	కార్మికులు
2021-22	83,677	30,625	13,99,860
2022-23	1,10,070	33,483	15,45,930
2023-24	1,20,390	33,335	15,53,610

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కార్మిక సంక్షేమ పథకాల్లో నమోదు చేసుకుంటున్న కార్మికుల సగటు తగ్గుతోంది. రాష్ట్రంలో ఏటా కొత్త పరిశ్రమలు, సంస్థలు కార్యకలాపాలు ప్రారంభిస్తున్నా.. సంక్షేమ పథకాల్లో పేర్లు నమోదు చేసుకుంటున్న కార్మికుల సంఖ్య మాత్రం ఆశించినంతగా పెరగడం లేదు. కార్మికులకు పరిశ్రమలు కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోగా.. తక్కువ వేతనాలతో పనిచేయించుకుంటున్నాయి. సంఘటిత రంగంలో పనిచేస్తున్నవారూ చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కులు, వైద్యబీమా సదుపాయాలు, పింఛన్లకు దూరమవుతున్నారు. రాష్ట్రంలో గడిచిన మూడేళ్లుగా 'ఈఎస్ఐసీ' వద్ద నమోదైన కార్మికుల గణాంకాలు పరిశీలిస్తే.. ఒక్కో పరిశ్రమ, సంస్థలో సగటున కేవలం 12.90 మంది పనిచేస్తున్నట్లు వెల్లడైంది. తన పరిధిలోకి వచ్చే యాజమాన్యాలు, కార్మికుల సంఖ్యను ఈఎస్ఐసీ ఇటీవల ప్రకటించింది.

పలు పరిశ్రమలు, సంస్థలు కిందిస్థాయి కార్మికులను రెగ్యులర్ విధానంలో తీసుకోవడం లేదు. నిపుణులు మినహా మిగతావారిని రోజువారీ కూలీలుగా, గుత్తేదారు వద్ద పనిచేసే కార్మికులుగా చూపిస్తున్నాయి. కనీస వేతనాలు, ఇతర కార్మిక సంక్షేమ పథకాలు వర్తింపజేయకుండా ఉండేందుకు కొన్ని పరిశ్రమలు ఈ పద్ధతి పాటిస్తున్నాయి. మరోవైపు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులను పార్ట్‌టైంగా చూపిస్తూ, కనీస పనిగంటల కన్నా తక్కువ పనిచేయించుకుంటూ సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకుంటున్నాయి. తెలంగాణలో గడిచిన మూడేళ్లలో పరిశ్రమల సంఖ్య దాదాపు 37 వేలు పెరిగింది. అదే సమయంలో కొత్తగా చేరిన కార్మికుల సంఖ్య కేవలం 1.53 లక్షలే. అంటే ఒక్కో పరిశ్రమలో సగటున ఐదుగురి కన్నా ఎక్కువ మంది కార్మికులు పెరగలేదు. 2021-22 సంవత్సరంలో నమోదైన పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు 13.99 లక్షల మంది ఉండగా.. ఒక్కో పరిశ్రమలో సగటున 16.7 మంది పనిచేస్తున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆ తర్వాతి ఏడాదికి కొత్తగా పరిశ్రమల సంఖ్య దాదాపు 17 వేలు పెరిగింది. కానీ వాటిలో పనిచేస్తున్న కార్మికుల సగటు 14.04 మందికి తగ్గింది. 2023-24 సంవత్సరంలో ఒక్కో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సగటు 12.90 మందికి పరిమితమైంది. మూడేళ్ల వ్యవధిలో సగటు కార్మికుల సంఖ్య 3.8 మందికి తగ్గింది. గడిచిన ఏడాది వ్యవధిలో తెలంగాణలో 10,320 కొత్త సంస్థలు, పరిశ్రమలు నమోదు కాగా.. 7,680 మంది కార్మికులు మాత్రమే పెరిగినట్లు ఈఎస్ఐసీ గణాంకాలు చెబుతున్నాయి. ఏపీలో నమోదైన పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల సగటు 2021-22లో 22.90 మంది ఉండగా.. 2023-24 ఏడాదికి 17.39 మందికి తగ్గిపోయింది.

సఫారీ బస్సుపైకి దూకిన చిరుత



- కిటికీ నుంచి లోపలికి వెళ్లే యత్నం
- కర్ణాటకలో ఘటన

బెంగళూరు నగర శివారు బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనంలో ఆదివారం సాయంత్రం ఓ చిరుత సఫారీ బస్సుపై దాడికి యత్నించింది. వెనుక కిటికీ తెరచి ఉండటంతో అందులోంచి లోపలికి ప్రవేశించే ప్రయత్నం చేసింది. కిటికీ తెరచి ఉన్నా గ్రిల్ ఉండడంతో పర్యాటకులకు ఎటువంటి గాయాలు కాలేదు. చిరుత పదే పదే కిటికీపైకి దూకుతూ.. గ్రిల్ మెష్‌ను తొలగించేందుకు యత్నించడంతో బస్సులోని పర్యాటకులు భయానికి గురయ్యారు. వెనుకే వస్తున్న మరో సఫారీ బస్సులోని ప్రయాణికులు ఈ ఘటన ఫొటోలను తీశారు. సోమవారం ఇవి వైరల్‌గా మారాయి.

– న్యూస్‌టుడే, బెంగళూరు

దొడ్డు, సన్న వడ్లు పండించిన రైతులకు ఆంక్షలు లేకుండా క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, పౌరసరఫరాల సంస్థ మాజీ ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన వడ్లకే బోనస్ ఇస్తామనడం సరికాదన్నారు.

వందెకరాల ఆసామినంటూ నాలుగు పెళ్లిళ్లు

- పోలీసుల అదుపులో నిత్య పెళ్లికొడుకు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సినిమాల్లో చూపించినట్లుగా నకిలీ కుటుంబ సభ్యులను సృష్టిస్తాడు. ఇస్రోలో ఉద్యోగం చేస్తున్నానని, విల్లాలు, బంగ్లాలు ఉన్నాయని, 100 ఎకరాలకు ఆసామినని నమ్మిస్తాడు. ఇంకా పెళ్లి కాలేదని బుకాయిస్తాడు. ఇలా మాటల గారడీతో నాలుగు పెళ్లిళ్లు చేసుకున్న నిత్యపెళ్లికొడుకును ఏలూరు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ నిందితుడి వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం బంగారుపేటకు చెందిన అంశం అనీల్‌బాబు అలియాస్ కల్యాణ్‌రెడ్డి ప్రస్తుతం ఖమ్మం జిల్లా మధిరలోని టీచర్స్‌కాలనీలో ఉంటున్నాడు. 9వ తరగతి వరకు చదివాడు. ఓ మ్యాట్రిమోనిలో కల్యాణ్‌రెడ్డిగా రిజిస్టర్ చేయించుకున్నాడు. దీనిద్వారా తనను సంప్రదించిన వారికి ఫోన్ చేసి, కల్యాణ్‌రెడ్డి (వరుడు) తండ్రిని మాట్లాడుతున్నానని చెప్పేవాడు. 'మా అబ్బాయి ఇస్రోలో హెచ్ఆర్ ఇన్‌ఛార్జి. నేను, నా భార్య ఇంజినీర్లుగా పనిచేస్తున్నాం. మా అబ్బాయి పెళ్లిచూపులకు వస్తాడు' అని నమ్మించేవాడు. పెళ్లి చూపులకు వచ్చినప్పుడు తన తల్లిదండ్రులకు సెలవు దొరక్కపోవడంతో రాలేకపోయారని చెప్పేవాడు. తాను డబ్బున్న వాడినని భావించాలని హైదరాబాద్ శివారు చేవెళ్లలో ఓ ఫామ్‌హౌస్, బెంగళూరులో ఓ విల్లా అద్దెకు తీసుకున్నాడు. అవి తనవేనని చెప్పేవాడు. ఓ వ్యక్తిని, పెళ్లి చేసే పంతులును వెంటే ఉంచుకునేవాడు.

ఇలా చిక్కాడు


2023లో ఐదో పెళ్లి చేసుకునేందుకు ప్రణాళిక వేసిన అనీల్‌బాబు.. భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన గుండా లక్ష్మీకుమారిని సంప్రదించాడు. ఆమె రెండో కుమార్తెను పెళ్లి చేసుకుని, మూడో కుమార్తెకు ఇస్రోలో ఉద్యోగం ఇప్పిస్తానని మాట ఇచ్చాడు. దఫదఫాలుగా వారి నుంచి రూ.9.53 లక్షలు కాజేశాడు. తన వద్ద పని చేస్తున్న తుంగా శశాంక్ అనే మహిళతో ఇంటర్వ్యూ చేయించి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా ఇప్పించాడు. ఆ తర్వాత మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు భీమడోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ విల్సన్ దర్యాప్తు ప్రారంభించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో గుండుగొలను సమీపంలో నిందితులను తాజాగా అరెస్టు చేశారు. అనీల్‌బాబు గతంలో పెళ్లిళ్లు చేసుకున్న వారి నుంచి ఉద్యోగాలిప్పిస్తామని మోసగించి, రూ.1.50 కోట్ల వరకు కాజేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడు అనీల్‌బాబుతో పాటు వైఎస్సార్ జిల్లా యర్రగుంట్లకు చెందిన తుంగా శశాంక్, కారు డ్రైవరు నంద్యాల జిల్లా బనగానిపల్లి మండలం బత్తులూరుపాడుకు చెందిన పల్లె హేమంత్‌రెడ్డిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2 లక్షల నగదు, కారు, సెల్‌ఫోన్లు, 13 సిమ్‌లు, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

సహకార గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా జగన్మోహన్‌రావు

నూతన కార్యవర్గం ఎన్నిక



జగన్మోహన్‌రావు



భీంరాజ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర సహకారశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నమనేని జగన్మోహన్‌రావు (వరంగల్), ప్రధాన కార్యదర్శిగా దేవునూరి భీంరాజ్ (హైదరాబాద్)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాధ్యక్షునిగా కె.నాగార్జున, ఉపాధ్యక్షులుగా సంజీవరెడ్డి, టైటస్‌పాల్, పరమేశ్, రవిచందర్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రెడ్డి, గంగారెడ్డి, కోశాధికారిగా శ్రీనివాస్‌రావు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ఓంప్రకాశ్ ప్రకటించారు. హైదరాబాద్ టీజీవో భవన్‌లో సోమవారం ఈమేరకు నూతన కార్యవర్గం ఎన్నికైంది. అనంతరం వీరు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. 19 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న అధికారులు పదోన్నతులు రాక ఇబ్బందులు పడుతున్నారని, దీంతోపాటు సర్వీసుపరమైన సమస్యల పరిష్కారానికి, సహకార శాఖ బలోపేతానికి కృషిచేస్తామని చెప్పారు. త్వరలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పిస్తామన్నారు. బాధ్యతలు చేపట్టిన సహకార గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని టీజీవోల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస్‌రావు, ఎ.సత్యనారాయణ అభినందించారు.

మంత్రిపై పరువు నష్టం కేసు.. కోర్టులో నాగార్జున వాంగ్మూలం నేడు

ఈనాడు, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్‌పై సోమవారం నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. తమ కుటుంబ గౌరవం, ప్రతిష్ఠ దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు ఉన్నాయంటూ నాగార్జున పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషన్‌ను పరిశీలించి, వాదనలు విన్న న్యాయస్థానం అక్టోబరు 8న నాగార్జున వాంగ్మూలం నమోదు చేయాలని పేర్కొంది. దీంతో మంగళవారం ఆయన కోర్టుకు హాజరుకానున్నారు. ఇదే సమయంలో సాక్షుల స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయాలని న్యాయవాది అశోక్‌రెడ్డి కోరారు. అనంతరం తదుపరి విచారణను న్యాయస్థానం మంగళవారానికి వాయిదా వేసింది.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY, HYDERABAD
KUKATPALLY: HYDERABAD 500 085, TELANGANA
ADMISSION NOTIFICATION
For
Sponsored Category Seats in M.Tech./M.Pharmacy Regular Programs - 2024-25

Dt. 07.10.2024

Eligible candidates can attend Directly Counseling for admission in to M.Tech./M.Pharmacy regular programs under **Sponsored Category** for the academic year -2024-25 at Office of the Directorate of Admissions, JNTUH, Kukatpally. **Schedule of Counseling on 16th, 17th, 18th and 19th October, 2024 at 10.00 am.** For details of seats in each specialization, eligibility criteria, Sponsorship Certificate Format, Detailed Counseling Schedule and Tuition Fee etc. visit JNTUH website www.jntuh.ac.in. **These candidates are not eligible for hostel admission and scholarship. Sliding will not be permitted for already admitted candidates through TG PGECET-2024. Tuition Fee for Semester Rs.35,000/-.**

Sd/-
DIPR R.O. No. 5067-PP/CL/ADVT/1/2024-25 Dt. 7-10-2024 **REGISTRAR**

శ్లో॥ అంతకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కళేబరమ్ !
య ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయ: !

పెద్దకర్మ



కీ.శే. శ్రీ నలమాద పురుషోత్తమ్ రెడ్డి

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ క్రోధినామ సంవత్సర భాద్రపద బహుళ ద్వాదశి అనగా
29 సెప్టెంబర్ 2024 ఆదివారం ఉదయం గం. 7:30 ని.లకు

శ్రీ నలమాద పురుషోత్తమ్ రెడ్డి గారు

స్వర్గస్థులైనారని తెలుపుటకు చింతిస్తున్నాము.

వారి పెద్దకర్మ ది. 10 అక్టోబర్ 2024 గురువారం మధ్యాహ్నం గం. 12 ల నుండి
హైటెక్స్, హైదరాబాద్ నందు జరుపబడును. కావున తెలియపరచడమైనది.

ఇట్లు

భార్య : నలమాద ఉషాదేవి

కుమారులు - కోడళ్ళు :

నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి - పద్మావతి   నలమాద గౌతమ్ కుమార్ - సుమ

కుమార్తె : మల్లిపెద్ది హితశ్రీ (రుక్మిణి)

మనుమలు : అభిమన్యు, త్రికయ్, నిశ్చయ్

విశ్వసనీయతే పెట్టుబడిగా మార్గదర్శి విస్తరణ

- కర్ణాటకలో చిక్కబళ్లాపుర శాఖ ప్రారంభించిన ఎండీ శైలజాకిరణ్


చిక్కబళ్లాపురలో మార్గదర్శి కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సంస్థ ఎండీ శైలజాకిరణ్, మార్గదర్శి కర్ణాటక డైరెక్టర్ లక్ష్మణరావు తదితరులు


చిక్కబళ్లాపుర శాఖ మొదటి కస్టమర్ నుంచి చిట్ పత్రాలు స్వీకరిస్తున్న మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్

ఈనాడు, బెంగళూరు: చందాదారుల విశ్వసనీయతే పెట్టుబడిగా కొనసాగుతున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను శాఖోపశాఖలుగా విస్తరించనున్నట్లు సంస్థ ఎండీ శైలజాకిరణ్ ప్రకటించారు. 62 ఏళ్ల సుదీర్ఘ వ్యాపార ప్రస్థానంలో ఉత్తమ సేవలతో చందాదారుల నమ్మకాన్ని కాపాడుకుంటూ వస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం కర్ణాటకలోని చిక్కబళ్లాపురలో సంస్థ 115వ శాఖను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'కర్ణాటకలోనూ మార్గదర్శి సంస్థ శాఖలు ఏటేటా విస్తరిస్తున్నాయి. ఉద్యోగాలు, చదువులు, వ్యాపారాలు, సొంతింటి నిర్మాణాలు.. ఇలా అన్ని అవసరాలు తీర్చేలా, చందాదారుల జీవితాశయాలు నెరవేర్చుకునే చిరునామాగా మార్గదర్శి మారింది. సేవల్లో నాణ్యత, నిబద్ధత కలిగిన సిబ్బంది సహకారంతో కర్ణాటకలో 24వ శాఖను ప్రారంభించాం. ఇటీవలే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని కోలారులో కొత్తశాఖను ప్రారంభించాం' అని శైలజాకిరణ్ గుర్తుచేశారు. 'తొమ్మిది వేలకు పైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కలిగి ఉన్న చిక్కబళ్లాపుర నగరం.. కన్నడనాట 1.4 శాతం వాటాతో రూ.14 వేల కోట్ల స్థూల దేశీయోత్పత్తిని సాధిస్తోంది. 13 లక్షల జనాభా గల ఈ జిల్లాలో మార్గదర్శికి చందాదారుల స్పందన అమోఘంగా ఉంటుందని ఆశిస్తున్నాం. త్వరలో బెంగళూరు నగరంలోని జేపీ నగర, కెంగేరిల్లోనూ కొత్త శాఖలు ప్రారంభిస్తామ'ని వెల్లడించారు. ఏటా కనీసం ఐదు కొత్త శాఖలు, ప్రతి తాలూకా పరిధిలో ఓ శాఖ ఏర్పాటు చేయాలన్న సంకల్పం ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్గదర్శి కర్ణాటక విభాగం డైరెక్టర్ పి.లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు పి.రాజాజి, బలరామకృష్ణ, చిక్కబళ్లాపురతో పాటు వివిధ శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ గ్యారంటీలే మా సొమ్ముకు రక్ష



మార్గదర్శిలో గ్యారంటీలు, నిబంధనలు ఎక్కువగా ఉంటాయన్న వాదన ఉన్నా, ఆ నిబంధనలే మా సొమ్ముకు రక్షణగా ఉంటాయని విశ్వసిస్తున్నాం. గతంలో నేను చిన్నచిన్న వ్యాపారాలను బ్యాంకు రుణాలతో ప్రారంభించేవాడిని. వాటిలో లాభాలు అంతగా చూడలేదు. అందుకు కారణం, వచ్చిన ఆదాయంలో ఎక్కువ భాగం కంతులకే వెళ్లేది. మార్గదర్శిలో ఆ భయం, భారం ఉండదు. వడ్డీ భారం లేని మార్గదర్శి చందాలు అన్నివర్గాల వారికి భరోసా కల్పిస్తాయి.
– డీసీ సంతోష్, యువ వ్యాపారవేత్త, చిక్కబళ్లాపుర

ఇక బీసీ గురుకులాల్లో 'మోడల్' విధానం

- పది పాసైతే నేరుగా ఇంటర్‌లోకి..
- వచ్చే ఏడాది నుంచి ఎంసెట్, నీట్ శిక్షణ
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



ఈనాడు, హైదరాబాద్: బీసీ గురుకులాల్లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు మోడల్ స్కూళ్ల తరహాలో నేరుగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంక్షేమ గురుకులాల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎంసెట్, నీట్ కోచింగ్ ఇస్తామని వెల్లడించారు. బీసీ గురుకుల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. త్వరలోనే వసతిగృహ సంక్షేమాధికారుల పదోన్నతులపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సోమవారమిక్కడ కుమురంభీం ఆదివాసీ భవన్‌లో బీసీ సంక్షేమశాఖ క్షేత్రస్థాయి అధికారులు, వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. గురుకుల విద్యాలయాల్లో సమస్యలపై ఆయా ప్రిన్సిపాళ్ల నుంచి సమాచారం తీసుకున్నారు. ఇంటర్నేషనల్ పాఠశాలలకు మించి యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు రానున్నాయన్నారు. ఈ గురుకులాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు సంబంధించి మెస్‌ఛార్జీల పెంపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, బిల్లులన్నీ గ్రీన్‌ఛానెల్ ద్వారా చెల్లిస్తామని ప్రకటించారు.

నెలాఖరులోపు తల్లిదండ్రులతో సమావేశాలు..

"ఇంటర్‌లో అన్ని గ్రూపులు అందుబాటులో పెట్టాలి. 8, 9, 10 తరగతులకు సంబంధించి రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రతి విద్యార్థి రెండింటిలో ఉండేలా చూడాలి. ఏఎన్ఎంలు విద్యార్థుల ఎత్తు, బరువు కొలుస్తూ రక్తహీనత లేకుండా చూడాలి. దసరా సెలవుల అనంతరం ఈనెల 15-31లోగా అన్ని గురుకులాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరించాలి. దసరాలోగా అద్దె భవనాల యజమానులకు 50 శాతం అద్దె చెల్లిస్తాం. స్టడీసర్కిళ్ల ద్వారా పిల్లలకు స్ఫూర్తిదాయకమైన తరగతులు నిర్వహించాలి. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి గురుకులంలో ప్రత్యేక బాక్స్‌లు ఏర్పాటుచేసి, ఆ సమస్యలను ఆర్సీవోలు పరిశీలించాలి" అని మంత్రి తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు సూచించారు. సమీకృత గురుకుల భవనాలు అందుబాటులోకి వచ్చిన తరువాత మౌలిక సదుపాయాలకు సమస్యలు ఉండబోవన్నారు. విద్యార్థులను ఒక్కో అంశంలో నిపుణులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాలమాయాదేవి, గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ ఆలోక్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్యబట్టు, జాయింట్ డైరెక్టర్ సంధ్య, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు జిల్లాల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

16 పరిశ్రమలకు మంత్రివర్గ ఉపసంఘం పచ్చజెండా!

- 8 కంపెనీలపై మరింత సమాచారం కావాలని అధికారులకు ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా పలు పరిశ్రమల స్థాపనకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపినట్లు తెలిసింది. 24 పరిశ్రమలపై చర్చించిన మంత్రివర్గ ఉపసంఘం.. ఇందులో 16 కంపెనీలకు ఆమోదముద్ర వేసినట్లు, మరో 8 పరిశ్రమలకు సంబంధించి మరింత సమాచారం అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిశ్రమలకు ప్రోత్సాహంపై కీలక నిర్ణయాలు తీసుకుంది. పెట్టుబడులు పెట్టాల్సిందిగా పారిశ్రామిక సంస్థలను ఆహ్వానించింది. భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించింది. దీంతో సానుకూలంగా స్పందించిన పలు కంపెనీలు పెట్టుబడులకు ముందుకొచ్చాయి. తమ ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచాయి. ఈ ప్రతిపాదనలపై సోమవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. వీటిలో ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది, రాయితీల గడువును పెంచమని కోరుతున్న కంపెనీలు కొన్ని ఉండగా, భూ కేటాయింపుల్లోనూ రాయితీలు అడుగుతున్నవి మరికొన్ని ఉన్నాయి. ఇటువంటి రెండు సిమెంట్ కంపెనీలు, ఒక ఆహార పరిశ్రమలతో పాటు మరో ఐదు పరిశ్రమలకు సంబంధించి మరిన్ని వివరాలను సమర్పించాల్సిందిగా మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మరో సమావేశంలో వీటిపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఆమోదించిన కంపెనీలకు అవసరమైన భూ కేటాయింపులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై సత్వరమే దృష్టిపెట్టాలని మంత్రివర్గ ఉపసంఘం ఉన్నతాధికారులను ఆదేశించింది. పరిశ్రమలకు అవసరమైన అనుమతుల జారీలో రెవెన్యూ, విద్యుత్, జలమండలి, రోడ్లు భవనాలు, కాలుష్య నియంత్రణ మండలి, తదితర శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించింది.

ఎన్ఐసీ చేతికి ధరణి

- ప్రైవేటు సంస్థను పక్కన పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- సాగు, ప్రభుత్వ భూముల రికార్డుల వ్యవస్థ సర్కారు అధీనంలోకి

ఈనాడు, హైదరాబాద్: భూముల రికార్డుల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం ప్రైవేటు కంపెనీ నుంచి నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ)కు అప్పగించింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఈ మేరకు బాధ్యతల బదిలీ ప్రక్రియ పూర్తయింది. గత నెల వరకు బాధ్యతలు పర్యవేక్షించిన ప్రైవేటు కంపెనీ క్వాంటెలాను ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టింది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంతోనే ఈ సంస్థ నిర్వహణ గడువు ముగిసినప్పటికీ తాత్కాలిక నిర్వహణ బాధ్యతలను పొడిగిస్తూ వచ్చారు.

2020 నవంబరు నుంచి ప్రైవేటు చేతుల్లో..

రాష్ట్రంలో మా భూమి(వెబ్‌ల్యాండ్) పోర్టల్ ద్వారా భూ దస్త్రాల నిర్వహణను ఎన్ఐసీ నిర్వహించేది. 2020 నవంబరులో ధరణి పోర్టల్ అందుబాటులోకి రావడంతో అప్పటి నుంచి సాఫ్ట్‌వేర్ నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు కంపెనీకి అప్పగించారు. అనంతరం పలు సంస్థల నుంచి చేతులు మారుతూ చివరికి క్వాంటెలా చేతికి వచ్చింది. భూముల దస్త్రాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని, భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ సంస్థలకు ధరణి బాధ్యతలను అప్పగిస్తామని గతేడాది శాసనసభ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ హామీ మేరకు ఆయన సీఎం కాగానే ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీటీఎస్(తెలంగాణ రాష్ట్ర సాంకేతిక సేవలు) ఎండీతోపాటు పలువురు ఐఏఎస్‌లతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ధరణి నిర్వహణను ఎన్ఐసీ, టీజీటీఎస్, సీజీజీ సంస్థలకు అప్పగించే విషయమై ఈ కమిటీ అధ్యయనం చేసి ఇటీవల నివేదిక ఇచ్చింది. పోర్టల్ నిర్వహణను తక్కువ వ్యయంతోనే చేపట్టడానికి ఎన్ఐసీ ముందుకు రావడంతో చివరికి దాని వైపే మొగ్గు చూపింది.

గతం కంటే రూ.85 లక్షలు తక్కువకు...

ధరణి నిర్వహణతోపాటు ఆపరేటర్లు, జిల్లా కోఆర్డినేటర్లు, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో నిపుణులందరికీ కలిపి ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ.3.15 కోట్లు చెల్లించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ప్రైవేటు కంపెనీ చేతుల్లో ఉండగా రూ.4 కోట్ల వరకు చెల్లింపులు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు ఎన్ఐసీకి అప్పగించినప్పటికీ సాఫ్ట్‌వేర్, పూర్తిస్థాయి డేటా, సర్వర్ వ్యవస్థలకు సంబంధించిన సమాచారాన్ని స్వాధీనం చేసుకోవడానికి రెండు నెలల సమయం పట్టే అవకాశాలు ఉన్నాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇకపై ఎన్ఐసీ, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టీజీటీఎస్‌లు సంయుక్తంగా ధరణికి సంబంధించిన అంశాలపై సమన్వయం చేసుకుంటాయని, ప్రజలకు సంబంధించిన వ్యవసాయ భూ రికార్డుల వ్యవస్థ అంతా ప్రభుత్వ అధీనంలోకి వచ్చినట్లైందని పేర్కొంటున్నారు.



కట్టుకట్టి... 15 వేల మొక్కలను సంరక్షించాడు!

ఈయన పేరు యెంబడి గంభీర్. వయస్సు 75 సంవత్సరాలు. మొక్కలు పెంచడం, అవి చెట్లయ్యేంతవరకు నీరు పోసి రక్షించడం విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఝరి(నార్నూరు), జైనూరు తదితర ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఆదిలాబాద్‌లోని క్షయ ఆసుపత్రిలో సూపర్‌వైజర్‌గా 33 సంవత్సరాలు సేవలు అందించారు. 20 వేల మందికి పైగా క్షతగాత్రులకు కట్టుకట్టారు. 2008లో పదవీ విరమణ పొందిన అనంతరం పర్యావరణ పరిరక్షణపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. 18 ఏళ్ల కిందట ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో 6 నెలల మొక్క విరిగిపోతే దానికి కట్టుకట్టి బతికించగా ఇప్పుడది వృక్షమైంది. అలా ఇప్పటి వరకు దాదాపు 15 వేల వరకు విరిగిన మొక్కలకు కట్లు కట్టి కాపాడారు. మొక్క విరిగిపోతే వెంటనే దానికి కట్టుకట్టి రోజూ పర్యవేక్షిస్తానని ఇలా 30 సంవత్సరాల్లో వేల సంఖ్యలో మొక్కలను సంరక్షించినట్లు తెలిపారు.

–ఈనాడు, ఆదిలాబాద్, న్యూస్‌టుడే ఆదిలాబాద్ క్రీడావిభాగం

రుణమాఫీ లెక్కలన్నీ బయటపెట్టాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు బూటకపు హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకుండా తెలంగాణ రైతులను మోసం చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. "అధికారంలోకి రాగానే రైతు రుణాలు ఒకేసారి మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన 224 రోజుల తరువాత రుణాలు సగం మాత్రమే మాఫీ అయ్యాయి. 2024 ఆగస్టు 26న ఓ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో రూ.31 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశామని ప్రకటించారు. ప్రధాని మోదీకి తాజాగా రాసిన లేఖలో రూ.17 వేల కోట్ల మేర రుణ మాఫీ జరిగిందని తెలిపారు. మిగతా రూ.14 వేల కోట్లు ఎక్కడికి పోయాయి. మరో 16 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఎందుకు జరగలేదు. రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ అని ప్రకటించి ఇప్పుడు కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అని చెప్పడం దారుణమైన మోసం కాదా. వాస్తవంగా రాష్ట్రంలో పంట రుణాలు తీసుకున్న రైతులు ఎంత మంది, రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్నవారెందరు, రుణమాఫీ పొందినవారి వివరాలేమిటో గణాంకాలతో వెల్లడించాలి' అని కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రధానికి సీఎం రాసిన లేఖలో అన్నీ అబద్ధాలే

భాజపా శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: పంటరుణ మాఫీ విషయమై ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా రాసిన లేఖలో అన్నీ అబద్ధాలే ఉన్నాయని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మేలు చేసేందుకు వాస్తవాలను విస్మరిస్తూ ఉత్తరం రాశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి లేఖపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఓ సభలో ప్రధాని మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోని తెలంగాణలో రైతులు ఇంకా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారని తెలిపారు. ప్రధాని వ్యాఖ్యలు వచ్చే ఎన్నికల్లో అక్కడి రైతులను ప్రభావితం చేస్తాయన్న కారణంతో కాంగ్రెస్ అధిష్ఠానం సూచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాస్తవాలను విస్మరించి, అబద్ధాలను రంగరించి లేఖ రాశారని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.



సర్వభూపాల వాహనంపై కాళీయ మర్దనుడు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సప్తగిరులు గోవింద నామస్మరణతో మారుమోగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజు సోమవారం రాత్రి శ్రీమలయప్ప స్వామివారు శ్రీకాళీయ మర్దనుడి అలంకారంలో ఉభయ దేవేరులతో కలిసి సర్వభూపాల వాహనంపై భక్తులను కటాక్షించారు. ఉదయం స్వామివారికి కల్పవృక్ష వాహనసేవ జరిగింది. వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులకు అభయప్రదానం చేశారు. బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన మంగళవారం సాయంత్రం 6.30 నుంచి గరుడ వాహనంపై శ్రీవారు ఊరేగి భక్తులకు అభయ ప్రదానం చేయనున్నారు.

విద్యుత్ డిమాండ్ ఆధారంగా ఈవీ ఛార్జింగ్ ధరలు

- ✦ ఉదయం 6 నుంచి 10– సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకూ యూనిట్‌కు రూ.7
- ✦ రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు రూ.5 ✦ మిగిలిన వేళల్లో రూ.6

- ఈఆర్‌సీకి డిస్కంల ప్రతిపాదన


ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈవీ ఛార్జింగ్ స్టేషన్

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ వాహనాలకు(ఈవీ) ఛార్జింగ్ పెట్టుకునేందుకు చెల్లించాల్సిన ఛార్జీలను విద్యుత్ డిమాండుకు అనుగుణంగా నిర్ణయించినట్లు రెండు విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లూ తెలిపాయి. రాష్ట్రంలో సాధారణంగా ఈవీ ఛార్జింగ్ పెట్టుకుంటే యూనిట్‌కు రూ.6 కరెంటు ఛార్జీని వసూలు చేస్తున్నాయి. కానీ రోజూ పగటిపూట కొన్ని సమయాల్లో అన్ని వర్గాల వినియోగదారులు కరెంటును ఒకేసారి వినియోగిస్తున్నందున గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఏర్పడుతోంది. తిరిగి రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకూ ఒక్కసారిగా పడిపోతోంది. ఈ నేపథ్యంలో గరిష్ఠ డిమాండ్ ఉండే ఉదయం, సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకూ ఈవీల ఛార్జింగ్ పెట్టుకుంటే యూనిట్‌కు రూ.7 చొప్పున వసూలు చేస్తామని 'రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి'(ఈఆర్‌సీ)కిచ్చిన ప్రతిపాదనల్లో తెలిపాయి. విద్యుత్ డిమాండ్ బాగా పడిపోయే సమయం రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకూ ఛార్జింగ్ పెట్టుకుంటే యూనిట్‌కు రూ.5 చొప్పున మాత్రమే కరెంటు ఛార్జీని వసూలు చేస్తామని డిస్కంలు ప్రతిపాదించాయి. మిగిలిన సమయాల్లో అంటే ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకూ మాత్రం యూనిట్‌కు రూ.6 చొప్పున వసూలుచేయాలని భావిస్తున్నారు. ఈఆర్‌సీ ఆమోదం అనంతరం ఈ ఛార్జీలు అమలులోకి వస్తాయి. డిస్కం ధరకు అదనంగా నిర్వహణ వ్యయాన్ని కలిపి ఆయా స్టేషన్ల నిర్వాహకులు యూనిట్ ధరను వసూలు చేస్తారు. రాష్ట్రంలో లోటెన్షన్(ఎల్‌టీ) కేటగిరీలో 508, హైటెన్షన్(హెచ్‌టీ)లో 21 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల కరెంటు కనెక్షన్లు ఉన్నట్లు డిస్కంలు తెలిపాయి.

ఛార్జింగ్ స్టేషన్‌లో బ్యాటరీ మార్పునకు కేంద్రం మార్గదర్శకాలు..

ఈవీ ఛార్జింగ్ స్టేషన్లలో బ్యాటరీ మార్చుకునే ప్రక్రియను సులభతరం చేస్తూ కేంద్ర విద్యుత్‌శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీచేసింది. ప్రతి ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌లో బ్యాటరీని మార్చుకునేందుకు(స్వాపింగ్) అవకాశం కల్పించింది. పూర్తిగా ఛార్జింగ్ చేసిన బ్యాటరీలను అద్దెకు కూడా ఇవ్వవచ్చని కేంద్రం తెలిపింది. ఈవీలో ఉన్నదానితోపాటు అదనంగా మరో బ్యాటరీ ఉంటే సొంత కరెంటు కనెక్షన్ నుంచి దానిని ఛార్జింగ్ చేసుకోవచ్చని పేర్కొంది. బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్ల(బీఎస్ఎస్) లేదా బ్యాటరీ ఛార్జింగ్ స్టేషన్ల(బీసీఎస్)ను సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది. ఛార్జింగ్ లేని సమయంలో బ్యాటరీల నుంచి అవసరమైతే కరెంటును గ్రిడ్‌కు కూడా సరఫరా చేసుకునే సదుపాయాలను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపింది. దీనివల్ల దేశంలో విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వ చేసుకునే సౌకర్యాలు పెరుగుతాయని వివరించింది.



ప్రాధాన్యతలను గుర్తిస్తేనే సమయం సద్వినియోగం

ప్రతి ఒక్కరికీ ఉన్నది రోజుకు 24 గంటల సమయమే. తమ ప్రాధాన్యతలేంటో స్పష్టంగా తెలిసినవారే దాన్ని సమర్థంగా వినియోగించుకోగలరు. మీరు ప్రాధాన్యతలను ఎంపిక చేసుకున్న తర్వాత ఏ పనికి ఎంత సమయం కేటాయించుకోవాలో నిర్ణయించుకోవాలి. మీకు సంబంధం లేని పనులకు, మీకు ఏ విధంగానూ ఉపయోగపడని వ్యక్తులకు మీ సమయాన్ని కేటాయించకండి. మీ ఉద్యోగానికి, దీర్ఘకాలిక లక్ష్యానికి అవసరమైన కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి ఎక్కువ సమయాన్ని వినియోగించండి. కుటుంబంతో గడిపే సమయం కూడా మీ ప్రాధాన్యతల్లో ఉండాలి. దీన్ని అనుసరించినవారికి సమయం లేకపోవడమంటూ ఉండదు.

– ఎ.వేలుమణి, వ్యాపారవేత్త

కాళ్లూ చేతులు కట్టేసి కృష్ణాలో పడేసి..

- వాటా డబ్బులు అడిగాడని వ్యాపార భాగస్వామి హత్య
- హైదరాబాద్‌లో అపహరణ.. కొత్తకోటలో ఘాతుకం


వెంకటప్పన్నరెడ్డి

జీడిమెట్ల, న్యూస్‌టుడే: వ్యాపారం నుంచి తప్పుకొన్న భాగస్వామి తన వాటా డబ్బులు తిరిగివ్వమని అడగ్గా స్నేహితుడే అతడిని కిరాయి వ్యక్తులతో అపహరించి.. కాళ్లూ చేతులు కట్టేసి కృష్ణా నదిలో పడేసి హత్య చేయించాడు. మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి డీసీపీ కోటిరెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా భీమిలికి చెందిన వెంకటప్పన్నరెడ్డి(54) రెండేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చారు. భార్య, ఇద్దరు కుమారులతో ఆల్విన్ కాలనీ ఈస్ట్‌సాయినగర్‌లో ఉంటున్నారు. బాలానగర్‌లోని మేఘా సంస్థలో ఏజీఎంగా పనిచేస్తున్నారు. ఈ నెల 4న విధులకు వెళ్లి.. రాత్రయినా తిరిగి రాకపోవడంతో భార్య హేమ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా స్నేహితుడే అపహరించినట్లు గుర్తించారు.

అన్నమయ్య జిల్లా కలికిరి మండలానికి చెందిన బత్తిన ద్వారకానాథ్‌రెడ్డి(48) వెంకటప్పన్నరెడ్డికి విశాఖపట్నంలో పరిచయమయ్యాడు. ఇద్దరూ 2021-22లో కాకినాడ పోర్టులో క్యాటరింగ్, క్లీనింగ్ సర్వీస్ వ్యాపారం చేశారు. లావాదేవీల్లో విభేదాలు వచ్చాయి. భాగస్వామి వాటా డబ్బులు రూ.28 లక్షలు చెల్లించేందుకు ద్వారకానాథ్‌రెడ్డి అంగీకరించాడు. నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో ఇటీవల ద్వారకానాథ్‌రెడ్డి ఇంటికి వెళ్లి తన డబ్బులివ్వాలని వెంకటప్పన్నరెడ్డి నిలదీశాడు. కుటుంబ సభ్యుల ముందు నిలదీయడంతో పరువు పోయిందని భావించిన ద్వారకానాథ్‌రెడ్డి స్నేహితుడిని హత్య చేసేందుకు పథకంవేశాడు. తెలిసిన వారి సాయంతో వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలానికి చెందిన సుధాకర్‌రెడ్డి(59)కి విషయం చెప్పాడు. అదే ప్రాంతానికి చెందిన పాశం ప్రసాద్(36) బుసుపాటి కిరణ్‌కుమార్(30), గడ్డం వెంకటసుబ్బయ్య(25) అన్నిక మణికంఠ(25)లకు రూ.10వేల చొప్పున చెల్లించి హత్యకు ఒప్పందం చేసుకున్నాడు. వారు ఈ నెల 4న ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతున్న వెంకటప్పన్నరెడ్డిని కూకట్‌పల్లి మైత్రీనగర్ వద్ద అడ్డుకున్నారు. క్లోరోఫాం చల్లి అపస్మారక స్థితిలోకి చేరిన తర్వాత కారులో జోగులాంబ గద్వాల జిల్లా కొత్తకోట తీసుకెళ్లారు. కాళ్లు, చేతులు కట్టేసి బీచుపల్లి బ్రిడ్జి మీద నుంచి కృష్ణానదిలో పడేశారు. పోలీసులు సాంకేతిక ఆధారాల ద్వారా జల్లెడపట్టి నిందితుల ఆచూకీని కనిపెట్టారు. పడేసిన చోటు నుంచి 15 కి.మీ. దూరంలో మృతదేహాన్ని గుర్తించారు. విలేకరుల సమావేశంలో అదనపు డీసీపీ సత్యనారాయణ, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఉన్నారు.

చేపపిల్లల పంపిణీపై నిఘాకు 'టి-మత్స్య'

గుత్తేదారులు, చెరువుల వారీగా వివరాల నమోదు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో రూ.100 కోట్లతో చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ పథకంలో అక్రమాల నిరోధానికి మత్స్య శాఖ 'టి-మత్స్య' పేరిట కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో దాదాపు పదేళ్లుగా చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. వీటి సరఫరాలో గుత్తేదారులు అక్రమాలకు పాల్పడ్డారన్న అభియోగాలున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమాల అడ్డుకట్టకు మత్స్యశాఖ యాప్‌ను రూపొందించింది. ఈ నెల 3న కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జనగామ, పెద్దపల్లి జిల్లాల్లో తొలి విడత పథకాన్ని ప్రారంభించారు. ఈ నెల 15 వరకు పంపిణీ చేయాలని భావిస్తున్నారు. యాప్‌లో జిల్లాల వారీగా చేపపిల్లల పంపిణీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సిబ్బంది పొందుపరుస్తున్నారు. నిర్దేశిత చెరువులు, గుత్తేదారుల వారీగా లక్ష్యాలు, పంపిణీ చేసిన చేపపిల్లలు. రవాణాకు వాడిన వాహనాల నంబర్లు, ఒక్కో వాహనంలో రవాణా చేసిన చేపపిల్లల సంఖ్య, వాటి ఫొటోలు, గుత్తేదారులు, డ్రైవర్ల ఫోన్ నంబర్లు తదితర వివరాలన్నీ నమోదు చేస్తున్నారు. యాప్‌లో నమోదుచేసిన గణాంకాల ఆధారంగా రోజువారీగా పంపిణీ అవుతున్న ఉచిత చేపపిల్లల వివరాలను మత్స్య శాఖ సంచాలకురాలు ప్రియాంక సమీక్షిస్తున్నారు.

చంద్రబాబుతో తీగల భేటీ

కాంగ్రెస్‌ను వీడి తెదేపాలో చేరాలని నిర్ణయం!


చంద్రబాబును కలిసిన తీగల కృష్ణారెడ్డి

ఈనాడు–హైదరాబాద్, మహేశ్వరం–న్యూస్‌టుడే: హైదరాబాద్ నగర మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబును సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. చంద్రబాబును శాలువాతో సత్కరించారు. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నానని చంద్రబాబుకు చెప్పగా మళ్లీ మాట్లాడుదామని ఆయన అన్నారు. చంద్రబాబును కలిసిన అనంతరం విలేకరులతో తీగల మాట్లాడుతూ..తాను తెలుగుదేశంలో చేరతానని తెలిపారు. తెలంగాణలో ఎన్టీఆర్‌కు ఎంతోమంది అభిమానులున్నారని, చంద్రబాబు హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని చెప్పారు. తెలంగాణలో తెదేపాను బలోపేతం చేస్తామన్నారు. ప్రస్తుతానికి తాను, తన అనుచరులు మాత్రమే తెలుగుదేశంలో చేరుతున్నామని, తన కుటుంబ సభ్యులు చేరడం లేదని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులను ఇతర ప్రాంతాలకు తరలించే విషయంలో ప్రభుత్వ వైఖరి సక్రమంగా లేదని అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న తన కోడలు, రంగారెడ్డి జడ్పీ మాజీ అధ్యక్షురాలు అనితా హరినాథ్‌రెడ్డితో కలిసి తీగల కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు భారాసలో ఉన్నారు. కాంగ్రెస్‌లో తనకు సముచిత స్థానం దక్కడం లేదన్న అసంతృప్తి.. మూసీ నిర్వాసితుల తరలింపులో ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకించాలనుకోవడం తదితర అంశాల నేపథ్యంలో తెదేపాలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

కుమార్తె వివాహానికి చంద్రబాబును ఆహ్వానించిన మర్రి

తన కుమార్తె వివాహానికి రావాలంటూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెదేపా అధినేత, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును ఆహ్వానించారు. మాజీ మంత్రి మల్లారెడ్డితో కలిసి వచ్చిన ఆయన చంద్రబాబుకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆ సమయంలో తీగల కృష్ణారెడ్డి కూడా అక్కడే ఉన్నారు. మీరూ తెదేపాలో చేరుతున్నారా అని వారిని విలేకరులు ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు.

ఐటీ పార్కుల పరిధిలో
కేంద్రీకృత రవాణా వ్యవస్థ



సమావేశంలో సీపీ అవినాశ్ మహంతి, జోయల్ డేవిస్, ఐటీ సంస్థల ప్రతినిధులు

ఈనాడు- హైదరాబాద్, రాయదుర్గం, న్యూస్‌టుడే: ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై సైబరాబాద్ పోలీసులు వేగంగా ముందుకెళ్తున్నారు. ఐటీ పార్కుల పరిధిలో కేంద్రీకృత రవాణా వ్యవస్థ, ఉమ్మడిగా వాడుకునే వాహనాల ఏర్పాటుపైనా కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఉద్యోగులు కార్‌పూలింగ్ వాడేలా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. ఈ మేరకు ఐటీ పరిశ్రమల ప్రతినిధులతో సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి, జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్, మాదాపూర్ డీసీపీ వినీత్ సోమవారం సమావేశమయ్యారు.

- సాధారణ రోజులు, వారాంతాల్లో రద్దీ తక్కువ ఉండేలా వేళలు వేర్వేరుగా ఉండాలి.
- ఆఫీసు వేళల సమాచారం ఐటీ కంపెనీలు ఇస్తే ముందస్తు చర్యలు తీసుకుంటారు.
- వాహనాల నియంత్రణ కోసం ట్రాఫిక్ మార్షల్ల వినియోగంతో పాటు సీఎస్ఆర్ నిధుల్ని సమర్థంగా ఉపయోగించడం.
- ప్రభుత్వ విభాగాల సమన్వయంతో రోడ్లను మెరుగుపర్చడం, రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయడం.
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ ప్రాంతంలో ప్రజా రవాణా వ్యవస్థ, రాయదుర్గం మెట్రోస్టేషన్, ఇమేజ్ టవర్స్ దగ్గర బస్ బే, పార్కింగ్ సౌకర్యం మెరుగుపర్చాలి.
- టీజీఐఐసీ, టీఎస్ఆర్టీసీ, జీహెచ్ఎంసీ సహా ఇతర ప్రభుత్వ శాఖలతో చర్చించి మరిన్ని చర్యలు తీసుకోవాలి.

పరిహారంపై మల్లగుల్లాలు

మూసీ నిర్వాసితులకు ఖజానా నుంచి కేటాయించలేని పరిస్థితి

రూ.12 వేల కోట్లకు పైగా అవసరం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులకు పరిహారం చెల్లించే విషయంలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇందుకు సుమారు రూ.12 వేల కోట్లకు పైగా అవసరమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇంత పెద్దమొత్తం నిర్వాసితుల మీదే వ్యయం చేయడం చాలా కష్టమైన విషయమని సీనియర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఖజానాలో మూసీకి పెద్దఎత్తున నిధులను కేటాయించే పరిస్థితి లేదని చెబుతున్నారు.



ఇటీవల చాదర్‌ఘాట్ వద్ద మూసీ పరీవాహకంలో కూల్చివేతలు

రుణం వస్తే ఊరట

మూసీ ప్రాజెక్టు కోసం రుణానికి వివిధ ఆర్థిక సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఇందుకు రూ.50 వేల కోట్ల మేర రుణం తీసుకోవాలని అనుకుంటోంది. ఈ మొత్తం మంజూరైతే నిర్వాసితులకు పరిహారం ఇచ్చే అవకాశం ఉంటుందని అంటున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా ఈ ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి పలు సభల్లో కుండబద్దలు కొట్టారు. క్షేత్రస్థాయిలో మాత్రం అవంతరాలు ఎదురవుతున్నాయి.

బఫర్‌లో 15 వేల ఆక్రమణలు


మంచిరేవుల నుంచి నాగోలు వరకు 55 కి.మీ.ల పొడవున మూసీని సుందరీకరణతోపాటు ఆరు వరుసల రహదారి, మెట్రో సౌకర్యం కల్పించాలని ప్రణాళిక రూపొందించారు. దీనికి రూ.50 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. దాదాపు 15 వేల ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. వాస్తవంగా మొత్తం చిన్నాపెద్దా నిర్మాణాలు దాదాపు 22 వేల వరకు ఉంటాయని చెబుతున్నారు. నదీ గర్భంలో ఉంటున్న 1600 మందికి రెండు పడక గదులను ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి 80 శాతం మంది అంగీకరించారు.

అపార్ట్‌మెంట్ల వాసుల అనాసక్తి

బఫర్ జోన్‌లో దాదాపు 5 వేల మందికిపైగా నిర్మాణదారులు బల్దియా నుంచి అనుమతులు తీసుకుని ఇళ్లను నిర్మించారు. ఇందులో అపార్టుమెంట్లూ ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో న్యాయం జరగదని వీరు ఖాళీ చేయడానికి ముందుకు రావడం లేదు. అత్తాపూర్ నుంచి బాపూఘాట్‌కు వెళ్లే ప్రాంతంలో ఒకచోట ఓ బిల్డర్ మూడేళ్ల కిందట 30 ఫ్లాట్లతో కూడిన అపార్టుమెంట్, ఆరు విల్లాలను నిర్మించారు. ఒక్కో ఫ్లాట్‌ను రూ.70 లక్షలకు, విల్లాలను కోటిన్నరకు విక్రయించారు. ప్రభుత్వం వీరికి ఇచ్చే పరిహారం 40 శాతం కూడా రావడం లేదు. వీరికి ఎలా న్యాయం చేయాలన్న దానిపై ప్రణాళిక లేదు. నగరంలో స్థలాన్ని సేకరించి వంద గజాల నుంచి ఆపైన పరిహారంగా ఇచ్చే విషయాన్నీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

చుట్టేద్దాం.. చూసొద్దాం

ఆహ్లాదకర వాతావరణం.. ఇటీవల కురిసిన వర్షాలతో పుడమికి పచ్చని రంగేసినట్టుగా పచ్చదనంతో ప్రకృతి పులకింపు.. నిండుకుండల్లా జలాశయాలు... పండగ రోజులు.. పిల్లలకు సెలవులు.. విహారానికి ఇంతకుమించిన అనువైన సమయం ఇంకేం ఉంటుంది.



ఈనాడు, హైదరాబాద్

పాఠశాలల నుంచి ప్రత్యేక టూర్లు..

దసరా సెలవులు మొదలైన రెండో తేదీ నుంచే పిల్లలను పలు పాఠశాలలు విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లాయి. ఎక్కువగా ఉత్తర భారత యాత్రలు, కొన్ని పాఠశాలలు ఇంటర్నేషనల్ టూర్లను ఏర్పాటు చేశాయి. వృత్తి, ఉద్యోగాలతో తీరిక లేకుండా ఉన్న తల్లిదండ్రులు.. సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తున్న ఈ తరహా విహారయాత్రలకు పంపిస్తున్నారు. ఐదారు రోజుల యాత్రకు విమానాల్లో వెళ్లి వస్తున్నారు. పండగ రోజు నాటికి ఇంట్లో ఉండేలా టూర్ షెడ్యూల్‌ను హైదర్‌గూడలోని ఒక పాఠశాల డిజైన్ చేసింది.

విహారంలోనూ పండగ..

- దసరా ఉత్సవాలను చూసేందుకు పండగ రోజు మైసూర్‌లో ఉండేలా, ఇంకొంత మంది కోల్‌కతా వరకు పయనమవుతున్నారు. కాన్పూర్‌లో దసరా వేడుకలు చూసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారని ట్రావెల్ సంస్థలు చెబుతున్నాయి.
- ఒత్తిడికి దూరంగా, ప్రకృతి ఒడిలో గడిపేందుకు దసరా సెలవులు అనువుగా భావిస్తున్నారు. కుటుంబంతో కలిసి రెండు నుంచి ఆరు రోజులు విహారానికి వేర్వేరు ప్రాంతాలకు వెళ్తున్నారు. ఎక్కువగా నాలుగు రోజుల పర్యటనకు మొగ్గుచూపుతున్నారు.
- బడ్జెట్, దొరికే సమయాన్ని బట్టి వికారాబాద్-అనంతగిరి, వరంగల్, శ్రీశైలం, తిరుపతి, విశాఖపట్నం, గోవా, షిర్డి యాత్రలకు ఎక్కువగా వెళుతున్నారు.
- సెప్టెంబరు-నవంబరు మధ్య దేశీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రదేశాల సందర్శనకు జనవరి నుంచి అన్వేషిస్తున్నారని ట్రావెల్స్ నిర్వాహకులు తెలిపారు.
- లక్షద్వీప్, ఉజ్జయిని, వారణాసి వరకు ఆధ్యాత్మిక, తీర ప్రాంత సమ్మిళిత యాత్రలను ఇష్టపడుతున్నారని చెప్పారు. హైదరాబాద్ నుంచి డొమెస్టిక్ విమాన ప్రయాణాలు పెరగడం పర్యాటక జోరును తెలుపుతోంది.


క్రూజ్ టూర్లకు డిమాండ్

నగరవాసులు జలపాతాల చెంత గడిపేందుకు, జలాశయాల్లో పడవ షికారును కోరుకుంటున్నారు. సోమశిల, నాగార్జునసాగర్, పాపికొండల్లో క్రూజ్ టూర్లను పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించింది. వీటి కోసం ఎక్కువ మంది తమను సంప్రదిస్తున్నారని... అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో ఎదురుచూస్తున్నామని పర్యాటక శాఖ చెబుతుంది.



రిసార్ట్‌లకు బారులు

నగర శివార్లలో పేరున్న పలు రిసార్ట్‌లు ఉన్నాయి. దసరా వేడుకలు కుటుంబంతో అక్కడే జరుపుకొనేందుకు దాండియా, గార్బ ఆడేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారని తమ రిసార్ట్‌లో బుకింగ్స్ చేసుకున్నారని మొయినాబాద్‌లోని మృగవని రిసార్ట్ నిర్వాహకులు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్న వారిలో ఎక్కువ మంది రామోజీ ఫిల్మ్‌సిటీ, హుస్సేన్‌సాగర్ పరిసరాలు చూడటానికి ఇష్టపడుతున్నారని పర్యాటక అధికారి ఒకరు తెలిపారు.



చెరువా చెరువా ఎక్కడున్నావ్?

- **ఓఆర్ఆర్ పరిధిలో నీటి వనరుల కబ్జా**
- **విస్తుగొలుపుతున్న తాజా ప్రభుత్వ నివేదిక**

ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా గత పదేళ్లలో అనేక నీటి వనరులను ఆక్రమణదారులు మాయం చేశారు. తాజాగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడుదల చేసిన శాటిలైట్ మ్యాపులతో కూడిన నివేదిక ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఇలాగే వదిలేస్తే మరో పదేళ్లలో ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న చెరువులు పూర్తిగా అన్యాక్రాంతం కావడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రం ఏర్పడిన నాటికి గ్రేటర్‌లో 225 చెరువులు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. మరో 196 పాక్షికంగా ఆక్రమించేశారు. ఇదంతా ఔటర్ రింగ్‌రోడ్డు లోపల జరిగిన ఆక్రమణల తంతు. ఔటర్ అవతల ప్రస్తుతం చెరువుల చుట్టూ అనేక భారీ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఆక్రమించి నిర్మాణాలు కడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా 2014 నాటికి అసలు ఆక్రమణలు లేని చెరువులు సైతం గత పదేళ్లలో ఆక్రమించేశారు. 20 చెరువుల్లో పూర్తిగా, మరో 57 చెరువుల్లో పాక్షికంగా ఆక్రమణలు ఉన్నట్లు తాజాగా శాటిలైట్ మ్యాపుల ద్వారా తెలుస్తోంది. చెరువుల్లోని ఎఫ్‌టీఎల్‌లో కబ్జాలపై హైడ్రా దృష్టి సారించిన సంగతి తెలిసిందే. చాలా చోట్ల కూల్చివేతలు కూడా చేపట్టింది. 2014కు ముందు శాటిలైట్ మ్యాపుల్లో ఆక్రమణలు లేకపోయినా సరే... తర్వాత కాలంలో దర్జాగా ఆక్రమణలకు పాల్పడిన వైనం తేటతెల్లమైంది. దీంతో వేరే దారి లేక వరద నీరంతా సమీప కాలనీలు, ఇళ్లల్లోకి ముంచెత్తుతోంది. పెద్దపెద్ద నీటి కుంటలను సైతం నామ రూపాలు లేకుండా అన్యాక్రాంతం చేసుకొని పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టారు. కొన్నిచోట్ల చెరువులు ఆక్రమించి లేఅవుట్లు వేసిన వైనం బయట పడింది. 2014 తర్వాత పలు చెరువుల ఆక్రమణల తీరును ఉపగ్రహ ఛాయాచిత్రాలు బయట పెట్టాయి.



పుప్పాలగూడ చెరువు ఇలా.. ఎరుపు రంగు అంతా ఆక్రమణ గుర్తింపే

గతేడాది కంటే 600 అధికంగా బస్సులు


ఈనాడు, హైదరాబాద్: దసరా పండగలకు ఆర్టీసీ 6,304 ప్రత్యేక బస్సులను నడుపుతోందని సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు. మహాలక్ష్మి పథకంతో రద్దీ పెరగడంతో గతేడాది కంటే అదనంగా 600 స్పెషల్ సర్వీసులను నడపనున్నట్లు చెప్పారు. ఈనెల 9 నుంచి 12 వరకు ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెస్తున్నామని... తిరుగు ప్రయాణానికి ఈనెల 13, 14 తేదీల్లో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. "జేబీఎస్ నుంచి 1,602, ఎల్బీనగర్ 1,193, ఉప్పల్ 585, ఆరాంఘర్ నుంచి 451 బస్సులను నడుపుతున్నాం. ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ ను సంస్థ అధికారిక వెబ్ సైట్ Rtgsrtcbus.in లో చేసుకోవాలి. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలి." అని సజ్జనార్ వివరించారు.

నీరు దిగలే.. భవిష్యత్తు దిగులే

వర్షాలు కురిసినా నేలలోకి ఇంకని జలాలు

గతేడాదితో పోల్చితే మరింత లోతుకు

ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా భూగర్భ జలాల నిల్వలు ఆందోళనకరంగా పడిపోతున్నాయి. ఏయేటికాయేడు కీలక ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాల్లో తగ్గుదల కనిపిస్తోంది. తాజాగా భూగర్భ జలవరుల విభాగం విడుదల చేసిన నివేదిక ప్రకారం... అనేక ప్రాంతాల్లో మీటర్ నుంచి 14 మీటర్ల వరకు తగ్గుదల కన్పిస్తోంది. ప్రధాన నగరం కంటే శివార్లలో తగ్గుదల ఆందోళనకరంగా మారింది. మహానగరం వేగంగా విస్తరించడంతోపాటు భారీ భవనాల నిర్మాణాలు... చెరువుల ఆక్రమణలు... మరోవైపు వాన నీటి సంరక్షణలో నిర్లక్ష్యం వల్ల ఆ ప్రభావం భూగర్భ జలమట్టాలపై పడుతోంది. కూకట్‌పల్లిలో గతేడాదితో పోల్చితే ఏకంగా 13.72 మీటర్లు కిందికి పడిపోయాయి. ఇబ్రహీంపట్నంలో 14.83 మీటర్లు భూగర్భ జలమట్టాలు తగ్గాయి. అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతంలో 12.82 మీటర్లు తగ్గుదల కన్పిస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో భూగర్భ జల విభాగం పిజోమీటర్లు ఏర్పాటు చేస్తుంది. అక్కడ నమోదైన వర్షపాతం ఆధారంగా ఈ నీటి నిల్వలు లెక్క కడుతుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరిలోని 30మండలాల్లో సెప్టెంబరు నెలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువే నమోదైంది. సరాసరి 30శాతం వరకు తగ్గుదల కన్పించింది.



సెప్టెంబరులో భూగర్భ జలాలు తగ్గుదల ఇలా..(మీటర్లలో)

మండలం	2023	2024	తగ్గుదల
ఇబ్రహీంపట్నం	9.28	24.11	-14.83
కూకట్‌పల్లి	11.86	25.58	-13.72
అబ్దుల్లాపూర్‌మెట్	8.33	21.15	-12.82
మల్కాజిగిరి	16.51	25.68	-9.17
మేడిపల్లి	11.88	17.19	-5.31
మహేశ్వరం	9.43	14.02	-4.59

వాన నీటి సంరక్షణతోనే..

- హెచ్ఎండీఏ ఏరియా... సాధారణ వర్షపాతం లెక్కలోకి తీసుకుంటే ఏటా ఇక్కడ కురిసే వర్షం 15 టీఎంసీలకు సరిసమానం అని నిపుణుల అంచనా. ఇందులో 5శాతం కూడా భూమిలోకి ఇంకించలేని పరిస్థితి.
- గతంలో చాలా అపార్ట్‌మెంట్లు, 300 చదరపు మీటర్లు దాటిన వ్యక్తిగత గృహాల్లో ఇంకుడు గుంతలు నిర్మించినప్పటికీ నిర్వహణ లేక పూడుకుపోయాయి. కాలనీలు, పార్కుల్లో ఇంకుడుగుంతలదీ అదే దారి. దీంతో వర్షపు నీరు ఇంకడం లేదు.
- శివార్లలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతోంది. భారీ బోర్లు వేసి అక్కడ భూగర్భ జలాలను తోడేస్తున్నారు. అదే స్థాయిలో వాన నీళ్లు భూమిలోకి చేరక భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.
- గతంలో జలమండలి, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో భారీఎత్తున ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. మరోసారి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి. జలమండలి ఆ దిశగా దృష్టి సారించింది.

సిమెంట్ రహదారులు. .ఎక్కడికక్కడ భారీ నిర్మాణాల వల్ల భూమి లోపలకు నీళ్లు ఇంకడం లేదు. వాన నీరంతా మురుగు కాల్వల ద్వారా మూసీలోకి చేరుతోంది.

ఏసీబీకి చిక్కిన ఏఎస్ఐ



మేడ్చల్, న్యూస్‌టుడే: రూ.50వేలు లంచం తీసుకుంటూ సోమవారం మేడ్చల్ ఏఎస్ఐ ఏసీబీకి దొరికాడు. అధికారుల వివరాల ప్రకారం.. గౌడవెల్లి పరిధిలో బూసాకెత్‌లో ఓ విల్లా యజమాని శర్మ తన ఇంట్లో ఇంటీరియల్ పనికి విశ్వనాథ్‌ను సంప్రదించి రూ.8లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందస్తుగా రూ.4లక్షలు చెల్లించాడు. చెల్లించిన డబ్బులకు తగినట్లుగా పనులు పూర్తి చేశాడు. మిగిలిన పనులు పూర్తిచేయాలని శర్మ ఒత్తిడి చేశాడు. ఒప్పందం ప్రకారం మిగిలిన డబ్బులు ఇవ్వాలని విశ్వనాథ్ కోరాడు. అతనిపై కోపంతో శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు నెలల క్రితం కేసు నమోదైంది. విశ్వనాథ్‌కు బెయిల్ ఇచ్చేందుకు రూ.2లక్షలకు ఏఎస్ఐ మధుసూదన్‌రావు బేరం కుదుర్చుకొని.. ముందుగా రూ.10వేలు తీసుకున్నాడు. మిగిలిన డబ్బులు సోమవారం వరకు ఇవ్వాలని కోరడంతో విశ్వనాథ్ ఏసీబీని సంప్రదించాడు. ఏఎస్ఐ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి నగదుతో సహా అదుపులోకి తీసుకున్నారు.



శరన్నవరాత్రులు, బతుకమ్మ పండగ నేపథ్యంలో నగరంలోని పలు ప్రధాన కూడళ్లు, ఆలయాలు విద్యుద్దీపాలతో మెరిసిపోతున్నాయి. బేగంపేట ప్రధాన రహదారిపై ఉన్న కట్ట మైసమ్మ దేవాలయం వద్ద విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.



పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఛైర్మన్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో నగర కార్పొరేటర్లు బతుకమ్మ ఆడారు. మేయర్ విజయలక్ష్మి, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, పట్నం సునీత మహేందర్ రెడ్డి తదితరులు సందడి చేశారు. **- న్యూస్‌టుడే, ఖైరతాబాద్, ఫిలింనగర్**

విద్యుత్తు తీగలకు నిచ్చెన తగిలి ఇద్దరి మృతి

మేడ్చల్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ పారిశ్రామికవాడలోని హిందూస్థాన్ యూనిలివర్ లిమిటెట్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఈ కార్యాలయాన్ని శంషాబాద్‌కు తరలిస్తున్నారు. సామగ్రిని కార్మికులతో ఖాళీ చేయిస్తున్న సమయంలో 15 అడుగుల ఎత్తున్న ఇనుప నిచ్చెనను బిహార్‌కు చెందిన చోటా పాశ్వాన్, గుడు బైట, కరం కుమార్, లకిందర్‌కుమార్, పువో మాంజిలు బయటకు తోసుకుంటూ వెళ్తున్నారు. కంపెనీ గేటు సమీపంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు నిచ్చెన తగిలింది. కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని సీఎమ్మార్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గుడ్ బైటా(26),పువో మాంజీ(25)లు మృతి చెందారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. కంపెనీ అధికారులు, గుత్తేదారుపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

మునుగుతోందా.. ముంచుతున్నారా..?

ఈనాడు, హైదరాబాద్: నాలాల్లో పూడిక తొలగించకపోవడంతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. కొన్నేళ్లుగా నాలాల్లోని పూడిక తీయడం లేదు. దీంతో క్రమంగా నాలాల్లోని బురద మట్టి మ్యాన్‌హోళ్ల మూతవరకు పేరుకుపోయింది. చివరికి వాటి మూత దాటి నాలాలోకి చుక్కనీరు చేరని పరిస్థితి. సికింద్రాబాద్ చిలకలగూడ చౌరస్తా నుంచి సీతాఫల్‌మండి రోడ్డు వైపు వరద నాలాను తవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జీహెచ్ఎంసీ మాత్రం ఏటా పూడికతీత పనులకు రూ.50కోట్ల మేర వెచ్చిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

మొండికేస్తున్న మూతలు.. చిలకలగూడ చౌరస్తా నుంచి రైల్వే క్వార్టర్స్ రోడ్డు మీదుగా గాంధీ చౌరస్తా వరకు చిన్న వర్షం కురిసినా రోడ్డు మునుగుతోంది. గాంధీ సర్కిల్ వరకు వరద రోడ్డు మీదుగానే ప్రవహించి నాలాలో కలుస్తుంది. స్థానికుల ఫిర్యాదుతో తాజాగా జీహెచ్ఎంసీ నాలా పునరుద్ధరణ పనులను చేపట్టింది. తేలిగ్గా తెరచుకోవాల్సిన మ్యాన్‌హోళ్ల మూతలు మొండికేశాయి. పేరుకుపోయిన మట్టి వాటిని పట్టేశాయి. అప్పటి వరకు 20 మ్యాన్‌హోళ్లను తెరిచామని, గాలి దూరేందుకు కూడా సందులేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



చిలకలగూడలో పూడిక నిండిన నాలా

నిధుల మేతగా పూడికతీత..

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టే పూడికతీత పనులు మొదట్నుంచీ గందరగోళమే. ఇటీవల టెండర్లలో కూకట్‌పల్లి జోన్, శేరిలింగంపల్లి జోన్ల సీనియర్ ఇంజినీరింగ్ అధికారులు బినామీ గుత్తేదారులను రంగంలోకి దించుతున్నారు. ఈ క్రమంలో కొందరు గరిష్ఠంగా 40శాతం తక్కువ ధరకే చేస్తామంటున్నారు. పూడిక మట్టిని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలిస్తేనే పూర్తిగా బిల్లును చెల్లించాలనే నిబంధన ఉంది. యార్డుకు వెళ్లే ప్రైవేటు వ్యర్థాలు, శివారు మున్సిపాలిటీల్లోని చెత్త వాహనాల 'వే బ్రిడ్జి' టోకెన్లను పూడికతీత గుత్తేదారులు కొనుగోలు చేసి జీహెచ్ఎంసీ వద్ద బిల్లులు తీసుకుంటున్నారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

ఆకట్టుకున్న యువ కళోత్సవం


కళోత్సవంలో అలేఖ్య పుంజల తదితరులు

రవీంద్రభారతి న్యూస్‌టుడే: తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో యువ కళోత్సవం కర్ణాటక, హిందుస్థానీ సంగీత కార్యక్రమాలు శ్రోతలను అలరించాయి. వేడుకల్లో భాగంగా సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. సంగీత నాటక అకాడమి అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల మాట్లాడుతూ..ప్రకృతిని ఆరాధించే పండగ అని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీమతి ఎ.వాణిప్రసాద్, కేంద్ర ప్రభుత్వ నార్త్ ఈస్ట్ జోన్ కల్చర్ సెంటర్ సంచాలకుడు ప్రసన్న గొగోయి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొని మాట్లాడారు.

ఎస్సీ 57 కులాలను 'ఎ' గ్రూప్‌లో చేర్చాలి


అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ 57 కులాల ఐక్య వేదిక నాయకులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలో అత్యధిక వెనుకబాటులో ఉన్న ఎస్సీల్లోని 57 కులాలను 'ఎ' గ్రూప్‌లో చేర్చి 8 శాతం రిజర్వేషన్ కేటాయించాలని ఎస్సీ 57 కులాల ఐక్య వేదిక కోరింది. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ఎస్సీ వర్గీకరణ కమిటీ అధికారి కిషన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 57 కులాలు ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగపరంగా వెనుకబడి ఉన్నాయని, ఊరి బయట గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, సొంత గూడు లేని ఈ సామాజిక వర్గాలను ఎస్సీ ఏ జాబితాలో చేర్చి 8 శాతం వాటా ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. ఏర్పుల యాదయ్య, శంకర్, తులసీరామ్, రాజు, ఎల్లేష్ ఉన్నారు.

కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే మాగంటి గోపూజ



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహిస్తున్న చక్ర అర్చన పూర్వక మాలమహా మంత్ర చండీహవనంలో సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అమ్మవారిని లలితాదేవి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ నిర్వహించారు.

–న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

అమ్మవారి మండపాల వద్ద అన్నదానాలు

బోరబండ: దసరా వేడుకల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బోరబండ బస్టాపు, బంజారానగర్, సైట్-1 కాలనీ, రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్, ఇందిరానగర్ ఫేజ్-2, ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీ, శ్రీరామ్‌నగర్, రహ్మత్‌నగర్ మండపాల వద్ద రోజూ అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

నిబంధనలు చెబుతారు.. మార్గదర్శనం చేస్తారు

ట్రాఫిక్ విధుల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు


నారాయణగూడ కూడలిలో సిగ్నల్ పడినప్పుడు ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నారాయణగూడ, న్యూస్‌టుడే: నగరంలో జనాభా పెరుగుతోంది. తదనుగుణంగా ఏటా రోడ్లపైకి కొత్త వాహనాలు లక్షల్లో వస్తున్నాయి. ట్రాఫిక్ ఉల్లంఘనుల సంఖ్య కూడా నానాటికీ పెరుగుతూనే ఉంది. ట్రాఫిక్ విభాగం సిబ్బంది అవసరమైన స్థాయిలో లేరనే చెప్పవచ్చు. ఫలితంగా నగర పౌరులు నిత్యం పద్మవ్యూహాన్ని దాటుకొని ముందుకుసాగాల్సి వస్తోంది. పలు సందర్భాల్లో నాలుగైదు కిలోమీటర్లు వెళ్లేందుకు రెండు గంటల సమయం పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లను ట్రాఫిక్ విధులకు ఉపయోగించుకోవాలని సంకల్పించారు. దీనికి విద్యాశాఖ సహకరించడంతో ఆరొందల మంది వాలంటీర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. నారాయణగూడ ట్రాఫిక్ పోలీసు ఠాణా పరిధిలోని హిమాయత్‌నగర్ వై.జంక్షన్, నారాయణగూడ ఫ్లైఓవర్ కూడలి, హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, నారాయణగూడ వైఎంసీఏ కూడలి, బషీర్‌బాగ్ ఫ్లైఓవర్, లిబర్టీ కూడలి, కింగ్‌కోఠి వంటి ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు (యువతీ, యువకులు) ట్రాఫిక్ విధులు నిర్వహిస్తూ కనిపిస్తున్నారు. నారాయణగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వారికి తగిన మార్గదర్శనం చేస్తున్నారు.

వీరేం చేస్తారంటే..

ఆయా కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడటంతోనే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 'శిరస్త్రాణాలు ధరించండి', 'కారులో ప్రయాణించేటప్పుడు 'సీట్ బెల్టు పెట్టుకోండి', సిగ్నల్ జంప్ చేయవద్దు అంటూ నినాదాలతో ముద్రించిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే శిరస్త్రాణాలు ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, వాహనాలు నడిపేవారు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనల్ని పాటించడం, నిబంధనల్ని అతిక్రమిస్తే ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో.. వివరిస్తున్నారు.

● ఒక్కో కూడలిలో కనీసం నలుగురు, అయిదుగురు వాలంటీర్లను వినియోగించుకుంటున్నామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చెప్పారు. ''ప్రజలు, ముఖ్యంగా యువత బాధ్యతారాహిత్యంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. రేసింగ్ బైక్‌లతో విన్యాసాలు చేస్తుంటారు. చాలా మంది కూడలిలో రెడ్‌సిగ్నల్ జంప్ చేసే ప్రయత్నం చేస్తుంటారు. ఇలాంటి సందర్భంలో ఏదైన ప్రమాదం జరిగితే ఒక్కరి మాత్రమే నష్టం కాదని, వారి కుటుంబాలు నష్టపోతాయని గ్రహించాలి. వాలంటీర్లకు జాకెట్లు ఇవ్వాలనే ఆలోచన చేయడం జరిగింది. త్వరలోనే ఇస్తాము'' అని సీఐ తెలిపారు.

ప్రజావాణికి 139 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల విజ్ఞప్తులను కమిషనర్ స్వీకరించారు. జీహెచ్ఎంసీ ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 90 విజ్ఞప్తులు వచ్చాయని అందులో టౌన్ ప్లానింగ్ 22, హౌసింగ్ 59, ట్యాక్స్ విభాగం 5, ఐటీ సెక్షన్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, మూసాపేట డిప్యూటీ కమిషనర్‌లకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో వచ్చిన 49 అర్జీల్లో కూకట్‌పల్లి జోన్‌లో 26, శేరిలింగంపల్లి జోన్‌లో 10, సికింద్రాబాద్ జోన్‌లో 7, ఎల్బీనగర్ జోన్‌లో 2, చార్మినార్ జోన్‌లో 3, ఖైరతాబాద్‌లో ఒక్కటి వచ్చాయని జీహెచ్ఎంసీ పేర్కొంది. అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనారాయణ, యాదగిరిరావు పాల్గొన్నారు.

అయోధ్యలో 57 రోజులపాటు చండీ మహాయాగం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరాజు, డీఎస్ఎన్ మూర్తి, ఎల్వీసుబ్రహ్మణ్యం, సత్యమూర్తి, డీఎస్ఆర్ మూర్తి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, కంచిలోని శ్రీ కంచి కామాక్షి పీఠం, విజయనగరంలోని చిన్మయి సేవా ట్రస్ట్ సంయుక్తంగా నవంబర్ 2 నుంచి 57 రోజులపాటు అయోధ్యలో శ్రీ మహా నారాయణ దివ్య రుద్ర సహిత శత సహస్ర చండీ విశ్వశాంతి మహాయాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వాహక సంస్థల ప్రతినిధులు వీఎస్ఎన్ సత్యమూర్తి, డీఎస్ఆర్ మూర్తి, డీఎస్ఎన్ మూర్తి, డా.జి.వెంకటేశ్వరరాజు తదితరులతో కలిసి మహాయాగానికి చెందిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మహాయాగం నవంబర్ 2 నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు అయోధ్యలో జరుగనుందని తెలిపారు.


ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీ సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో..


జీటీఎస్ దేవస్థానంలో లలిత త్రిపురసుందరీ దేవి అలంకరణలో


ఓల్డ్ కమేళాలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో


బంజారాహిల్స్‌లో దుర్గామాత మండపంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని సత్కరిస్తున్న భక్తులు


ఫిల్మ్‌నగర్ జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

మహాచండి.. చాముండి

దుర్గా ఉత్సవం.. బెంగాలీ సంబరం


ప్రత్యేకాలంకరణలో దుర్గామాత

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : భక్తుల్లో స్నేహభావం పెంపొందించాలనే ఉద్దేశంతో బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గా పూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంజిత్ పాల్, ఉపాధ్యాక్షుడు సంజయ్ పాన్, కార్యవర్గ సభ్యుడు త్రిషీతా ముఖర్జీలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం.1లోని బంజారా ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 8 నుంచి 13 వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. బెంగాలీ వంటకాలతో ప్రత్యేక స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.


బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో దాండియా ఆడుతున్న మహిళలు

గుండె మార్పిడితో మహిళకు పునర్జన్మ

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: ఎడమ జఠరిక పనిచేయకపోవడంతో తలెత్తిన గుండె వైఫల్యం, అరిథ్మియాతో డైలేటెడ్ కార్డియోమియోపతితో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న 39 ఏళ్ల మహిళకు బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి వైద్య బృందం విజయవంతంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించారు. సోమవారం ఓ ప్రకటనలో కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.అజిత్ సింగ్ వివరాలను వెల్లడించారు. తీవ్రమైన హృద్రోగ సమస్యతో బాధపడుతున్న మహిళకు గతంలోనే ఆటోమేటిక్ ఇంప్లాంటబుల్ కార్డియోవర్టర్ డిఫిబ్రిలేటర్ (ఏఐసీడీ) అమర్చారు. అయితే గుండె వైఫల్యం, వెంట్రిక్యులర్ టాకికార్డియో తదితర సమస్యలతో కేర్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించడంతో పూర్తిస్థాయి పరిశీలన చేసి గుండె మార్పిడి చేయాలని నిర్ధారించారు. జీవన్‌దాన్‌లో నమోదు చేసుకోవడంతో.. ఐదు నెలల అనంతరం అవసరమైన గుండె లభించడంతో సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డా.నగేష్ నేతృత్వంలో నిపుణుల బృందం రోగికి గుండె మార్పిడి ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. డా.నగేష్ మాట్లాడుతూ.. గుండె మార్పిడి మహిళకు కొత్త జీవితాన్ని అందించిందని, త్వరితంగా కోలుకున్నారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

యూసుఫ్‌గూడ:

? శ్రీకృష్ణదేవరాయనగర్ ప్లాట్ నెం.45, పంజాబ్ నేషనల్ బ్యాంకు సమీపంలో మూడు నెలలుగా వీధిదీపాలు వెలుగడం లేదు. పండుగల నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించాలి. –భాస్కర్‌రాజు, శ్రీకృష్ణదేవరాయనగర్‌కాలనీ.

✓ వెలగని వీధిదీపాలకు వెంటనే మరమ్మతులు చేపడతాం.

–సుష్మ, బల్దియా, ఎలక్ట్రిసిటీ విభాగం ఏఈ.

జీవో 477ను వెంటనే రద్దు చేయాలి: భారాస


మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

ఫిలింనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం రూ.1.5లక్షల కోట్ల భారీ బడ్జెట్‌తో మూసీ నది అందాల ప్రాజెక్టును ప్రతిపాదించినప్పటికి ఈ ప్రాజెక్టు అమలులో పేదల ఇళ్లను కూల్చివేయడం తీవ్ర ఆందోళన కల్గిస్తోందని భారాస సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్ విమర్శించారు. మూసీ నది ప్రాజెక్టు జీవో నం.477ను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వానికి లేఖ రాశారు. పూర్తిస్థాయి పునరావాస ప్రణాళికను రూపొందించి పారదర్శకతతో ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. రూ.1.5లక్షల కోట్ల ప్రాజెక్టు ఖర్చు వివరాలను పూర్తిగా వివరించి ప్రజలకు తెలియజేయాలన్నారు. మూసీ నది ప్రాజెక్టు పర్యావరణ వేత్తలు, పట్టణ ప్రణాళిక కర్తలు, ప్రభావిత వర్గాలతో సరైన స్థాయిలో సంప్రదింపులు లేకుండా చేపట్టడం ప్రజాస్వామ్య పద్ధతులను తారుమారు చేసే చర్య అని విమర్శించారు.

రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారం కుప్పకూలింది: రాకేశ్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ మొత్తం కుప్పకూలిందని భారాస నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కట్టిన ప్లాట్స్ కూడా అమ్ముడుపోవడం లేదన్నారు. నగరంలో ఎక్కడ చూసిన టూలెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్ ఇండస్ట్రీ కుదేలు అవుతోందని, మనీ సర్క్యులేషన్ లేదన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జన్సీ వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. మూసీపై అఖిలపక్షాన్ని పిలవాలన్నారు. హైడ్రాను వెనక్కి తీసుకోవాలని కోరారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తికి రెండు రోజుల జైలు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: మహిళ వెంట పడుతూ వేధిస్తున్న వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన శివకుమార్ గౌడ్ క్యాబ్ డ్రైవర్. హౌజ్ కీపింగ్ పనిచేస్తున్న ఓ మహిళను వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం గాంధీభవన్ వద్ద గల మనోరంజన్ కాంప్లెక్స్‌లోని పదో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి మంద మురళీ రెండు రోజుల జైలు శిక్షను విధించారు.

బ్రహ్మోత్సవం.. వాహనసేవ వైభవం


సూర్యప్రభ వాహనసేవలో శ్రీవారు

యూసుఫ్‌గూడ: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ఉదయం సూర్యప్రభ వాహనసేవ, సాయంత్రం చంద్రప్రభ వాహనసేవలను నిర్వహించారు.

జేఎన్ఏఎఫ్ఏయూకు పదెకరాల స్థలం కేటాయింపుపై హర్షం


మాట్లాడుతున్న పసునూరి దయాకర్

ఖైరతాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) కొత్త క్యాంపస్ నిర్మాణం కోసం జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పదెకరాలు కేటాయించడంపై హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, కళాశాల మాజీ ప్రిన్సిపల్స్, మాజీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కళలపై ఉన్న అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. స్థల కేటాయింపును అంబేడ్కర్ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది రాజకీయ కోణంలో చూడొద్దని, కొత్త క్యాంపస్ ఏర్పాటుకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణా రెడ్డి, వరంగల్ మాజీ ఎంపీ, పూర్వ విద్యార్థి, శిల్పి పసునూరి దయాకర్, మాజీ ప్రిన్సిపల్స్ ప్రొ. ఎస్.ఎం.పీరం మాట్లాడారు. యూనివర్సిటీ విస్తరణకు స్థలాన్ని కేటాయించి, అధునాతన వసతులతో క్యాంపస్, థియేటర్ల నిర్మాణం చేపట్టడం వల్ల తెలంగాణ సాంస్కృతిక, కళారంగానికి తలమానికంగా నిలుస్తుందని అన్నారు. ప్రొ.కె.దశరథ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గౌరీశంకర్, సుధానిధి, బస్వరాజ్ పాల్గొన్నారు.

బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌ఛార్జిగా దొరపల్లి రమేష్



బంజారాహిల్స్ న్యూస్‌టుడే : బహుజన సమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌ఛార్జిగా బంజారాహిల్స్ దేవరకొండ బస్తీకి చెందిన దొరపల్లి రమేష్ నియమితులయ్యారు. నగరంలోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లాల సమీక్ష సమావేశంలో బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్.. రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. రమేష్ మాట్లాడుతూ..బీఎస్పీ విధానాలను సమాజంలో ప్రచారం చేస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

బంజారాహిల్స్‌లో డి సన్స్ పటోలా వస్త్ర ప్రదర్శన


వస్త్ర ప్రదర్శన ప్రారంభిస్తున్న డా. సుధా జైన్. చిత్రంలో నిర్వాహకులు

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలకు చెందిన విభిన్న వస్త్ర ఉత్పత్తులతో 'డి సన్స్ పటోలా ఆర్ట్' వస్త్ర ప్రదర్శన పేరిట సోమవారం బంజారాహిల్స్‌లోని రోడ్ నం.1లోని లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో ప్రారంభమైంది. మిస్ ఇండియా ఆసియా పసిఫిక్, నగర సోషలైట్ సుధా జైన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రదర్శన ప్రారంభించారు. నిర్వాహకుడు భవిన్ మక్వానా మాట్లాడుతూ రాజ్ కోటా, పటోల దుపట్టా, శాలువాలు, సింగిల్ పఠాన్ చీరలు, సిల్క్ టిష్యూ పటోల ఉత్పత్తులు ప్రదర్శనలో కొలువుదీరాయన్నారు. ఈ ప్రదర్శన ఈనెల 15వ తేదీ వరకు కొనసాగనుంది.

వాహనాలను పార్కింగ్ ప్రాంతంలోనే నిలపండి


పార్కింగ్ నిర్వాహకులకు సూచనలిస్తున్న ఏసీపీ హరిప్రసాద్

ఈనాడు కథనానికి స్పందన

జూబ్లీహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి చుట్టూ ట్రాఫిక్ కష్టాలను 'ముందుచూపు లేక.. ముందుకు కదలల్లేక' అనే శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన వార్తకు ట్రాఫిక్ అధికారులు స్పందించారు. పశ్చిమ మండల ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సోమవారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్సై నర్సింహారావుతో కలిసి పెద్దమ్మగుడి ప్రాంతంలో పర్యటించారు. పెద్దమ్మగుడి ఆలయంలో ఉన్న పార్కింగ్‌ను పరిశీలించి.. పార్కింగ్ గుత్తేదారు కనకరాజుతో మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్‌లోనే నిలపాలని, పార్కింగ్ సౌకర్యం లేదంటూ తిప్పి పంపొద్దని సూచించారు. ఆలయానికి వచ్చే వాహనాలు రోడ్డుపై నిలిస్తే గుత్తేదారు బాధ్యత వహించాల్సి ఉంటుందని సూచించారు. దేవి ఉత్సవాలు ముగిసేవరకు ఎలాంటి సమస్య రాకుండా చూసేందుకు ప్రయత్నిస్తామని కట్టా హరిప్రసాద్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ట్రాఫిక్‌ను పర్యవేక్షించేందుకు అదనపు సిబ్బంది సంఖ్యను కొంత పెంచుతామని తెలిపారు.

బంగారం తక్కువ ధరకంటూ రూ.3 లక్షల బురిడీ

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బంగారం తక్కువ ధరకు ఇప్పిస్తానంటూ మోసానికి పాల్పడిన ఇద్దరిపై కోర్టు ఆదేశాల మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. హుమాయున్‌నగర్‌కు చెందిన ఎన్‌టి.జగన్నాథ్ ఛార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు కొద్ది నెలల క్రితం మహబూబ్‌నగర్‌లోని రాంనగర్‌కు చెందిన సాయిచందు గౌడ్‌తో పరిచయం ఏర్పడింది. తనకు కేరళలోని బంగారం వ్యాపారులతో మంచి సంబంధాలున్నాయని, తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని జగన్నాథ్‌ను నమ్మించాడు. దీంతో ఏడాది జూన్ 23న రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో ముందస్తుగా రూ.3 లక్షలు సాయిచందు తీసుకున్నాడు. రోజులు గడిచినా బంగారం, డబ్బులు తిరిగి ఇవ్వలేదు. సాయిచందు గౌడ్, సీతారాం వల్లభ్‌లపై జగన్నాథ్ కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు వారిద్దరిపై బంజారాహిల్స్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా దూసుకొచ్చి.. ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: రెడ్ సిగ్నల్ జంప్ చేసి ర్యాష్‌గా డ్రైవింగ్ చేసి ఓ యువకుడిని ఢీ కొట్టిన యువకుడిపై మధురానగర్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్సార్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న రాకేష్ స్విగ్గి డెలవరి బాయ్. ఈనెల 6న రాత్రి 7.30గంటల సమయంలో సత్యం థియేటర్ నుంచి యూసుఫ్‌గూడకు పార్శిల్ ఇవ్వడానికి వెళ్తున్న సమయంలో పంజాగుట్ట నుంచి ఎస్సార్‌నగర్‌కు ట్రిపుల్ రైడింగ్‌తో వస్తున్న కేపీహెచ్‌బీ ప్రాంతానికి చెందిన యశ్వంత్‌రెడ్డి రెడ్ సగ్నల్‌ను జంప్‌చేసి రాకేష్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాకేష్ ముఖానికి, కుడిచేతికి, కుడికాలుకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని తాపీమేస్త్రీ ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: భార్యతో గొడవపడిన భర్త మనస్తాపంతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన నరేష్(29), లత దంపతులు. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. నరేశ్ తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన నరేశ్ పనికి సరిగా వెళ్లకపోవడంతో తరచుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో ఈ నెల 6న బాబును తీసుకుని ఉప్పుగూడలో ఉండే తన సోదరుడు రమేష్ ఇంటికి లత వెళ్లిపోయింది. అనంతరం భర్తకు ఫోన్ చేస్తే ఎత్తకపోవడంతో నరేష్‌కు మామ వరుస అయిన వీరేష్‌కు ఫోన్‌చేసి నరేష్ ఫోన్ ఎత్తడం లేదు, ఇంటికి వెళ్లి చూడమని తెలిపింది. 6న అర్ధరాత్రి వీరేష్ వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతు కనిపించాడు. పోలీసులకు, స్థానికులకు సమాచారం ఇచ్చి, నరేష్‌ను కిందికి దించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి పరిరక్షణ.. భావితరాలకు పునాది


చర్చా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాణిప్రసాద్, విమలక్క తదితరులు

రవీంద్రభారతి : ప్రకృతి పరిరక్షణ అనేది భవిష్యత్తు తరాలకు పునాది అని పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్ అన్నారు. సోమవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న బతుకమ్మ సంబరాలలో భాగంగా అరుణోదయ విమలక్క సారథ్యంలో 'బతుకమ్మ, పర్యావరణం, మహిళల భద్రత, చెరువుల పరిరక్షణ'పై చర్చా కార్యక్రమం జరిగింది. వాణిప్రసాద్ మాట్లాడుతూ.. బతుకమ్మ అంటే అనవాయితీ, సంస్కృతి మాత్రమే కాదని.. అందులో ఆలోచింపజేసే అంశాలు చాలా ఉన్నాయని, విమలక్క మొదలుపెట్టిన బహుజన బతుకమ్మను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంలో భాగం చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రకృతి, పర్యావరణంపై స్పష్టంగా ఉంటారన్నారు. విమలక్క మాట్లాడుతూ.. తెలంగాణలో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. గతంలో తాము బహుజన బతుకమ్మను ఎత్తుకున్నప్పుడు దానిని అణచివేయాలని చూశారన్నారు. బతుకమ్మ ఉత్సవం మాత్రమే కాదని.. ఉద్యమం కూడా అన్నారు. ప్రకృతికి, స్త్రీకి మధ్య ఉన్న బంధాన్ని, అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, దాసోజు లలిత, జ్యోతి, అనిత, గోగు శ్యామల, సుజాత తదితరులున్నారు.

సినిమా ఫొటోల స్థానంలో అశ్లీల చిత్రాల పోస్ట్

● సహాయకుడిపై సినీ దర్శకనిర్మాత ఫిర్యాదు

జూబ్లీహిల్స్: ఇన్‌స్టాగ్రామ్ పేజీలోని సినిమా ఫొటోలు తొలగించి అశ్లీల చిత్రాలు పెట్టిన తన సహాయకుడిపై చర్యలు తీసుకోవాలంటూ ఓ సినీ దర్శకనిర్మాత బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ సాగర్ సొసైటీలో షేక్ నాగుల్ షరీఫ్ అనే దర్శకనిర్మాత తాను నిర్మిస్తున్న సినిమా కోసం సూరజ్‌సాయి అనే యువకుడిని సహాయకుడిగా నియమించుకున్నాడు. ఆడిషన్స్ జరిగే సమయంలో సినిమా అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీని కొత్తగా తెరిచి పలు జిల్లాల్లో పాల్గొన్న ఔత్సాహిక నటులు ఆయా సినిమా పేజీని అనుసరించేలా సూరజ్‌సాయికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఇన్‌స్టా పాస్‌వర్డ్ తెలిసిన సూరజ్‌సాయి కొంతమందితో తప్పుగా ప్రవర్తించడం, అనధికారిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి విధుల్లో నుంచి తొలగించారు. ఆదివారం కార్యాలయానికి వచ్చిన సూరజ్‌సాయి పని కావాలంటూ కోరగా కుదరదని అక్కడి నుంచి పంపించారు. దీంతో సూరజ్‌సాయి ఇన్‌స్టా పేజీలోని సినిమా ఫొటోలు తొలగించి అసభ్యకరమైన ఫొటోలు పెట్టాడు. పేజీ పేరు మార్చి అసభ్యకర సందేశాలను పెట్టాడు. పలువురు సినిమా కార్యాలయానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. నాగుల్ షరీఫ్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

పవన్‌కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ కె.ఎ.పాల్ ఫిర్యాదు

పంజాగుట్ట, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ వ్యవహారంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ.. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ కోరారు. ఈ మేరకు నగరంలోని పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయన వ్యాఖ్యల వల్ల భక్తుల్లో అశాంతి వాతావరణం ఏర్పడిందని, తన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అడ్మిన్ ఎస్ఐ ప్రదీప్‌ను కోరారు.

సినీ కార్యాలయాల్లో చోరీ

యూసుఫ్‌గూడ: చిత్ర పరిశ్రమకు సంబంధించిన రెండు కార్యాలయాల్లో చోరీ జరిగింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం...రహ్మత్‌నగర్‌కు చెందిన బలరామ్ ప్రసాద్ మధురానగర్‌లోని ఫ్లాట్ నెంబరు సీ-64 గ్రౌండ్ ఫ్లోర్‌లో శ్రీహరిత ప్రొడక్షన్ పేరుతో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. ఈనెల 6న ఉదయం తన కార్యాలయాన్ని తెరవడానికి వచ్చిన సమయంలో కార్యాలయం తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ల్యాప్‌టాప్ కనబడలేదు. తన ఇంటి ఓనర్ రాకేష్‌కు సమచారం ఇవ్వగా, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న రామ్ మీడియా సర్వీసెస్ లిమిటెడ్ పేరుతో వీడియో ఎడిటింగ్ కార్యాలయం ఉంది. షాపు నిర్వాహకుడిని పిలిచి కార్యాలయంలో పరిశీలించగా కార్యాలయంలో భద్రపర్చిన రూ.80 వేలతో పాటు, కెమెరా చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



అన్నపూర్ణాదేవిగా బల్కంపేట ఎల్లమ్మ

బల్కంపేట: ఎల్లమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలవిరాట్‌ను వివిధ రకాల డ్రై ఫ్రూట్స్, 108 కేజీల 21 రకాల మిఠాయిలతో తీర్చిదిద్దారు.




లలితాదేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ

జూబ్లీహిల్స్: పెద్దమ్మతల్లి సోమవారం లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కనకాంబరం రంగు చీర, చేతిలో చెరకుగడ, పాశాంకుశాలను ధరించి భక్తులను అలరించారు.



మహాచండీ దేవిగా ప్రత్యంగిరా మాత

ఆర్కేపురం: కుర్తాళం పీఠంలో వారాహి సమేత ప్రత్యంగిరా దేవి మహాచండీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. విశేష అభిషేకం, హోమం నిర్వహించారు.



భవానీదేవిగా శ్రీఉజ్జయిని మహాకాళీ

సికింద్రాబాద్: శ్రీఉజ్జయిని మహాకాళీ అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ భవానీదేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కృత్రిమ మేధ సాంకేతికతతో విప్లవాత్మక మార్పులు

మాదాపూర్, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ కంపెనీవారు కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన నాలుగు కొత్త అప్లికేషన్లను ఆవిష్కరించారు. బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ వినోద్‌బాబు, బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ కంపెనీ గ్లోబల్ సేల్స్ డైరెక్టర్ నాధ్ తోట, రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డా.అజయ్‌మిశ్రా, బ్లూ క్లౌడ్ సంస్థ ప్రతినిధులు డా. కె.అఖిల, జనార్దన్, కీర్తిప్రియ తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, అజయ్‌మిశ్రా తదితరులు



ఎల్బీ స్టేడియంలో ఈనెల 9న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సూచించారు. సోమవారం విద్యుత్ శాఖ ఎండీ ముష్రాఫ్ అలీ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి హరిచందన, అదనపు డీజీపీ మహేష్ భగవత్, నగర అదనపు (ట్రాఫిక్) పోలీసు కమిషనర్ విశ్వప్రసాద్ ఏర్పాట్లు పరిశీలించారు. – న్యూస్‌టుడే, నారాయణగూడ

మొక్కే కదా అని వదిలేస్తే..

నగరంలో గుట్టుగా గంజాయి పెంపకం

- మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌కు చెందిన 19 ఏళ్ల యువకుడు స్థానిక రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గట్టిగా ప్రశ్నించగా.. రైల్వే ట్రాక్ పక్కన గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు అంగీకరించాడు.
- బిహార్‌కు చెందిన యువకుడు ధూలపల్లిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. అతని నివాసం వద్ద కొత్తరకం మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందుకుని మేడ్చల్ అబ్కారీ పోలీసులు దాడి చేయగా గంజాయి అని తేలింది.



అబ్కారీ సిబ్బంది గుర్తించిన గంజాయి మొక్కలు

నగరంలో గంజాయి మొక్కల పెంపకం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల నుంచి ఓవైపు పెద్దఎత్తున గంజాయి సరఫరా అవుతుండగా.. కొందరు కేటుగాళ్లు ఇక్కడే సొంతంగా మొక్కలు పెంచడం పోలీసులు, అబ్కారీ శాఖకు సవాల్‌గా మారింది. గంజాయి స్మగ్లింగ్, విక్రయాలపై నిఘా పెరగడం, పట్టుబడితే కటకటాలు తప్పవన్న కారణంతో కొందరు ఇంటి ఆవరణలో, నగర శివార్లలో మొక్కలు పెంచుతున్నారు.

- అబ్కారీ శాఖ ఈ ఏడాది సెప్టెంబరు వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో 663 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుంది. సెప్టెంబరులోనే 203 మొక్కలను పట్టుకున్నారు.
- నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అయ్యే గంజాయిలో దాదాపు 40 శాతం ధూల్‌పేట నుంచే వెళ్తోంది.
- ఏవోబీలో కిలో రూ.3 వేలుగా ఉన్న గంజాయి ధర నగరానికి సరఫరా అయిన తరువాత రూ.30 వేలకు చేరుతోంది.

ఈనాడు, హైదరాబాద్

120 బస్‌షెల్టర్లు అత్యవసరం

400 షెల్టర్ల నిర్మాణాలకు ఏళ్లుగా ప్రతిపాదనలు

హైదరాబాద్‌లో అవసరమైన బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండా, వానల్లో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్ పరిధిలో 2800 బస్సుల్లో నిత్యం 19 లక్షల మంది ప్రయాణిస్తుండగా.. మహాలక్ష్మి పథకం వల్ల ఆ సంఖ్య మరింత పెరిగింది. ప్రస్తుతం 1370 బస్సు షెల్టర్లు వేర్వేరు ప్రాంతాల్లో ఉండగా 400కు పైగా ప్రాంతాల్లో షెల్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో 120 ప్రాంతాల్లో అత్యవసరంగా నిర్మించాలి. ఎప్పటి నుంచో ఈ ప్రతిపాదనలు జీహెచ్ఎంసీ వద్ద ఉండగా దీనిపై ఇప్పటి వరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు.



లంగర్‌హౌజ్ వద్ద..

ఈ మార్గాల్లో ఇబ్బందులు...

పంజాగుట్ట మార్గంలో ప్రయాణికులు ఎక్కువ. అయితే కూడలికి సమీపంలో షెల్టర్ నిర్మించడం ఇబ్బందిగా మారింది. బస్సు ఆగితే వెనకాల వచ్చే వాహనాలు ఆగిపోవాల్సి వస్తుండటం రద్దీ ఏర్పడుతోంది. వీటితో పాటు హిమాయత్‌నగర్‌రోడ్డు, అమీర్‌పేట్, కోఠి, ఉప్పల్, లంగర్‌హౌజ్, చందానగర్, మెహదీపట్నం నుంచి కాళీ మందిర్ తదితర మార్గాల్లో బస్ షెల్టర్లు అందుబాటులో లేవు. మరోవైపు హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, సోమాజిగూడ ప్రాంతాల్లో అవసరానికి మించి షెల్టర్లు నిర్మించారు. ఐటీ ఉద్యోగులు, ఎక్కువగా క్యాబ్‌లు, ద్విచక్ర వాహనాలపై ఆధారపడుతుంటారు. బస్‌షెల్టర్ల ఏర్పాటులో జాప్యం, నిర్వహణ లోపం కారణంగా ఆర్టీసీ ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. అయితే ఆర్టీసీ అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించనున్నట్టు బల్దియా చెబుతోంది. 80 షెల్టర్ల నిర్మాణానికి సంయుక్తంగా సర్వే చేపట్టనున్నట్టు ఓ అధికారి వెల్లడించారు.

ఈనాడు, హైదరాబాద్

పనిచేయని బోరుకు ప్రాణం

- సమాంతరంగా ఇంజక్షన్ వెల్స్ ఏర్పాటు



చాలా కాలంగా చుక్క నీరు రాకుండా.. మూలకు చేరిన జలమండలి బోర్లు తిరిగి ప్రాణం పోసుకోనున్నాయి. గ్రేటర్ వ్యాప్తంగా ఈ వినూత్న ప్రక్రియకు జలమండలి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి చేసింది. లేదంటే వచ్చే వేసవి నుంచి అలాంటి ఇళ్లకు నీటి ట్యాంకర్లను మూడు రెట్ల ధరకు విక్రయించనున్నారు. ఇందులో భాగంగా పనిచేయకుండా ఉన్న బోర్ల వద్ద ఇంజక్షన్ వెల్‌లను ఏర్పాటు చేసి తిరిగి వాటిని పనిచేసేలా చేయనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా జలమండలి చెందిన 3,222 వరకు పవర్ బోర్లు, చేతి పంపులు ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో కొన్ని పనిచేయడం లేదు. ఎండిపోయిన బోరుకు సమాంతరంగా ఇంజక్షన్ వెల్ ఏర్పాటు చేయనున్నారు. వర్షపు నీరు ఆ ఇంజక్షన్ వెల్‌లోకి పంపనున్నారు. ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి తిరిగి బోర్లు పనిచేయనున్నాయి. దీనివల్ల మరోసారి బోరు ఎండిపోయే పరిస్థితి ఉండదు.

నగరంలో జలమండలికి చెందిన బోర్ వెల్స్ ఇలా..

మొత్తం పవర్ బోర్లు	2,796
పనిచేయనివి	942
కూలినవి	84
మొత్తం చేతి పంపులు	3070
పనిచేయనవి	1717
కూలిపోయినవి	339

ఈనాడు, హైదరాబాద్

కాపర్ ల్యాండ్‌లైన్లకు..

కాలం చెల్లినట్లేనా?

సిటీలో 40వేల కనెక్షన్లు.. ఫైబర్‌లోకి మారాలంటున్న బీఎస్ఎన్ఎల్

నగరంలో ఇప్పటికీ ల్యాండ్‌లైన్ ఫోన్లను ఇళ్లు, కార్యాలయాల్లో వినియోగిస్తున్నారు. వీటిలో 40వేల దాకా బీఎస్ఎన్ఎల్‌కు చెందిన కాపర్ ఆధారిత కనెక్షన్లు ఉన్నాయి. బ్రాడ్‌బ్యాండ్ సేవలకు కూడా వినియోగిస్తున్నారు. మెరుగైన సేవల కోసం వీటిని ఫైబర్‌లోకి మార్చుకోవాలని వినియోగదారులను బీఎస్ఎన్ఎల్ కోరుతుంది.



నిర్వహణ కష్టమని.. : గ్రేటర్‌లో బీఎస్ఎన్ఎల్‌కు విస్తృతమైన ఫైబర్ నెట్‌వర్క్ ఉంది. ఫైబర్ టూ ద హోమ్ పేరుతో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇస్తోంది. అదే సమయంలో తొలినాళ్లలో వేసిన కాపర్ ఆధారిత నెట్‌వర్క్ కల్గిన కనెక్షన్లు సిటీలో ఉన్నాయి. వీటిలో నెట్‌వర్క్ లోపాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. నిర్వహణ కూడా బీఎస్ఎన్ఎల్‌కు సవాల్‌గా మారింది. కాబట్టి కాపర్ నుంచి ఫైబర్‌కు మారాలని వినియోగదారులను అభ్యర్థిస్తుంది.

సానుకూలతల దృష్ట్యా.. కాపర్‌తో పోలిస్తే ఫైబర్‌లో ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అధిక బ్యాండ్‌విడ్త్ కల్గి ఉండటం, సిగ్నల్ లోపాల సమస్యలు తక్కువ. అయితే కాపర్ నుంచి ఫైబర్‌కు మారాలంటే ప్యాకేజీలను ఎంపిక చేసుకోవాలి. కాపర్ నుంచి ఫైబర్‌కు మారేందుకు ఎలాంటి సర్వీస్ ఛార్జీలు ఉండవని బీఎస్ఎన్ఎల్ చెబుతోంది.

4జీ నెట్‌వర్క్ నవీకరణ..

హైదరాబాద్ బిజినెస్ ఏరియా పరిధిలో 1500 ప్రాంతాల్లో టవర్లను 4 జీ నెట్‌వర్క్‌లోకి నవీకరిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి 4జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని బీఎస్ఎన్ఎల్ ప్రయత్నిస్తోంది. మరిన్ని సేవల ఆధునికీకరణపై దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు.

ఈనాడు, హైదరాబాద్

ముగ్గురిని బలిగొన్న బస్సు

బీదర్, న్యూస్‌టుడే : కర్ణాటకలోని జిల్లా కేంద్రం బీదర్ దేవవన పార్కు సమీపంలో సోమవారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన జగన్నాథ్ (35), రేణుక (34), వినోద్ (14) అనే వారు మరణించారు. జగన్నాథ్, రేణుక దంపతులు. వినోద్ వారి కుమారుడు. బీదర్‌లో ఉంటూ వీరు వ్యవసాయం చేసుకుంటున్నారు. పొలం పనులు ముగించుకుని ముగ్గురూ ఒకే బైకులో ఇంటికి వెళుతుండగా.. హైదరాబాద్ నుంచి బీదర్‌కు వస్తున్న బస్సు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాద తీవ్రతకు ముగ్గురూ అక్కడికక్కడే మరణించారు. బీదర్ నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సమగ్ర కులగణన చేపట్టాలి



నిరసన తెలియజేస్తున్న రాజేందర్ పటేల్‌గౌడ్

కాచిగూడ, న్యూస్‌టుడే: ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సమగ్ర కులగణనను చేపట్టాలని జాతీయ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. కులగణన చేపట్టాలని కోరుతూ సోమవారం కాచిగూడలో నేతలు పులిజాల కృష్ణ, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, భూషణ్‌భాస్కర్ తదితరులతో కలిసి చేపట్టిన నిరసన కార్యక్రమంలో రాజేందర్ పటేల్‌గౌడ్ మాట్లాడారు. కులగణనకు జీవో జారీ చేసి నిధులను కేటాయించిన ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే కులగణనకు హామీనిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.



ఆకట్టు.. కొనేట్టు

వినియోగదారులను ఆకట్టుకోవడం.. వారితో ఏదైనా వస్తువును కొనిపించడం అంటే ఆషామాషీ కాదు. తానూ స్వయంగా ధరించి ఖైరతాబాద్ కూడలి వద్ద మాస్కులు విక్రయిస్తున్న మహిళ.

చెరువులకు పూర్వ వైభవం

- హైడ్రా ఆధ్వర్యంలో కార్యాచరణ

ఈనాడు, హైదరాబాద్: ఓఆర్ఆర్ లోపలి చెరువులకు వాస్తవ రూపం ఇచ్చేందుకు హైడ్రా సిద్ధమైంది. ఆక్రమణల తొలగింపు, వ్యర్థాలను వెలికితీయడం వంటి చర్యలతో జలవనరులకు పూర్వ వైభవం కల్పించే చర్యలను ప్రారంభించింది. మొదటగా మాదాపూర్‌లోని సున్నంచెరువు, ఎర్రకుంట, గగన్‌పహాడ్‌లోని అప్పాచెరువు, కూకట్‌పల్లిలోని నల్లచెరువులకు పునరుజ్జీవం కల్పించేందుకు హైడ్రా కమిషనర్, చెరువుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ ఏ.వి.రంగనాథ్ సిద్ధమయ్యారు. చెరువులన్నింటి హద్దులను పక్కాగా గుర్తించే చర్యల్లో భాగంగా సోమవారం ట్యాంక్‌బండ్ బుద్ధభవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. నీటిపారుదలశాఖ, రెవెన్యూ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో ఆయన చర్చించారు.

భువనేశ్వర్‌లోని యాప్ తరహాలో.. ఒడిశాలోని భువనేశ్వర్‌లోనూ ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలు పెరుగుతుండటంతో.. అక్కడి సర్కారు దేశంలోనే మొదటిసారి 2020లో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఆక్రమణలను నిమిషాల్లో పసిగట్టే బీఎల్‌యూఐఎస్ (భువనేశ్వర్ ల్యాండ్ యూజ్ ఇంటెలిజెన్స్ సిస్టమ్) పేరిట కొత్త వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ స్థలాన్నింటికీ అక్షాంశాలు, రేఖాంశాలు, సర్వే నెంబర్లతో హద్దులను నిర్ణయించారు. భూములు ఏ రెవెన్యూ గ్రామం, పోలీస్ స్టేషన్, నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నాయి, ఇతర వివరాలతో డిజిటల్ పటాన్ని రూపొందించారు. అందులో ఏవైనా మార్పులు చోటు చేసుకోగానే సంబంధిత అధికారికి వెంటనే సందేశం వెళ్లేట్లు సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశారు.

హియాయత్‌సాగర్ మాదిరి.. టన్నుల కొద్దీ వ్యర్థాలతో, ఆక్రమణలతో కుంచించుకుపోయిన జలవనరులకు పూర్వ స్థితిని తీసుకురావడమే హైడ్రా ప్రధాన లక్ష్యమని సమావేశంలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు రంగనాథ్ స్పష్టం చేశారు. శాస్త్రీయంగా తటాకాల పూర్తిస్థాయి నీటి మట్టం(ఎఫ్‌టీఎల్) నిర్ధారణకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. ఎన్ఆర్ఎస్ఏ, ఇతర సంస్థల వద్దనున్న 45ఏళ్ల నాటి నగరపటాల్లోని చెరువుల విస్తీర్ణం, నీటి పారుదలశాఖ వద్దనున్న హద్దులను సరిపోల్చితే అసలైన హద్దులు తేలతాయని నిర్ణయించారు. భూమి సర్వే నెంబర్లు, జలవనరులు, పచ్చదనం వంటి వివరాలతో కూడిన గ్రామ పటాలనూ పరిశీలిద్దామని అభిప్రాయం వ్యక్తం చేశారు. హిమాయత్‌సాగర్‌తో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గుర్తింపు ప్రారంభించి, అదే విధానాన్ని అన్ని చెరువులకు వర్తింపజేయాలని, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న చెరువుల పరిరక్షణ విధానాలపైనా సమీక్షించాలని నిర్ణయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



షేక్ మదీనా భాషా, శ్రావణ్‌కుమార్

బాలాపూర్, న్యూస్‌టుడే: ఒకరు విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా.. మరొకరు విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ.. ఇద్దరూ అనుకోకుండా కలుసుకుని బయలుదేరిన 5 నిమిషాల వ్యవధిలోనే మృత్యువాతపడ్డారు. లారీ ఢీకొని ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు కథనం ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన షేక్ మదీనా భాషా(42) మీర్‌పేటలో ఉంటూ ఫిర్జాదిగూడలోని ఆర్టీసీ వర్క్‌షాప్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మహబూబ్‌నగర్ హన్వాడా మండలం దర్పల్లి గ్రామానికి చెందిన అన్నోజు శ్రావణ్‌కుమార్(40) నందనవనం ప్రాంతంలో ఉంటూ టీకేఆర్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం భాషా బైక్‌పై విధులకు వెళ్తున్నాడు. శ్రావణ్ డ్యూటీ దిగి ఇంటికి వెళ్లేందుకు రహదారిపై వేచి ఉన్నాడు. భాషాను లిఫ్ట్ అడిగి ఎక్కాడు. కొద్ది దూరం వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన లారీ. . ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యంతర బెయిల్ ఉపసంహరణకు జానీ మెమో దాఖలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: నృత్య దర్శకుడు జానీకి మంజూరు చేసిన నాలుగు రోజుల మధ్యంతర బెయిలు అవసరం లేదంటూ అతడి తరపు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. జాతీయ ఉత్తమ నృత్య దర్శకుడు అవార్డును అందుకోవడానికి దిల్లీ వెళ్లడానికి జానీ అభ్యర్థన మేరకు రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. అయితే అతడి అవార్డును తాత్కాలికంగా అవార్డుల కమిటీ నిలిపి వేసిన నేపథ్యంలో బెయిలు పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు మెమో దాఖలు చేశారు.

నార్మల్ డెయిరీకి పూర్వవైభవం తెస్తాం: మంత్రి



బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్, న్యూస్‌టుడే: నార్మల్ డెయిరీకి పూర్వవైభవం తెస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని డెయిరీ కార్యాలయంలో నూతన ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ జయశ్రీ, డీసీసీ ఛైర్మన్ సంజీవరెడ్డి హాజరయ్యారు.

లండన్‌కు బయల్దేరిన వివాహిత అదృశ్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: లండన్‌కు బయల్దేరిన ఓ వివాహిత శంషాబాద్‌లో అదృశ్యమైంది. హైదరాబాద్‌కు చెందిన మహిళ లండన్ నుంచి ఇటీవల ఇక్కడికి వచ్చారు. ఈ నెల 5న రాత్రి తిరిగి తాను లండన్‌కు బయలుదేరుతున్నట్లు భర్తకు సమాచారం ఇచ్చారు. ఆమె అక్కడికి చేరుకోక పోవడంతో ఆన్‌లైన్‌లో భర్త చేసిన ఫిర్యాదు మేరకు విమానాశ్రయం పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

వివాహితుడి వేధింపులు.. బాలిక ఆత్మహత్య

అల్వాల్, న్యూస్‌టుడే: వివాహితుడి వేధింపులు తాళలేక ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. అల్వాల్ పోలీసుల కథనం ప్రకారం.. లోతుకుంట పరిధిలో నివసించే బాలిక(17) పదో తరగతి చదువుతోంది. కొంతకాలం క్రితం స్థానికంగా బ్యాండ్ వాయించే 30ఏళ్ల వ్యక్తి బాలికతో పరిచయం పెంచుకున్నాడు. అతనికి అప్పటికే వివాహమైంది. భార్య, పిల్లలు ఉన్నారు. బాలికతో చనువు పెంచుకొని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. బాలిక పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో తరచూ వెంటపడటంతో ఆమె విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు హెచ్చరించినా నిందితుడు వేధింపులు ఆపలేదు. దీంతో ఆదివారం రాత్రి బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, వేదికపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ శశాంక

కడ్తాల్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాంటివని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన గీత కార్మికులకు కాటమయ్య కిట్లు, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. నేతలు చల్లా నర్సింహారెడ్డి, బాలాజీసింగ్, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్- మజ్లిస్ మధ్య ఘర్షణ

కార్వాన్, న్యూస్‌టుడే: రోడ్డు నిర్మాణ విషయంలో తలెత్తిన వివాదం కాంగ్రెస్- మజ్లిస్ పార్టీల మధ్య ఘర్షణకు దారితీసింది. ఆసిఫ్‌నగర్ ఫిరోజ్‌గాంధీనగర్‌లో రోడ్డు నిర్మాణం సాగుతోంది. కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్‌ఖాన్ సోమవారం అక్కడకు వెళ్లారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్‌హుస్సేన్ మద్దతుదారులు, కాంగ్రెస్ కార్యకర్తల నడుమ ఘర్షణ జరిగి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై మాజిద్ హుస్సేన్ డీసీపీకి ఫిర్యాదు చేశారు.

పిల్లల్ని అప్పగించాలని శిశువిహార్ వద్ద నిరసన



వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: తమ పిల్లలను అప్పగించాలని మధురానగర్‌లోని శిశువిహార్ ఆవరణలో తల్లిదండ్రులు సోమవారం నిరసన తెలిపారు. ఈ ఏడాది మే 28న పిల్లలను కొనుగోలు చేశారన్నా ఆరోపణలపై శిశు సంక్షేమశాఖ అధికారులకు తల్లిదండ్రులు తమ పిల్లలను మధురానగర్‌లోని శిశువిహార్‌లో అప్పగించారు. దీనిపై తల్లిదండ్రులు హైకోర్టుని ఆశ్రయించారు. సానుకూలంగా స్పందించిన హైకోర్టు తల్లిదండ్రుల నుంచి పిల్లలను స్వాధీనం చేసుకునే హక్కు లేదని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ తల్లిదండ్రులు ఉత్తర్వులతో శిశువిహార్‌కు చేరుకున్నారు. పిల్లలను అప్పగించాలని అధికారులతో గొడవకు దిగారు. సీఐ శ్రీనివాస్, పోలీసులు ఇరువురిని సముదాయించారు.

బాలికపై విశ్రాంత ఎస్సై తనయుడి అత్యాచార యత్నం

– తండ్రి పని చేసిన ఠాణాలోనే పోక్సో కేసు నమోదు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: ఓ విశ్రాంత పోలీసు అధికారి తనయుడు బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. తండ్రి ఉద్యోగ విరమణ చేసిన ఠాణాలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. జీడిమెట్ల ఠాణా పోలీసుల కథనం ప్రకారం... విశ్రాంత ఎస్సై కుమారుడు ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అదే ప్రాంతంలో ఉండే బాలికతో పరిచయం ఉంది. ఆదివారం సాయంత్రం పండ్లు ఇస్తానని ఇంట్లోకి తీసుకెళ్లాడు. అత్యాచార యత్నం చేయడంతో కేకలు పెడుతూ బయటకు వచ్చింది. జరిగిన విషయాన్ని బాలిక కుటుంబీకులు నిందితుడి తండ్రి దృష్టికి తీసుకెళ్లారు. తన కుమారుడిపై లేనిపోని నిందలు వేస్తారా.. అంటూ వారిపై చిందులు తొక్కాడు. బాధితులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు ఆధ్యాత్మికత ప్రాధాన్యం తెలియజేయాలి



ఆలయంలో శ్రీనివాస్‌గుప్తా తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: నేటి యువతకు భారతీయ ఆధ్యాత్మికత ప్రాధాన్యతను తెలియజేయాలని అంతర్జాతీయ వైశ్య సమాఖ్య జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సోమవారం అంబర్‌పేటలో జరిగిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. సనాతన హిందూ ధర్మంలో ఆధ్యాత్మిక చింతనకు విశిష్ట స్థానం ఉందన్నారు. రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. తిరుపతిగుప్తా, సాయి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

On behalf of my clients **(1)** Corvine Chemicals and Pharmaceuticals (P) Ltd., and **(II)** Goutham Bacha, S/o. Srinivas Bacha, this notice is issued to the general public and it is issued **ONLY to notify that the persons dealing with M/s. SUKHII Projects LLP should not setup, at a later stage, that they have not been notified as to the following:** **(A)** that the disputes have arisen between the other designated partners and my clients, who are also designated partners holding 55% Stake/share in **M/s.SUKHII** Projects LLP, Plot No. 59, Sagar Society, Road No.2, Banjara Hills, Hyderbad-500034. **(B)** That because of said disputes, Arbitration Clause/ Agreement of LLP Agreement dated **05-12-2019** as amended by Supplement Agreement dated **08-01-2022,** has been invoked by my clients and Arbitration Application No. 245 of 2024 has also been filed in the Hon'ble High Court of Telangana, **(C)** That my clients have also filed an Application under Section 9 of the Arbitration and Conciliation Act, 1996 seeking interim reliefs and vide orders dated **11-09-2024** passed in the **CRP No. 2846 of 2024** read with the Order dated **1-10-2024** disposing off the said CRPS of the Hon'ble High Court of Telangana arising out of the said **COP No. 100 of 2024** on file of the Commercial Court, the other Designated Partners (Numbering 6) have been directed not to take such steps which would render the Award to be passed in the said Arbitration become useless and non-executable. **(D)** That the **COP. No. 100 of 2024** is also pending for adjudication before the Hon'ble Commercial Court, City Civil Court, at Hyderabad.

Sd/- **N.ANIL KUMAR,** Advocate
3-6-237, Flat No.214, 2nd Floor, Lingapur House,
Amrutha Estates, Himayathnagar,
Hyderabad - 500029. T.S.



స్కందమాతగా
బాసర అమ్మవారు

నిర్మల్ జిల్లా బాసర అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. సోమవారం స్కందమాతగా అమ్మవారు దర్శనమిచ్చారు. బాసర ఉత్సవాల సందర్శనకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

– న్యూస్‌టుడే, ముథోల్(బాసర)

ఫీజుల కట్టడి.. మళ్లీ మొదటికి

- ప్రైవేట్ పాఠశాలల్లో రుసుముల నియంత్రణకు మరో కమిటీ
- నియమిస్తామని సర్కారు ప్రకటన
- నవంబరు నుంచి సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బడుల్లో ప్రవేశాలు



ఈనాడు, హైదరాబాద్: "హైదరాబాద్‌లోని కొన్ని పాఠశాలల్లో ఎల్‌కేజీ ఫీజు గత ఏడాది రూ.2.30 లక్షలుండగా.. ఈసారి ఏకంగా రూ.3.70 లక్షలకు పెరిగింది. రియల్ ఎస్టేట్, ఇతర రంగాల్లో ద్రవ్యోల్బణం పెరగడం కాదు.. నిజమైన ద్రవ్యోల్బణం విద్యారంగంలోనే పెరిగింది." ఓ బెంగళూరు వాసి నెల క్రితం సామాజిక మాధ్యమాల్లో చేసిన ఈ పోస్టు భాగ్యనగరంలో పాఠశాలల ఫీజులు మధ్యతరగతి వారికే కాదు... ధనవంతులూ భరించలేని స్థాయికి చేరుకుంటున్నాయనడానికి నిదర్శనం. దేశంలోని అనేక నగరాల కంటే హైదరాబాద్‌లోనే ఫీజులు అధికంగా ఉన్నాయని ఏడేళ్ల క్రితమే ఓ అధ్యయనం తేటతెల్లం చేసింది. అందుకే హైదరాబాద్ స్కూల్ స్టూడెంట్స్ పేరెంట్స్ అసోసియేషన్(హెచ్ఎస్‌పీఏ) పేరిట తల్లిదండ్రులు ఓ సంఘం ఏర్పాటు చేసుకొని ఫీజుల నియంత్రణకు పోరాటం చేస్తున్నారు. సుప్రీంకోర్టు వరకూ వెళ్లారు. అయినా ఏళ్లుగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కొలిక్కి రావడం లేదు.

గతంలో కమిటీ నివేదిక ఇచ్చినా..

జీవో 91 ప్రకారం కలెక్టర్లు ఛైర్మన్‌గా ఉండే డీఎఫ్ఆర్‌సీ(డిస్ట్రిక్ట్ ఫీ రెగ్యులేటరీ కమిటీ)లకు ఫీజులను నియంత్రించే అధికారం లేదని.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమిటీలకు మాత్రమే అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు 2016 సెప్టెంబరు 19న తీర్పునిచ్చింది. ఆ జీవోలో చిన్న మార్పు చేస్తే డీఎఫ్ఆర్‌సీలకు ఫీజులను నియంత్రించే అధికారం దఖలు పడుతుంది. కానీ, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రొ.తిరుపతిరావు ఛైర్మన్‌గా ఓ కమిటీని నియమించింది. ఆయన 2017 డిసెంబరులో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. 10 శాతానికి మించకుండా ఏటా ఫీజులను పెంచుకోవచ్చని ప్రతిపాదించినట్లు విలేకరులకు తిరుపతిరావు తెలిపారు. ఆ నివేదికను ప్రభుత్వం బయటకు వెల్లడించలేదు. పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో అప్పటి ప్రభుత్వం తీసుకుంది. అదే సంవత్సరం ఏప్రిల్‌లో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ కమిటీ కూడా ఏటా 10 శాతం వరకు పెంచుకోవచ్చని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దానిపై తన నిర్ణయాన్ని సర్కారు వెలువరించలేదు. ఫలితంగా పాఠశాలల్లో ఫీజులపై ఏళ్ల తరబడిగా నియంత్రణ లేకుండా పోయింది. యాజమాన్యాలది ఇష్టారాజ్యంగా మారింది.

ఆ లోపు సాధ్యమేనా?

పాఠశాలల ఫీజులను నియంత్రించేందుకు చట్టం తీసుకొస్తామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం గత మే నెల 18న ఎప్‌సెట్ ఫలితాల విడుదల సందర్భంగా విలేకరులకు తెలిపారు. కాకపోతే 2025-26 విద్యాసంవత్సరం నుంచి అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఛైర్మన్‌గా ఉన్న మంత్రివర్గ ఉపసంఘం మాత్రం రుసుములను కట్టడి చేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని సెప్టెంబరు 11న వెల్లడించింది. విధివిధానాల రూపకల్పనకు కమిటీ వేస్తారా? ఉన్నత విద్యలో ప్రొఫెషనల్ కళాశాలలకు ఉన్న టీఏఎఫ్ఆర్‌సీ(తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ) తరహాలో మరో కమిటీని ఏర్పాటు చేస్తారా అన్నదానిపై స్పష్టత లేదు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం కమిటీని నియమిస్తామని 10 రోజుల క్రితం చెప్పారు. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారి మాత్రం ఫీజుల వ్యవహారాన్ని విద్యా కమిషన్ చూసుకుంటుందని చెప్పారు. అయితే నవంబరు, డిసెంబరుల నుంచే పలు పాఠశాలలు ప్రవేశాలు నిర్వహిస్తాయి. ఆలోపు కమిటీలు నిర్ణయం తీసుకోవడం సాధ్యమేనా అన్నది ప్రశ్నార్థకం. తమ పిటిషన్ వల్లే గత ప్రభుత్వం చట్టం తీసుకొస్తామని హైకోర్టుకు తెలిపిందని, మళ్లీ కమిటీలు.. కమిషన్లు అంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్ఎస్‌పీఏ సంయుక్త కార్యదర్శి వెంకట్ పేర్కొన్నారు.

దసరా సెలవులయ్యేలోపే కొత్త టీచర్లకు పోస్టింగులు

ఈనాడు, హైదరాబాద్: డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 9న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్న విద్యాశాఖ... వారికి దసరా సెలవులు ముగిసేలోపు పోస్టింగులు ఇవ్వనుంది. మెరిట్ ఆధారంగా ఏ పాఠశాలలో పనిచేయాలో డీఈవోలు ఉత్తర్వులు ఇస్తారు. నియామకపత్రాల అందజేత కార్యక్రమం ముగిసిన వెంటనే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. దసరా సెలవులు ఈ నెల 14తో ముగుస్తాయి. అప్పటికి జిల్లాల వారీగా కౌన్సెలింగ్ పూర్తిచేసి, పోస్టింగులు ఇస్తామని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నరసింహారెడ్డి తెలిపారు. కోర్టు కేసుల కారణంగా కొన్ని జిల్లాల్లో స్పెషల్ ఎడ్యుకేటర్లు, పీఈటీలకు నియామకపత్రాలను ఈ నెల 9న ఇవ్వడానికి వీలుకాదన్నారు.

కలెక్టరేట్ల నుంచి హైదరాబాద్‌కు బస్సులు

దాదాపు 10 వేల మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేయాల్సి ఉన్నందున డీఈవోల ఆధ్వర్యంలో 60 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. కొందరు అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పత్రాలను అందజేసి ప్రసంగిస్తారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియానికి వచ్చేందుకు ఈ నెల 9న ఆయా కలెక్టరేట్ల నుంచి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఎంపికైన వారిలో పాలిచ్చే తల్లులు, గర్భిణులు, దివ్యాంగులు ఉంటే వారి వెంట ఒకరిని వెంట తెచ్చుకోవడానికి వీలు కల్పించారు.

జహీరాబాద్-బీదర్ రోడ్డుపై ఘోర ప్రమాదం



సిద్రామ్ జగన్నాథ్ రేణుక వినయ్ కుమార్

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దుర్మరణం

జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్ – న్యూస్‌టుడే: జహీరాబాద్-బీదర్ రోడ్డుపై సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. వారంతా ద్విచక్రవాహనంలో పొలానికి వెళ్లి తిరిగొస్తుండగా బీదర్ వైపు వెళ్తున్న కర్ణాటక బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో గణేష్‌పూర్‌కు చెందిన గునెల్లి సిద్రామ్ (70) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఆయన అల్లుడు బిరాదర్ జగన్నాథ్ (40), కుమార్తె బిరాదర్ రేణుక (35), మనవడు వినయ్ కుమార్ (14)లు తీవ్రంగా గాయపడి, కర్ణాటకలోని బీదర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అంతర్రాష్ట్ర రహదారిపై జరిగిన ప్రమాదంతో జహీరాబాద్-బీదర్ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న హద్నూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన బస్సు, ద్విచక్ర వాహనాన్ని పక్కకు తప్పించి రాకపోకలను పునరుద్ధరించారు.

'మేడిగడ్డ'ను ఎప్పుడు సందర్శించారు?

- ఈఎన్సీ నాగేంద్రరావుకు విజిలెన్స్ ప్రశ్నలు

ఈనాడు, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీని ఎప్పుడు సందర్శించారో చెప్పండంటూ నీటి పారుదల శాఖ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) విభాగం ఇంజినీర్-ఇన్-చీఫ్(ఈఎన్సీ) నాగేంద్రరావును విజిలెన్స్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. సోమవారం హైదరాబాద్‌లోని విజిలెన్స్ కార్యాలయంలో ఆయనను విజిలెన్స్ అదనపు ఎస్పీ ఆనంద్‌కుమార్ సుమారు 3 గంటలపాటు విచారించినట్లు సమాచారం. రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా మీ పాత్ర ఏమిటి? ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? ఓఅండ్ఎం విభాగానికి సంబంధించి ఏయే పనులు చేపట్టారు? తదితర అంశాలపై ప్రశ్నించినట్లు సమాచారం. మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాకు పియర్స్ కుంగిపోవడానికి కారణాలు, ఓఅండ్ఎం లోపాలు వంటి వివరాలనూ సేకరించినట్లు తెలిసింది. మేడిగడ్డపై పూర్తిస్థాయి నివేదిక రూపకల్పనకు విజిలెన్స్ అధికారులు ప్రత్యక్ష విచారణ ప్రారంభించిన విషయం తెలిసిందే. గతంలో సీడీవో సీఈగా పనిచేసి, ప్రస్తుతం ఆదిలాబాద్ ముఖ్య ఇంజినీరుగా ఉన్న శ్రీనివాస్, వర్క్స్ అండ్ అకౌంట్స్ సంచాలకుడు ఫణి భూషణ్‌శర్మలను మంగళవారం విచారించనున్నారు.



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట చెరువు 2014లో ఖాళీగా.. | 2023లో ఆక్రమణలతో

చెరువులను మింగేశారు

- గత పదేళ్లలో ఇష్టారాజ్యంగా కబ్జాలు
- రాజధాని పరిధిలో ఆక్రమణలపై టీజీఆర్ఏసీ అధ్యయనం

ఈనాడు, హైదరాబాద్: రాజధానిలో, పరిసరాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో.. అక్రమార్కులు పదుల సంఖ్యలో చెరువులను చెరపట్టేశారు. వీరి ప్రతాపానికి 44 చెరువులు పూర్తిగా కనుమరుగయ్యాయని.. తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టీజీఆర్ఏసీ) ఉపగ్రహ చిత్రాల సాయంతో గుర్తించింది. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలో (ఓఆర్ఆర్ లోపల) చెరువుల ఆక్రమణలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి తాజాగా నివేదిక ఇచ్చింది. నల్లకుంట.. మర్రివాని కుంట.. పిటూరుకుంట.. తదితర సాగునీటి తటాకాలు.. రికార్డుల్లో తప్ప క్షేత్రస్థాయిలో లేవని స్పష్టం చేసింది. రాజధాని పరిధిలో అంతకుముందు ఎటువంటి ఆక్రమణలు లేని 20 చెరువులను గత పదేళ్ల కాలంలో కబ్జాదారులు పూర్తిగా ఆక్రమించేశారని నివేదిక తెలిపింది. 2014కు ముందే ఆక్రమణలు ఉండి.. ఈ పదేళ్లలో మరింత పెరిగి.. 24 చెరువులు పూర్తిగా కబ్జాకు గురయ్యాయని పేర్కొంది. గత పదేళ్ల కాలంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 28, రంగారెడ్డి జిల్లాలో 22, సంగారెడ్డి జిల్లాలో 7 చెరువులు పాక్షికంగా కబ్జాల పాలయ్యాయని తెలిపింది.

పదేళ్లకు ముందే కబ్జాలు మొదలై.. ఇప్పుడు పూర్తిగా కనుమరుగైనవి (24)

రంగారెడ్డి జిల్లాలో:	10
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో:	10
సంగారెడ్డి జిల్లాలో:	3
హైదరాబాద్ జిల్లాలో:	1

గత పదేళ్లలోనే కబ్జా అయిన 20 చెరువులు (అంకెలు ఎకరాల్లో)..

హైదరాబాద్ జిల్లాలో

షేక్‌పేట మండలం: షేక్‌పేట చెరువు (1.61)
మారేడుపల్లి మండలం: మారేడుపల్లి చెరువు (1.56)

రంగారెడ్డి జిల్లాలో

గండిపేట మండలం: అలిజాపూర్ గ్రామ చెరువు (0.82)
పీరంచెరువులో పిటూరుకుంట (1.16)
పుప్పాలగూడలో చెరువు (9.25)
శేరిలింగంపల్లి మండలం: గోపన్‌పల్లి గ్రామంలో (1.53)
బాలాపూర్ మండలం: మామిడిపల్లిలో మర్రివానికుంట (1.98)
రాజేంద్రనగర్ మండలం: బుద్వేలు గ్రామ చెరువు (6.39)
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం: కుంట్లూరు గ్రామ చెరువు (1.62)

మల్కాజిగిరి జిల్లాలో

అల్వాల్ మండలం: అల్వాల్‌లో 2 చెరువులు (1.33, 1.30)
ఉప్పల్ మండలం: ఉప్పల్ భగాయత్‌లో చెరువు (2.91), మల్లాపూర్ చెరువు (1.92)
కూకట్‌పల్లి మండలం: కేపీహెచ్‌బీ కాలనీ చెరువు (1.07)
మేడిపల్లి మండలం: బోడుప్పల్ గ్రామ చెరువు (0.72)
కీసర మండలం: రాంపల్లి చెరువు (0.39)
మేడ్చల్: గుండ్లపోచంపల్లి చెరువు (1.67)
బాచుపల్లి: బాచుపల్లిలో చెరువు (2.10)
★ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం: కిష్టారెడ్డిపేటలో 2 చెరువులు (0.89, 0.23)

ఇందూటెక్, బ్రాహ్మణిల భూములను
స్వాధీనం చేసుకోండి

- నిర్మాణం ప్రారంభించని సంస్థలకూ వర్తింపు
- పనులు మొదలైన వాటిల్లో జోక్యం చేసుకోలేం
- 2007 నాటి భూకేటాయింపుల పిల్‌పై హైకోర్టు ఆదేశం



ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో 2001 నుంచి 2006 సంవత్సరం వరకు జరిగిన భూకేటాయింపుల వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టంచేసింది. పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించి, రాయితీపై భూములను కేటాయించినట్లు తెలిపింది. అయితే... ఇందూటెక్ జోన్, బ్రాహ్మణి పరిశ్రమలతో సహా నిర్మాణం ప్రారంభించని పలు కంపెనీలకు చెందిన భూములను నాలుగు నెలల్లో స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 2001 నుంచి 2006 వరకు ఎలాంటి ప్రకటన లేకుండా, వేలం నిర్వహించకుండా, నామినేషన్ పద్ధతిపై 4,156 ఎకరాలను పలు కంపెనీలకు, వ్యక్తులకు కారుచౌకగా విక్రయం, లీజుపై కేటాయించడాన్ని సవాలు చేస్తూ ఛత్రి అనే స్వచ్ఛంద సంస్థ 2007లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి ఇటీవల 72 పేజీల తీర్పు వెలువరించింది. "1997 నుంచి 2006 సంవత్సరం వరకు ఐటీ, పారిశ్రామిక రంగాల ఆలంబనగా ఆర్థిక ప్రగతి సాధించడానికి ప్రభుత్వం పలు విధానాలను రూపొందించింది. చివరి కేటాయింపు జరిగిన ఏడాది తర్వాత పిటిషన్ దాఖలైంది. దాని విచారణ పెండింగ్‌లో ఉండగానే పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించింది. పిటిషనర్ కోరినట్లుగా ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం సొమ్మును వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తే... అది ప్రభుత్వ విధాన నిర్ణయాలకు విరుద్ధం అవుతుంది. అందువల్ల అలాంటి ఆదేశాలను ఇవ్వలేం. పరిశ్రమలు ఏర్పాటు చేయని కంపెనీల నుంచి భూములను స్వాధీనం చేసుకోలేదన్న పిటిషనర్ వాదన సమర్థనీయం. భూకేటాయింపులు జరిగినా... నిర్మాణాలు ప్రారంభించని ఇందూటెక్ జోన్, బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్, స్టార్‌గేజ్ ప్రాపర్టీస్, అనంత టెక్నాలజీస్, జెటీహోల్డింగ్‌లకు కేటాయించిన భూములను నాలుగు నెలల్లో రద్దు చేయాలి" అని ఆదేశించింది.

ప్రభుత్వ ఆస్తుల కేటాయింపులో పారదర్శకత ఉండాలి

ప్రభుత్వ ఆస్తుల కేటాయింపు విధానం పారదర్శకంగా ఉండాలని, ఈ విధానాలపై న్యాయసమీక్షకు సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన పలు తీర్పులను ధర్మాసనం ప్రస్తావించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటరును పరిగణనలోకి తీసుకుంది. "పారిశ్రామిక అభివృద్ధి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 1973లో ఏపీఐఐసీని ఏర్పాటు చేసింది. విస్తృత స్థాయిలో ఉపాధి కల్పించడంలో భాగంగా పరిశ్రమలను ఆకర్షించడమే రాష్ట్ర ప్రభుత్వ విధానంలోని ప్రధాన ఉద్దేశం. దీనిపై ప్రభుత్వం 2000లోనే ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అప్పటి ప్రభుత్వ విధానాలు ఐటీ రంగానికి ఊతం ఇచ్చాయి. రాష్ట్రంలో ఐటీ రంగం 2004-05లో 64.05% వృద్ధి సాధించగా... జాతీయ సగటు 34% మాత్రమే. 2007-08లో పరిశ్రమల ఎగుమతి రూ.8,270 కోట్లతో 41% ఉండగా జాతీయ సగటు 33.88% మాత్రమే. ఐటీ రంగానికి సంబంధించి 1997 నుంచి 2007-08 వరకు 1,584 యూనిట్లు ఏర్పాటవగా రూ.26,122 కోట్ల ఎగుమతులు, రూ.10,101 కోట్ల పెట్టుబడులు, 2.39 లక్షల ఉద్యోగాలు లభించాయి. 2002-05, 2005-10 మధ్య ఐటీ పాలసీతో హైటెక్ సిటీ, సాఫ్ట్‌వేర్ యూనిట్లు, బహుళజాతి సంస్థలు, మైక్రోసాఫ్ట్, సీఏ, కాన్‌బే, యుబీఎస్, ఫ్రాంక్లిన్ అండ్ టెంపుల్టన్, విప్రో, హనీవెల్, అమెజాన్ తదితర బహుళజాతి కంపెనీలు ఏర్పాటయ్యాయి. భూకేటాయింపుల్లో దురుద్దేశాలు, వివక్ష ఉన్నట్లు పిటిషనర్ పేర్కొనలేదు. ఇవిలేకుండా ప్రభుత్వ నిర్ణయాలు ఏకపక్షమని చెప్పలేం. అందువల్ల భూకేటాయింపులపై ప్రభుత్వ విధానంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరంలేదు' అని స్పష్టంచేసింది.

వసుంధర

vasundhara@eenadu.in

శ్రీమహాలక్ష్మీ దేవి!



అదృష్టం, విలాసం, ఐశ్వర్యం, సంపద, శ్రేయస్సులకు ప్రదాతగా లక్ష్మీదేవిని కొలుస్తారు. త్రిపురాత్రయంలో మధ్యలో ఉంటుంది లక్ష్మీ అమ్మవారు. అమృతం కోసమని దేవతలు, రాక్షసులు క్షీరసాగరాన్ని మధిస్తోంటే ఎన్నో దివ్య సంపదలు ఉద్భవించాయి. వాటిలో లక్ష్మీదేవి ఒకరు. పసుపు కాంతితో... తెల్లటి వస్త్రాలతో... మాతృవాత్సల్యం నిండిన చూపుతో జన్మించిందట. ఒంటినిండా బంగారం, పూలను అలంకరించుకుని వరద ముద్రతో ఉన్న అమ్మవారిని అంతా తమ వద్దే ఉంచుకోవాలని భావిస్తే... ఆమె మాత్రం మహావిష్ణువును పతిగా ఎంచుకుంది. విష్ణువు ఎన్ని అవతారాలెత్తినా... ఆయన ధర్మపత్నిగా ఆమే జన్మించిందని చెబుతారు. రజో గుణానికి ప్రధానమైన దేవత. ఐశ్వర్యానికీ, శ్రేయస్సుకీ అధిదేవత అయినా... రాక్షస సంహారమూ చేసింది. కోలాసురుడు అనే రాక్షసుడి సంహారానికే లక్ష్మీదేవి అవతరించిందని చెబుతారు. మహిషాసుర మర్దనం చేసిందీ అమ్మవారే అంటారు. అమ్మని అష్టలక్ష్ములుగా కొలుస్తాం కదా! మానవాళికి ఎనిమిది లక్ష్యాలు ఉండాలట. ఆ లక్ష్యాలను సూచిస్తూ అమ్మవారు అష్టలక్ష్ములుగా అవతరించిందట. అందుకే లక్ష్మి అంటే లక్ష్యానికి దారితీసే దేవత. లక్ష్యం సిద్ధిస్తే లక్ష్మీ కటాక్షం పొందినట్లేననీ భావిస్తారు.

శక్తిరూపం

‘శ్రామిక శక్తిలో మహిళలు ఎక్కువమంది లేకుండా దేశం అభివృద్ధి చెందదు. స్త్రీలు ఉద్యోగాల్లోకి రావాలంటే... పని ప్రదేశంలో భద్రతపై దృష్టిపెట్టాలి’

అంటారు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్. ఇప్పటివరకూ ఈ స్థాయికి చేరినవారిలో గీత ఒక్కరే మహిళ. గాజుతెరల్ని బద్దలుకొట్టి ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్తగా ఎంపికై ప్రపంచ స్థాయి ఆర్థిక దిగ్గజాల సరసన నిలబడిన పిన్నవయస్కురాలు కూడా.

ప్రపంచ నిధి... మన ‘గీత’ చేతుల్లో!



గీత

‘అర్థం చేసుకోగలిగితే చాలు... అర్థశాస్త్రం ఎంతో ఆనందాన్ని, ఆత్మసంతృప్తిని కలిగిస్తుం’దంటారు గీత. ఆ ఇష్టమే వాణిజ్యం, పెట్టుబడి, ద్రవ్య విధానం, అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభాలు... వంటి అంశాలపై పట్టు తెచ్చుకునే స్ఫూర్తినిచ్చిందట. 2019లో గీత చీఫ్ ఎకానమిస్ట్‌గా పదవిని చేపట్టినప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితిలో ఉంది. ఆపై కరోనా మహమ్మారితో మరింత అతలాకుతలమైంది. ఈ పరిస్థితుల్లో ఆమె తన అసాధారణ నాయకత్వ పటిమతో ప్రపంచాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించారు. డిజిటలైజేషన్, రిసెర్చ్ విభాగాల్ని బలోపేతం చేశారు. కొత్తతరం మహిళా ఆర్థికవేత్తలను, వారి నాయకత్వాలను ప్రోత్సహించారు. ముఖ్యంగా అప్పులు, ఆదాయాల అసమానతలపై గీత సమయానుకూలంగా చేసిన హెచ్చరికలు, సూచనలు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాయి. ఇవే ఈమెకు అత్యున్నత పదవిని అప్పజెప్పాయి.

లెక్కల్లో వందకు 45 మార్కులే!

భారతీయ అమెరికన్ ఆర్థికవేత్తగా పేరు పొందిన గీతా గోపీనాథ్ కోల్‌కతాలోని మలయాళీ కుటుంబంలో జన్మించారు. తండ్రి టీవీ గోపీనాథ్, తల్లి వీసీ విజయలక్ష్మి. వారి ఇద్దరమ్మాయిల్లో గీతే చిన్న. ప్రాథమిక విద్య మైసూర్‌లోని నిర్మలా కాన్వెంట్‌లో చదివారు. ఏడో తరగతి వరకూ ఆమె సాధారణ విద్యార్థే. లెక్కల్లో అయితే, 100కి 45 మార్కులకి మించేవి కాదట. అయినా అమ్మానాన్నలు తనని ఏనాడూ దండించలేదని చెబుతారామె. కూతురు మార్కుల్లో వెనకబడటానికి సరిగా అర్థం చేసుకోలేకపోవడమే అని గ్రహించిన గోపీనాథ్... ఇంట్లోని వస్తువులతోనే సులువైన పద్ధతుల్లో పాఠాలు నేర్పించడం మొదలుపెట్టారు. అలా ఆసక్తి పెంచుకున్న గీత... తరవాత ఇక వెనుదిరిగి చూడనేలేదు. దిల్లీలోని లేడీ శ్రీరామ్ కాలేజ్‌లో బీఏ చేశారు. ఆపై దిల్లీ యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో పీజీ చేశారు. నిజానికి అప్పటివరకూ ఐఏఎస్ కావాలన్నది ఆమె కల. కానీ, అమెరికాలోని వాషింగ్టన్ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ చదివే అవకాశం రావడంతో అటువైపు వెళ్లారు. ఆపై ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో ఉపకారవేతనంతో పీహెచ్‌డీ పూర్తి చేశారు. జటిలమైన ఆర్థిక విషయాలను వేగంగా అర్థం చేసుకోవడంలోనే కాదు, వాటిని సులభంగా బోధించడంలోనూ పట్టు సాధించారు గీత. షికాగో విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2010లో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయి ప్రొఫెసర్‌గా పనిచేశారు. ‘ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్’ ఆర్థిక సలహాదారుల ప్యానల్ సభ్యురాలిగానూ వ్యవహరించారు. 2018లో హార్వర్డ్‌లో ఉన్నప్పుడే ఐఎంఎఫ్‌లో పనిచేసే అవకాశం తలుపు తట్టింది. తాను ఎకనామిక్స్‌ని ఎంచుకోవడానికి తొంభైల్లోని ఆర్థిక సంక్షోభ వార్తలే కారణమని చెబుతారామె. ఐఎంఎఫ్ చీఫ్ ఎకనామిస్ట్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ గీత.. ఈ ఘనత సాధించిన రెండో భారతీయురాలు.

దేశవృద్ధికి మహిళాశక్తి...

‘మహిళలు కుటుంబ సంరక్షకులుగా మాత్రమే ఉంటే సరిపోదు. వారు కార్మికశక్తిలో భాగం అయితేనే ఆర్థిక వృద్ధి, నూతన ఆవిష్కరణలు, ఉత్పాదకత పెరగడానికి దోహదమవుతుంది. స్త్రీ సాధికారత అంటే వారికి అవకాశాలు కల్పించడమే కాదు... విజయం సాధించేలా వారి సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి అవసరమైన వాతావరణాన్ని కూడా సృష్టించాలి. అసమానంగా వేతనాలు, విద్యావకాశాలు, ఆరోగ్యాన్ని దూరం చేసే సామాజిక నిబంధనలను దూరం చేయాలి. స్త్రీలు దేశవిదేశాల విధివిధానాలు, ప్రస్తుత పరిస్థితులు, ఆర్థిక అంశాలు.. అన్నీ తెలుసుకోవాలి’ అంటారామె. గీత పరిశోధన పత్రాలు టాప్ ఎకనామిక్స్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ‘యంగ్ గ్లోబల్ లీడర్’ అవార్డుతో పాటు ‘టాప్ 25 ఎకనామిస్ట్స్ అండర్ 45’ జాబితాలోనూ చోటు సంపాదించుకున్నారు. భారత ప్రభుత్వం నుంచి ‘ప్రవాసీ భారతీయ సమ్మాన్’ పురస్కారాన్నీ అందుకున్నారు.

గీతకి ఫ్యాషన్‌పై ఆసక్తి ఎక్కువ. సంగీత శిక్షణా తీసుకున్నారు. దిల్లీ వర్సిటీలో చదువుతున్నప్పుడు సహాధ్యాయి ఇక్బాల్ సింగ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మాజీ ఐఏఎస్‌గా పనిచేసిన ఈయనా ఆర్థికవేత్త. రాహిల్ అనే అబ్బాయి ఉన్నాడు.

మగాడు కదా...
అలానే కొడతాడంటున్నారు!

పెళ్లయిన వారం రోజుల నుంచే ఆయన ప్రతిదానికీ అరవడం, చేయిచేసుకోవడం మొదలుపెట్టారు. కొత్తకదా! ఒకరినొకరం అర్థం చేసుకోవడానికి సమయం పడుతుందనుకున్నా. కానీ, నా భర్తకు ఆడపిల్లలంటే చులకన భావనని క్రమంగా తెలిసింది. తప్పని చెప్పాల్సిన అత్తమామలు... ‘మగాడు కదా అలాగే ఉంటాడ’ని సమర్థిస్తున్నారు. ఓసారైతే తల పగిలి మూడు కుట్లూ పడ్డాయి. ఈ హింస భరించలేక ఆర్నెల్ల క్రితం పుట్టింటికి వచ్చి విడాకుల నోటీసు పంపించా. నా కాళ్ల మీద నేను నిలబడేందుకు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నా. అది తెలిసి అక్కడే ఉన్న నా సర్టిఫికెట్లను కాల్చేశారట. అతడికి శిక్ష పడాలంటే ఏం చేయాలి? – ఓ సోదరి

ఎన్ని చట్టాలు చేసినా... స్త్రీలకు ఇంటా బయటా రక్షణ లేకుండా పోయింది. భార్యను హింసిస్తున్న కొడుకుని సమర్థిస్తున్నారంటే... అతడు రేపు వాళ్లనీ కొట్టడానికి సిద్ధపడతాడన్న విషయం ఆ తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. మీరు విడాకుల కేసు వేసేటప్పుడు రిటర్న్ ఆఫ్ ఆర్టికల్స్, డాక్యుమెంట్స్ అన్నీ అడిగి ఉండాల్సింది. విలువైన ధ్రువపత్రాలు, ఇతరత్రా విలువైన వస్తువుల్ని మీ వెంట తెచ్చుకోలేకపోవడం మీ పొరపాటు. ముందు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయండి. ఆ తరవాత ఆ కాపీని జత చేస్తూ, ఏయే సర్టిఫికెట్లు, అధికారిక పత్రాలు పోయాయో సంబంధిత అధికారులకు, ప్రభుత్వ విభాగాలకు కొత్తవి ఇవ్వమని దరఖాస్తు చేసుకోండి. అంటే మీరు చదివిన స్కూలు, కాలేజీల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి, హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, యూనివర్సిటీ రిజిస్ట్రార్‌లకు అప్లై చేస్తే పరిశీలించి వాటిని జారీ చేస్తారు. మీ భర్త, అత్తమామల మీద గృహహింస చట్టం కింద కూడా కేసు నమోదు చేయొచ్చు. మీకు జరిగిన నష్టానికి పరిహారం పొందడానికి సెక్షన్ 22 ప్రకారం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ముందుగా మీరు ప్రొటెక్షన్ ఆఫీసర్ దగ్గర ఫిర్యాదు చేస్తే వాళ్లు పిలిపించి మాట్లాడతారు. నిజంగా సర్టిఫికెట్స్ కాల్చేశారా? మిమ్మల్ని బెదిరించడానికి అలా చెబుతున్నారో తెలుస్తుంది. వారు వాస్తవంగానే ఆ పని చేస్తే మీరు పడ్డ శారీరక, మానసిక, ఆర్థిక వేదనకు ఏక మొత్తంగా పరిహారం కోరవచ్చు. ఏది ఏమైనా తొందరగా లాయర్‌ని సంప్రదించి విడాకుల పిటిషన్‌లో శాశ్వత భత్యమూ కోరండి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

రంగులు మార్చే... రుద్రాక్ష పూలు!

దసరా పండగనాటికి ప్రకృతి అంతా పూలతో సింగారించుకుని మురిసిపోతుంది. అందుకే, బతుకమ్మ వేడుకలో పూలదే సందడి. వాటిల్లో రుద్రాక్ష పూలది ప్రత్యేక స్థానం. సాయంత్రం వేళ విచ్చుకునే ఈ పూలను తాజాగా కోసి... బతుకమ్మపై పేరుస్తారు. వీటినే చంద్రకాంత, సాయంత్రం పూలని కూడా పిలుస్తారు. ఇవి ముదురు గులాబీ, పసుపు, ఎరుపు, కాషాయం వంటి ఎన్నో వర్ణాల్లోనూ విచ్చుకుంటాయి. అంతేకాదు, ఒకే మొక్కకి రెండు మూడు రంగుల్లోనూ పూలు వస్తాయి. అంతేకాదు, అప్పటివరకూ ఓ కలర్‌లో పూసిన మొక్కే కొన్నాళ్ల తరవాత మరో రంగులో పుష్పించడమూ వీటిల్లో చూడొచ్చు. ఈ రుద్రాక్ష పూలను మన సంస్కృతికి నెలవైన పలు పండగలు, పూజల్లో వాడతాం. అయితే, ఈ మొక్క పుట్టింది మాత్రం పెరూ దేశంలోనట. ఆహార రంగుల తయారీలో ఈ పూలను వినియోగిస్తారు. వీటికి ఔషధ గుణాలు ఎక్కువ. ముఖ్యంగా ఆయుర్వేద వైద్యంలో మూత్ర సమస్యలు, వాపులు తగ్గేందుకూ, గాయాలకు చికిత్సగానూ వాడతారు. వీటి వేర్లకు విరేచనాలను తగ్గించే శక్తి ఉందట. ముఖ్యంగా ఇందులోని కొన్నిరకాల విత్తనాలను కాస్మెటిక్ డైలుగానూ వినియోగిస్తారట.





వారసత్వం అందుకుని...

దుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా నాట్యం చేసేటప్పుడు కానీ, పూజ చేసేటప్పుడు కానీ ఢాక్(డోలు) వాయించడం ప్రధానంగా చూస్తుంటాం. ఇక బెంగాలీలైతే, ఈ నవరాత్రుల్లో రోజూ ఉదయాన్నే డోలు, డప్పుల చప్పుళ్లతోనే నిద్రలేస్తుంటారు. అంతలా ఇవి వేడుకల్లో భాగమయ్యాయి. ఈ వృత్తిలో సాధారణంగా మగవారే ఎక్కువగా కనిపిస్తుంటారు. అయితే, ఇప్పుడిప్పుడే మహిళలూ రాణిస్తున్నారు. తాజాగా ఉత్తర బెంగాల్‌లోని పుర్బా బర్ధమాన్ జిల్లా కత్వాకి చెందిన 10 మంది మహిళా ఢాకీల బృందం కోల్‌కతాలో దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొన్నారు. తెలుపు, నీలిరంగు కలయికలోని చీర, తెల్లటి షూ, భుజాలకు ఢాక్ తగిలించుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ గ్రూపులో ఒకరైన అపర్ణా దాస్ మాట్లాడుతూ ‘మా నాన్న దసన్ దాస్ 55ఏళ్లుగా ఢాక్ వాయిస్తున్నారు. నేను ఎనిమిదేళ్ల క్రితం ఈ కళను నాన్న దగ్గరే నేర్చుకున్నా. ఆ సమయంలో మా ఊళ్లో వాళ్లంతా ‘ఇది మగవాళ్ల పని. ఇంట్లో కూర్చోక నీకెందుకు ఇవన్నీ’ అన్న సలహాలూ ఇచ్చారు. అయితే, నేను ఇవేమీ పట్టించుకోలేదు. నాన్న కూడా ‘ఈ కళ మా జీవితం. తరతరాల నుంచీ ఈ వృత్తిలో ఉన్నాం. దీన్ని ఎవరు అడిగినా నేర్పిస్తాను. అది నా కూతురైనా, అల్లుడైనా, కొడుకైనా సరే. అందరూ నాకు సమానమే. శ్రద్ధగా చేస్తున్నారా లేదా అన్నదే ముఖ్యం’ అని సమాధానమిచ్చేవార’ని చెబుతారామె. ఇప్పుడు వీరి కుటుంబంలో చాలామంది మహిళలు ఈ వృత్తిలోనే కొనసాగుతున్నారు. మొదట్లో సమాజం అంగీకరించడానికి కొంత సమయం పట్టినా, పట్టుదలతో రాణించారు వీళ్లు. ఇప్పుడు ఊళ్లో మిగతా మహిళలూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని ఇటువైపు అడుగులు వేస్తున్నారు.

వచ్చిందండీ... దీపావళి బార్బీ!



బార్బీ... ఏ క్షణాన దీన్ని రూపొందించారో కానీ... ప్రపంచవ్యాప్తంగా చాలామంది అమ్మాయిల కలల బొమ్మగా మారింది. వయసుతో సంబంధం లేకుండా ట్రెజర్‌లా అన్ని రకాలనీ పోగేసి దాచుకునే వారూ బోలెడు మంది. వీళ్లకు తగ్గట్టే.. . పార్టీ చేసుకునే అమ్మాయిలానే పరిమితం కాలేదు బార్బీ. ధైర్యం నూరిపోస్తూ, ప్రోత్సహిస్తూ, స్ఫూర్తి నింపుతూ, మంచి చెబుతూ... ఎన్నో రూపాల్లో వచ్చింది. తొలిసారి దీపావళి థీమ్‌తో దేశీలుక్‌లో వచ్చేసింది. మూన్‌లైట్ బ్లూమ్ లెహెంగాలో ఎర్ర బొట్టు, కళ్లకు కాటుక, చెవులకు పెద్ద జుంకీలు, చేతులకు గాజులతో చూడగానే అచ్చమైన భారతీయ యువతిని గుర్తుకు తెచ్చేస్తోంది. ఈ లుక్‌ని తీర్చిదిద్దింది డిజైనర్ అనితా డోంగరే. దీని కోసం బార్బీ మాతృసంస్థ ‘మ్యాటెల్’ ఏడాదిన్నర క్రితమే ఆమెను సంప్రదించిందట. చిన్న పరిమాణంలో ఆ డ్రెస్‌ను ఆకర్షించేలా తీర్చిదిద్దడం అనితకి సవాలుగానే అనిపించిందట. ఎన్నో స్కెచ్‌లు, డిజైన్ల తరవాత రాజస్థానీ స్ఫూర్తితో నీలిరంగు చోలీ టాప్, ఫ్లోరల్ కోటీ వెస్ట్, లెహెంగాను రూపొందించారు. పూర్తి డ్రెస్‌నీ భారతీయ కళాకారుల నైపుణ్యం ఉట్టిపడేలా మల్లె, దాలియా, కలువ పూల మోటిఫ్‌లతో తీర్చిదిద్దారు. తాజాగా ఆ డ్రెస్‌ని వేసుకుని స్టైల్‌గా సిద్ధమైన బార్బీని మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నట్టు సంస్థ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. దాన్ని చూసి భారతీయ సంప్రదాయం అంతర్జాతీయ వేదికపై మెరుస్తోందని కొందరంటే... ఆధునిక భారతీయ మహిళకు అద్దం పట్టినట్లు ఉందని మరికొందరు అంటున్నారు. విదేశీయులూ ఈ లుక్‌కి ఫిదా అవుతున్నారట. మరి... మీరేమంటారు?



బంగారం-వెండి



7న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	78000	78,220	75,750	75,875	78,050	78,000	78,140	78,200	77,180	77,400
ఆర్నమెంట్	71,800	72,000	71,000	71,200	72,270	72,230	71,850	71,900	71,000	71,200
వెండి (కిలో)	94,097	95,150	95,000	95,200	92,700	92,800	93,200	93,500	94,000	92,000

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,100	7,120
వెండి (గ్రా)	103.00	103.00

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాం ద్వారా పంపవచ్చు.

వెండి బతుకమ్మ... పసిడి గౌరమ్మ!





తెలంగాణ ఆడబిడ్డలు ఆనందంగా జరుపుకొనే పూల పండగ బతుకమ్మ. తంగేడు, గునుగు, గుమ్మడి, తామర... ఇలా ఒకటేమిటి ప్రకృతిలో కనిపించే పూలన్నీ వరుసలో పేర్చి పైన గౌరమ్మను ప్రతిష్ఠించి ఆరాధిస్తారు. ‘బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో’ అంటూ అలసట లేకుండా పాడుతూ, ఆనందంగా పాదాలు కదుపుతూ నృత్యం చేస్తారు. అయితే, మారిన పరిస్థితుల వల్ల అన్ని సార్లూ, అన్ని రకాల పూలూ అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు. ఉద్యోగాలు, ఉపాధి రీత్యా దూరంగా నగరాల్లో, విదేశాల్లో బతుకమ్మ చేసుకునే వారికి పూలు దొరక్కపోవచ్చు. ఇలాంటివారికోసమే వెండి, బంగారు బతుకమ్మలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. వరుసల్లో పూలు పేర్చినట్లుగా డిజైన్ చేసిన వెండి బతుకమ్మలు, పూలనే అందంగా అమర్చుకునే వీలుతో మరికొన్ని రకాలూ వచ్చేశాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే... కొత్తకోడళ్లకు ఇచ్చే బతుకమ్మ వాయనంలో కాగితపు బతుకమ్మలకు బదులుగా ఈ వెండి బతుకమ్మల్ని చేరుస్తున్నారు. వీటికే పసిడి, వెండి లోహలతో చేసిన పువ్వులూ, రాళ్లూ, నవరత్నాలు... వంటి హంగులను చేర్చి కళ్లు తిప్పుకోనివ్వకుండా చేస్తున్నారు. అలాంటి కొన్ని డిజైన్లు ఇవి... మీరూ చూసేయండి. బాగున్నాయి కదూ!

నేటి ట్రెండ్



ఈ పదాలు మర్చిపోతేనే ఉద్యోగం!

ఇంటర్వ్యూలో స్పష్టత ప్రదర్శించడం ఎంతో ముఖ్యం. అలాగే ఎదుటివారికి మీపై సదభిప్రాయం తగ్గకుండా జాగ్రత్తపడటం కూడా ముఖ్యమే. అందుకే కొన్ని పదాలను వీలైనంత తక్కువగా వినియోగించమంటున్నారు కెరియర్ నిపుణులు. తప్పదు అనుకుంటే వాటికి పర్యాయపదాలు మేలు అని చెబుతున్నారు. ఆ పదాలేంటో కూడా వివరిస్తున్నారు.

నో...
ఈ పదాన్ని వీలైనంత నివారించడం మంచిది. మీ అభిప్రాయాన్ని ‘నో’ అని చెప్పడంలో తప్పులేకపోయినా ఇంటర్వ్యూ చేసే వ్యక్తికి మీపై ప్రతికూలభావాన్ని కలిగించొచ్చు. సెలవు రోజుల్లో మీరు అందుబాటులో ఉండటం వీలవుతుందా అని అడిగితే తిరస్కరిస్తూ ‘నో’ అనకుండా, పరిస్థితి తీవ్రతను బట్టి హాజరవ్వడానికి ప్రయత్నిస్తానని చెప్పాలి. ఇలా సానుకూల పదజాలంతో మీ సమాధానాన్ని మార్చగలిగితే చాలు.

కోపం...
ఇది చాలా బలమైన భావోద్వేగం. మీకు నచ్చని నియమాన్ని అవతలివ్యక్తి చెబుతున్నప్పుడు మీ ముఖకవళికల్లో ఈ ఛాయలు ఏమాత్రం కనిపించకూడదు. మీలో రాజీతత్వం లేదనుకునే ప్రమాదం ఉంది. కొన్నిసార్లు మిమ్మల్ని అహంకారం ఉన్న వ్యక్తిగానూ ఊహించుకోవచ్చు. సహనం ఉంటేనే సంస్థలో బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తారనే వాళ్ల నమ్మకానికి మీ కోపం అసహనంగా కనిపిస్తుంది. ఆ ఉద్యోగానికి మీరు అనర్హులని అనుకునే ప్రమాదం కూడా ఉంటుంది.

పర్ఫెక్షనిస్ట్...
మీ బలాలు, బలహీనతల గురించి ప్రశ్నించినప్పుడు ఈ పదాన్ని వినియోగించకూడదు. బాధ్యతలను సక్రమంగా, సకాలంలో పూర్తిచేయగలనని ఆత్మవిశ్వాసంతో చెప్పడానికి ప్రయత్నించాలి. పర్ఫెక్షనిస్ట్‌నని అంటే ఎదుటివారు అతిశయంగా భావించొచ్చు.

నేను...
మీ నైపుణ్యాలు, అనుభవాలు, అర్హతల గురించి చర్చ వస్తే ‘నేను’ అంటూ మీ గురించి చెప్పొచ్చు. టీమ్ వర్క్ గురించి మాట్లాడేటప్పుడు జట్టుతో కలిసి సమష్టిగా పనిపూర్తి చేస్తానని, సహకారం అందించి సంస్థ వృద్ధికి తోడ్పడతానని చెప్పాలి. ఇక్కడ కూడా ప్రతి మాటకు ముందు, వెనక ‘నేను’ అంటూ ఉంటే మీకు టీమ్ స్పిరిట్ లేదనుకుంటారు. వ్యక్తిగత ఎదుగుదలపై మాత్రమే ఆసక్తి ఉందనుకుంటారు.



ఫైర్డ్...
గత ఉద్యోగం నుంచి ‘ఫైర్(తొలగించడం)’ అయ్యానని అనకూడదు. ఆ సంస్థ నుంచి బయటకురావడానికి మీ బాధ్యత ఎంతవరకు ఉందో వివరించాలి. ఆ అనుభవం నుంచి మీరు నేర్చుకున్న పాఠాన్ని ప్రస్తుతం మీ కొత్త బాధ్యతల్లో ఎలా వినియోగించాలని అనుకుంటున్నారో చెప్పాలి. అది ఎదుటివారికి మీపై ప్రతికూలభావాన్ని రానీయకుండా చేస్తుంది.

ఛాంపియన్స్

దూసుకొచ్చింది

గుంటూరు బుల్లెట్

ముకేశ్ నేలవల్లి.. ఇప్పుడు భారత షూటింగ్‌లో మార్మోగుతున్న పేరు. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా ఏడు పతకాలు సొంతం చేసుకున్నాడీ యువ షూటర్. అతను తెలుగువాడే కావడం విశేషం. గగన్ నారంగ్‌కు చెందిన గన్ ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీ నుంచే ఎదిగిన ఈ కుర్రాడు.. నారంగ్ లాగే మేటి షూటర్‌గా పేరు తెచ్చుకునేలా కనిపిస్తున్నాడు. పాఠశాల స్థాయిలో అనుకోకుండా షూటింగ్ సాధన మొదలుపెట్టిన ముకేశ్.. ఇప్పుడు ఆ ఆటలో అత్యున్నత స్థాయిని అందుకునే దిశగా సాగుతున్నాడు.

గుంటూరు క్రీడలు – న్యూస్‌టుడే


ముకేశ్

పెరూలోని లిమాలో ఇటీవలే ముగిసిన ప్రపంచ జూనియర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ 24 పతకాలు సాధిస్తే.. అందులో ముకేశ్ ఏడు గెలవడం విశేషం. 10 మీటర్ల పిస్టల్ టీమ్.. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ టీమ్, వ్యక్తిగత.. 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ టీమ్.. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించిన ముకేశ్.. 25 మీ. స్టాండర్డ్ పిస్టల్, 50 మీ. పిస్టల్ వ్యక్తిగత విభాగాల్లో కాంస్యాలు దక్కించుకున్నాడు. ముకేశ్‌ది గుంటూరులోని శ్రీనగర్. న్యాయవాది అయిన తండ్రి శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలైన తల్లి మాధవి ప్రోత్సాహంతో అతను షూటింగ్‌లో అంచెలంచెలుగా ఎదిగాడు. 8వ తరగతి చదువుతుండగా వేసవి శిబిరంలో షూటింగ్ శిక్షణ తీసుకున్న ముకేశ్.. నెల రోజుల్లోనే జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి ఆ ఆటను కెరీర్‌గా ఎంచుకున్నాడు. స్థానికంగా షూటింగ్ అకాడమీని నడుపుతున్న సుబ్రహ్మణ్యేశ్వరరావు శిక్షణలో మెరుగులు దిద్దుకున్న ముకేశ్.. జాతీయ స్థాయిలో సత్తా చాటి ఖేలో ఇండియా పథకానికి ఎంపికయ్యాడు. గుంటూరులో 10 మీటర్లను దాటి సాధనకు అవకాశం లేకపోవడంతో అతను కొన్ని రోజులు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుని.. ఆపై పుణెలో గగన్ నారంగ్‌కు చెందిన గన్ ఫర్ గ్లోరీ అకాడమీలో చేరాడు. ఖేలో ఇండియా పథకంలో భాగంగా అక్కడ 10 మీటర్ల విభాగంలో ఉచిత శిక్షణ పొందిన ముకేశ్.. 25 మీ, 50 మీలో సొంత ఖర్చుతో సాధన చేశాడు. అందుకోసం బాగా ఖర్చయినా.. తల్లిదండ్రుల ఆదాయంలో ఎక్కువ శాతం ముకేశ్‌కే కేటాయించారు. కరోనా సమయంలో శిక్షణ, సాధన సరిగా సాగక కొంత లయ దెబ్బ తిన్నా.. తర్వాత పుంజుకున్నాడు. గత మూడేళ్లలో జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్స్, ఖేలో ఇండియా క్రీడల్లో పదుల సంఖ్యలో పతకాలు సాధించిన ముకేశ్‌కు ఇటీవలి జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ కెరీర్లో గొప్ప మలుపు. ఆరు విభాగాల్లో 10 పతకాలకు పోటీ పడి ఏడు కైవసం చేసుకున్నాడు. అందులో అయిదు స్వర్ణాలే. 19 ఏళ్ల ముకేశ్ ఇంకో రెండేళ్లు జూనియర్ విభాగంలోనే కొనసాగబోతున్నాడు. తర్వాత సీనియర్ విభాగంలోకి మారి లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ముకేశ్ ప్రస్తుతం కె.ఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ''దేశం తరపున అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణం గెలవాలని ప్రతి క్రీడాకారుడూ కలగంటాడు. నాకు ఒకే టోర్నీలో అయిదు పసిడి పతకాలు గెలిచే అవకాశం రావడం చాలా ప్రత్యేకం. ఇది తర్వాతి టోర్నీల్లో మరింత ఉత్తమ ప్రదర్శన చేసేందుకు స్ఫూర్తినిస్తుంది'' అని ముకేశ్ తెలిపాడు.

భారత జట్టుకు స్వర్ణం

దిల్లీ: జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు సత్తా చాటింది. 50 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో భారత్ స్వర్ణ పతకం సాధించింది. దీపక్ దలాల్, కమల్‌జీత్, రాజ్ చంద్రలతో కూడిన భారత బృందం 1616 పాయింట్లతో అగ్రస్థానం కైవసం చేసుకుంది. అజర్‌బైజాన్ రజతం, అర్మేనియా కాంస్య పతకాలు గెలిచాయి. వ్యక్తిగత విభాగంలో తెలుగుతేజం ముకేశ్ నేలవల్లి కాంస్యం సాధించాడు. గుంటూరుకు చెందిన ముకేశ్‌కు ఈ టోర్నీలో ఇది ఏడో పతకం కావడం విశేషం. మహిళల 50 మీటర్ల పిస్టల్‌లో పరీషా గుప్తా రజతం నెగ్గింది. టీమ్ విభాగంలో సెజల్ కాంబ్లి, కేతన్, కనిష్క దాగర్‌లతో కూడిన భారత మహిళల జట్టు రజతం గెలుచుకుంది. మొత్తంగా ఈ టోర్నీలో భారత్ 13 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలు సహా 24 పతకాలతో నంబర్‌వన్‌గా నిలిచింది. ఇటలీ (13 పతకాలు) రెండు, నార్వే (10) మూడో స్థానాలు సాధించాయి.

మసూద్, షఫీక్ శతకాలు

- పాకిస్థాన్ 328/4
- ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు


మసూద్

ముల్తాన్: సొంత గడ్డపై బంగ్లాదేశ్ చేతిలో వైట్‌వాష్ పరాభవం తర్వాత పాకిస్థాన్ పుంజుకుంది. ఇంగ్లాండ్‌తో మూడు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆ జట్టు శుభారంభం చేసింది. కెప్టెన్ షాన్‌మసూద్ (151; 177 బంతుల్లో 13×4, 2×6), ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (102; 184 బంతుల్లో 10×4, 2×6) సెంచరీలు సాధించడంతో సోమవారం ఆట చివరికి పాకిస్థాన్ 328/4తో మెరుగైన స్థితిలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన పాక్.. ఆరంభంలోనే సయిమ్ అయూబ్ (4) వికెట్ కోల్పోయినప్పటికీ.. మసూద్, షఫీక్ జోడీ సాధికారికంగా ఆడి జట్టును 261/1తో తిరుగులేని స్థితికి చేర్చింది. చివరి సెషన్లో ఇంగ్లాండ్ 3 వికెట్లు పడగొట్టి కాస్త ఉపశమనం పొందింది. పేలవ ఫామ్‌లో ఉన్న బాబర్ అజామ్ 30 పరుగులు చేసి ఔట్ కాగా.. సాద్ షకీల్ (35), నసీమ్ షా (0) క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లలో గస్ అట్కిన్సన్ (2/7) ఆకట్టుకున్నాడు.

శ్రీలంక పూర్తి స్థాయి కోచ్‌గా జయసూర్య

కొలంబో: మాజీ కెప్టెన్ సనత్ జయసూర్య శ్రీలంక జట్టుకు పూర్తిస్థాయి కోచ్‌గా నియమితుడయ్యాడు. 2026 టీ20 ప్రపంచకప్ వరకు జయసూర్య చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తాడని శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) సోమవారం ప్రకటించింది. ఈ ఏడాది జులైలో జయసూర్యను తాత్కాలిక కోచ్‌గా ఎస్ఎల్‌సీ నియమించింది. భారత్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌పై శ్రీలంక మెరుగైన ప్రదర్శన నేపథ్యంలో జయసూర్యకు పూర్తి స్థాయిలో బాధ్యతలు అప్పగించింది. జయసూర్య ఆధ్వర్యంలో గత 27 ఏళ్లలో తొలిసారిగా భారత్‌తో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను శ్రీలంక గెలుచుకుంది. ఇంగ్లాండ్ గడ్డపై టెస్టు మ్యాచ్‌లో నెగ్గింది. సొంతగడ్డపై న్యూజిలాండ్‌ను 2-0తో చిత్తుచేసి టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది.

మహిళల టీ20 ప్రపంచకప్

ఎదురులేని ఇంగ్లాండ్

దక్షిణాఫ్రికాపై విజయం


ఎకిల్‌స్టోన్

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌కు వరుసగా రెండో విజయం. సోమవారం జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో ఆ జట్టు 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా పరుగుల కోసం కష్టపడింది. 6 వికెట్లకు 124 పరుగులే చేయగలిగింది. ఓపెనర్ వోల్వార్ట్ (42; 39 బంతుల్లో 3×4) టాప్ స్కోరర్. ఆమె.. బ్రిట్స్ (13)తో తొలి వికెట్‌కు 31, అనెకె బాష్ (18)తో రెండో వికెట్‌కు 40 పరుగులు జోడించింది. మరిజేన్ కాప్ 26 పరుగులు చేసింది. సోఫీఎకిల్‌స్టోన్ (2/15), సారా గ్లెన్ (1/18), చార్లీ డీన్ (1/25) దక్షిణాఫ్రికాను కట్టడి చేశారు. నాట్ సీవర్ (48 నాటౌట్; 36 బంతుల్లో 6×4), డానీ వ్యాట్ (43; 43 బంతుల్లో 4×4) రాణించడంతో లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 19.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఛేదన ఆఖరి ఓవర్‌కు సాగినా మ్యాచ్ ఎప్పుడూ ఇంగ్లాండ్ నియంత్రణలోనే ఉంది. ఇన్నింగ్స్ మధ్యలో సాధించాల్సిన రన్‌రేట్ పెరిగినా.. నాట్ సీవర్ చక్కని బ్యాటింగ్‌తో జట్టును లక్ష్యం దిశగా నడిపించింది. డానీ వ్యాట్‌తో మూడో వికెట్‌కు ఆమె 64 పరుగులు జోడించింది. ఎకిల్‌స్టోన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

సంక్షిప్త స్కోర్లు... దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: 124/6 (లారా వోల్వార్ట్ 42, మరిజేన్ కాప్ 26, అనెరీ20, ఆనెకె బాష్ 13; ఎకిల్‌స్టోన్ 2/15, సారా గ్లెన్ 1/18, చార్లీ డీన్ 1/25)

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: 19.2 ఓవర్లలో 125/3 (నాట్ సీవర్ 48 నాటౌట్, డానీ వ్యాట్ 43, క్యాప్సీ 19; కాప్ 1/17, నడైన్ డీక్లెర్క్ 1/23)

సింధు పునరాగమనం


సింధు

వాంటా (ఫిన్లాండ్): భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు బ్యాడ్మింటన్‌లో పునరాగమనం చేయనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో విఫలమయ్యాక విరామం తీసుకున్న సింధు.. ఆర్కిటిక్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీ బరిలో దిగనుంది. మంగళవారం ప్రారంభమయ్యే ఈ టోర్నీలో సింధు ఆరో సీడ్‌గా ఆడనుంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో మిచెల్ లీ (అమెరికా)తో సింధు తలపడనుంది. వోనీ లీ (జర్మనీ)తో ఆకర్షి కశ్యప్, సుంగ్ యున్ (చైనీస్ తైపీ)తో మాళవిక బాన్సోద్ తమ పోరాటం ప్రారంభిస్తారు. పారిస్‌లో త్రుటిలో పతకం చేజార్చుకున్న స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ సైతం పునారగమనం చేయనున్నాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో రస్ముస్ గెమ్కీ (డెన్మార్క్)తో లక్ష్యసేన్ పోటీపడనున్నాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో నటాషా- సారా (డెన్మార్క్) జంటతో రుతుపర్ణ పాండా- శ్వేతపర్ణ పాండా జోడీ తలపడనుంది.

లంక ఒకప్పటి జట్టు కాదు


షెఫాలి వర్మ

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్‌లో తమ తర్వాతి ప్రత్యర్థి శ్రీలంకను తాము తేలిగ్గా తీసుకునే అవకాశమే లేదని భారత జట్టు ఓపెనర్ షెఫాలి వర్మ పేర్కొంది. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన భారత్.. రెండో మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన శ్రీలంకను బుధవారం ఢీకొనబోతోంది. ఈ నేపథ్యంలో షెఫాలి మాట్లాడుతూ.. ''ఒకప్పుడు శ్రీలంక జట్టులో చమరి ఆటపట్టునే ఎక్కువ పరుగులు చేస్తూ, వికెట్లు తీస్తూ ఉండేది. కానీ ఆసియా కప్‌లో జట్టంతా సమష్టిగా రాణించింది. ఆ జట్టు ఎంతో మెరుగైంది. అందుకే ఆసియా కప్‌లోనూ విజేతగా నిలిచింది'' అని షెఫాలి చెప్పింది. మరోవైపు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మాట్లాడుతూ.. తన దృష్టిలో ఆస్ట్రేలియా మ్యాచ్ అన్నింటికంటే కీలకమని అభిప్రాయపడింది ''ఒక క్రికెటర్‌గా ప్రతి మ్యాచ్ కీలకమే. వంద శాతం ప్రదర్శన ఇవ్వాల్సిందే. మా గ్రూప్‌లో శ్రీలంక కూడా మెరుగైన జట్టే. కానీ ఆస్ట్రేలియాతో మ్యాచ్ అంటే చిన్న తప్పు కూడా చేయడానికి వీల్లేదు'' అని స్మృతి చెప్పింది.

టోగోతో భారత్ డేవిస్ కప్ పోరు

లండన్: డేవిస్ కప్ ప్రపంచ గ్రూపు-1 ప్లేఆఫ్స్‌లో టోగోతో భారత్ తలపడనుంది. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సోమవారం ప్రకటించిన డ్రా ప్రకారం వచ్చే ఏడాది జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 మధ్యలో డేవిస్ కప్ పోరు ఉంటుంది. ప్రపంచ గ్రూపు-1, గ్రూపు-2 ప్లేఆఫ్స్‌లో 52 దేశాలు తలపడనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరులో స్టాక్‌హోమ్‌లో జరిగిన ప్రపంచ గ్రూపు-1 పోరులో భారత్ 0-4తో స్వీడన్ చేతిలో పరాజయం చవిచూసింది. టోగోపై విజయం సాధిస్తే భారత్ ప్రపంచ గ్రూప్-2 పోరుకు అర్హత సాధిస్తుంది.



ప్రొడునోవా క్వీన్..

ఆటను వీడెన్

జిమ్నాస్టిక్స్‌కు దీప కర్మాకర్ గుడ్‌బై

దిల్లీ


దీప

ఓ భారత అథ్లెట్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం తేలికైన విషయం కాదు. చాలా కొద్ది మందికే ఆ అవకాశం వస్తుంది. అదే జిమ్నాస్టిక్స్‌లో ఒలింపిక్స్‌లో ఆడడం అంటే చాలా చాలా కష్టం. అలాంటి నేపథ్యంలో ఆమె ఒలింపిక్స్‌లో పోటీపడ్డ తొలి భారత మహిళగా రికార్డు సృష్టించడమే కాదు, అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూ రియో ఒలింపిక్స్ (2016)లో ఏకంగా నాలుగో స్థానం సాధించింది. వెంట్రుక వాసిలో పతకం కోల్పోయినా.. దేశ ప్రజల మనసులు గెలిచిన ఆ జిమ్నాస్ట్ దీప కర్మాకర్. పోటీ పడితే చాలు అన్నట్లు కాకుండా పతకం కోసం అత్యంత ప్రమాదకరమైన ప్రొడునోవా వాల్ట్ చేసింది. భారత జిమ్నాస్టిక్స్‌పై చెరగని ముద్ర వేసిన ఈ త్రిపుర అమ్మాయి సోమవారం తన కెరీర్‌ను ముగించింది. ఆట నుంచి రిటైరవుతున్నట్లు ప్రకటించింది. ''బాగా ఆలోచించాక జిమ్నాస్టిక్స్ నుంచి రిటైర్‌కావాలని నిర్ణయించుకున్నా. ఇది తేలికైన నిర్ణయం కాదు. కానీ ఇదే సరైన సమయం అనిపించింది. జిమ్నాస్టిక్స్ నా జీవితంలో ముఖ్య భాగం'' అని దీప కర్మాకర్ చెప్పింది. భవిష్యత్తులో కోచ్ కావాలనుకుంటున్నట్లు తెలిపింది. ''జిమ్నాస్ట్‌గా నేను సాధించిన ఘనతలకు గర్విస్తున్నా. ప్రపంచ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం, పతకాలు గెలవడం, ముఖ్యంగా రియో ఒలింపిక్స్‌లో ప్రొడునోవా వాల్ట్ తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి'' అని ఆమె పేర్కొంది.

ఆరేళ్ల వయసులో ఆటలో అడుగుపెట్టిన దీప.. సరైన సౌకర్యాలు లేకున్నా కోచ్‌లు సోమా నంది, బిశ్వేశ్వర్ నందిల శిక్షణలో తన నైపుణ్యాలకు పదును పెట్టుకుంది 2008లో జూనియర్ నేషనల్స్‌లో విజేతగా నిలవడంతో ఆమె విజయయాత్ర మొదలైంది. 2014 కామన్వెల్త్ క్రీడల్లో వాల్ట్ కాంస్యం గెలవడంతో దీప వెలుగులోకి వచ్చింది. కామన్వెల్త్ క్రీడల్లో పతకం గెలిచిన భారత తొలి జిమ్నాస్ట్ ఆమె. ఆ తర్వాత 2015 ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచిన ఆమె.. 2015 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో అయిదో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత రియో ఒలింపిక్స్‌లో ప్రదర్శనతో దీప పేరు మార్మోగిపోయింది. రియో తర్వాత గాయాలు, శస్త్రచికిత్సలతో ఆమె చాలా ఇబ్బందిపడింది. అయితే బలంగా పుంజుకున్న దీప 2018లో తుర్కియేలో జరిగిన ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో పసిడి పతకం గెలిచింది. ఆసియా జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ దీప బంగారు పతకాన్ని గెలుచుకుంది. దేశంలో ఎందరో యువ జిమ్నాస్ట్‌లకు స్ఫూర్తిగా నిలిచిన ఆమె.. పద్మశ్రీ, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, అర్జున అవార్డులను పొందింది.

ఏంటీ ప్రొడునోవా?

జిమ్నాస్ట్ పరుగెత్తుకుంటూ వచ్చి గాల్లో చాలా ఎత్తుకు ఎగిరి రెండు సోమర్‌సాల్ట్‌లు కొట్టి, సురక్షితంగా ల్యాండ్ కావడమే ప్రొడునోవా వాల్ట్. ప్రపంచవ్యాప్తంగా జిమ్నాస్ట్‌లు ఈ వాల్ట్‌ను అత్యంత ప్రమాదకరమైందిగా, క్లిష్టమైందిగా పరిగణిస్తారు. ప్రయత్నించిన వాళ్లు చాలా కూడా తక్కువే. వాల్ట్ ఆఫ్ డెత్‌గా పేరున్న ఈ విన్యాసాన్ని చరిత్రలో దీప కర్మాకర్ సహా అయిదుగురు అమ్మాయిలు మాత్రమే విజయవంతంగా చేయగలిగారు. ఈ మాత్రం తేడా వచ్చినా జిమ్నాస్ట్‌కు తీవ్రమైన గాయం కావొచ్చు లేదా మరణం సంభవించవచ్చు. రష్యాకు చెందిన ఎలెనా ప్రొడునోవా 1999లో మొదటిసారి ఈ విన్యాసాన్ని చేసింది. ఆమె పేరే ఈ వాల్ట్‌కు పెట్టారు. 2016 ఒలింపిక్స్‌లో దీప కేవలం 0.15 పాయింట్ల తేడాతో కాంస్య పతకాన్ని కోల్పోయింది.

ఇప్పుడు ఎక్కువ స్పిన్ చేస్తున్నా: వరుణ్

గ్వాలియర్: సైడ్‌స్పిన్ నుంచి ఓవర్ స్పిన్‌కు మారడం వల్లే తనకు మంచి ఫలితాలు వస్తున్నాయని మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అన్నాడు. ''నేను గతంలో సైడ్‌స్పిన్ బౌలర్‌ని. ఇప్పుడు పూర్తిగా ఓవర్ స్పిన్ బౌలర్‌గా మారిపోయా. స్పిన్ బౌలింగ్‌కు సంబంధించి ఇది సూక్ష్మమైన సాంకేతిక అంశం. కానీ నాకు రెండేళ్లు పట్టింది. మారిన నా బౌలింగ్‌ను టీఎన్‌పీఎల్, ఐపీఎల్‌లో ప్రయత్నించి చూశా. ఇందులో మానసిక కోణం కూడా ఉంటుంది. కానీ సాంకేతిక అంశంపైనే ఎక్కువగా శ్రమించా'' అని చెప్పాడు. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌కు వరుణ్ టీమ్‌ఇండియాలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ''ఎప్పుడు జట్టును ప్రకటించినా.. 'నా పేరు ఎందుకు లేదు అనుకునేవాణ్ని'. చోటు దక్కకపోవడం గురించి ఆలోచించేవాణ్ని. అది నాలో ప్రేరణ కలిగించేది. పునరాగమనం కోసం ఏదైనా చేయాలన్న పట్టుదల పెరిగింది. చాలా దేశవాళీ మ్యాచ్‌లు ఆడడం మొదలుపెట్టా. అది నాకు ఉపయోగపడింది'' అని వరుణ్ అన్నాడు.

నితీశ్, మయాంక్.. చాలా రేటు గురూ!

దిల్లీ: నితీశ్‌కుమార్ రెడ్డి, మయాంక్ యాదవ్.. ఈ ఏడాది ఐపీఎల్‌లో చక్కటి ప్రదర్శనతో వెలుగులోకి వచ్చిన యువ కిశోరాలు. తెలుగు కుర్రాడైన నితీశ్.. సన్‌రైజర్స్ తరపున ఆల్‌రౌండ్ మెరుపులతో ఆకట్టుకున్నాడు. ఇక దిల్లీకి చెందిన మయాంక్ యాదవ్ లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్ తరపున ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనే తన పేస్‌తో ఎంత పేరు తెచ్చుకున్నాడో తెలిసిందే. వీళ్లిద్దరూ ఒకే రోజు అంతర్జాతీయ అరంగేట్రం చేయడం విశేషం. ఆదివారం బంగ్లాదేశ్‌తో తొలి టీ20ల్లో తొలిసారి భారత జట్టు జెర్సీ తొడుక్కున్నారు ఈ కుర్రాళ్లు. ఈ మ్యాచ్‌లో మయాంక్ బౌలింగ్‌లో అదరగొడితే.. నితీశ్ బ్యాటర్‌గా ఆడిన కొన్ని బంతుల్లో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. గత ఐపీఎల్ సీజన్లో తక్కువ రేటుకు ఆయా ఫ్రాంఛైజీల సొంతమైన ఈ కుర్రాళ్లు వచ్చే సీజన్ కోసం ఎక్కువ రేటు పలకడం ఖాయం. వీరిని అట్టిపెట్టుకోవాలంటే ఫ్రాంఛైజీలు భారీ మొత్తమే వెచ్చించాల్సి ఉంటుంది. ఇన్నాళ్లూ అన్‌క్యాప్డ్ ఆటగాళ్లుగా ఉన్న నితీశ్, మయాంక్.. ఇప్పుడు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం వారి రేటు మారిపోనుంది. ఈసారి మెగా వేలం రాబోతున్న నేపథ్యంలో గరిష్ఠంగా అయిదుగురు ఆటగాళ్లను మాత్రమే ఫ్రాంఛైజీలు అట్టిపెట్టుకోవాల్సి ఉంటుంది. మిగతా వాళ్లు వేలంలోకి వెళ్తారు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ నితీశ్‌ను, లఖ్‌నవూ మయాంక్‌ను తమతోనే కొనసాగించాలంటే వారిపై చెరో రూ.11 కోట్లు ఖర్చు చేయాలి. వీళ్లిద్దరూ వేలంలోకి వెళ్లినా మంచి రేటే పలుకుతారని అంచనా.


మయాంక్, నితీశ్

అరుంధతికి అయోగ్యత పాయింటు

దుబాయ్: పాకిస్థాన్‌పై అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు తొలి విజయాన్ని అందించిన పేస్ బౌలర్ అరుంధతి రెడ్డిని ఐసీసీ మందలించింది. పాక్ బ్యాటర్ నిదా దర్‌ను ఔట్ చేసిన అనంతరం ఆమెకు వీడ్కోలు పలుకుతూ సంబరాలు చేసుకోవడం ద్వారా అరుంధతి ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్లు ఐసీసీ పేర్కొంది. ఆమెను మందలించడంతో పాటు ఒక అయోగ్యత పాయింటును ఇచ్చినట్లు వెల్లడించింది. అరుంధతి తన తప్పును అంగీకరించినట్లు ఐసీసీ తెలిపింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఈ తెలుగమ్మాయి 19 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెలుచుకుంది.

యువ భారత్ 316/5


నిత్య పాండ్య

చెన్నై: నిత్య పాండ్య (94; 135 బంతుల్లో 12×4) సత్తాచాటడంతో ఆస్ట్రేలియా-19 జట్టుతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో యువ భారత్ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. సోమవారం ప్రారంభమైన మ్యాచ్‌లో బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత అండర్-19 జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 5 వికెట్లకు 316 పరుగులు సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన యువ భారత్ రెండో ఓవర్లోనే ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (3) వికెట్ కోల్పోయింది. మరో ఓపెనర్ విహాన్ మల్హోత్రా (10) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరిగినా.. నిత్య, కార్తికేయ (71; 99 బంతుల్లో 9×4, 1×6) ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌ను నిర్మించారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 112 పరుగులు జోడించి భారత్‌ను పటిష్ఠ స్థితికి చేర్చారు. 13 పరుగుల వ్యత్యాసంలో నిత్య, కార్తికేయ ఔటైనా.. కెప్టెన్ సోహమ్ పత్వర్ధన్ (61 బ్యాటింగ్; 120 బంతుల్లో 6×4), నిఖిల్ కుమార్ (61; 93 బంతుల్లో 7×4) ఆ ప్రభావం జట్టుపై పడనీయలేదు. వీరిద్దరు కలిసి అయిదో వికెట్‌కు 105 పరుగులు జోడించి భారత్‌ను మెరుగైన స్థితికి చేర్చారు.

అలాస్కన్ నైట్స్‌కు తొలి ఓటమి


ప్రజ్ఞానంద

లండన్: గ్లోబల్ చెస్ లీగ్‌లో అలాస్కన్ నైట్స్ తొలి ఓటమిని చవిచూసింది. తొలి అయిదు మ్యాచ్‌ల్లో నెగ్గిన ఆ జట్టు సోమవారం తన ఆరో మ్యాచ్‌లో 7-9తో అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ చేతిలో కంగుతింది. జోంగ్యిపై హు ఇఫాన్ (అల్పైన్), కష్లిన్‌స్కయాపై కేతిరనా లాగ్నో (అల్పైన్) విజయం సాధించారు. దేనియల్ దర్దాపై నిహాల్ సరీన్ (నైట్స్) గెలిచాడు. కార్ల్‌సన్‌తో గేమ్‌ను అనీష్ గిరి (నైట్స్), ప్రజ్ఞానందతో గేమ్‌ను అబ్దుసతరోవ్ (నైట్స్), రిచర్డ్ ర్యాపోర్ట్‌తో గేమ్‌ను మమెద్యరోవ్ (నైట్స్) డ్రాగా ముగించారు. మరో మ్యాచ్‌లో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ 10-8తో ముంబా మాస్టర్స్‌ను ఓడించింది. లాగ్రేవ్‌పై అలీరెజా (కింగ్స్), హంపిపై అలెగ్జాండ్రా (కింగ్స్) గెలిచారు. వీ యిపై విదిత్ (ముంబా), వాలెంటినాపై హారిక (ముంబా) నెగ్గారు. స్విడ్లర్‌తో పోరును తైమూర్ (నైట్స్), జవోఖిర్‌తో గేమ్‌ను రౌనక్ డ్రాగా ముగించారు.

హరియాణా, జమ్మూ కశ్మీర్
భవిత తేలేది నేడే

చండీగఢ్, శ్రీనగర్: హరియాణా, జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభం కానుంది. 8 గంటలకు ప్రారంభమయ్యే కౌంటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు చేశామని అధికారులు వెల్లడించారు.

■ హరియాణాలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను కల్పించామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పంకజ్ అగర్వాల్ తెలిపారు.

■ మూడోసారి అధికారంలోకి వస్తామని భాజపా ధీమా వ్యక్తం చేస్తుండగా అధికారం తమదేననే ఆశతో కాంగ్రెస్ ఉంది. ఎగ్జిట్ పోల్స్ అన్నీ దాదాపుగా కాంగ్రెస్‌కే మొగ్గు చూపాయి. ఈ నేపథ్యంలో ఫలితాలపై పార్టీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

■ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలున్నా ఈసారి పోటీ మాత్రం జాతీయ పార్టీలైన భాజపా, కాంగ్రెస్‌ల మధ్యే ప్రధానంగా సాగింది.

■ హరియాణాలోని 90 నియోజకవర్గాల్లో 1,031 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అందులో 464 మంది స్వతంత్రులు. 101 మంది మహిళలు. ఈ నెల 5వ తేదీన ఇక్కడ పోలింగ్ జరిగింది.

కశ్మీర్‌లో.. జమ్మూ కశ్మీర్‌లోనూ మంగళవారం ఉదయమే కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఇక్కడి 90 నియోజకవర్గాల్లో సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1న మూడు విడతల్లో పోలింగ్ జరిగింది. కౌంటింగ్ జరిగే 20 జిల్లా కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

■ 90 నియోజకవర్గాల్లో మొత్తం 873 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 63.45 శాతం పోలింగ్ జరిగింది.




ఈ మూడు లక్షణాలు ఉంటేనే ఉన్నత జీవితం

ప్రతి ఒక్కరూ గొప్ప జీవితాన్ని కోరుకుంటారు. కానీ కొందరు మాత్రమే దాన్ని సొంతం చేసుకుంటారు. దీనికి కారణం చాలా మంది తమ జీవితం సులభంగా గడిచిపోవాలని, ఎలాంటి సమస్యలూ రాకూడదని కోరుకోవడమే. కానీ జీవితమంటేనే సవాళ్లమయం. వాటిని ఎదుర్కొని ముందుకెళ్లే ధైర్యం, అదే సమయంలో విలువలకు కట్టుబడి ఉండే నిబద్ధత, యాదృచ్ఛికంగా బతికేయకుండా ప్రతిరోజూ క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా పనిచేసే స్వభావం.. ఈ మూడు లక్షణాలు ఉన్నవారే ఉన్నత జీవితాన్ని పొందుతారు.

– బి.ఎస్.గుప్తా, యోగా శిక్షకులు

మైక్రోఆర్ఎన్ఏ ఆవిష్కర్తలకు
వైద్య నోబెల్



స్టాక్‌హోమ్: జన్యుపదార్థంలోని చిన్నపాటి తునకలైన మైక్రో ఆర్ఎన్ఏను కనుగొన్న అమెరికన్ శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌లు ఈ ఏడాది వైద్య రంగంలో నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. క్యాన్సర్ చికిత్సలో కొత్త మార్గాలకు ఈ ఆవిష్కారం దోహదపడనుంది. కణ స్థాయిలో జన్యువుల పనితీరును మార్చేసే సామర్థ్యం మైక్రోఆర్ఎన్ఏకు ఉంది. ఆంబ్రోస్, రవ్‌కున్‌ల పరిశోధన.. జీవులు ఎలా అభివృద్ధి చెందుతాయి.. ఎలా పని చేస్తాయి వంటి అంశాలను అర్థం చేసుకోవడంలో కీలకంగా మారుతోందని నోబెల్ ఎంపిక కమిటీ సోమవారం స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో పేర్కొంది. ఆంబ్రోస్.. ప్రస్తుతం మసాచుసెట్స్ విశ్వవిద్యాలయ మెడికల్ స్కూల్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఉండగా మైక్రో ఆర్ఎన్ఏపై పరిశోధనలు చేశారు. రవ్‌కున్.. ప్రస్తుతం హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో జన్యుశాస్త్ర ప్రొఫెసర్‌గా ఉన్నారు. మసాచుసెట్స్ జనరల్ ఆసుపత్రితోపాటు హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో ఆయన పరిశోధనలు సాగించారు. నోబెల్ పురస్కారం కింద దక్కే 10 లక్షల డాలర్లను విజేతలిద్దరికీ పంచుతారు.



ఏమిటీ పరిశోధన?

ఆంబ్రోస్, రవ్‌కున్‌లు తమ పరిశోధన ద్వారా జన్యు నియంత్రణ అనే కొత్త సూత్రాన్ని వెలుగులోకి తెచ్చారు. మానవులు సహా బహుళ కణజీవులకు ఇది చాలా ముఖ్యం. నిజానికి ఈ శాస్త్రవేత్తలిద్దరూ జన్యుపరిణామాలను నియంత్రిస్తూ, తద్వారా సరైన సమయంలో కణాలు వృద్ధి చెందేలా చూసే జన్యువులపై తొలుత ఆసక్తి ప్రదర్శించారు. ఇందుకోసం వారు జన్యు మార్పిడి చేసిన రెండు రకాల కీటకాలపై పరిశోధన చేశారు. వీటిలో ఉత్పరివర్తన చెందిన జన్యువులు, వాటి పాత్రను గుర్తించాలనుకున్నారు. అంతిమంగా.. జన్యువులను మైక్రోఆర్ఎన్ఏ నియంత్రిస్తున్నట్లు కనుగొన్నారు. కోట్ల సంవత్సరాల్లో జీవులు పరిణామక్రమం చెందడానికి ఈ వ్యవస్థ దోహదపడినట్లు తేల్చారు.

ప్రయోజనాలివీ..

కణ స్థాయిలో జన్యువుల పనితీరును నియంత్రించడంలో సాయపడటం ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధుల చికిత్సకు మైక్రోఆర్ఎన్ఏ కొత్త మార్గాలను తెరిచింది. ఇది కొత్త ప్రొటీన్ల తయారీ సూచనలను అందించగలదు. తద్వారా కొత్త మందుల అభివృద్ధికి ఉపయోగపడగలదు. బయోమార్కర్‌గానూ సేవలు అందించగలదు. 'కణాల్లోని జన్యువుల పనితీరును మైక్రోఆర్ఎన్ఏ మార్చగలదు. క్యాన్సర్‌ను ఉదాహరణగా తీసుకుంటే.. కాలక్రమంలో ఒక నిర్దిష్ట జన్యువు మార్పు చెందే అవకాశం ఉంది. తద్వారా దాని క్రియాశీలత పెరుగుతుంది. ఇది క్యాన్సర్‌కు దారితీయవచ్చు. దీనికి విరుగుడుగా.. ఈ జన్యువుకు సంబంధించిన చర్యలను మార్చే వీలున్న మైక్రోఆర్ఎన్ఏను క్యాన్సర్ కణాల్లోకి చేరవేయాలి. తద్వారా ఆ జన్యు చర్యలను నిలువరించొచ్చు'' అని లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీ పరిశోధకురాలు క్లారీ ఫ్లెచర్ తెలిపారు.

స్వీడన్‌కు చెందిన దిగ్గజ శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వీలునామా మేరకు నోబెల్ పురస్కారాలు ఏర్పాటయ్యాయి. సోమవారం వైద్య విభాగంతో అవార్డుల ప్రకటన మొదలైంది. మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రం, గురువారం సాహిత్య విభాగాల్లో విజేతలను ప్రకటిస్తారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని, ఈ నెల 14న ఆర్థికశాస్త్రంలో పురస్కార గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ జయంతిని పురస్కరించుకొని ఏటా డిసెంబర్ 10న ఈ పురస్కారాలు అందిస్తారు. వైద్యశాస్త్రంలో ఇప్పటివరకు 227 మంది నోబెల్ అందుకున్నారు. ఇందులో 13 మంది మహిళలు ఉన్నారు.

లెఫ్టినెంట్ గవర్నర్‌కు
ఆ అధికారం సమర్థనీయమేనా?

- చర్చనీయాంశమైన జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి నామినేటెడ్ ఎమ్మెల్యేల ఎంపిక

శ్రీనగర్/దిల్లీ: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతున్న సమయంలోనే జమ్మూకశ్మీర్‌లో నామినేటెడ్ ఎమ్మెల్యేల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏ పక్షానికీ స్పష్టమైన ఆధిక్యం లభించదని, హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చనే అంచనాలు బలంగా వినిపిస్తున్న వేళ... ప్రభుత్వ ఏర్పాటులో అయిదుగురు నామినేటెడ్ ఎమ్మెల్యేలు అత్యంత కీలకంగా మారే అవకాశం ఉంది. వీరిని లెఫ్టినెంట్ గవర్నర్ నియమిస్తే కనుక అది భాజపాకే లబ్ధికలిగిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



అయితే, మంత్రి మండలి సిఫార్సు లేకుండానే నామినేటెడ్ ఎమ్మెల్యేలను నియమించే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉంటుందా అనేది ప్రధాన ప్రశ్న. దీనికి అనుకూల, ప్రతికూల వాదనలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. నామినేటెడ్ ఎమ్మెల్యేలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రాంతీయ పక్షాలైన నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) సోమవారం హెచ్చరించాయి.


కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. అయిదుగురు నామినేటెడ్ ఎమ్మెల్యేలతో శాసనసభలో సభ్యుల సంఖ్య 95కి పెరుగుతుంది. ఎన్నికైన శాసనసభ్యుల మాదిరిగా నామినేటెడ్ సభ్యులకూ ఓటు హక్కు కల్పిస్తే ప్రభుత్వ ఏర్పాటుకు 48 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్నికల ఫలితాల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించని పక్షంలో నామినేటెడ్ ఎమ్మెల్యేలు ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత కీలకం అవుతారు.

నామినేటెడ్ సభ్యుల నియామకంపై న్యాయ నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో... ప్రభుత్వ ఏర్పాటులో నామినేటెడ్ ఎమ్మెల్యేలు నిర్వహించే పాత్రపై స్పష్టత లేదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అశ్వనీ కుమార్ దూబే తెలిపారు. అయితే, పుదుచ్చేరిలో లెఫ్టినెంట్ గవర్నర్ ముగ్గురు నామినేటెడ్ సభ్యులను నియమించడాన్ని 2018 తీర్పులో సుప్రీంకోర్టు సమర్థించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న జమ్మూకశ్మీర్ తిరిగి రాష్ట్ర హోదాను పొందినట్లయితే ఈ ప్రశ్నే తలెత్తదని సీనియర్ న్యాయవాది శంకర నారాయణ అభిప్రాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా వస్తుందని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తెలిపిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఎన్నికల ఫలితాలు రాకుండానే నామినేట్ సభ్యులను లెఫ్టినెంట్ గవర్నర్ నియమించడంపై చర్చించడం తొందరపాటే అవుతుందని దిల్లీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎస్.ఎన్.ధింగ్రా అభిప్రాయపడ్డారు.

పశ్చిమాసియా స్వరూపాన్నే మార్చేస్తాం

- ఇజ్రాయెల్‌కు ఇది అస్తిత్వ యుద్ధం
- నెతన్యాహు కీలక వ్యాఖ్యలు

టెల్‌అవీవ్/జెరూసలెం: గాజాతో యుద్ధానికి ఏడాది పూర్తయిన వేళ.. పశ్చిమాసియా భద్రతా స్వరూపాన్నే మార్చేయనున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ భవిష్యత్తు కోసం ఇది తప్పనిసరి అని పేర్కొన్నారు. అక్టోబరు 7 తరహా దాడులు ముమ్ముందు పునరావృతం కాకుండా ఉండాలంటే భద్రతా స్వరూపాన్ని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం జరిగిన ప్రత్యేక క్యాబినెట్ సమావేశంలో నెతన్యాహు మాట్లాడారు. ఈ సందర్భంగా యుద్ధాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ఇది ఇజ్రాయెల్ అస్తిత్వ యుద్ధమని ప్రకటించారు. "ఇరాన్ దుష్టశక్తులపై ఎదురుదాడి మన భవిష్యత్తుకు, భద్రతకు తప్పనిసరి. లక్ష్యాలన్నీ పూర్తయిన తర్వాతే యుద్ధాన్ని ముగిస్తాం. అప్పటివరకు ఆపే ప్రసక్తే లేదు" అని పేర్కొన్నారు. గతేడాది అక్టోబరు 7న జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సోమవారం ఇజ్రాయెల్ ఘనంగా నివాళులు అర్పించింది. సంస్మరణ కార్యక్రమాలు జరుగుతున్న సమయంలోనే గాజా నుంచి టెల్ అవీవ్, దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ 4 రాకెట్లు ప్రయోగించింది. అటు లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా 35కుపైగా రాకెట్లతో ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాలపై విరుచుకుపడింది.



మాల్దీవులతో బంధం శతాబ్దాల నాటిది

- ప్రధాని మోదీ



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ అయిన మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు

దిల్లీ: భారత్, మాల్దీవుల బంధానికి 'అభివృద్ధి సహకారం' మూలస్తంభమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మాల్దీవుల అవసరాలకు దిల్లీ ప్రాధాన్యమిస్తూ వస్తోందని గుర్తుచేశారు. భారత పర్యటనకు వచ్చిన ఆ దేశాధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుతో దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో మోదీ సోమవారం భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృత స్థాయిలో సమాలోచనలు జరిపారు. భారత్, మాల్దీవుల బంధం శతాబ్దాలనాటిదని మోదీ పేర్కొన్నారు. ప్రతి సంక్షోభంలోనూ ఆ దేశానికి తొలుత ఆపన్నహస్తం అందిస్తున్నది దిల్లీయేనని గుర్తుచేశారు. మాల్దీవులకు తాజాగా 40 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. భారత్ సహకారంతో మాల్దీవుల్లోని హనిమధూ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్తగా నిర్మించిన రన్‌వేను ముయిజ్జు, మోదీ సంయుక్తంగా వర్చువల్ విధానంలో ప్రారంభించారు. మరోవైపు- మాల్దీవుల్లో రూపే కార్డు చెల్లింపుల సేవలు కూడా మొదలయ్యాయి. ఆర్థిక, పర్యాటక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం అయ్యేందుకు రూపే కార్డు సేవలు దోహదపడనున్నాయి. భారత్ సహకారంతో మాల్దీవుల్లో తలపెట్టిన పలు ఇతర అభివృద్ధి ప్రాజెక్టులనూ మోదీ, ముయిజ్జు సంయుక్తంగా ప్రారంభించారు. ఎగ్జిమ్ బ్యాంకు సౌజన్యంతో నిర్మించిన 700 సామాజిక గృహ యూనిట్లను ఆ దేశానికి భారత్ అప్పగించింది. విదేశీ మారక నిల్వల కొరతను అధిగమించడంలో మాల్దీవులకు దోహదపడేలా ఆ దేశంతో కరెన్సీ మార్పిడి ఒప్పందాన్ని దిల్లీ కుదుర్చుకుంది. మాల్దీవుల్లో ఓడరేవులు, రోడ్డు నెట్‌వర్కులు, పాఠశాలలు, గృహ ప్రాజెక్టుల నిర్మాణానికి సహకరించేందుకు భారత్ తాజాగా ముందుకొచ్చింది. మాల్దీవుల సామాజిక, ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధిలో భారత్ కీలక భాగస్వామి అని ముయిజ్జు పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా తమ దేశానికి ఉదారంగా సహాయం అందిస్తున్నందుకు ప్రధాని మోదీకి, భారత ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

'గర్బా'పై పాట రాసిన ప్రధాని మోదీ

దిల్లీ: దసరా నవరాత్రులను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దుర్గాదేవిని ప్రార్థిస్తూ గర్బా నృత్యంపై ప్రత్యేక పాట రాశారు. సోమవారం ఆయన తన ఎక్స్ ఖాతాలో ఆ పాటను షేర్ చేశారు. "ఈ పవిత్ర నవరాత్రుల్లో దుర్గాదేవిని ప్రజలు ఐక్యంగా, వివిధ రకాలుగా ఆరాధిస్తారు. ఈ ప్రత్యేక సమయంలో అమ్మవారి శక్తి, దయను కీర్తిస్తూ 'ఆవతీ కాలయ్' అనే గర్బా పాటను రాశాను. మనందరిపై దుర్గాదేవి ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నా." అని ప్రధాని మోదీ తెలిపారు. ఈ గీతాన్ని గాయని పూర్వా మంత్రి పాడారు.

మధ్యప్రదేశ్‌లో ఆరేళ్ల బాలికపై అత్యాచారం

దిండోరి: మధ్యప్రదేశ్‌లోని దిండోరి జిల్లాలో ఆదివారం దారుణం జరిగింది. ఆరేళ్ల బాలికపై తన ఇంటిపక్కన నివాసముండే ఓ వ్యక్తి(21) అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక పరిస్థితి విషమంగా ఉండడంతో జబల్‌పుర్‌లోని ఆస్పత్రికి తరలించామని అధికారులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. 'బాలిక తన అమ్మమ్మ-తాతయ్యలతో కలిసి ఉంటోంది. ఆదివారం ఎవరు లేని సమయంలో ఇంట్లోకి చొరబడిన నిందితుడు ఆమెపై అత్యాచారం చేశాడు. ఇది గమనించిన పొరిగింటి మహిళ విషయాన్ని బాలిక అమ్మమ్మ దృష్టికి తీసుకెళ్లింది. ఆమె వెళ్లి చూడగా.. బాలిక ప్రైవేటు భాగాల నుంచి రక్తస్రావమైంది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది' అని అధికారులు తెలిపారు.

బొగ్గు గనిలో పేలుడు.. ఆరుగురి మృతి

- పశ్చిమబెంగాల్‌లో విషాదం



పేలుడు ప్రాంతంలో సహాయక చర్యలు

కోల్‌కతా: బొగ్గు గనిలో పేలుడు సంభవించి ఆరుగురు మృతిచెందిన విషాదకర ఘటన పశ్చిమబెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. గంగరామ్‌చక్, గంగరామ్‌చక్ భదులియా బొగ్గు గనుల్లో పేలుళ్ల కోసం డిటోనేటర్లను తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు వెస్ట్ బెంగాల్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(డబ్ల్యూబీపీడీసీఎల్) పేర్కొంది. ఈ ప్రమాదంలో మరికొందరు ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని తెలిపింది. ఇప్పటివరకు నాలుగు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, సహాయచర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. కాగా, ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని ఘటనాస్థలాన్ని పర్యవేక్షించిన భాజపా స్థానిక ఎమ్మెల్యే అనుప్ సాహా పేర్కొన్నారు. మరో ముగ్గురు గాయపడ్డారని, వారి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.

నాగ్‌పుర్ రైల్వే స్టేషన్‌లో వ్యక్తి బీభత్సం

- కర్రతో ప్రయాణికులపై దాడి
- ఇద్దరి మృతి

నాగ్‌పుర్: మహారాష్ట్రలోని నాగ్‌పుర్ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి బీభత్సం సృష్టించాడు. ప్లాట్‌ఫామ్‌పై నిద్రిస్తోన్న ప్రయాణికులపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం తెల్లవారుజామున ఆరో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై బాధితులు నిద్రిస్తుండగా జైకుమార్ కేవత్(45) అనే వ్యక్తి వారి మీద దాడిచేశాడు. బాధితుల అరుపులు విన్న జీఆర్‌పీ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఒకరిని తమిళనాడు దిండిగల్‌కు చెందిన గణేశ్ కుమార్(40)గా గుర్తించారు. మరో బాధితుడి వివరాలు తెలియాల్సి ఉంది.

రష్యా చమురు గిడ్డంగిపై ఉక్రెయిన్ దాడి

యుద్ధం కీలక దశకు చేరుకుంది: జెలెన్‌స్కీ

కీవ్: యుద్ధంలో రష్యా చమురు అవసరాలను తీర్చే క్రిమియాలోని కీలక చమురు గిడ్డంగిపై తాము భారీ దాడి చేశామని ఉక్రెయిన్ సైన్యం సోమవారం ప్రకటించింది. ఫియోడోసియాలో గల చమురు గిడ్డంగిపై దాడి జరిపినట్లు ఆ దేశ జనరల్ స్టాఫ్ సోషల్ మీడియాలో వెల్లడించారు. సోమవారం ఉదయం గిడ్డంగి వద్ద మంటలు కనిపించాయని స్థానిక రష్యా అధికారులు వెల్లడించారు. అయితే దానికి కారణాన్ని వారు తెలపలేదు. మరోవైపు రష్యాతో తాము జరుపుతున్న పోరు కీలక దశకు చేరుకుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ పేర్కొన్నారు.





గుమ్లా యాత్రలో సంప్రదాయ దుస్తులతో డోలు వాయిస్తున్న కల్పనా సోరెన్

ఆ పార్టీ 'పిల్ మాస్టర్ గ్యాంగ్'

భాజపాపై కల్పనా సోరెన్ విమర్శ

రాంచీ: ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సతీమణి, జేఎంఎం ఎమ్మెల్యే కల్పనా సోరెన్ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీని 'పిల్ మాస్టర్ గ్యాంగ్'గా అభివర్ణించారు. ప్రజలకు అందాల్సిన పథకాలకు కాషాయ పార్టీ అడ్డుగా మారిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జేఎంఎం ఏర్పాటు చేసిన ప్రచార ర్యాలీలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఝార్ఖండ్ ముఖ్యమంత్రి మైయా సమ్మాన్ యోజన' పథకంపై భాజపా పిల్ దాఖలు చేయడాన్ని కల్పనా సోరెన్ ఖండించారు. "మహిళలకు ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన పథకంపై కోర్టులో భాజపా పిల్ దాఖలు చేసింది. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్నీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినా దానికి అడ్డు తగులుతోంది. సీఎం హేమంత్ సోరెన్ ప్రవేశపెడుతున్న ప్రతి పథకానికీ ఆటంకం కలిగించే 'పిల్ మాస్టర్ గ్యాంగ్'గా మారింది" అని ఆరోపించారు. గిరిజన వర్గాల డిమాండ్లను భాజపా విస్మరిస్తోందని కల్పన ఆరోపించారు. "గిరిజనులకు వారి సంస్కృతిని గుర్తించేందుకు కోడ్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టాం. కానీ, భాజపా మాత్రం దాన్ని అంగీకరించడం లేదు. వారి సంస్కృతిని కాపాడేందుకు ఇష్టపడడం లేదు. ఝార్ఖండ్‌ను సీఎం హేమంత్ సోరెన్ మాత్రమే కాపాడగలరు. రాష్ట్రంలోని కొన్ని గిరిజన జాతులను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలని కోరుతూ కేంద్రానికి మా ప్రభుత్వం లేఖ రాసింది. దాన్ని వారు తిరస్కరించారు. గిరిజనుల హక్కులను కాపాడేంత వరకు హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వం పోరాడుతూనే ఉంటుంది" అని కల్పనా సోరెన్ పేర్కొన్నారు.

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం...
సంజయ్ రాయ్ ఏకైక నిందితుడిగా

- కోర్టుకు సీబీఐ అభియోగాలు



జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ కోల్‌కతాలో సాధువుల ప్రదర్శన

కోల్‌కతా: ఆర్జీ కర్ ఆసుపత్రి జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) సోమవారం కోల్‌కతాలోని ప్రత్యేక కోర్టుకు అభియోగాలు (ఛార్జ్ షీట్) సమర్పించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ ఒక్కరి పేరును మాత్రమే చేర్చింది. కోల్‌కతా పోలీస్ విభాగంలో వాలంటీర్‌గా విధులకు హాజరైన సంజయ్ రాయ్... ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీ కర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై ఘోరానికి పాల్పడ్డాడని సీబీఐ పేర్కొంది. సామూహిక అత్యాచారం విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం అదే నెల 14న దర్యాప్తు బాధ్యతలను చేపట్టిన సీబీఐ ఆ తర్వాత నిందితుడు సంజయ్‌కు సత్యశోధన పరీక్ష నిర్వహించింది. ఇదే కేసులో తాలా పోలీస్ స్టేషన్ ఆఫీసర్ ఇన్ ఛార్జి అభిజిత్ మండల్‌ను, వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను కూడా సీబీఐ అరెస్టు చేసింది.

కొనసాగుతున్న వైద్యుల నిరశన

హత్యాచార బాధిత జూనియర్ వైద్యురాలికి న్యాయం జరగాలని కోరుతూ పశ్చిమబెంగాల్లో జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారం మూడో రోజుకు చేరింది. వారి ఆందోళనలో భాగంగా మంగళవారం సాయంత్రం ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించారు.

నవరాత్రి ఉత్సవాలపై ప్రభావం

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా ఇచ్చిన బాయ్‌కాట్ పిలుపులు దసరా ఉత్సవాలపై ప్రభావం చూపుతోంది. కోల్‌కతా నగరంలో దసరా పండగను అత్యంత వైభవంగా జరుపుకోవటం ఆనవాయితీ. అయితే, ఈ ఏడాది ఉత్సవాలను బహిష్కరిస్తూ పలు మండళ్లు పిలుపునిచ్చాయి. దీంతో ప్రజలు పూజా కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొని ఉత్సవాలకు దూరంగా ఉంటున్నారు.



కొల్హాపుర్‌లో అజయ్ తుకారాం సనదే కుటుంబంతో కలిసి భోజనం చేస్తున్న రాహుల్ గాంధీ

రాజ్యాంగాన్ని కాంగ్రెస్ కాపాడుతుంది : రాహుల్

- దళిత కుటుంబంతో గడిపిన వీడియో విడుదల

దిల్లీ: బహుజనులకు వారి హక్కులను అందిస్తున్న రాజ్యాంగాన్ని కాంగ్రెస్ రక్షిస్తుందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే ప్రతి భారతీయుడు తమ హృదయాల్లో సోదరభావం స్ఫూర్తిని నింపుకొన్నప్పుడే సమాజంలో నిజమైన భాగస్వామ్యం, సమానత్వం నెలకొంటాయన్నారు. ఇటీవల ఓ దళిత కుటుంబంతో తన సంభాషణ, వారి వంటగదిలో వంటకు తాను చేసిన సాయానికి సంబంధించిన ఓ వీడియోను ఆయన సోషల్ మీడియాలో విడుదల చేశారు. "ఇప్పటికీ దళితుల వంటిల్లు గురించి చాలా తక్కువమందికే తెలుసు. చాలా మందికి దళితులేం తింటారో తెలియదు. అజయ్ తుకారాం సనదే, అంజనా తుకారాం సనదేలతో ఓ మధ్యాహ్నం భేటీ అయ్యాను. మహారాష్ట్రలోని కొల్హాపుర్‌లో వారు తమ ఇంటికి నన్ను ఆహ్వానించి గౌరవించారు. మేం కలిసి వంట చేశాం" అంటూ రాహుల్ 'ఎక్స్'లో వివరించారు.

2023లో నదులకు గడ్డు కాలం

జెనీవా: ప్రపంచవ్యాప్తంగా ఉన్న నదులు 2023లో అతి పొడి వాతావరణాన్ని ఎదుర్కొన్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) వెల్లడించింది. గత 33 ఏళ్లలో ఆ ఏడాదిలోనే నదులలోని నీరు ఎక్కువగా ఆవిరైపోయిందని, కొన్ని ప్రాంతాల్లో దీర్ఘకాల కరవుకు కారణమైందని తెలిపింది. 'నదులకు నీటిని అందించే హిమానీనదాలు గత ఐదు దశాబ్దాలలో భారీగా కరిగిపోయాయి. ఇది ఆయా నదులపై ఆధారపడి జీవిస్తున్న లక్షల మందిపై ప్రభావం చూపింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 360 కోట్ల మంది ప్రజలు ఏడాదికి 30 రోజులు నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. 2050 నాటికి ఈ సంఖ్య 500 కోట్లకు చేరుకుంటుంది' అని నివేదికలో డబ్ల్యూఎంవో వెల్లడించింది. అమెరికా, అర్జెంటీనా, బ్రెజిల్, పెరూ, ఉరుగ్వే మొదలైన దేశాలు కరవు పరిస్థితులను ఎదుర్కొన్నాయని.. అమెజాన్ నది, టిటికాకా సరస్సులో నీటి మట్టం కనిష్ఠ స్థాయికి పడిపోయిందని తెలిపింది. వాతావరణానికి సంబంధించి సరైన సమాచారంతో లోతైన విశ్లేషణ చేస్తే జలవనరులపై మనకు సంపూర్ణ అవగాహన వస్తుందని డబ్ల్యూఎంవో సూచించింది. 2023 అత్యంత గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరంగా రికార్డులకెక్కగా 2024 దానిని అధిగమించే అవకాశాలున్నాయని హెచ్చరించింది.

కచ్ తీరంలో రూ.120 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం

గాంధీధామ్, దిఫు: అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.120 కోట్ల విలువైన 12 కేజీల కొకైన్‌ను గుజరాత్ కచ్ జిల్లాలోని గాంధీధామ్ పట్టణంలో క్రీక్ ప్రాంతంలో స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం పోలీసులు తెలిపారు. ఏడాది వ్యవధిలో క్రీక్ ప్రాంతం నుంచి భారీగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్న మూడో ఘటన ఇది. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు నిర్వహించిన సోదాల్లో 10 సంచుల్లో గల కొకైన్ దొరికింది. స్మగ్లర్లు తాము పట్టుబడకుండా ఉండేందుకు కొకైన్‌ను అక్కడ దాచి ఉంటారని పోలీసులు వెల్లడించారు.

■ అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్ జిల్లాలో రెండు వేర్వేరు ఘటనల్లో రూ.1.60 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అయిదుగురు నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు చేపట్టిన గాలింపు చర్యల్లో అరుణాచల్‌ప్రదేశ్ దిశగా వెళ్తున్న వాహనదారు వద్ద 10 సబ్బు పెట్టెల్లో రూ.కోటి విలువైన 117.52 గ్రాముల హెరాయిన్ దొరికింది. మరో ఘటనలో మణిపుర్ నుంచి వస్తున్న వాహనంలో రూ.60 లక్షల విలువైన 1.5 కేజీల బ్రౌన్‌షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సాహితీ ఇన్‌ఫ్రా ఎండీకి 5 రోజుల ఈడీ కస్టడీ!

ఈనాడు, హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను ఈడీ కస్టడీలోకి తీసుకునేందుకు నాంపల్లి కోర్టు అనుమతించింది. సోమవారం ఈ కేసు విచారణ జరిగింది. నిందితుడి నుంచి సమాచారం సేకరించడానికి 14 రోజుల కస్టడీ కోసం పిటిషన్ దాఖలుచేసినా, 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని ఈడీ వాదనలు వినిపించింది. 5 రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 14 నుంచి 18 వరకు లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు విచారించనున్నారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కేసు నమోదుచేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సెప్టెంబరు 29న లక్ష్మీనారాయణను అరెస్టు చేసింది. ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో వినియోగదారుల నుంచి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసినట్టు సాహితీ ఇన్‌ఫ్రా సంస్థపై ఆరోపణలున్నాయి. 700 మంది నుంచి వసూళ్లు చేసినట్టు దర్యాప్తులో వెల్లడైందని ఈడీ పేర్కొంది. రూ.161 కోట్ల స్థిర, చరాస్తులు జప్తు చేసినట్టు పేర్కొంది. దర్యాప్తు క్రమంలో సాహితీ ఇన్‌ఫ్రా ఆస్తులను జప్తు చేశారని, బాధితుల ఫిర్యాదులతో కేసులు నమోదు చేసి విచారణను సైతం అధికారులు పూర్తి చేశారని నిందితుడి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈడీ కస్టడీకి అప్పగించాల్సిన అవసరం లేదని, సంబంధిత ధ్రువపత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. కోట్లలో మోసం జరగడంతోనే ఈడీ రంగంలోకి దిగిందని, మోసాల గురించి మాత్రమే విచారణ జరుపుతుందని ఆ సంస్థ తరఫు న్యాయవాది వాదించారు.

జాబితాల ప్రకటనలో జాప్యం

- 15తో ముగియనున్న 2024 ఫాల్ సీజన్ దరఖాస్తుల గడువు
- బీసీలకు విదేశీ విద్య పథకం అమలుపై సందిగ్ధం



ఈనాడు, హైదరాబాద్: విదేశాల్లో ఉన్నతవిద్య అభ్యసించే అర్హులైన పేద బీసీ విద్యార్థులకు చేయూత అందించేందుకు ఉద్దేశించిన మహాత్మా జ్యోతిబా పులే విదేశీ విద్య పథకం అమలుపై సందిగ్ధం నెలకొంది. మిగతా సంక్షేమశాఖలు అర్హుల జాబితాలను వెల్లడిస్తున్నా.. బీసీ సంక్షేమశాఖలో తాత్సారం జరుగుతోంది. 2023 ఫాల్ సీజన్‌కు స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయి దాదాపు ఏడాది గడుస్తున్నా అర్హుల జాబితాను ఇప్పటివరకు ప్రకటించలేదు. పథకం వర్తిస్తుందన్న ఆశతో ఇప్పటికే విదేశాల్లో పీజీ, ఇతర ఉన్నత విద్య కోర్సుల్లో చేరిన విద్యార్థుల ఫీజులను తల్లిదండ్రులు అప్పులు చేస్తూ సర్దుబాటు చేస్తున్నారు.

ఏమిటీ పథకం..

బీసీలకు విదేశీ విద్య పథకం కింద ఏటా 300 మందికి రెండు విడతల్లో రూ.20 లక్షల చొప్పున ఉపకార వేతనం, ఒకవైపు విమాన ఛార్జీలు, వీసా ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. తొలుత ఉపకార వేతనం మంజూరైన తర్వాత విద్యార్థులు వీసాలకు దరఖాస్తు చేసేవారు. కొందరికి ఉపకార వేతనం మంజూరైనప్పటికీ వివిధ కారణాలతో వీసాలు తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో వీసాలు పొందిన విద్యార్థులే ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఏటా స్ప్రింగ్ సీజన్‌కు మార్చిలో, ఫాల్ సీజన్‌కు అక్టోబరులో దరఖాస్తులు స్వీకరిస్తోంది.

ప్రస్తుత పరిస్థితి..

- 2023 అక్టోబరులో ఫాల్ సీజన్‌కు 2,700 మంది దరఖాస్తు చేసుకున్నారు. 150 మంది అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. జనవరిలో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఫిబ్రవరి నాటికి జాబితా ప్రకటించాల్సి ఉంది. రాష్ట్రస్థాయి కమిటీ జాబితాను సిద్ధం చేసినా.. ఉన్నతాధికారులు ఆమోదించలేదు. వీసాలు పొంది కోర్సుల్లో చేరిన అభ్యర్థుల కోర్సులు సైతం ముగింపు దశకు చేరుకోవడం గమనార్హం.
- 2024 స్ప్రింగ్ సీజన్‌కు 150 మందిని ఎంపిక చేసేందుకు ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో దరఖాస్తులు స్వీకరించారు. దాదాపు 3 వేల మంది దరఖాస్తు చేశారు. మెరిట్ జాబితా ప్రకారం 1,200 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయింది. ఫాల్ సీజన్ జాబితా ప్రకటించకుండా స్ప్రింగ్ సీజన్ జాబితా ప్రకటిస్తే ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో ఇప్పటివరకు స్ప్రింగ్ సీజన్‌కు సంబంధించిన రాష్ట్రస్థాయి ఎంపిక కమిటీ సమావేశం నిర్వహించలేదు.
- 2024 ఫాల్ సీజన్ దరఖాస్తుల స్వీకరణ ప్రస్తుతం కొనసాగుతోంది. ఈ నెల 15 చివరి తేదీ. ఇప్పటివరకు దాదాపు 2 వేల మంది దరఖాస్తు చేసినట్లు అంచనా.

ముంచుకొచ్చిన ఉపద్రవం పరిమళిస్తున్న మానవత్వం

ఉభయ తెలుగు రాష్ట్రాలను ముంచెత్తిన వరదలు పేదలు, చిరు ఉద్యోగులు, చిన్నవ్యాపారుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఒక్కొక్కరికి రూ.లక్షల్లో నష్టం వాటిల్లడంతో దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు.

చీకట్లు కమ్ముకున్న వారి జీవితాల్లో పలువురు మానవత్వంతో వెలుగులు పంచుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..



మేకా లక్ష్మీ తులసమ్మ, రిటైర్డ్ ఫిజిక్స్ లెక్చరర్, గుంటూరు
విరాళం: రూ.2,00,000



ఆర్య కృష్ణ ఇమ్మణి, క్రాంతిపార్క్ రాయల్, సికింద్రాబాద్
విరాళం: రూ.1,00,111

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
సి.వి.రమణారావు, ఆడిటర్, బ్రహ్మయ్య అండ్ కంపెనీ, విశాఖపట్నం	50,000
రాజా వెంకట సత్యనారాయణరావు, హైదరాబాద్	25,116
చిరుమామిళ్ల సుధాకర్‌నాయుడు, బెంగళూరు	10,116
బి.కల్పన, మొగల్తూరు, పశ్చిమగోదావరి జిల్లా	10,116
బీనీడి సరళ, హైదరాబాద్	10,116
ఎన్.చిన్నికృష్ణ, పోరంకి, విజయవాడ	10,000
గంధం మహేందర్‌రెడ్డి, సిద్దిపేట	10,000
క్రీస్తు సేవాశ్రమం, పోరంకి, విజయవాడ	10,000
ఎం.జోసఫీన్, హైదరాబాద్	10,000
యలమంచిలి చక్రధరరావు, తణుకు	10,000
శ్రీ యర్రా వెంకటరత్న గీతా భవనం, యానాం	10,000
కొసరాజు శ్రీరామమూర్తి, హైదరాబాద్	10,000
మొవ్వా పద్మిని, ప్రవ్య, యు.కె.	5,250
వట్టిగుంట మోహిష, బెంగళూరు	5,250
టి.ఎం.రావు హైస్కూల్ పదో తరగతి 1984–85 బ్యాచ్ విద్యార్థులు, భట్టిప్రోలు, బాపట్ల జిల్లా	5,116
పి.వి.వి.ఎస్.వి.ప్రసాద్(బాబు), కడియపులంక, తూర్పుగోదావరి	5,100
కె.తుల్సిక శేఖర్, మడకశిర, సత్యసాయి జిల్లా	5,001
విజయ స్నిగ్ధ, వెంట్రప్రగడ, కృష్ణాజిల్లా	5,001
వెంకట సుబ్బ రామ్మోహన్ గుప్తా, బెంగళూరు	5,001
ఆచంట మాధవి, విజయవాడ	5,000
అనిశెట్టి శ్రీధర్, హైదరాబాద్	5,000
ఎన్.వెంకట కృష్ణారావు, జంగారెడ్డిగూడెం	5,000
చెన్నా సూర్యారావు, హైదరాబాద్	5,000
జి.వి.రామన్‌లక్ష్మణ్, గుంతకల్లు, అనంతపురం జిల్లా	5,000
రాజా కేశవప్రసాద్, రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్, జగ్గయ్యపేట, ఎన్టీఆర్ జిల్లా	5,000
వింజమూరి నాగసూర్య శ్రీనివాస్, హైదరాబాద్	5,000
ఎ.ఎం.హెచ్. పాఠశాల, రాజమహేంద్రవరం ఓల్డ్ ఫ్రెండ్స్ (1965–66)	5,000

సాయం చేద్దాం. కన్నీరు తుడుద్దాం.

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే నిరసన సెగ తాకేది మాకే: తుమ్మల

- 'మంత్రులతో ముఖాముఖి'కి 95 అర్జీలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: 'మేం నిత్యం రైతుల్లోనే తిరుగుతున్నాం.. ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే మాకు నిరసన సెగ తాకేది కదా..?' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో జరిగిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి తుమ్మల హాజరయ్యారు. కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలు, ఉద్యోగాలు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సమస్యలకు సంబంధించి 95 వినతులు వచ్చాయి. కొన్ని సమస్యలపై వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలానికి సంబంధించిన భూమి విషయంలో యాదమ్మ అనే వృద్ధురాలు మంత్రికి ఫిర్యాదు చేయగా..ఆయన వెంటనే ఆ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. సీఎం, మంత్రులందరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని.. ప్రభుత్వంపై వారికి మంచి ఉద్దేశం ఉందన్నారు. కావాలనే ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొడుతున్నాయన్నారు. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వంపై ఎలాంటి అసంతృప్తి లేదన్నారు. అధికారం కోల్పోయిన బాధ ఒకరిదని, అధికారంలోకి రావాలనే బాధ ఇంకొకరిదని విమర్శించారు. "రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశాం.. అది ప్రధాని మోదీకి, భాజపా నేతలకు కనిపించడం లేదా? భాజపా పాలిత రాష్ట్రాలలో రుణమాఫీ చేశారా?" అని ప్రశ్నించారు. రుణమాఫీ పూర్తికాగానే రైతు భరోసా నిధులు వేస్తామని తుమ్మల తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీసుకున్న 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.



'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హయ్యర్ పెన్షన్ సమస్య పరిష్కారానికి కృషి

- ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీ కరుమలయన్

రాంనగర్, న్యూస్‌టుడే: హయ్యర్ పెన్షన్ సమస్య పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీ, సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్ తెలిపారు. పీఎఫ్‌లో హయ్యర్ పెన్షన్ అమలులో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఎస్ఆర్టీసీ, టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్లు సంయుక్తంగా సోమవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించాయి. తొలుత బర్కత్‌పురలోని పీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై అధికారులతో చర్చించిన అనంతరం ఆయన ధర్నాచౌక్‌కు వచ్చి మాట్లాడారు. రెండు ఆర్టీసీలు ఒకే పీఎఫ్ కోడ్‌తో పనిచేస్తున్నాయని, హయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులతో చెప్పినట్లు వివరించారు. ఉమ్మడి ఆర్టీసీగా ఉన్నప్పుడు 16,307 మంది హయ్యర్ పెన్షన్ కోరుతూ ఆప్షన్లు ఇచ్చారు. తమకు రావాల్సిన పీఎఫ్ డబ్బులు 2014లో రిజెక్ట్ చేశారని, పదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఇవ్వలేదని వాపోయారు. ఈ విషయాన్ని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శివకుమార్ దృష్టికి తీసుకెళ్తే తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, కార్యదర్శి వీఎస్ రావు, ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధానకార్యదర్శి అయ్యప్పరెడ్డి, గౌరవాధ్యక్షుడు జిలానీబాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరుమలయన్.. చిత్రంలో వీఎస్ రావు

317 జీవో బాధితులకు ఊరట!

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో 317 జీవో అమలుతో నష్టపోయిన కొందరు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు త్వరలో ఊరట కలగనుంది. భార్యాభర్తలు, పరస్పర బదిలీ, మెడికల్ గ్రౌండ్‌లో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కొత్త కేటాయింపులు చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం సానుకూలత వ్యక్తం చేసింది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సోమవారం సచివాలయంలో ఉపసంఘం సమావేశమైంది. స్థానికత ప్రకారం ఉద్యోగుల కేటాయింపుపై సుదీర్ఘంగా చర్చించింది. న్యాయ వివాదాలకు తావు లేకుండా కేటాయింపు జరగాలని అభిప్రాయపడింది. స్థానికతకు అవరోధంగా ఉన్న క్లాజులపై మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు 3 గంటలకుపైగా న్యాయ నిపుణులతో చర్చించారు.

22 నుంచి ఏఈ పోస్టుల సర్టిఫికెట్ల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ విభాగాల్లో 833 సహాయ ఇంజినీర్(ఏఈ) పోస్టుల భర్తీకి మెరిట్ జాబితాలో చోటు సంపాదించిన అభ్యర్థులకు ఈ నెల 22 నుంచి నవంబరు 5 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు వర్సిటీలో ఈ పరిశీలన ఉంటుందన్నారు.

ఎస్సీ గురుకుల సొసైటీలో 174 మందికి ఎంబీబీఎస్ సీట్లు

ఈనాడు, హైదరాబాద్: నీట్ ఎంబీబీఎస్ ప్రవేశాలకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఎస్సీ గురుకుల సొసైటీకి చెందిన 174 మంది విద్యార్థులు సీట్లు సాధించారని సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. సాయివంశీ అనే విద్యార్థి 438వ ర్యాంకుతో గాంధీ వైద్య కళాశాలలో, హేమంత్ 1791, శృతి 3378 ర్యాంకులతో ఉస్మానియాలో సీట్లు పొందారని వివరించారు.

పీసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ వర్కింగ్ ఛైర్మన్‌గా వీరన్నయాదవ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: పీసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ వర్కింగ్ ఛైర్మన్‌గా మహబూబాబాద్ జిల్లాకు చెందిన మేకల వీరన్నయాదవ్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ఏఐసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఛైర్మన్ కెప్టెన్ అజయ్‌సింగ్ యాదవ్ ప్రకటించారు.

ఆయిల్‌పామ్, బిందుసేద్యం రాయితీలకు నిధులు

ఈనాడు, హైదరాబాద్: ఆయిల్‌పామ్ సాగు, బిందు సేద్యం, వెదురు సేద్యం పథకాల రాయితీలకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. ఆయిల్‌పామ్ రైతులు, కంపెనీలకు 2024-25 సంవత్సరానికి మొదటి విడతగా రూ.176 కోట్లు, బిందు సేద్యం కింద రూ.51.66 కోట్లు, వెదురు పథకం కింద రూ.16.47 లక్షల మంజూరుకు అనుమతులిచ్చింది.

పశువైద్యులొస్తున్నారు

- కొత్తగా 171 మంది నియామకం
- వారిలో 70 మంది మహిళలు

ఈనాడు,హైదరాబాద్: రాష్ట్రంలోని పశువైద్యశాలలకు కొత్త వైద్యులొస్తున్నారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పరిధిలో ఎంపికైన 171 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (వీఏఎస్)లకు అదనపు సంచాలకురాలు మల్లేశ్వరి సోమవారం నియామక పత్రాలు అందజేశారు. 'గ్రామీణ ప్రాంతాల్లో అవసరాల మేరకు, బహుళజోన్‌ల వారీగా ఖాళీలను పరిగణనలోకి తీసుకుని పోస్టింగులు ఇస్తాం. ఈ వారంలోనే ధ్రువీకరణపత్రాల పరిశీలన పూర్తిచేసి, నెలాఖరు నాటికి ఉత్తర్వులు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని ఈ సందర్భంగా మల్లేశ్వరి వివరించారు.

ఏడేళ్ల తర్వాత

2017లో 101 మంది వీఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆ తర్వాత 2022 డిసెంబరు నాటికి 185 ఖాళీలను గుర్తించి, అదే నెలలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చింది. 2023 జులై 13, 14 తేదీల్లో పరీక్షలు నిర్వహించారు. ఆగస్టులో ఫలితాలను ప్రకటించారు. మొత్తం 185కిగానూ 14 పోస్టులకు అర్హులు లేకపోవడంతో వాటిని మినహాయించి 171 పోస్టులకు తాజాగా అభ్యర్థులను ఎంపిక చేశారు.

రెండు విభాగాలుగా ఎంపిక

నియామకాలు రెండు విభాగాలుగా జరిగాయి. ఇందులో 'ఎ-విభాగంలో' పోస్టులు ఆసుపత్రులకు సంబంధించినవికాగా, మిగిలినవి ల్యాబ్‌లకు సంబంధించినవి. మొత్తం 171 పోస్టుల్లో 'ఎ విభాగం' కింద 160 మంది ఎంపికయ్యారు. ఇందులో 89 మందిని మొదటి బహుళ జోన్‌కు, మరో 71 మందిని రెండో బహుళజోన్‌కు కేటాయించారు. బి-విభాగంలో మొదటి బహుళజోన్‌లో అయిదుగురు, రెండో బహుళజోన్‌లో ఆరుగురు చొప్పున 11 మంది ఎంపికయ్యారు. మొత్తం ఎంపికైన వారిలో 70 మంది మహిళలు. పశువైద్యశాలల్లో దీర్ఘకాలంగా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండటంతో చాలావరకు మూతపడి ఉన్నాయి. కొన్నిచోట్ల సరైన వైద్యం అందడం లేదు. తాజా నియామకాలతో ఆయా ఆసుపత్రుల పరిధిలో వైద్యసేవలు మెరుగుపడనున్నాయి.

మరో 121 ఖాళీలు

2022లో పబ్లిక్ సర్వీసు కమిషన్ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నుంచి ఇప్పటివరకు మరో 121 వెటర్నరీ అసిస్టెంటు సర్జన్ల పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇందులో 30 శాతం పోస్టులు శాఖాపరమైన పదోన్నతులతో భర్తీ చేసేందుకు అవకాశం ఉంది. అవి పోనూ ఇంకా పోస్టులు మిగిలే అవకాశం ఉంది. మరోవైపు ఈ శాఖలో 70 మంది ఒప్పంద వీఏఎస్‌లు పనిచేస్తున్నారు. వారిలో 20 మంది మాత్రమే వెయిటేజీతో టీజీపీఎస్సీ నోటిఫికేషన్ పోస్టులకు ఎంపికయ్యారు. మరో 50 మంది ఒప్పంద విధానంలోనే కొనసాగుతున్నారు. ఖాళీలు ఏర్పడిన క్రమంలో తమకు వెయిటేజీ ఇచ్చి భర్తీ చేయాలని వారు సర్కారును అభ్యర్థిస్తున్నారు.



కొత్తగా ఎంపికైన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లతో పశువైద్యశాఖ అదనపు సంచాలకురాలు మల్లేశ్వరి, అధికారులు

13న నాంపల్లి మైదానంలో 'అలయ్ బలయ్'

అబిడ్స్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలను ప్రతిబింబించేలా 'అలయ్ బలయ్' వేడుకలను 18 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు హరియాణా గవర్నర్ దత్తాత్రేయ అన్నారు. ఈ నెల 13న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఎగ్జిబిషన్‌లోని పెండాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల మంత్రులు, అధికార, అనధికార ప్రముఖులు అందరినీ ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సమావేశంలో అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, గొంటి శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ. చిత్రంలో విజయలక్ష్మి, ప్రేమ్‌సింగ్ రాథోడ్



బోర్ కొడితే పుస్తకం తెరవండి.. ఫోన్ కాదు

పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం సమకూరడమే కాదు, ప్రపంచంపై మీ దృష్టికోణం విస్తృతమవుతుంది. మీ ఎదుగుదలకు ఉపయోగపడే అపార అవకాశాల గురించి మీకు తెలుస్తుంది. మీ ఏకాగ్రత పెరిగి ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. పుస్తక రచయితల ఏళ్ల తరబడి జీవితానుభవాలను కొన్ని గంటల్లోనే గ్రహించి, వాటి నుంచి పాఠాలు నేర్చుకొనే వెసులుబాటు మీకు ఉంటుంది. అందుకే మీకు బోర్ కొట్టినప్పుడు పుస్తకాన్ని తెరవండి, ఫోన్‌ను కాదు.

– సంజనా సామ్రాజ్, ప్రత్యామ్నాయ బోధనా పద్ధతుల పరిశోధకురాలు

ఇరాక్‌లో యువకుడి నరకయాతన

పాసుపోర్టు తీసుకొని గదిలో బంధించారని సెల్ఫీ వీడియో



అజయ్

సారంగాపూర్, న్యూస్‌టుడే: అధిక వేతనం ఉంటుందన్న ఏజెంట్ మాటలు నమ్మి విదేశాలకు వెళితే గదిలో బంధించారంటూ సెల్ఫీ వీడియోలో ఓ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్‌కు చెందిన పల్లపు అజయ్ 14 నెలల క్రితం రూ.2.70 లక్షలు కట్టి ఇరాక్ దేశానికి వెళ్లాడు. అజయ్‌కు ఉపాధి కల్పించాలని ఇరాక్‌లో ఇతరులకు ఏజెంట్ అప్పగించాడు. వారు పని కల్పించకుండా ఆయన పాస్‌పోర్టును తీసుకున్నారు. భాష రాక, బయటకు వెళ్లలేక గదిలోనే ఉంటున్నట్లు తల్లిదండ్రులు రాధ-గంగయ్యకు సమాచారమిచ్చారు. 5 నెలల క్రితం ఏజెంట్ ఇండియాకు రాగా అజయ్ తల్లిదండ్రులు నిలదీయడంతో రూ.లక్ష వెనక్కి ఇచ్చాడు. వారు ఆ డబ్బును అజయ్‌కు పంపించారు. స్వదేశానికి వచ్చేందుకు పాసుపోర్టు లేదని తల్లిదండ్రులకు తెలపడంతో నెల కిందట మరోసారి రూ.66 వేలు పంపించారు. పస్తులతో ఇబ్బందులు పడుతున్నానంటూ అజయ్ సెల్ఫీ వీడియో పంపించడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ కుమారుడిని స్వదేశానికి తీసుకురావాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

గల్ఫ్ దేశాల్లో మరణించిన వారికి

రూ.5 లక్షల ఆర్థికసాయం

- డిసెంబరు 7, 2023 నుంచి వర్తింపు
- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

ఈనాడు, హైదరాబాద్: గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికులు అక్కడ ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్ 7, 2023 నుంచి ఈ సాయం వర్తిస్తుందని పేర్కొంటూ.. దీనికి సంబంధించిన నిబంధనల జీవోను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి జారీచేశారు.

మార్గదర్శకాలు ఇవీ...

- బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల్లో పని చేయడానికి వెళ్లిన తెలంగాణ కార్మికులు, ఉద్యోగులు ఏ కారణం వల్ల మరణించినా వారి కుటుంబ సభ్యులకు ఈ ఆర్థిక సాయం అందుతుంది. ఉత్తర్వుల్లో పేర్కొన్న ఈ 7 దేశాలకు మాత్రమే ఇది వర్తిస్తుంది.
- బాధిత కుటుంబాలు మృతుడి మరణ ధ్రువీకరణ పత్రం, మృతుడి పాస్‌పోర్టును క్యాన్సిల్ చేసినట్లుగా ధ్రువీకరణ సమర్పించాలి.
- చనిపోయిన సమయంలో ఉత్తర్వుల్లో పేర్కొన్న 7 దేశాల్లో ఏదో ఒక దేశంలో ఉద్యోగం, ఉపాధి పొందుతున్నట్లుగా వర్క్ వీసా, ఉద్యోగం చేస్తున్న సంస్థ వివరాలు చూపించాలి.
- ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునే వాళ్లు తమ బ్యాంక్ అకౌంట్ వివరాలను అందజేయాలి.
- అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కలెక్టర్ ఆ దరఖాస్తును పరిశీలించి, అర్హతను నిర్ణయిస్తారు.
- ధ్రువీకరణ అనంతరం ఆర్థిక సాయాన్ని మంజూరు చేస్తారు. బాధిత కుటుంబ సభ్యుడి బ్యాంకు ఖాతాలో నేరుగా రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని జమచేస్తారు.
- గల్ఫ్ కార్మికుడు చనిపోయిన రోజు నుంచి గానీ, మృతదేహం కుటుంబ సభ్యులకు అందిన రోజు నుంచి గానీ.. ఆరు నెలలలోగా మృతుల కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవాలి.

ఈ ప్రక్రియలో అన్ని జిల్లాల కలెక్టర్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి ఆదేశించారు.



ఉనికిచెర్ల రైల్వే సొరంగం అందుబాటులోకి..

హనుమకొండ జిల్లా వడ్డేపల్లి సమీపంలోని ఉనికిచెర్ల రైల్వే గేటు వద్ద రైల్వే శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సొరంగ మార్గం సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ప్రధానంగా బల్లార్షా నుంచి కాజీపేట వైపు వచ్చే రైళ్లకు క్రాసింగ్ సమస్య తప్పించడానికి రూ.36 కోట్లతో సుమారు 250 మీటర్ల పొడవున ఈ సొరంగ మార్గాన్ని నిర్మించారు. సోమవారం గూడ్సు రైళ్లను ఈ సొరంగం నుంచి నడిపారు. మంగళవారం నుంచి ప్యాసింజరు రైళ్లను అనుమతించనున్నారు. సొరంగ మార్గం నుంచి కాజీపేట వైపు రైళ్లు వస్తే, పైనుంచి వరంగల్ వైపు వచ్చే రైళ్లు నడుస్తాయి. – న్యూస్‌టుడే, కాజీపేట



మార్పునకు సిద్ధం కాకపోతే కనుమరుగే

శాంసంగ్ సంస్థ తొలుత కిరాణా సరకులను విక్రయించే కంపెనీగా మొదలైంది. ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రపంచ దిగ్గజంగా ఎదిగింది. ఇదే తరహాలో ఎన్నో సంస్థలు రూపాంతరం చెంది విజయం సాధించాయి. పరిస్థితులకు అనుగుణంగా మార్పు చెందని ఎన్నో కంపెనీలు కాలగర్భంలో కలిసిపోయాయి. ప్రస్తుత మీ పరిస్థితి శాశ్వతం కాదని గుర్తుంచుకోండి. కాలం విసిరే కొత్త సవాళ్లను స్వీకరిస్తూ, మిమ్మల్ని మీరు మెరుగుపర్చుకుంటూ ఎలాంటి మార్పుకైనా సిద్ధంగా ఉండండి.

– మనోజ్ అరోడా, రచయిత

19 నుంచి బైపీసీ విద్యార్థులకు ఫార్మసీ కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో బైపీసీ విద్యార్థులు బీఫార్మసీ, ఫార్మా డి, బీటెక్ బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 19 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రెండు విడతల షెడ్యూల్‌ను ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన సోమవారం విడుదల చేశారు. 19 నుంచి 22 వరకు ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. 21 నుంచి 23 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 21 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 28న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. నవంబరు 4 నుంచి చివరి విడత కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు.

వచ్చే ఏడేళ్లకు విద్యుత్ ప్రణాళిక తయారీ

ట్రాన్స్‌కోకు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఏడు సంవత్సరాలకుగాను రాష్ట్ర అవసరాలకు కావలసిన విద్యుత్తు సరఫరా కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి విద్యుత్ పరిశోధన కేంద్రం ఏర్పాటుచేయాలని.. ఆధునిక సాంకేతికత విజ్ఞానాన్ని అందించడానికి ఇంజినీర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం తన ఛాంబర్‌లో ఆయన ట్రాన్స్‌కో పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 15,700 మెగావాట్లు ఉందని, రాబోయే ఏడేళ్లలో ఇది 27 వేల మెగావాట్లకు పెరిగే అవకాశం ఉన్నందున, తదనుగుణంగా సరఫరాకు కావలసిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలుచేయాలని భట్టి తెలిపారు. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి నిర్ణీత గడువు పెట్టుకొని పూర్తిచేయాలని సూచించారు. వచ్చే రెండు సంవత్సరాల్లో సంస్థ చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి సమీక్షించారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా, సబ్‌స్టేషన్ల నిర్మాణం తదితర అంశాలపై రాష్ట్ర ఇంధనశాఖ కార్యదర్శి రొనాల్డ్‌రాస్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

321 కంపెనీలు.. రూ.7,108 కోట్ల పెట్టుబడులు

- వీటికి వివిధ ప్రాంతాల్లో 566.53 ఎకరాల కేటాయింపు
- తద్వారా ప్రత్యక్షంగా 25,277 మందికి ఉద్యోగావకాశాలు!
- గత పది నెలల పురోగతిపై టీజీఐఐసీ నివేదిక



ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన పది నెలల కాలంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో 321 కంపెనీలు రాష్ట్రంలో రూ.7,108 కోట్లను పెట్టుబడులుగా పెట్టేందుకు ముందుకొచ్చినట్టు టీజీఐఐసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా 25,277 మంది తెలంగాణ యువతకు ఉద్యోగావకాలు లభిస్తాయని ఇప్పటివరకు అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. ఆయా కంపెనీల స్థాపన కోసం టీజీఐఐసీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 566.53 ఎకరాల భూమిని కేటాయించినట్లు వివరించారు. రాష్ట్రంలో గత పది నెలల్లో కొత్త పరిశ్రమల స్థాపనలో పురోగతిపై నివేదికను సోమవారం విష్ణువర్ధన్‌రెడ్డి విడుదల చేశారు.

గజం భూమి కూడా వృథా పోనీకుండా చర్యలు

''ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇటీవల దావోస్, అమెరికా, దక్షిణ కొరియాలో చేపట్టిన పర్యటనలతో రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయి. ఇరువురు నేతలూ తమ పర్యటనలో వివిధ కంపెనీలతో విస్తృతంగా జరిపిన చర్చల ఫలితంగా అనేక సంస్థలు రాష్ట్రంలో తమ కంపెనీలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చాయి. పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన కంపెనీలతో పరిశ్రమల శాఖ నిరంతరం సంప్రదింపులు జరుపుతూ.. వారికి అవసరమైన భూమిని సమకూర్చే ప్రయత్నం చేస్తోంది. తద్వారా కంపెనీలు తీసుకొచ్చే క్రతువులో కీలక భూమిక పోషిస్తోంది. టీజీఐఐసీ ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపన, అనుమతుల ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే ప్రతి సంస్థకూ టీజీఐఐసీ అండగా ఉంటోంది. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే కంపెనీల పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం.. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల పాలసీలకు అనుగుణంగా ఉన్న కంపెనీలకు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. కంపెనీలకు అందించే ప్రతి గజం భూమి సద్వినియోగం అయ్యేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాం'' అని విష్ణువర్ధన్ రెడ్డి ఆ నివేదికలో పేర్కొన్నారు. గత నెలలో పరిశ్రమలకు చేసిన కొన్ని భూకేటాయింపుల వివరాలను వెల్లడించారు. 'గతనెలలోనే తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ, స్టేట్ లెవెల్ ల్యాండ్ అలాట్‌మెంట్ కమిటీకి వచ్చిన భూకేటాయింపుల దరఖాస్తులను క్షుణ్నంగా పరిశీలించిన అనంతరం 70 కంపెనీలు భూకేటాయింపులకు అర్హమైనవి టీజీఐఐసీ గుర్తించింది. వాటికి సంబంధించిన భూకేటాయింపులు ఉత్తర్వులు జారీచేసింది. తద్వారా రూ.1,721 కోట్ల పెట్టుబడులు, 7,543 మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయి' అని వివరించారు.

భూకేటాయింపులు జరిగిన ముఖ్యమైన కంపెనీల వివరాలిలా..

- ఇండోనేసియాకు చెందిన మయూర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫుడ్ ప్రాసెసింగ్ తయారీ పరిశ్రమ నెలకొల్పేందుకు రూ.158.80 కోట్ల పెట్టుబడి. 866 మందికి ఉపాధి.
- లోహం మెటీరియల్స్ ప్రై.లి.(లిథియం అయాన్ బ్యాటరీ తయారీ పరిశ్రమ) రూ.502 కోట్ల పెట్టుబడులు. 414 మందికి ఉద్యోగాలు.
- అమృతాంజన్ హెల్త్ కేర్ లిమిటెడ్ రూ.125.04 కోట్ల పెట్టుబడులు. 142 మందికి ఉద్యోగావకాశాలు.
- జయదుర్గ హోమ్ డెకర్స్ రూ.114.12 కోట్ల పెట్టుబడులు. 950 మందికి ఉద్యోగాలు.
- డ్రోగో డ్రోన్స్ ప్రై.లి రూ.34.63 కోట్ల పెట్టుబడులు. 300 మందికి ఉద్యోగావకాశాలు.

నూతన వ్యాపార రంగాల్లోకి సింగరేణి

- విదేశీ కంపెనీలతో ఉమ్మడి భాగస్వామ్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఈనాడు, హైదరాబాద్: విదేశీ కంపెనీలతో ఉమ్మడి భాగస్వామ్యం ఏర్పాటుచేసుకుని నూతన వ్యాపార రంగాల్లోకి సింగరేణి ప్రవేశిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అధునాతన ఉత్పత్తుల పరిశ్రమలను కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సింగరేణి ఖాళీ ప్రదేశాల్లో.. గ్రీన్‌ఎనర్జీ ప్లాంట్లు, గనులున్న ప్రాంతాల్లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. దసరా సందర్భంగా అన్ని గనుల్లో ఈ నెల 11న విందు ఏర్పాటుచేసి ఉత్పాదకత పెంపుపై అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రజాభవన్‌లో సోమవారం సింగరేణి కార్మికులకు బోనస్, లాభాల వాటా చెక్కుల్ని పంపిణీచేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు. లాభాల వాటా, దీపావళి బోనస్, పండగ అడ్వాన్స్‌లు కలిపి రూ.1,261 కోట్లను కార్మికులు, ఉద్యోగులకు చెల్లిస్తున్నట్లు భట్టి చెప్పారు. బొగ్గు మాత్రమే కాకుండా ఇతర ఖనిజ పరిశ్రమల్లోకి కూడా సంస్థ విస్తరించడానికి కృషి చేస్తామన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సేవలను గుర్తిస్తూ తొలిసారిగా లాభాల నుంచి ఒక్కొక్కరికి రూ.5 వేలు చెల్లిస్తున్నామన్నారు. దీపావళి బోనస్‌ను పండగకు ముందు సింగరేణి చెల్లిస్తుందని తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు వైద్యసేవల ఖర్చు పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. వారి సమస్యలపై త్వరలో వివరాలు సేకరించి చర్చిస్తామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో హైదరాబాద్ తరహా అత్యుత్తమస్థాయి విద్యను అందించే పాఠశాలలు, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటుచేసి కార్మికులకే కాకుండా ఇతరులకూ విద్య, వైద్య సేవలు అందించాలన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో రూ.కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని తమ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కల్పించామన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్.డి.ఎల్.ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఆసం శ్రీనివాస్ గతేడాది 304 రోజులు పనిచేసి రూ.3,24,150 లాభాల వాటాను పొంది సింగరేణి సంస్థలో టాపర్‌గా నిలిచారు. ఆ తర్వాత కార్మికులు జెస్సిరాజ్ రూ.3.10 లక్షలు, ఎ.శ్రీనివాస్ రూ.3 లక్షలు, ఎం.తిరుపతి రూ.3 లక్షల లాభాల వాటా పొందారు.



సింగరేణి ఉద్యోగికి చెక్కు అందజేస్తున్న సీఎండీ బలరాం. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్,

తప్పులు దిద్దకుండానే ఎస్‌ఎస్‌సీ మార్కుల జాబితాలు

- సవరణ దరఖాస్తులిచ్చినా పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 2024 మే నెలలో పదోతరగతి పాసైన వేల మంది విద్యార్థులతో సెకండరీ స్కూల్ సర్టిఫికెట్(ఎస్‌ఎస్‌సీ) బోర్డు అధికారులు ఆటలాడుతున్నారు. ఇంటర్ ప్రవేశాల కోసం తొలుత జారీ చేసిన మార్కుల జాబితాలో దొర్లిన తప్పులు సవరించకుండా అసలు(ఒరిజినల్) ధ్రువపత్రాన్ని తప్పుల తడకగా పంపించారు. విద్యార్థుల ఇంటి పేర్లు.. తల్లిదండ్రుల పేర్లలో తప్పులుంటే సవరణ చేస్తామని ప్రకటించిన అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. వేల మంది విద్యార్థులకు ఇలాంటి మార్కుల జాబితాలే వచ్చాయని డీఈవో కార్యాలయాల అధికారులు చెబుతున్నారు. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే మూడువేల మందికిపైగా విద్యార్థుల మార్కుల జాబితాల్లో తప్పులున్నాయని తేలింది. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సోమవారం పదుల సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చారు. దీనిపై వారు అధికారులను ప్రశ్నించగా.. తమ చేతుల్లో ఏం లేదని మరోమారు ఎస్‌ఎస్‌సీ బోర్డు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పై చదువులు మొదలు విద్యార్థులు పెద్దయ్యాక ఓటరు గుర్తింపు కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు దరఖాస్తుకు ఇలా అన్నింటికీ పదోతరగతి మార్కుల జాబితా ధ్రువపత్రమే ప్రామాణికం. అలాంటి ధ్రువపత్రం విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి.

యూడైస్‌లో మార్పులు చేసినా..: పది పాసైన వారు ఇంటర్‌లో చేరేందుకు ఎస్‌ఎస్‌సీ బోర్డు అధికారులు వారు చదువుకున్న పాఠశాలలకు మే నెలాఖరులో మార్కుల జాబితాను పంపించారు. కొన్నింటిలో విద్యార్థుల ఇంటి పేరు తప్పుగా ఉంది. ఓ విద్యార్థి తల్లి పేరు రమ అయితే ఉమ అని వచ్చింది. ఇలా తల్లిదండ్రుల పేర్లు సరిగా లేవు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించగా.. తప్పుల సవరణకు ఎస్‌ఎస్‌సీ బోర్డు అధికారులు అవకాశం కల్పించారు. ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా ఉన్న యూడైస్ వెబ్‌సైట్‌లో మార్పుచేర్పులు చేయమని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు సూచించారు. జులై నెలాఖరు వరకూ వారు మార్పుచేర్పులు చేసి ఎస్‌ఎస్‌సీ బోర్డుకు పంపించారు. వీటిని ఏమాత్రం పట్టించుకోకుండా బోర్డు అధికారులు పదోతరగతి పరీక్షల హాల్‌టిక్కెట్లలోని వివరాలు మాత్రమే అసలు మార్కుల జాబితాలో ముద్రించి పాఠశాలలకు పంపించడంలో తప్పులు యథాతథంగా ఉండిపోయాయి.

సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: ''రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇప్పటి వరకు విడుదల చేయలేదు. అప్పుల బాధతో అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బిల్లులు చెల్లించి వారి కుటుంబాల్లో దసరా పండుగ వెలుగులు నింపాలి'' అని రాష్ట్ర సర్పంచుల సంఘాల ఐకాస ఛైర్మన్ సుర్వి యాదయ్యగౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచుల పట్ల ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడవద్దని కోరారు. పెండింగ్ బిల్లుల విషయమై పట్టించుకోకుంటే 15న సంఘం ముఖ్యనేతల సమావేశాన్ని నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఐకాస ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: డ్రాగన్ ఫ్రూట్ రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలుగు డ్రాగన్ ఫ్రూట్ రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు, జాతీయ హార్టీకల్చర్ బోర్డు సభ్యుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు సోమవారం బాటసింగారం పండ్ల మార్కెట్లో ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డిని కలిసి సత్కరించారు. రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, తెలుగు డ్రాగన్ ఫ్రూట్ రైతుల అసోసియేషన్ ప్రతినిధులు రమేశ్‌రెడ్డి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిలుక మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

డిగ్రీ కాంట్రాక్టు అధ్యాపకులకు 3 నెలలుగా అందని జీతాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితి దయనీయంగా మారింది. వారికి నెట్/సెట్/పీహెచ్‌డీ అర్హతలు లేవని ప్రభుత్వం వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించలేదు. పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందినందున అదనపు అర్హతలకు నాలుగేళ్ల మినహాయింపు ఇవ్వాలని, ఆలోపు రెగ్యులర్ చేయాలని ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈ విద్యా సంవత్సరం(2024-25) పని చేసేందుకు 466 మందికి ప్రభుత్వం రెన్యువల్ ఉత్తర్వులు కూడా ఇవ్వలేదు. దీంతో కళాశాల విద్యాశాఖ బడ్జెట్ ఉన్నా వారికి జులై నుంచి జీతాలు విడుదల చేయడం లేదు. వెంటనే రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేసి వేతనాలు విడుదల చేయాలని, తమను రెగ్యులర్ చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘం(టీజీడీసీసీఎల్‌ఏ-3740) రాష్ట్ర అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి విన్నవించారు.

పెండింగ్ డీఏలు, బిల్లుల విడుదలకు వినతి

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయులకు బకాయి పడిన నాలుగు వాయిదాల డీఏలు ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సోమవారం ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు విన్నవించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సప్లిమెంటరీ వేతనాలు, సరెండర్ లీవులు, గత పీఆర్సీ బకాయిలు, మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన వారికి పెన్షనరీ బెనిఫిట్స్ తదితర వేల బిల్లులు ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావడం లేదని తెలిపారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం తక్షణమే ఉద్యోగుల పెండింగ్ బకాయిలన్నీ విడుదల చేయాలని భట్టిని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తదితరులు ఉన్నారు.



ఉపముఖ్యమంత్రి భట్టికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి. చిత్రంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు

EENADU Vol: 51, Iss: 59 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223, RNI No. 27656/75, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

21 వేల మంది బాలికలకు 'మలబార్' ఉపకార వేతనాలు

ఈనాడు, ముంబయి: ప్రముఖ వ్యాపార సంస్థ మలబార్ గ్రూప్ 2024 సంవత్సరానికి జాతీయ ఉపకారవేతన కార్యక్రమాన్ని ప్రకటించింది. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల ముంబయిలో ప్రారంభించారు. దీని కింద దేశవ్యాప్తంగా ప్రతిభ చాటిన 21 వేల మంది బాలికలకు రూ.16 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు అందిస్తారు.

'దిల్లీ నేషనల్ జూలాజికల్ పార్క్' సభ్యత్వం రద్దు

దిల్లీ: ఆఫ్రికన్ ఏనుగు శంకర్‌ను సంకెళ్లతో బంధించి వైద్యం చేసినందుకుగాను ఆందోళన వ్యక్తం చేసిన వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ జూస్ అండ్ అక్వేరియమ్స్(వాజా) దిల్లీ నేషనల్ జూలాజికల్ పార్క్ సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఈ మేరకు దిల్లీ జూకు వాజా లేఖ రాసింది. 1996లో నాటి భారత రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మకు జింబాబ్వే ఓ మగ ఏనుగును బహూకరించింది. ఈ ఏనుగుకు శంకర్‌గా నామకరణం చేసి దిల్లీ జూలో ఉంచారు. 2005లో తన సహజీవి అయిన బాంబై అనే మరో ఆఫ్రికన్ ఏనుగు మరణించడంతో శంకర్ ఒంటరిదయ్యింది. అనంతరం దీని సంక్షేమం విషయంలో జూ నిర్వాహకుల సేవల పట్ల వాజా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇటీవల వాజా కౌన్సిల్ విచారణ జరిపి శంకర్ సంరక్షణ పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ జూ సభ్యత్వాన్ని తాత్కాలికంగా రద్దు చేసింది. శంకర్ సంరక్షణ విషయంలో మెరుగైన ప్రణాళికలు రూపొందించి తమ ఆమోదం పొంది ఆరు నెలల్లోపు గణనీయమైన పురోగతి సాధించాలని లేకుంటే సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేస్తామని వాజా లేఖలో హెచ్చరించింది.

జర్మనీ, ఫ్రాన్సుల్లో భారత రాయబారుల నియామకం

దిల్లీ: జర్మనీ, ఫ్రాన్సు దేశాల్లో భారత నూతన రాయబారులను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ(ఎంఈఏ) సోమవారం నియమించింది. జర్మనీలో సీనియర్ దౌత్యవేత్త అజిత్ వినాయక్ గుప్తేను (1991 ఐఎఫ్ఎస్ బ్యాచ్), ఫ్రాన్సులో సంజీవ్ కుమార్ సింగ్లాను (1997 ఐఎఫ్ఎస్ బ్యాచ్) భారత రాయబారులుగా నియమించినట్లు పేర్కొంది. అజిత్ ప్రస్తుతం ఈజిప్టులో భారత రాయబారిగా పనిచేస్తుండగా, సంజీవ్ కుమార్ ఇజ్రాయెల్‌లో ఈ విధులు నిర్వహిస్తున్నారు.

జైలు శిక్ష అనుభవించడం ప్రారంభించిన ఈశ్వరన్

సింగపూర్: భారత సంతతికి చెందిన సింగపూర్ మాజీ రవాణా మంత్రి ఎస్.ఈశ్వరన్ (62) అవినీతి కేసులో తనకు పడిన ఏడాది జైలు శిక్షను సోమవారం నుంచి అనుభవించడం మొదలుపెట్టారు. ఈ శిక్ష మీద హైకోర్టుకు అప్పీలుకు వెళ్లకూడదని నిర్ణయించుకున్న ఈశ్వరన్ తాను చేసిన తప్పులపై జాతికి బేషరతుగా క్షమాపణ చెప్పారు. తన పదవిని దుర్వినియోగం చేసి ఇద్దరు వ్యాపారుల నుంచి ఏడేళ్లలో 3,13,200 డాలర్ల విలువైన బహుమతులను అక్రమంగా పొందారని, న్యాయానికి అడ్డుతగిలారని రుజువు కావడంతో గత గురువారంనాడు ఆయనకు జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఈశ్వరన్ పై వచ్చిన మరో 30 ఆరోపణలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. తనపై ఆరోపణలను ఆయన సెప్టెంబరు 24న ఒప్పుకున్నారు. కోర్టు విచారణ 2025 వరకు కొనసాగి తన కుటుంబాన్ని మానసికంగా కుంగదీస్తుందని గ్రహించి నేరాంగీకార ప్రకటన చేస్తున్నానని ఆయన వివరించారు.



దిల్లీలో దీక్ష కొనసాగిస్తున్న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్

అగ్రనాయకులు వచ్చి కలిసేవరకు లద్దాఖ్ భవన్‌లోనే

- స్పష్టంచేసిన సోనమ్ వాంగ్‌చుక్

దిల్లీ: దేశ అత్యున్నత నాయకత్వం తమను కలిసేందుకు ఎప్పుడు వస్తారో చెప్పేవరకు తాను, తన మద్దతుదారులు లద్దాఖ్ భవన్‌లోనే ఉంటామని పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ సోమవారం తెలిపారు. లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చుతామన్న ఎన్నికల హామీని భాజపా నెరవేర్చాలని మాత్రమే తాము కోరుతున్నామని, అసాధారణమైంది ఏదీ డిమాండ్ చేయడంలేదని పేర్కొన్నారు. "లద్దాఖ్ నుంచి 30-32 రోజులపాటు పాదయాత్ర చేసి ఇక్కడకు చేరుకున్నాం. నాయకులు కనీసం మాతో సమావేశమవ్వాలి. ఇక్కడ వాతావరణం వేడిగా ఉంది. దోమల బెడదా ఉంది. నిరసనల్లో వృద్ధులు సైతం ఉన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మా డిమాండ్ నెరవేరే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు" అని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు.

రూ.1.55 లక్షల కోట్ల నష్టం!

92% రోడ్లు, 66% భవనాలు నేలమట్టం • కోలుకోవడానికి దశాబ్దాల సమయం • గాజాలో దాడులకు ఏడాది



ఇజ్రాయెల్ క్షిపణి దాడితో గాజాలోని ఖాన్ యూనిస్‌లో ధ్వంసమైన భవనాలు

గాజాలో ఇజ్రాయెల్ దాడులకు ఏడాది నిండింది. ఈ ఏడాదిలో దాదాపుగా రూ.1.55 లక్షల కోట్ల (18.5 బిలియన్ డాలర్ల) నష్టం జరిగింది. ఇది 2022లో గాజా, వెస్ట్‌బ్యాంకుల్లో మొత్తం ఆర్థిక ఉత్పాదకతతో (జీడీపీ) సమానం. గాజాలో 92 శాతం రోడ్లు, 66 శాతం భవనాలు దెబ్బతిన్నాయి. మొత్తం విధ్వంసం నుంచి ఈ ప్రాంతం కోలుకోవడానికి దశాబ్దాల సమయం పడుతుంది. ఇప్పటికిప్పుడు యుద్ధం ఆగినా గాజావాసులంతా టెంట్లలో నివసించాల్సిందే. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఐక్యరాజ్య సమితి వేసిన అంచనా ప్రకారం.. 66 శాతం భవనాలు పూర్తిగా విధ్వంసమయ్యాయి. 2,27,000 ఇళ్లు దెబ్బతిన్నాయి. మిగిలినవీ నివసించేందుకు అనుకూలంగా లేవు.

✦ ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో సగం కంటే తక్కువ సైజులో గాజా ఉంటుంది. కానీ ఉక్రెయిన్‌లో కంటే అధికశాతం ప్రాంతం దాడులతో దెబ్బతింది.

✦ గాజా తాగునీరు, శానిటేషన్ వ్యవస్థ ధ్వంసమైంది. 84 శాతం ఆరోగ్య సౌకర్యాలు దెబ్బతిన్నాయి.

✦ గాజాలోని 23 లక్షల మంది ప్రజల్లో 90శాతం నిరాశ్రయులయ్యారు. వారు పలుమార్లు శరణార్థ శిబిరాలను మారాల్సి వచ్చింది.

✦ గాజాలో నిరుద్యోగం 80శాతానికి పెరిగింది. యుద్ధానికి ముందు అది 50శాతంగా ఉండేది. ప్రజలు మొత్తం పేదరికంలోనే జీవిస్తున్నారు. ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలు ఇప్పుడు శిథిల భవనాలుగా మారిపోయాయి. యుద్ధంవల్ల 4 కోట్ల టన్నుల చెత్త పేరుకుపోయింది.

✦ గాజాలో యుద్ధం కారణంగా ఇజ్రాయెల్‌కు సాయం రూపంలో అమెరికా 17.9 బిలియన్ డాలర్లను ఖర్చు చేసింది.

పునర్నిర్మాణం సాధ్యమా?

యుద్ధం తర్వాత గాజా పునర్నిర్మాణానికి సాయం చేస్తామని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రకటించాయి. అయితే గాజాలో పాలస్తీనా పాలనను అనుమతించబోమని ఇప్పటికే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. దీంతో పునర్నిర్మాణం ఎలా అనేదే ప్రశ్న. గాజాలో నిర్మాణాలను భారీగా సామగ్రిని తరలించాల్సి ఉంటుంది. దీనికి ఇజ్రాయెల్ అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు. గాజాలో ధ్వంసమైన ఇళ్లను నిర్మించాలంటే కనీసం 40 ఏళ్లు పడుతుందని అంచనా.

ఇదీ యుద్ధం లెక్క..

✦ ఇజ్రాయెల్‌లో మరణించినవారు: 1200 మందికిపైగా..

✦ హమాస్ బందీలుగా గాజాకు తరలించిన ఇజ్రాయెలీలు: 251 మంది.

✦ గాజాలో ప్రస్తుతం జీవించి ఉన్న బందీలు: 66 మంది.

✦ గాజాలో చనిపోయిన బందీలు: 35 మంది.

✦ గాజాలో మరణించిన పాలస్తీనావాసులు: 41,000 మందికిపైగా..

✦ గాజాలో గాయపడినవారు: 96,000 మంది.

✦ ఇజ్రాయెల్ హతమార్చామని చెబుతున్న మిలిటెంట్లు: 17,000 మంది.

✦ యుద్ధంలో మరణించిన ఇజ్రాయెల్ సైనికులు: 720 మంది.

✦ గత ఏడాది అక్టోబరు 7 నుంచి ఇజ్రాయెల్ పైకి ప్రయోగించిన రాకెట్లు: 9,500.

✦ గాజాలో నిరాశ్రయులు: 19 లక్షల మంది (90%).

✦ ఇజ్రాయెల్‌లో నిరాశ్రయులు: 58,000 మంది.

✦ దెబ్బతిన్న విద్యుత్తు గ్రిడ్లు: 510 కిలోమీటర్లు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

వికసిత్ భారత్

సాధించేవరకూ విశ్రమించేది లేదు

- ఎంతో సాధించినా ఇంకా ఎంతో ఉంది
- ప్రభుత్వాధినేతగా 23 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని మోదీ స్పందన

దిల్లీ: ఉమ్మడి లక్ష్యమైన వికసిత్ భారత్‌ను సాధించేవరకూ విశ్రమించబోనని దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఇందుకోసం అలుపులేకుండా పని చేస్తానని, మరింత బలంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. తొలిసారిగా 2001 అక్టోబరు 7వ తేదీన గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఆ తర్వాత ప్రధాని అయ్యారు. సోమవారంతో ప్రభుత్వాధినేతగా 23 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్స్‌లో వరుస పోస్టులు పెట్టారు.

ముఖ్యమంత్రిగా..

'నేను ప్రభుత్వాధినేతగా 23 ఏళ్లు పూర్తి చేసుకోవడానికి శుభాశీస్సులు అందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. 2001 అక్టోబరు 7వ తేదీన నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టా. నాలాంటి కార్యకర్తకు రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతలను అప్పగించడం మా పార్టీ భాజపా గొప్పదనం. నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి




గుజరాత్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. కచ్ భూకంపం, సూపర్ సైక్లోన్, కరవు, దశాబ్దాల కాంగ్రెస్ లూటీ పాలన, మతతత్వం, కులతత్వం వంటి సమస్యలున్నాయి. వాటన్నింటినీ అధిగమించి జనశక్తితో గుజరాత్‌ను పునర్నిర్మించాం. అభివృద్ధిలో ఉన్నత శిఖరాలకు చేర్చాం. గుజరాత్‌లో సంప్రదాయేతర రంగమైన వ్యవసాయంలోనూ విజయం సాధించాం. నా 13ఏళ్ల పాలనలో గుజరాత్ సబ్ కా సాత్ సబ్ కా వికాస్‌కు ఉదాహరణగా నిలిచింది' అని ప్రధాని పేర్కొన్నారు.

ప్రధానిగా..

'2014లో దేశ ప్రజలు భాజపాను రికార్డు స్థాయి మెజారిటీతో గెలిపించి నన్ను ప్రధానిని చేశారు. 30 ఏళ్లలో పూర్తి మెజారిటీ సాధించడం చరిత్రాత్మకం. గత దశాబ్దకాలంలో దేశం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లను పరిష్కరించాం. 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పించాం. ప్రపంచంలో భారత్ ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. మన విజయాలను ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది' అని మోదీ పేర్కొన్నారు.

మోదీ సుదీర్ఘ రాజకీయ ప్రయాణమే స్ఫూర్తి

- ప్రధానిని కొనియాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా



దిల్లీ: ఒక వ్యక్తి తన జీవితాంతం దేశ సేవ ఎలా చేస్తారో చెప్పడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రయాణమే నిదర్శనమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మోదీ రాజకీయాల్లోకి వచ్చి 23 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన స్పందించారు. 2001 అక్టోబరు 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. దాదాపు 13 ఏళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. "నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానిగా సోమవారంతో 23 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణమే ప్రజా సేవ కోసం ఒక వ్యక్తి తన జీవితం మొత్తాన్ని ఎలా అంకితం చేయగలరనే విషయానికి ప్రతీక. ఆయన రాజకీయ ప్రయాణంలో నిరంతరం హోం మంత్రిగా తోడుగా ఉండడం నా అదృష్టం. పేదల సంక్షేమం, భద్రత, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా దేశాన్ని అభివృద్ధి చేయడం కోసం ఎలా పని చేయాలో ప్రధాని నరేంద్ర మోదీ చూపించారు. 23 ఏళ్లుగా నిరాటంకంగా, అలసిపోకుండా, తనను తాను పట్టించుకోకుండా దేశానికి, ప్రజల సేవకే ఆయన అంకితం అయ్యారు" అని ఎక్స్ వేదికగా అమిత్ షా పేర్కొన్నారు.

ఝార్ఖండ్ ఎన్నికలపై భాజపా సీనియర్ల సమాలోచనలు

దిల్లీ: త్వరలో జరగనున్న ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై భాజపా సీనియర్ నేతలు తాజాగా సమాలోచనలు జరిపారు. దిల్లీలో భాజపా జాతీయాధ్యక్షుడు జె.పి.నడ్డా నివాసంలో ఆదివారం జరిగిన ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్‌సింగ్ చౌహాన్, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, ఝార్ఖండ్ భాజపా అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో తమ పార్టీ తరఫున బరిలో దించాల్సిన అభ్యర్థుల జాబితాపై వారు చర్చించారు. జేడీయూ, ఏజేఎస్‌యూ వంటి పార్టీలతో సీట్ల పంపకంపైనా చర్చలు జరిపారు. ఝార్ఖండ్‌లో భాజపా ఇంఛార్జిగా శివరాజ్ సింగ్ చౌహాన్, సహ ఇంఛార్జిగా హిమంత ఉన్నారు.

డైమార్ఫోస్ వద్దకు వ్యోమనౌక పయనం

కేప్ కెనావెరాల్: రెండేళ్ల కిందట ఒక వ్యోమనౌక ఢీకొట్టిన గ్రహశకలం వద్ద పరిస్థితులను పరిశోధించేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ) సోమవారం 'హెరా' అనే వ్యోమనౌకను ప్రయోగించింది. ఇది రోదసిలో రెండేళ్ల పాటు ప్రయాణించి లక్షిత ప్రదేశానికి చేరుకుంటుంది. అమెరికాలోని కేప్ కెనావెరాల్ నుంచి స్పేస్‌ఎక్స్‌కు చెందిన రాకెట్ ద్వారా ఈ ప్రయోగం జరిగింది. 2022లో అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా)కు చెందిన 'డార్ట్' వ్యోమనౌక.. 150 మీటర్ల వెడల్పున్న డైమార్ఫోస్ అనే గ్రహశకలాన్ని ఢీ కొట్టింది. భూమికి ప్రమాదకరంగా పరిణమించే వీలున్న అంతరిక్ష శిలల గమనాన్ని మార్చొచ్చా అన్నది పరిశీలించేందుకు శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. నిజానికి డైమార్ఫోస్.. డిడిమోస్ అనే మరో పెద్ద గ్రహశకలం చుట్టూ తిరుగుతోంది. డార్ట్ ఢీ వల్ల డైమార్ఫోస్ కక్ష్య తగ్గింది. దీన్నిబట్టి పుడమికి హానికరంగా మారే వీలున్న గ్రహశకలాలను ముందే గుర్తిస్తే.. వాటిని సురక్షితంగా దారిమళ్లించొచ్చని వెల్లడైంది. అయితే 'డార్ట్' ఢీ వల్ల ఉత్పన్నమైన పరిస్థితిని మరింత నిశితంగా గమనించాలని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. తద్వారా భవిష్యత్‌లో భూమిని రక్షించే క్రమంలో అవసరమైన మార్పులను గుర్తించాలని తలపోస్తున్నారు. డార్ట్ ఢీ వల్ల డైమార్ఫోస్ నుంచి భారీగా ధూళి, శిలలు రోదసిలోకి ఎగిసిపడ్డాయి. అవి 10వేల కిలోమీటర్ల దూరం వరకూ వ్యాపించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. కొన్ని శిలలు ఇప్పటికీ అక్కడే ఉండొచ్చని, వాటివల్ల 'హెరా' వ్యోమనౌకకు ప్రమాదం వాటిల్లవచ్చని కూడా పేర్కొన్నారు.

కేజ్రీవాల్ ఖాళీచేసిన నివాసంలోకి ఆతిశీ

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఇటీవల కేజ్రీవాల్ ఖాళీ చేసిన అధికారిక నివాసంలోకి ముఖ్యమంత్రి ఆతిశీ సోమవారం మారారు. ఈ పరిమాణం జరిగిన గంటల వ్యవధిలోనే భాజపా విమర్శనాస్త్రాలు సంధించింది. కొత్త కేటాయింపు చేసేందుకు బంగ్లాను ఇప్పటికీ ప్రజా పనుల విభాగానికి కేజ్రీవాల్ అప్పగించలేదని ఆరోపించింది. కొత్త నివాసంలోకి మారిన వెంటనే అక్కడి సిబ్బందితో ముఖ్యమంత్రి ఆతిశీ సమావేశమయ్యారు. అంతకుముందు ఓ చిన్నపాటి ట్రక్కులో ఉత్తర దిల్లీ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని ఆరో నంబరు బంగ్లాకు ఆమె వస్తువులు చేరుకున్నాయి. మరోవైపు, బంగ్లాకు సంబంధించి ప్రజా పనుల విభాగం రాసిన లేఖను దిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, భాజపా ఎమ్మెల్యే విజేందర్ గుప్తా సామాజిక అనుసంధాన వేదికల్లో పంచుకున్నారు. వాస్తవానికి కేజ్రీవాల్ ఇప్పటికీ బంగ్లా ఖాళీ చేయలేదని, ఆయనకు సంబంధించిన చాలా వస్తువులు శీష్‌మహల్ బంగ్లాలోనే ఉన్నాయని చెప్పారు. కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బంగ్లాకు రూ.కోట్లు వెచ్చించి మరమ్మతులు చేయించడాన్ని విమర్శిస్తూ ఆ నివాసాన్ని భాజపా 'శీష్‌మహల్'గా పేర్కొంటోంది.

ఆప్ రాజ్యసభ ఎంపీ నివాసంలో ఈడీ సోదాలు

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాజ్యసభ సభ్యుడు సంజీవ్ అరోడాపై నమోదైన భూకుంభకోణం కేసుకు సంబంధించి సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఇందులో జలంధర్, గురుగ్రామ్, దిల్లీలోని ప్రాంతాలతో పాటు లుధియానాలోని ఎంపీ నివాసం కూడా ఉంది. సోదాలపై ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి

- ఇద్దరు చైనీయుల మృతి
- మరో 17 మందికి గాయాలు


కరాచీ: పాకిస్థాన్ ఆర్థిక రాజధాని కరాచీలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఆత్మాహుతి దాడిలో ఇద్దరు చైనీయులు మృతి చెందారు. మరో 17 మంది గాయపడ్డారు. స్థానిక జిన్నా అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి సమీపంలో చైనా ఉద్యోగులే లక్ష్యంగా ఈ దాడి జరిగిందని అధికారులు సోమవారం తెలిపారు. ఈ ఘటనలో అనుమానిత సూసైడ్ బాంబర్ కూడా చనిపోయినట్లు వెల్లడించారు. పాక్‌లో షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశం జరగనున్న కొద్ది రోజుల ముందే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. జిన్నా విమానాశ్రయం నుంచి వెళ్లే చైనా ఇంజినీర్లు, పెట్టుబడిదారులే లక్ష్యంగా తాము ఈ ఆత్మాహుతి దాడికి పాల్పడ్డామని నిషేధిత బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) పేర్కొంది. "చైనా ఉద్యోగులతో వెళ్తున్న వాహనం విమానాశ్రయం సమీపంలోని ప్రధాన సిగ్నల్ దగ్గరికి రాగానే.. పేలుడు సంభవించేలా సూసైడ్ బాంబర్ చిన్న వాహనాన్ని ఉపయోగించినట్లు ప్రాథమిక నివేదికలో తేలింది" అని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆసిఫ్ షేక్ తెలిపారు. ఈ పేలుడు ధాటికి సిగ్నల్ దగ్గర ఉన్న మరో ఆయిల్ ట్యాంకర్‌కు మంటలు అంటుకుని అదీ పేలిందని, దాంతో మరికొందరికి గాయాలయ్యాయని పోలీసులు చెప్పారు. ఆత్మాహుతి దాడిలో తమ దేశస్థులు ఇద్దరు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారని చైనా కూడా ధ్రువీకరించింది. ఈ ఘటన తమకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని పేర్కొంది. తమ దేశస్థుల భద్రతలో గల లోపాలను సరిదిద్దాలని పాకిస్థాన్‌ను డిమాండ్ చేసింది. సీపెక్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న తమవారికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని సూచించింది.



ఆత్మాహుతి దాడి అనంతరం పాకిస్థాన్‌లోని కరాచీ విమానాశ్రయం వద్ద ధ్వంసమైన వాహనాలు

హారిస్‌పై ఖాళీ పుస్తకం.. అమెజాన్ బెస్ట్‌సెల్లర్

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రధాన పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో.. రాజకీయ ప్రచారం జోరందుకొంది. ఈ సమయంలో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్‌పై విడుదలైన ఓ సెటైర్ పుస్తకం అమెజాన్ బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఇప్పుడు ఇందుకు సంబంధించిన వీడియోను వీక్షించి నెటిజన్లు పగలబడి నవ్వుతున్నారు. 'ది అచీవ్‌మెంట్స్ ఆఫ్ కమలా హారిస్' పేరిట జేసన్ డూడాస్ ఓ పుస్తకాన్ని విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను మిషెల్ బోలెస్ సమకూర్చారు. ఇప్పుడు ఆన్‌లైన్ విక్రయ వేదిక అమెజాన్‌లో ఈ పుస్తకం బెస్ట్ సెల్లర్ జాబితాలో చేరింది. ఇంతకీ ఆ పుస్తకంలో ఏముందో తెలుసా..? పూర్తిగా తెల్ల కాగితాలు, అక్కడక్కడా కొన్ని అధ్యాయాల పేర్లు రాసి వదిలేసినట్లు కనిపిస్తోంది. వాల్‌మార్ట్ స్టోర్ బుక్ సెక్షన్‌లో ఈ పుస్తకం వీడియోను చిత్రీకరించిన వ్యక్తి టిక్‌టాక్‌లో తొలుత పోస్టు చేశాడు. అనంతరం జాక్ అనే వ్యక్తి చిత్రీకరించి ఎక్స్‌లో పోస్టు చేశాడు. దాదాపు ఏడు గంటల్లో 20 లక్షల మందికిపైగా దీనిని వీక్షించారు. వందల మంది దీనిని రీపోస్టు చేశారు. అమెజాన్‌లో దీని సమీక్షల స్క్రీన్‌షాట్లను కూడా అతడు పంచుకొన్నాడు. "ఇది పూర్తిగా వాస్తవాల ఆధారంగా రచించిన పుస్తకం. ఆమె 20 ఏళ్ల ప్రజాజీవితం మొత్తంపై సమగ్రంగా పరిశోధించి రాసిన డీటైల్డ్ రిపోర్టు ఇది" అని రచయిత పేర్కొన్నారు. అంతేకాదు.. వామపక్ష న్యాయవాదులు తనపై కేసులు వేస్తారనే భయంతో రచయిత ముందే 'ఈ పుస్తకం చాలావరకు ఖాళీగా ఉంది' అనే నోట్‌ను జత చేశాడు. ఈ పుస్తకంపై నెటిజన్లు జోకులు వేస్తున్నారు. 'ఈ పుస్తకం ఖరీదు 16 డాలర్లే. కానీ, దీనికి వెలకట్టలేం' అని ఓ యూజర్ వ్యాఖ్యానించాడు. "నేను మూడు పుస్తకాలను అమెజాన్ నుంచి ఆర్డర్ చేశాను. ఒకటి నా పొరుగింట్లో ఉన్న లిబరల్ మిత్రుడికి డెలివరీ అయింది. మిగిలిన రెండూ రావాల్సి ఉంది" అని మరో యూజర్ వెటకారంగా వ్యాఖ్యానించాడు.



మేం విఫలమయ్యాం: ఐడీఎఫ్

టెల్‌అవీవ్/జెరూసలెం: అక్టోబరు 7న హమాస్ జరిపిన దాడిని నిలువరించడంలో తాము విఫలమయ్యామని ఇజ్రాయెల్ సైన్యం అంగీకరించింది. సోమవారం ఆ దేశ ఆర్మీచీఫ్ హెర్జి హలెవీ ప్రత్యేక సందేశం విడుదల చేశారు. "ఇది సుదీర్ఘ యుద్ధం. ఇది సైనిక సామర్థ్యాలనే కాదు.. మానసిక శక్తిని.. దీర్ఘకాలం పోరాడే సామర్థ్యాన్ని పరీక్షిస్తోంది. ప్రతిరోజు, వారం, నెలా గడిచేకొద్దీ శత్రువుల పరిస్థితి ఘోరంగా తయారవుతోంది. అక్టోబరు 7కు దాడి రోజున ప్రజలను కాపాడాల్సిన బాధ్యతల్లో మేము విఫలమయ్యాం. మన దేశాన్ని నాశనం చేయాలని చూసేవారు ఎప్పటికీ కోలుకోలేరని తెలుసుకోవాలి. హమాస్ సైనిక విభాగాన్ని పూర్తిగా ఓడించాం. హెజ్‌బొల్లా సీనియర్ నాయకత్వమూ తుడిచిపెట్టుకుపోయింది" అని హెర్జి హలెవీ తెలిపారు. ఓవైపు గతేడాది అక్టోబరు 7న హమాస్ చేతిలో బందీగా మారిన ఇడాన్ స్టీవీ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయినట్లు సోమవారం ఇజ్రాయెల్ ప్రకటించింది. ప్రస్తుతం అతడి మృతదేహం కూడా హమాస్ వద్దే ఉందని పేర్కొంది. నోవా ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు స్టీవీ అక్కడికి వెళ్లగా.. హమాస్ దళాలు దాడి చేయడంతో తన ఇద్దరు మిత్రులతో కారులో తప్పించుకొనే యత్నం చేశాడు. కానీ, వారిని హమాస్ మిలిటెంట్లు అడ్డగించారు. దీంతో మరో మార్గంలో వేగంగా వెళుతున్న వీరి కారు చెట్టును ఢీకొంది. అనంతరం హమాస్ సభ్యులు ఆ వాహనాన్ని చుట్టుముట్టి అతడి మిత్రులను కాల్చి చంపారు. స్టీవీని బంధించారు.



దిల్లీలోని రాష్ట్రపతి భవన్ వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీతో మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, ఆయన సతీమణి సాజిధా మహమ్మద్

రాజ్‌ఘాట్‌లో నివాళులు

దిల్లీ: భారత్ పర్యటనకు వచ్చిన మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, ఆయన సతీమణి సాజిధా మహమ్మద్‌లకు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సాదర స్వాగతం పలికారు. ఆ సమయంలో ప్రధాని మోదీ కూడా అక్కడే ఉన్నారు. రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి ముయిజ్జు దంపతులు పుష్పాంజలి ఘటించారు.

భారత పర్యాటకులకు ముయిజ్జు విజ్ఞప్తి

మాల్దీవుల్లో పర్యటించాలంటూ భారతీయులకు ముయిజ్జు విజ్ఞప్తి చేశారు. వారు తమ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతున్నారని పేర్కొన్నారు. ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ముయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు, ఆ దేశానికి చెందిన కొందరు మంత్రులు చేసిన వ్యాఖ్యలతో భారత్‌తో సంబంధాలు ఒడుదొడుకులకు లోనయిన సంగతి తెలిసిందే. చైనా అనుకూలుడిగా ముయిజ్జుకు పేరుంది.

ఉద్యోగానికి భూమి కేసులో లాలూ, ఆయన కుమారులకు బెయిల్



కోర్టు వద్ద ఆర్జేడీ అధినేత లాలూ, ఆయన కుమార్తె మీసా భారతి

దిల్లీ: రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారులు...తేజస్వీ, తేజ్ ప్రతాప్‌లకు దిల్లీ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. లాలూ ప్రసాద్ కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో భూమి/స్థలాలను ముడుపులుగా తీసుకుని ఉద్యోగాలిచ్చారనే ఆరోపణలకు సంబంధించి మనీలాండరింగ్ కేసు నమోదైంది. లాలూతో పాటు ఆయన ఇద్దరు కుమారులూ నిందితులుగా ఉన్నారు. రూ.లక్ష చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించి నిందితులు బెయిల్ పొందవచ్చని ప్రత్యేక కోర్టు జడ్జి తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు సంస్థలు అదనపు అభియోగాలు మోపడంతో నిందితులకు గతంలో జడ్జి సమన్లు జారీ చేశారు.

ఏసీ, సోఫాలు ఎత్తుకెళ్లారు!

- తేజస్వీ యాదవ్‌పై భాజపా ఆరోపణలు

పట్నా: ఆర్జేడీ నేత, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌పై భాజపా సంచలన ఆరోపణలు చేసింది. అధికారిక నివాసాన్ని ఖాళీ చేసే సమయంలో అందులోని ఏసీ, సోఫాలు, బెడ్స్, ట్యాప్స్ వంటివి ఎత్తుకెళ్లారని పేర్కొంది. ఆర్జేడీ-జేడీయూ-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం హయాంలో తేజస్వీ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ప్రభుత్వం పడిపోవడంతో ఆ పదవిని కోల్పోయారు. పట్నాలో ఆయన ఉన్న అధికారిక నివాసాన్ని ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీకి కేటాయిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత ఆదివారం తేజస్వీ ఈ నివాసాన్ని ఖాళీ చేశారు. ఆ తర్వాత వెళ్లి చూడగా అందులోని పలు వస్తువులు కన్పించకుండా పోయాయని, ఆ జాబితాను త్వరలోనే విడుదల చేస్తామని భాజపా మీడియా ఇన్‌ఛార్జ్ దానిశ్ ఇక్బాల్ వెల్లడించారు.

చైనా నిఘా బెలూన్లను కూల్చివేయడంపై భారత వాయుసేన సాధన

ఇంటర్నెట్ డెస్క్: పొరుగు దేశాలపై నిఘా కోసం చైనా ప్రయోగించే బెలూన్లను కూల్చివేయడంపై భారత వాయుసేన తీవ్రంగా సాధన చేసినట్లు సమాచారం. దాదాపు 15 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణిస్తున్న వస్తువును కూల్చడంపై కొన్ని నెలల క్రితం తూర్పు ఎయిర్ కమాండ్‌లో శిక్షణ కార్యక్రమం జరిగినట్లు ఓ ఆంగ్ల పత్రిక కథనంలో పేర్కొంది. అత్యంత ఎత్తులో ఉన్న బెలూన్‌ను కూల్చే ఈ ఆపరేషన్‌లో రఫేల్ యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. దీనిలో ఉపయోగించిన బెలూన్లకు పేలోడ్‌ను కూడా అమర్చారు. దానిని దాదాపు 55 వేల అడుగుల ఎత్తులో ఒక క్షిపణిని ప్రయోగించి కూల్చివేశారు. దీంతో గగనతలంలో నిదానంగా కదిలే భారీ లక్ష్యాలను కూడా కూల్చేసే సత్తా భారత్‌కు ఉన్నట్లు తేలింది. 2023లో చైనా ప్రయోగించిన ఓ బెలూన్ అమెరికాలోని దక్షిణ కరోలినా గగనతలంలో ప్రత్యక్షమై సంచలనం సృష్టించింది. నాడు అమెరికా యుద్ధ విమానం ఎఫ్-22 సాయంతో దీనిని కూల్చివేశారు. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై ఇటువంటి బెలూన్లు కనిపించినట్లు వార్తలొచ్చాయి. భారత్‌లో కూడా త్రివిధ దళాల కమాండ్ ఉన్న అండమాన్ నికోబార్ దీవులపై ఇలాంటివి కనిపించాయి.

సరిహద్దుల్లో చైనా నిఘా డ్రోన్ల సంచారం

హిమాచల్‌ప్రదేశ్‌లోని కిన్నౌర్ జిల్లాలో భారత్-చైనా సరిహద్దులో డ్రోన్ల సంచారాన్ని గుర్తించినట్లు ఆ రాష్ట్ర మంత్రి జగత్‌సింగ్ నేగి తెలిపారు. చైనాకు చెందినవిగా భావిస్తున్న ఈ డ్రోన్లు నిఘా, గూఢచర్య కార్యకలాపాల కోసం ప్రయోగించి ఉండొచ్చన్నారు.

'ఇమ్రాన్ కుటుంబ సభ్యులనూ కలుసుకోరాదు'

లాహోర్: పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ (72), ఆయన భార్య బుష్రా బీబీలు తమ కుటుంబ సభ్యులను కానీ, న్యాయవాదులను కానీ, పార్టీ నాయకులను కానీ ఈ నెల 18వ తేదీ వరకు కలుసుకోవడానికి వీల్లేదని పాక్ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిషేధం విధించింది. ఇమ్రాన్, బుష్రాలు జైలులో ఉన్నారు. ప్రస్తుతం పీటీఐ కార్యకర్తలు దేశమంతటా ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు జరుపుతున్నారు. వీరు ఇస్లామాబాద్‌లో ఈ నెల 15, 16 తేదీలలో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) శిఖరాగ్ర సభకు విఘాతం కలిగిస్తారనే అనుమానంతోనే పై నిషేధం విధించినట్లు పంజాబ్ అధికారులు తెలిపారు. భద్రతా కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఎస్సీవో సభకు కట్టుదిట్టమైన భద్రత కల్పించడానికి పాక్ సైన్యం రంగంలోకి దిగింది.

ఈనాడు బిజినెస్

అమెరికాకు మధుమేహ ఔషధం: నాట్కో

నోవో నార్డిస్క్‌తో పేటెంట్ వివాదం పరిష్కారం

ఈనాడు, హైదరాబాద్: మధుమేహ వ్యాధిని, అధిక బరువును అదుపు చేయడానికి వినియోగించే 'ఒజెంపిక్' అనే ఔషధం విషయంలో నోవో నార్డిస్క్ అనే బహుళ జాతి కంపెనీతో తలెత్తిన పేటెంట్ వివాదాన్ని నాట్కో ఫార్మా - మైలాన్ ఫార్మాస్యూటికల్స్ సంస్థలు సామరస్యంగా పరిష్కరించుకున్నాయి. ఈ మేరకు సర్దుబాటు ఒప్పందం కుదుర్చుకున్నట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది. సెమగ్లుటైడ్ (ఒజెంపిక్ బ్రాండు జనరిక్ మందు) అనే ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసి, అమెరికాలో విక్రయించడానికి నాట్కో ఫార్మా కొంత కాలం క్రితం సిద్ధమైంది. దీనికి మైలాన్ ఫార్మా పంపిణీ భాగస్వామిగా నాట్కోతో జత కలిసింది. ఈ ఔషధానికి అనుమతి కోసం యూఎస్ఎఫ్‌డీఏ (అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ) వద్ద పారా-4 పైలింగ్‌తో ఏఎన్‌డీఏ దరఖాస్తును ఈ సంస్థలు దాఖలు చేశాయి. ఈ లోపు ఒజెంపిక్ బ్రాండు యజమాని అయిన నోవో నార్డిస్క్ అమెరికా న్యాయస్థానంలో మైలాన్‌పై పేటెంట్ ఉల్లంఘన ఫిర్యాదు దాఖలు చేయగా, విచారణ జరుగుతోంది. ఇంతలోనే ఇరుపక్షాలు ఒక అవగాహనకు వచ్చి, వివాదాన్ని పరిష్కరించుకున్నాయి.

రూ. లక్ష కోట్ల అమ్మకాలు: 'ఒజెంపిక్' ఔషధం వార్షిక అమ్మకాలు 12 బిలియన్ డాలర్ల (సుమారు రూ. లక్ష కోట్ల)కు పైగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మధుమేహ వ్యాధిని అదుపు చేసే కొత్త తరం ఔషధం ఇది. ఈ ఔషధాన్ని వెంటనే అమెరికాలో విడుదల చేసే అవకాశం నాట్కో-మైలాన్ ఫార్మాకు తాజా ఒప్పందం వల్ల కలుగుతోందని సమాచారం.

అమ్మకానికి హైడెల్‌బర్గ్ సిమెంట్!

4% పెరిగిన షేరు

దిల్లీ: జర్మనీకి చెందిన హైడెల్‌బర్గ్ మెటీరియల్స్ ఏజీ గ్రూప్ సిమెంట్, తమ భారత అనుబంధ సంస్థ హైడెల్‌బర్గ్ సిమెంట్ ఇండియా వ్యాపారాన్ని విక్రయించేందుకు రంగం సిద్ధమైంది. అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్స్ రూ.10,000 కోట్ల విలువతో ఈ సంస్థను కొనేందుకు సంప్రదింపులు జరుపుతోందని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. అల్ట్రాటెక్ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ వంటి కంపెనీలు కూడా ఈ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. హైడెల్‌బర్గ్ ఇండియా సిమెంట్‌కు మొత్తం 6.36 మిలియన్ టన్నుల వార్షిక సిమెంట్ గ్రైండింగ్ సామర్థ్యం ఉంది. హైడెల్‌బర్గ్ మెటీరియల్స్‌కే చెందిన జువారీ సిమెంట్‌కు 7.1 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉంది. ఈ కంపెనీని కూడా స్వాధీనం చేసుకోవాలని అదానీ యత్నంగా చెబుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్లాంట్లు: జువారీ సిమెంటుకు ఆంధ్రప్రదేశ్ వైయస్సార్ జిల్లా ఎర్రగుంట్ల సమీపంలోని కృష్ణానగర్‌లో, తెలంగాణలోని నల్గొండ జిల్లా సీతాపురంలో సిమెంటు ప్లాంట్లున్నాయి. వీటితో పాటు చెన్నై, కోచి, సోలాపూర్‌లలోనూ యూనిట్లు ఉన్నాయి.

వాటాలు ఇలా: హైడెల్‌బర్గ్ సిమెంట్ ఇండియాలో హైడెల్‌బర్గ్ మెటీరియల్స్‌కు 69.39% వాటా ఉంది. 2006లో మైసూర్ సిమెంట్స్‌లో నియంత్రిత వాటాను కొనుగోలు చేసిన హైడెల్‌బర్గ్ మెటీరియల్స్ తొలుత ఇండోరమ సిమెంట్‌తో సంయుక్త సంస్థను ఏర్పాటు చేసింది. తదుపరి 2008లో పూర్తిగా ఈ సంస్థను స్వాధీనం చేసుకుంది. 2009లో ఇండోరమ సిమెంట్ కూడా మైసూర్ సిమెంట్స్‌లో విలీనమైంది. తదుపరి హైడెల్‌బర్గ్ సిమెంట్ ఇండియా సామ్రాజ్యాన్ని విస్తరించింది. ఈ కంపెనీ భారత స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంది. ప్రస్తుత షేరు ధర ప్రకారం, హైడెల్‌బర్గ్ మెటీరియల్స్ వాటా విలువ సుమారు రూ.3,437 కోట్లుగా ఉంది. 2023-24లో హైడెల్‌బర్గ్ సిమెంట్ ఆదాయం 6% పెరిగి రూ.2,420.3 కోట్లకు చేరింది. నికర లాభం రూ.99.1 కోట్ల నుంచి 69% పెరిగి రూ.167.70 కోట్లకు చేరింది.

✦ హైడెల్‌బర్గ్ సిమెంట్ ఇండియా తన వ్యాపారాన్ని విక్రయించబోతోందన్న వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు 4.03% పెరిగి రూ.227.40 వద్ద ముగిసింది. అంబుజా సిమెంట్స్ షేరు మాత్రం 3.19% తగ్గి రూ.590.50 వద్ద స్థిరపడింది.


దేశంలో 100 ఆహార పరీక్షా ల్యాబ్‌లు

దిల్లీ: దేశవ్యాప్తంగా 100 ఆహార పరీక్షా ల్యాబ్‌లు, 50 ఆహార ఇర్రేడియేషన్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆహార శుద్ధి శాఖ మంత్రి చిరాగ్ పాస్వాన్ తెలిపారు. ఆహార తయారీ స్థాయిని పెంచడం, నాణ్యత, భద్రత ఉండేలా చూసే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్పత్తుల నాణ్యతపై రాజీపడని పరిశ్రమ వర్గాలను పాస్వాన్ కోరారు. దీని వల్ల బ్రాండ్‌పైనే కాకుండా దేశ ప్రతిష్ఠపై ప్రభావం పడుతుందని అన్నారు. నియంత్రణ సంస్థలు విధించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులు ఉండేలా చేసేందుకు 100 ఆహార పరీక్షా ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆహార తయారీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆహార వృథా తగ్గించాలని, ఉత్పత్తులకు అదనపు విలువ జోడించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. భారత్‌ను అంతర్జాతీయ ఆహార కేంద్రంగా మార్చేందుకు పరిశ్రమ వర్గాలు పనిచేయాలని చిరాగ్ పాస్వాన్ సూచించారు.

ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశాలు ప్రారంభం

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని కమిటీ, కీలక రేట్లపై నిర్ణయం తీసుకోనుంది. బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీసీ నిర్ణయాలను శక్తికాంతదాస్ ప్రకటిస్తారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో, కమొడిటీ ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణంపై మళ్లీ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈసారి కీలకరేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంది.

ఏఏఏఐ అధ్యక్షుడిగా ప్రశాంత్ కుమార్




ముంబయి: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా 2024-25 ఏడాదికి, గ్రూప్‌ఎం మీడియా ఇండియా సీఈఓ (దక్షిణాసియా) ప్రశాంత్ కుమార్ మళ్లీ ఎన్నికయ్యారు. ముంబయిలో జరిగిన ఏఏఏఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా హవాస్ ఇండియా గ్రూప్ సీఈఓ (ఆగ్నేయ, ఉత్తరాసియా) రానా బారువా ఎన్నికయ్యారు. బోర్డు సభ్యులుగా ఎన్నికైన వారిలో శామ్ బల్సారా (మాడిసన్ కమ్యూనికేషన్స్), తాన్యా గోయల్ (ఎవరెస్ట్ బ్రాండ్ సొల్యూషన్స్), తపాస్ గుప్తా (బీఈఐ కాన్ఫ్యూయెన్స్ కమ్యూనికేషన్), విషన్‌దాస్ హర్దాసానీ (మ్యాట్రిక్స్ పబ్లిసిటీస్ అండ్ మీడియా ఇండియా), మోహిత్ జోషి (హవాస్ మీడియా), సంతోష్ కుమార్ (ఇన్నోసియాన్ వరల్డ్‌వైడ్ కమ్యూనికేషన్), కునాల్ లలానీ (క్రేయాన్ అడ్వర్టైజింగ్), రోహిన్ మెహతా (కినెక్ట్), చంద్రమౌళి (ముత్తు మైత్రి అడ్వర్టైజింగ్), విక్రమ్ సఖుజా (ప్లాటినం అడ్వర్టైజింగ్), కల్యాణ్ సర్కార్ (స్టాండర్డ్ పబ్లిసిటీ), కె.శ్రీనివాస్ (శ్లోకా అడ్వర్టైజింగ్, హైదరాబాద్) ఉన్నారు. ఏఏఏఐ బోర్డులో ఎక్స్-అఫీసియో సభ్యునిగా అనుప్రియా ఆచార్య వ్యవహరిస్తారు.

✦ సవాళ్లను ఎదుర్కోవడంలో, కొత్త అవకాశాలు అన్వేషించడంలో, వినూత్నకు పెద్దపీట వేయడంలో శాయశక్తులా కృషి చేస్తున్నామని ఏఏఏఐ ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న ప్రశాంత్ తెలిపారు.

10 రోజుల్లో 12 కోట్ల స్పామ్ కాల్స్ గుర్తించాం

తెలుగు రాష్ట్రాలపై ఎయిర్‌టెల్



శివన్ భార్గవ

ఈనాడు, హైదరాబాద్: మొబైల్ వినియోగదారులకు వచ్చే స్పామ్ కాల్స్ విషయంలో అంతర్జాతీయంగా భారత్‌ది నాలుగో స్థానం. 87% మందికి అనవసరమైన సందేశాలు వస్తుంటాయి. వీటిని గుర్తించేందుకు ఇన్నాళ్లూ థర్డ్ పార్టీ యాప్‌లపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేదంటోంది భారతీ ఎయిర్‌టెల్. తమ నెట్‌వర్క్ స్మార్ట్‌ఫోన్లకు వచ్చే కాల్స్, సంక్షిప్త సందేశా (ఎస్ఎంఎస్)ల్లో స్పామ్ ఏవో 2 మిల్లీ సెకన్లలోనే కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా గుర్తించి, వినియోగదారుకు హెచ్చరికగా తెలియ చేస్తున్నామని వెల్లడించింది. ఈ సేవలను ప్రారంభించిన 10 రోజుల్లో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న 3.38 కోట్ల ఎయిర్‌టెల్ వినియోగదారులకు వచ్చిన వాటిల్లో 12.2 కోట్ల స్పామ్ కాల్స్, 23 లక్షల స్పామ్ సంక్షిప్త సందేశాల (ఎస్ఎంఎస్)ను గుర్తించి, వారిని హెచ్చరించినట్లు భారతీ ఎయిర్‌టెల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివన్ భార్గవ సోమవారం ఇక్కడ తెలిపారు. మొత్తం 250కి పైగా అంశాలను విశ్లేషించాకే, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సిస్టం ఈ హెచ్చరిక చేస్తోందని పేర్కొన్నారు. సందేశాల్లో వచ్చే ప్రమాదకర వెబ్‌లింకులపై అనుకోకుండా క్లిక్ చేసినా, వెంటనే తగిన హెచ్చరికలు వస్తాయని తెలిపారు. ఫోన్‌కు ఉండే ఐఎంఈఐని మార్చి కాల్స్ చేసినా, సందేశాలు పంపించినా నెట్‌వర్క్ ఇట్టే పట్టేస్తుందన్నారు.

లుఫ్తాన్సాతో జీఎంఆర్ ఏరో టెక్నిక్స్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: దేశంలో విమానాల ఇంజిన్ కోర్ వాష్ సేవల నిర్వహణ కోసం జీఎంఆర్ గ్రూపు సంస్థ అయిన ఏరో టెక్నిక్, లుఫ్తాన్సా టెక్నిక్‌తో భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనివల్ల వినియోగదార్లకు స్థిరమైన సేవలు అధిక నాణ్యత, తక్కువ ఖర్చుతో లభిస్తాయని జీఎంఆర్ ఏరో టెక్నిక్ పేర్కొంది. ఈ ఏడాది చివర్లో బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇంజిన్ కోర్ వాష్ సేవలు ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. లుఫ్తాన్సా అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, నారో - వైడ్ బాడీ విమానాల ఇంజిన్లకు సేవలు అందిస్తామని తెలిపింది. లుఫ్తాన్సా 'సైకిలన్' పేరుతో 60కి పైగా దేశాల్లో ఈ సేవలందిస్తోంది.

హిమాచల్ ప్రదేశ్ ఆర్టీసీకి ఒలెక్ట్రా 327 విద్యుత్తు బస్సులు!



ఈనాడు, హైదరాబాద్: హిమాచల్ ప్రదేశ్ ఆర్టీసీ 327 విద్యుత్తు బస్సుల కొనుగోలుకు పిలిచిన టెండర్లలో, హైదరాబాద్‌కు చెందిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ తక్కువ ధర కోట్ చేసి ఎల్-1గా ఎంపికైంది. ఇందులో 9 మీటర్ల పొడవైన బస్సులు 297, 12 మీటర్ల పొడవైన బస్సులు 30 ఉన్నాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, స్విచ్ మొబిలిటీ ఈ టెండర్లలో పాల్గొన్నాయి. హిమాచల్ ప్రదేశ్ పర్వత ప్రాంతాల్లో ఎత్తైన కొండలు, వాటి మధ్య లోయల్లో, కఠిన పరిస్థితుల్లో ప్రయాణించే బస్సులకు అధిక సామర్థ్యం ఉండాలి. మనాలి-రోహ్‌తంగ్ పాస్ మధ్య 13 వేల మీటర్ల ఎత్తైన, ఘాట్ మార్గంలో బస్సులు తిప్పడం కష్టం. ఈ ప్రాంతాల్లో కొంతకాలంగా ఒలెక్ట్రా విద్యుత్తు బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయి. కొత్త టెండర్ల ప్రకారం ఇచ్చే బస్సులు, మోడల్‌ను బట్టి ఒకసారి ఛార్జి చేస్తే 180-250 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తాయని కంపెనీ తెలిపింది.

కోడి గుడ్లు

8న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	525
గోదావరి	525
విశాఖపట్నం	525
చిత్తూరు	523

నా ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది..



'నా ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది.. ఆందోళనపడాల్సిన అవసరం లేదు. వయసు రీత్యా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు ప్రస్తుతం వైద్య పరీక్షలు చేయించుకుంటున్నా. ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరానంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదు. నా ఆరోగ్యంపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయొద్దని ప్రజలకు, మీడియాకు విజ్ఞప్తి చేస్తున్నా'

– టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా

(బీపీ పడిపోవడంతో సోమవారం టాటాను ముంబయిలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్‌లో చేర్చారంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో, ఆయన ఈ స్పష్టత ఇచ్చారు)

బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రచారకర్త సచిన్ తెందుల్కర్



సచిన్‌తో దేబదత్త చంద్

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా తన అంతర్జాతీయ ప్రచారకర్తగా క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్‌ను నియమించుకుంది. ఈ సందర్భంగా 'బీఓబీ మాస్టర్‌స్ట్రోక్ సేవింగ్స్ అకౌంట్‌'ను అందుబాటులోకి తెస్తున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా ఎండీ, సీఈఓ దేబదత్త చంద్ పేర్కొన్నారు. ఇందులో ఫ్లెక్సీ ఫిక్స్‌డ్ డిపాజిట్ సౌకర్యం, రిటైల్ రుణాలపై వడ్డీ రాయితీ, ఉచిత ఎటెర్నా క్రెడిట్ కార్డు, వరల్డ్ ఓప్యులెన్స్ వీసా ఇన్ఫినిటీ డెబిట్ కార్డులాంటి సౌకర్యాలుంటాయి. ఈ ఖాతాలో కనీసం రూ.10 లక్షలు నిల్వ ఉంచాలి.

2030 కల్లా 30 కోట్ల మంది దేశీయ విమాన ప్రయాణికులు

మంత్రి రామ్మోహన్ నాయుడు

దిల్లీ: దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 2030 కల్లా 30 కోట్లకు చేరే అవకాశం ఉందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాల సామర్థ్యం పెంపునకు 11 బిలియన్ డాలర్లు (సుమారు రూ.92,000 కోట్లు) వెచ్చిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణహిత విమాన ఇంధన సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు భారత్, ఫ్రాన్స్ కలిసి పనిచేస్తాయని ఫ్రెంచ్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తెలిపారు. ప్రస్తుతం మన దేశంలో 157 విమానాశ్రయాలుండగా, 2025 కల్లా ఈ సంఖ్య 200కు చేరే అవకాశం ఉంది.

బోయింగ్ 737 విమానాలతో జాగ్రత్త


దేశీయ సంస్థలకు డీజీసీఏ సూచన



దిల్లీ: బోయింగ్ 737 విమానాలను నిర్వహిస్తున్న దేశీయ విమానయాన సంస్థలు జాగ్రత్తగా ఉండాలని విమానయాన నియంత్రణ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సూచించింది. ఆ విమానాల్లో రడ్డర్ నియంత్రణ వ్యవస్థ మొరాయిస్తోందని, దీంతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపింది. విమానాల వర్టికల్ యాక్సిస్‌ను నియంత్రించే వ్యవస్థే రడ్డర్. ఇటీవల బోయింగ్ 737 విమానాల భద్రతపై అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ) దర్యాప్తు నివేదికను వెలువరించింది. ఇందులో రడ్డర్ నియంత్రణ వ్యవస్థపై ఎన్‌టీఎస్‌బీ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత విమానయాన సంస్థలకు డీజీసీఏ భద్రతా నియామవళిని ఇచ్చింది. ప్రస్తుతం భారత్‌లో బోయింగ్ 737 విమానాలను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ వంటి సంస్థలు వినియోగిస్తున్నాయి. అన్ని సంస్థలు ఈ విమానాలపై భద్రతాపరమైన పరీక్షలు చేపట్టాలని డీజీసీఏ ఆదేశించింది.

భారత్ నుంచి మరిన్ని విడిభాగాలు: ఎయిర్‌బస్ సీఈఓ: భారత్ నుంచి విడిభాగాలను తీసుకోవడం పెంచనున్నట్లు ఎయిర్‌బస్ సీఈఓ గులేమ్ ఫారీ పేర్కొన్నారు. దేశీయ సంస్థలు ఇండిగో, ఎయిరిండియా నుంచి ఎయిర్‌బస్ భారీగా కొత్త విమానాల ఆర్డర్లను అందుకుంది. 2019-23లో విమానాల తయారీ కోసం భారత్ నుంచి విడిభాగాలు, సేవలను తీసుకోవడం రెట్టింపు చేసి, బిలియన్ యూరోలకు పెంచినట్లు ఫారీ తెలిపారు. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విమానయాన విపణిగా భారత్ ఉందని, ఇక్కడ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ నెలకొందన్నారు. భారత్‌లో ఎయిర్‌బస్‌కు 100కు పైగా సరఫరాదారులు ఉన్నారు.

నెస్లే ఇండియా కొత్త ఛైర్మన్ మనీశ్ తివారీ



దిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా నాయకత్వంలో మార్పులు ప్రకటించింది. 2025 ఆగస్టు నుంచి నెస్లే ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌గా, అమెజాన్ ఇండియా మాజీ అధిపతి మనీశ్ తివారీని సంస్థ నియమించింది. నెస్లే ఇండియా ప్రస్తుత ఎండీ సురేశ్ నారాయణన్ 2025 జులైలో పదవీ విరమణ చేయనున్నారు. గత 26 ఏళ్లుగా నెస్లే గ్రూప్‌లో నారాయణన్ పనిచేశారు. 2015లో మ్యాగీ వివాదం సమయంలో కంపెనీని సమర్థంగా నడిపించారు. మనీశ్ తివారీ నియామకానికి కొన్ని అనుమతులు రావాల్సి ఉందని నెస్లే ఇండియా తెలిపింది.

కార్ల నిల్వలు పేరుకున్నాయ్

● దిద్దుబాటు చర్యలు తీసుకోండి ● కంపెనీలను కోరిన డీలర్ల సంఘం



దిల్లీ: దేశంలో వాహన రిటైల్ విక్రయాలు, వార్షిక ప్రాతిపదికన గత నెలలో 9% తగ్గాయి. గిరాకీ నెమ్మదించడంతో ప్రయాణికుల వాహనాల (కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్ల) నిల్వలు రికార్డు స్థాయికి చేరాయని వాహన డీలర్ల సమాఖ్య ఫాడా తెలిపింది. వాహన తయారీ కంపెనీలు (ఓఈఎం) ఈ పరిస్థితిని గమనించి, దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఫాడా కోరింది. 2023 సెప్టెంబరులో 18,99,192 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా, గత నెలలో అవి 17,23,330కి పరిమితమయ్యాయి. ప్రయాణికుల వాహన (పీవీ) విక్రయాలు 3,39,543 నుంచి 19% తగ్గి 2,75,681కి పరిమితమయ్యాయి. వినాయక చవితి, ఓనమ్ వంటి పండుగల సమయంలోనూ రిటైల్ విక్రయాలు నెమ్మదించాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ వెల్లడించారు. సీజనల్ అంశాలతో పాటు భారీ వర్షాలు, నిదానించిన ఆర్థిక వ్యవస్థ వంటివి పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయని వివరించారు. డీలర్ల వద్ద 80-85 రోజులకు సరిపడా, రూ.79,000 కోట్ల విలువైన సుమారు 7.9 లక్షల వాహనాలు నిల్వ ఉన్నట్లు వివరించారు. ఇంతటి అధిక నిల్వలు గతంలో ఎప్పుడూ లేవన్నారు.

ఏప్రిల్-సెప్టెంబరు మధ్య ఫరవాలేదు: 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబరులో అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 1,19,15,963 వాహనాలు రిటైల్‌గా విక్రయమయ్యాయి. ఏడాది క్రితం ఇదే సమయంలో విక్రయమైన 1,11,83,734 వాహనాలతో పోలిస్తే ఇవి 7% ఎక్కువ. ఇందులో ప్రయాణికుల వాహన రిజిస్ట్రేషన్లు 18,51,249 నుంచి 1% పెరిగి 18,70,991కు చేరాయి. ద్విచక్ర వాహన విక్రయాలు 9% పెరిగి 85,66,531కి చేరాయి. వాణిజ్య వాహన రిజిస్ట్రేషన్లు 4,80,488 నుంచి స్వల్పంగా తగ్గి 4,77,381గా నమోదయ్యాయి.

వాహన విభాగం	సెప్టెంబరు విక్రయాలు	వృద్ధి/ క్షీణత (%)
ద్విచక్ర	12,04,259	−8
వాణిజ్య	74,324	−10
త్రిచక్ర	1,06,524	0.65
ట్రాక్టర్లు	74,324	15

పండుగ విక్రయాలపై ఆశలు: దసరా-దీపావళి సమయంలో విక్రయాలపై డీలర్లతో పాటు కంపెనీలు కూడా ఆశావహంగా ఉన్నాయి. వ్యవసాయ పరిస్థితులు బాగున్నందున, గ్రామీణ విపణిలో గిరాకీ పెరుగుతుందని భావిస్తున్నారు. అధిక నిల్వలను ఈ నెలలో తగ్గించుకుని, 2024-25 మిగతా ఆర్థిక సంవత్సరంలో సానుకూల వృద్ధి నమోదు చేయాలనే భావనలో ఉన్నారు.

ఏథర్ స్కూటర్లపై ఆఫర్లు

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ ద్విచక్ర వాహన సంస్థ ఏథర్ ఎనర్జీ తమ 450ఎక్స్, 450అపెక్స్ స్కూటర్లపై పండగల ఆఫర్ ప్రకటించింది. ఈ రెండు స్కూటర్లపైనా గరిష్ఠంగా రూ.25,000 వరకు ప్రయోజనాలు అందిస్తున్నట్లు పేర్కొంది. ఇందులో ఏడాది కాలానికి ఉచిత ఏథర్ గ్రిడ్ ఛార్జింగ్, కొనుగోలుపై రూ.5,000 వరకు రాయితీ, ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా 8 ఏళ్లపాటు బ్యాటరీ వారంటీ వర్తింపులాంటివి ఉన్నాయని తెలిపింది.

అమెజాన్ చేతికి ఎంఎక్స్ ప్లేయర్ యాప్

దిల్లీ: ఉచిత స్ట్రీమింగ్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఎంఎక్స్ ప్లేయర్‌ను కొనుగోలు చేసినట్లు అమెజాన్ సోమవారం వెల్లడించింది. దీన్ని కంటెంట్ స్ట్రీమింగ్ సర్వీస్ మినీటీవీతో విలీనం చేసి 'అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌'ను ఆవిష్కరించనుంది. ఎంఎక్స్ ప్లేయర్‌ను ఎంత మొత్తం వెచ్చించి కొనుగోలు చేసిందీ అమెజాన్ ప్రకటించలేదు. వినోదాన్ని ఎక్కువ మంది ప్రేక్షకులకు అందించాలన్నదే ఈ విలీన లక్ష్యమని అమెజాన్ తెలిపింది. అమెజాన్ మినీటీవీ, ఎంఎక్స్ ప్లేయర్ విలీనం తర్వాత అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్ ఆటోమేటిక్‌గా వినియోగదార్ల యాప్‌ల్లో అప్‌డేట్ అవుతుందని, దీని కోసం వారు రీఇన్‌స్టాల్/అప్‌డేట్ చేసుకోవాల్సిన అవసరం లేదని అమెజాన్ తెలిపింది. సెప్టెంబరులో 25 కోట్ల మంది వినియోగదార్లు తమ కంటెంట్ చూసి ఆనందించారని వెల్లడించింది.

అయిదేళ్లలో భారత్‌లో రూ.2,000 కోట్ల పెట్టుబడి

హిటాచీ ఎనర్జీ

దిల్లీ: స్విట్జర్లాండ్ సంస్థ హిటాచీ ఎనర్జీ వచ్చే 4-5 ఐదేళ్లలో భారత్‌లో రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాల పెంపు, విభాగాల విస్తరణ, నిపుణుల నియామకంపై ఈ నిధులను వెచ్చించనున్నట్లు హిటాచీ ఎనర్జీ ఇండియా (భారత్, ఆగ్నేయాసియా) ఎండీ, సీఈఓ ఎన్.వేణు తెలిపారు. ఇన్సులేషన్, విడిభాగాల తయారీ సామర్థ్యాల పెంపు, ప్రస్తుతమున్న హెచ్‌వీడీసీ హై వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం లాంటి వాటిపైనా ఈ నిధులను వినియోగించనుంది. ఏటా రూ.400 కోట్ల చొప్పున వచ్చే ఐదేళ్లలో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు వేణు తెలిపారు. ఇందుకోసం మార్కెట్ల నుంచి నిధుల సమీకరణ సహా పలు మార్గాలను యోచిస్తున్నామని వెల్లడించారు.

యూఏఈ మదుపర్లకు న్యాయ వివాద పరిష్కార సమయం తగ్గింపు: భారత్

దిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మదుపర్లు అంతర్జాతీయ న్యాయ స్థానాలను ఆశ్రయించడానికి ముందు భారత న్యాయ స్థానాల ద్వారా వివాదాలను పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాల్సిన సమయాన్ని మూడేళ్లకు భారత్ తగ్గించింది. అంతకుముందు ఇది అయిదేళ్లుగా ఉంది. ఆగస్టులో భారత్, యూఏఈల మధ్య ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం (బీఐటీ) అమల్లోకి రానున్న నేపథ్యంలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. యూఈఏ, భారత్‌ల మధ్య ఈ ఒప్పందం ఫిబ్రవరిలో కుదిరింది. ఇరు దేశాల మదుపర్లకు సౌకర్యవంత వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ ఒప్పందం దోహదం చేయనుంది. సాధారణంగా బీఐటీ విధానం ప్రకారం.. అంతర్జాతీయ న్యాయ స్థానాలను ఆశ్రయించడానికి ముందు కనీసం అయిదేళ్ల వరకు భారత న్యాయ స్థానాల్లో, ఆయా వివాదాల పరిష్కారానికి మదుపర్లు ప్రయత్నించాలి. భారత బీఐటీ విధానంలో షేర్లు, బాండ్లు లాంటి పెట్టుబడులకు మినహాయింపు ఉండగా... భారత్- యూఈఏ బీఐటీ విధానంలో ఈ తరహా పెట్టుబడులకు కూడా రక్షణ కల్పించారు. 'ఇన్వెస్టర్ స్టేట్ డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ ద్వారా దేశీయంగా న్యాయ వివాదాల పరిష్కారానికి తప్పనిసరిగా మూడేళ్ల వరకు ప్రయత్నించాల'ని ఆర్థిక శాఖ తెలిపింది.

25000 పాయింట్ల దిగువకు నిఫ్టీ

● ఆరో రోజూ సూచీలకు నష్టాలే ● రూ.8.90 లక్షల కోట్ల సంపద ఆవిరి



సమీక్ష

సెన్సెక్స్ ▼ 638	నిఫ్టీ ▼ 219
81050	24796

వరుసగా ఆరో రోజూ సూచీలను నష్టకష్టాలు వీడలేదు. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగాయి. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా దిగ్గజ షేర్లు డీలాపడటంతో నిఫ్టీ కీలకమైన 25,000 పాయింట్ల దిగువకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి పైసా తగ్గి 84 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 3% లాభంతో 80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

✦ సూచీల నష్టాల నేపథ్యంలో, మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ సోమవారం ఒక్కరోజే రూ.8.90 లక్షల కోట్లు తగ్గి, రూ.451.99 లక్షల కోట్ల (5.38 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 239 పాయింట్ల (క్రితం ముగింపు 81,688.45) లాభంతో 81,926.99 వద్ద ప్రారంభమైంది. అదే జోరులో 82,137.77 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకిన సూచీ, తదుపరి అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకుంది. ఒకదశలో 962 పాయింట్ల నష్టంతో 80,726 పాయింట్లకు చేరింది. చివర్లో కొద్దిగా కోలుకుని 638.45 పాయింట్లు తగ్గి 81,050 దగ్గర ముగిసింది. నిఫ్టీ 218.85 పాయింట్ల నష్టంతో 24,795.75 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,694.35- 25,143 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సామాజిక మాధ్యమాల్లో విద్యుత్ స్కూటర్ల నాణ్యతపై ఆందోళనలు వ్యక్తం కావడంతో, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేరు 8.93% కోల్పోయి రూ.90.20 వద్ద ముగిసింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టాలు నమోదుచేశాయి. అదానీ పోర్ట్స్ 4.17%, ఎన్‌టీపీసీ 3.50%, ఎస్‌బీఐ 3.36%, పవర్‌గ్రిడ్ 2.92%, ఇండస్ఇండ్ బ్యాంక్ 2.43%, యాక్సిస్ బ్యాంక్ 2.31%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.24%, టైటన్ 2.07%, అల్ట్రాటెక్ 1.99%, టాటా స్టీల్ 1.47%, రిలయన్స్ 1.18% నష్టపోయాయి. ఎం అండ్ ఎం, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ 1.46% వరకు లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో యుటిలిటీస్ 3.63%, విద్యుత్ 3.14%, సేవలు 3.12%, కమొడిటీస్ 2.54%, టెలికాం 2.49%, ఇంధన 2.46%, చమురు-గ్యాస్ 2.38% కుదేలయ్యాయి. ఐటీ, టెక్ మాత్రమే మెరిశాయి. బీఎస్ఈలో 3422 షేర్లు నష్టాల్లో ముగియగా, 636 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 120 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

✦ **హీరో మోటార్స్ ఐపీఓ దరఖాస్తు ఉపసంహరణ:** హీరో మోటార్స్ కంపెనీ గ్రూప్‌నకు చెందిన వాహన విడిభాగాల సంస్థ హీరో మోటార్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) పత్రాలను ఉపసంహరించుకుంది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.900 కోట్లు సమీకరించాలని భావించింది. ✦ ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు డయగ్నోస్టిక్ సేవల సంస్థ **సురక్ష డయగ్నోస్టిక్ లిమిటెడ్‌**కు సెబీ అనుమతి ఇచ్చింది.

✦ బిలియన్ ఎలక్ట్రిక్ మొబిలిటీకి విద్యుత్ ట్రక్కుల డెలివరీని ప్రారంభించినట్లు **అశోక్ లేలాండ్** తెలిపింది. ఈ ట్రక్కులను చెన్నై- బెంగళూరు, చెన్నై- విజయవాడ మార్గాల్లో కంపెనీ నడపనుంది.

✦ సెక్యూరిటీల మార్కెట్‌లో రెండేళ్ల పాటు పాల్గొనకుండా స్థిరాస్తి సంస్థ **ఒమాక్సే**, దాని ఛైర్మన్ రోహ్‌తాస్ గోయల్, ఎండీ మోహిత్ గోయల్‌పై సెబీ విధించిన నిషేధంపై సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్) స్టే విధించింది.

ఈనాడు సినిమా

బాజీరావ్ సామర్థ్యం ఏంటో గూగుల్‌ను అడుగు


'సింగమ్ అగైన్'

"సీతమ్మ తల్లి అపహరణకు గురైనప్పుడు లంక కాలిపోయింది. ఇప్పుడదే చరిత్ర పునరావృతం కానుంది. తను ఇచ్చిన మాట కోసం బాజీరావ్ సింగమ్ లంకను దహనం చేయబోతున్నాడు" అంటూ 'సింగమ్ అగైన్' హంగామాను మొదలుపెట్టింది చిత్రబృందం. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రమిది. రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేశారు దర్శకుడు. "వచ్చేది ఎవరో ప్రేక్షకులకు బాగా తెలుసు. సింగమ్ రాకతో చరిత్ర పునరావృతం కానుంద"ని వ్యాఖ్యల్ని జోడించారు. "తన భార్య సీతను రక్షించేందుకు 3000 కిలో మీటర్లు ప్రయాణించిన రాముడిలాగే.. అవ్నీని కాపాడేందుకు ఈ సింగమ్ కూడా ఎంత దూరమైన వెళ్తాడు" అంటూ మొదలైన ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగుతోంది. రామాయణ తరహాలో లక్ష్మణుడిలా టైగర్ ష్రాఫ్, ఆంజనేయుడిగా రణ్‌వీర్ సింగ్, ఆపదలో ఆదుకునే జటాయువులా అక్షయ్‌కుమార్ పాత్రల్ని పరిచయం చేస్తూ.. ఇతిహాసానికి హీరోల యాక్షన్ తోడైతే ఎలా ఉంటుందో చూపిస్తున్న ఈ ట్రైలర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తుంది. "నీ తండ్రి బాజీరావ్ సామర్థ్యం ఏంటో గూగుల్‌ని అడుగు చెప్తుంది', 'సింగమ్‌ని తక్కువ అంచనా వేసి తప్పు చేయొద్దు. అతనొక అగ్ని తుపాన్ లాంటి వాడు', 'నేను మీ రామాయణంలో రావణుడిని. ఇప్పుడీ కలియుగంలో విజయం రావణుడిదే" లాంటి సంభాషణలు సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నాయి. అక్షయ్ కుమార్, కరీనా కపూర్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొణె, అర్జున్ కపూర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రం నవంబరు 1న విడుదల కానుంది.


మోహన్‌లాల్, మీనా

దృశ్యం ముగింపునకు వచ్చే ఏడాది ప్రారంభం

'దృశ్యం' చిత్రాలు మాతృక మలయాళంలోనే కాదు రీమేక్ అయినా ప్రతి భాషలోనూ విజయం సాధించాయి. ఇందులో జార్జ్ కుట్టి పాత్రలో కనిపించిన అగ్రకథానాయకుడు మోహన్‌లాల్ నటనతో పాటు కథలోని మలుపులు ప్రేక్షకులను మెప్పించాయి. మీనా కథానాయిక.త జీతూ జోసెఫ్ తెరకెక్కించిన ఈ సినిమాలు మంచి హిట్‌ను అందుకున్నాయి. అనుకోకుండా జరిగిన ఓ హత్య కేసు నుంచి పోలీసుల చేతికి దొరక్కుండా తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి జార్జ్ కుట్టి చేసే ప్రయత్నాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ఇప్పుడు దీనికి ముగింపుగా 'దృశ్యం 3' రాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. తాజాగా ఈ మూడో భాగం గురించి ఓ ఆసక్తికర విషయం బయటికొచ్చింది. వచ్చే ఏడాది ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. "దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయి. 2025 ప్రథమార్ధంలో షూటింగ్‌ను ప్రారంభించి.. క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకుంది చిత్రబృందం. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటించనున్నార"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఈసారి జార్జ్‌కుట్టి పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తారో చూడాలి.


శివ కార్తికేయన్, సాయిపల్లవి

లోకమే రంగులై పొంగెనే..

శివ కార్తికేయన్, సాయిపల్లవి జంటగా తెరకెక్కిన చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థతో కలిసి కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రంలోని 'హే రంగులే... నీ రాకతో లోకమే రంగులై పొంగెనే...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. జి.వి.ప్రకాశ్‌కుమార్ స్వరకల్పనలోని ఈ పాటని రామజోగయ్య శాస్త్రి రచించగా, అనురాగ్ కులకర్ణి, రమ్య బెహరా ఆలపించారు. బహుభాషల్లో విడుదలవుతున్న బయోగ్రాఫికల్ యాక్షన్ చిత్రమిది. ఈ నెల 31న తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖిత రెడ్డి విడుదల చేస్తున్నారు. ఇండియాస్ ఫియర్‌లెస్ పుస్తకంలోని మేజర్ వరదరాజన్ ఛాప్టర్ ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మరొకటి పూర్తి చేసిన సూర్య


సూర్య

కథానాయకుడు సూర్య.. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ కలయికలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పూజా హెగ్డే కథానాయిక. జూన్‌లో చిత్రీకరణ ప్రారంభించుకున్న ఈ సినిమా ఇప్పుడు మొత్తం చిత్రీకరణను పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని సూర్య సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. ఈ మేరకు చిత్ర బృందంతో కలిసి దిగిన ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. "ఈ చిత్ర బృందం నాకు జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకాల్ని ఇచ్చింది. కార్తీక్ దర్శకత్వంలో చేసినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమాని ఎన్నో అందమైన ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. షూట్ అంతా ఆనందంగా జరిగింది. దీనికోసం ఎంతో మంది ప్రతిభావంతులైన వ్యక్తులు పనిచేశార"న్నారు. ప్రేమ, యాక్షన్, వినోదాల మేళవింపుతో రూపొందిన చిత్రమిది. జోజు జార్జ్, జయరామ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. ప్రస్తుతం సూర్య నటించిన 'కంగువా' నవంబరులో ప్రేక్షకుల ముందుకు రానుంది.


సుధీర్ బాబు

"నా కెరీర్‌లో నటుడిగా నాకెంతో సంతృప్తినిచ్చిన చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. ఇదొక అరుదైన కథతో తెరకెక్కింది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది" అన్నారు హీరో సుధీర్‌బాబు. ఇటీవలే 'హరోం హర'తో ప్రేక్షకుల్ని పలకరించిన ఆయన.. ఇప్పుడు 'మా నాన్న సూపర్ హీరో'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. అభిలాష్ రెడ్డి కంకర తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు సుధీర్‌బాబు.

మహేశ్‌బాబు నుంచి చాలా కొత్త మాటలు విన్నా!

యాక్షన్ జానర్ నుంచి పక్కకు వచ్చి ఇలాంటి భావోద్వేగభరితమైన కథతో రావడానికి కారణమేంటి?

"ప్రత్యేకంగా ఫలానా కథలతోనే ముందుకెళ్లాలని నేనేమీ అనుకోను. నా వద్దకొచ్చిన కథల్లో ఏది బాగుంటే దానితో ముందుకెళ్తా. అయితే అనుకోకుండా నా నుంచి ఈ మధ్య వరుసగా యాక్షన్ చిత్రాలే వచ్చాయి. నిజానికి 'మా నాన్న సూపర్ హీరో'ని 'హరోం హర'కు ముందే ఒప్పుకున్నా. కాకపోతే విడుదల కాస్త అటు ఇటైంది. నేను నటుడిగా అన్ని రకాల జానర్లు ప్రయత్నించాలనుకుంటా. వరుసగా యాక్షన్ సినిమాలే చేస్తే ఓ ఇమేజ్‌లో ఇరుక్కుపోవాల్సి వస్తుంది. ఓ దశ దాటాక సరైన కథలు కూడా దొరకవు. అందుకే రకరకాల కథలు చేయాలనుకుంటా. అప్పుడే దర్శకులకు నేను ఏదైనా చేయగలనన్న నమ్మకం కలుగుతుంది".

ఈ కథలో మిమ్మల్ని బాగా ఆకర్షించిన అంశాలేంటి?

"ఇది విశ్వజనీనమైన కథ. ఒక కొడుకు.. ఇద్దరు తండ్రుల మధ్య నడిచే ముక్కోణపు ప్రేమకథగా ఉంటుంది. ఇలాంటి కథ ఇంతకు ముందెప్పుడూ రాలేదు. అందుకే కథ విన్నప్పుడే చేయాలని నిర్ణయించేసుకున్నా. ఈ సినిమాలో నేను పెంచిన తండ్రిని విపరీతంగా ప్రేమిస్తుంటా. కానీ, తను నాపై చిరాకు పడుతుంటాడు. ఆ తండ్రికి ఓ సమస్య ఎదురైనప్పుడు ఈ కొడుకు ఏమైనా చేయడానికి సిద్ధపడతాడు. సరిగ్గా అప్పుడే కథలోకి కన్న తండ్రి ఎంట్రీ ఇవ్వడంతో ఓ సంఘర్షణ మొదలవుతుంది. ఈ కథంతా ప్రధానంగా తండ్రీకొడుకుల ప్రేమకథగానే ఉంటుంది".

చిన్నప్పుడు మీ నాన్న మీతో ఎలా ఉండేవారు? మీ సినిమాలు చూసి ఎలా స్పందిస్తుంటారు?

"మా నాన్న స్ట్రిక్ట్ కాదు. అలాగే మరీ ఫ్రెండ్లీ కూడా కాదు. ఆయన ఎప్పుడూ కోప్పడరు. మమ్మల్ని కొట్టింది కూడా లేదు. తను చాలా క్రమశిక్షణ గల మనిషి. ఆయన క్రమశిక్షణ చిన్నప్పటి నుంచి నాకు, మా అక్కకు ఎంతో స్ఫూర్తినిచ్చేది. 'మీరు ఇలా ఉండాలి.. అలా ఉండాల'ని తను మాకెప్పుడూ చెప్పింది లేదు. నాన్న నా సినిమాల గురించి పెద్దగా మాట్లాడరు. అది బాగుంది.. ఇది బాలేదని ఎప్పుడూ చెప్పరు. కాకపోతే ఆయనకు నాది ఏదైనా చిత్రం నచ్చితే నాకు ఇట్టే తెలిసిపోద్ది. వాళ్ల మిత్రులెవరైనా ఆ సినిమా గురించి మెసెజ్ పెడితే నాకు ఫార్వర్డ్ చేస్తుంటారు. లేదంటే థియేటర్ల వద్ద ప్రేక్షకుల స్పందనను వీడియో తీసి పెడుతుంటారు. అలా వచ్చిందంటే నాన్నకు సినిమా నచ్చిందని అర్థం. ఒకవేళ నచ్చలేదంటే అలాంటివేమీ రావు".

'మా నాన్న సూపర్ హీరో' ట్రైలర్ చూసి మహేశ్ బాబు ఏమన్నారు?

"మహేశ్‌బాబు సాధారణంగా ఏదైనా ఎక్కువ ఎక్స్‌ప్రెస్ చేయరు. ఆయనకు నేను తొలుత రఫ్ కట్ ట్రైలర్ పంపిస్తే 'బాగుందని..' మెసేజ్ పెట్టారు. ఆ తర్వాత ఫైనల్ ట్రైలర్ పంపా. అది చూశాక మాత్రం చాలా మెచ్చుకున్నారు. హార్ట్ టచ్చింగ్‌గా ఉందన్నారు. ఆఖర్లో వచ్చే మహేశ్ పేరున్న డైలాగ్ ఫన్నీగా ఉందన్నారు. ఇలా తన నుంచి చాలా కొత్త మాటలు విన్నా (నవ్వుతూ). అలా తను దీని గురించి అంత ఎక్కువగా మాట్లాడేసరికి మా నమ్మకం రెట్టింపయ్యింది".

తండ్రీకొడుకుల అనుబంధాల నేపథ్యంలో చాలా కథలొచ్చాయి కదా. దీంట్లో ప్రత్యేకతేంటి?

"నాన్నపై ప్రేమను 'యానిమల్'లో బోల్డ్‌గా, అగ్రెసివ్‌గా చూపించారు. దాంట్లో హీరో పాత్ర లార్జర్ దెన్ లైఫ్ క్యారెక్టర్‌లా ఉంటుంది. అది జనాలకు కనెక్ట్ అయ్యింది. మా చిత్రంలో నాన్న మీద ఉన్న ప్రేమను ప్రేమతోనే చూపించనున్నాం. అది కూడా చాలా సహజంగా, మనసులకు హత్తుకునేలా ఉంటుంది".

యాక్షన్ సినిమాలతో పోల్చితే.. ఇలాంటి భావోద్వేగభరితమైన చిత్రాలు చేసేటప్పుడు మీరెలా సిద్ధమవుతుంటారు?

"ఇలాంటి కథలు, పాత్రలు చేసేటప్పుడు మానసికంగా చాలా ప్రశాంతంగా ఉండాలి. రోజంతా దృష్టిని మరో అంశంపైకి మరలకుండా చూసుకోవాలి. అందుకే ఇలాంటి పాత్రలు చేసేటప్పుడు ఫోన్‌కు దూరంగా ఉంటుంటా. నా భార్య, పిల్లలకు దూరంగా ఉంటుంటా. నేను బ్యాడ్మింటన్ ఆడే రోజుల్లో ఏదైనా ముఖ్యమైన మ్యాచ్ ఉన్న రోజు ఈ పద్ధతినే అనుసరించే వాణ్ని".

మీ కొత్త చిత్ర విశేషాలేంటి?

"ప్రస్తుతం 'జటాధర' అనే పాన్ ఇండియా సినిమా చేస్తున్నా. దాని తర్వాత రాహుల్ రవీంద్రన్‌తో ఓ సినిమా చేయనున్నా".


అనన్య నాగళ్ల

పొట్టేల్ వస్తోంది

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన 'పొట్టేల్' ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. అజయ్ ముఖ్యభూమిక పోషించారు. నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్ కుమార్ సడిగె నిర్మిస్తున్నారు. ఈ చిత్ర విడుదల తేదీని సోమవారం ఖరారు చేశాయి సినీ వర్గాలు. "గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ యాక్షన్ డ్రామా ఇది. దీపావళి సెలవు కూడా కలిసొస్తుండటంతో 25న చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే పాటలు, ప్రచార చిత్రాలు మంచి ఆదరణని సొంతం చేసుకున్నాయ"ని సినీ వర్గాలు తెలిపాయి.

ఈసారి యాక్షన్ కథతో...


నితిన్

'ఇష్క్' తర్వాత మరోసారి కలిసి పనిచేయబోతున్నారు నితిన్ - విక్రమ్ కె.కుమార్. ఈ ఇద్దరూ ఇదివరకు ప్రేమకథ కోసం చేతులు కలపగా, ఈసారి అందుకు భిన్నమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు కసరత్తులు జరుగుతున్నాయి. నితిన్ కోసం భారీ హంగులతో కూడిన ఓ యాక్షన్ కథని విక్రమ్ కె.కుమార్ సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. శ్రేష్ఠ్ మూవీస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నితిన్ చేస్తున్న 'రాబిన్‌హుడ్', 'తమ్ముడు' చిత్రాల తర్వాత ఈ కొత్త చిత్రం మొదలు కానుంది. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఈ సినిమా చిత్రీకరణ ఊపందుకునే అవకాశాలున్నాయి.

నేటి యువత ఆలోచనలకు తగ్గ చిత్రమిది


విఘ్నేశ్, లిఖిత, శ్రీనిక, పృథ్వీ

"ఇప్పుడున్న యువతరం ఆలోచనలకు తగ్గ సినిమా 'యుఫోరియా'. యువతకు, తల్లిదండ్రులకు మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో ఉంటుంది" అన్నారు దర్శకుడు గుణశేఖర్. ఇప్పుడాయన తెరకెక్కిస్తున్న ఈ సినిమాని నీలిమ గుణ నిర్మిస్తున్నారు. విఘ్నేశ్, లిఖిత, పృథ్వీ, శ్రీనిక ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భూమిక ముఖ్య పాత్రలో కనిపించనుంది. ఈ చిత్ర గ్లింప్స్‌ను నిర్మాతలు దిల్ రాజు, కె.ఎల్.దామోదర్ ప్రసాద్ సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ.. "గ్లింప్స్ అదిరిపోయింది. నేటి ట్రెండ్‌కు తగ్గట్లుగా ఉంది. నైట్ లైఫ్, డ్రగ్స్, అత్యాచారాలు తదితర అంశాల్ని టచ్ చేశారు" అన్నారు. "చక్కగా తెలుగు మాట్లాడే వాళ్లు.. థియేటర్ ఆర్టిస్టుల్ని ఈ సినిమాకి తీసుకున్నాం. ఈ చిత్రం కచ్చితంగా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నా" అన్నారు నిర్మాత నీలిమ గుణ. దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ.. "ఓ రెండు ఘటనలు నన్ను బాగా కదిలించాయి. ప్రతి వారం అలాంటి ఘటనలే జరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఇప్పుడున్న టైమ్‌లో ఈ కథ చెప్పాలనిపించింది. యువతకు యువతతోనే చెప్పాల్సిన కథ ఇది. సినిమాలో 90శాతం కొత్తవాళ్లే కనిపిస్తారు. నేటి యువత ఆలోచనలకు తగ్గట్లుగా సినిమా చాలా కొత్తగా ఉంటుంది" అన్నారు.

నెలాఖరు నుంచి బరిలోకి


కియారా అడ్వాణీ


యశ్

'కేజీఎఫ్' విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న చిత్రం 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్నారు. కియారా అడ్వాణీ కథానాయిక. నయనతార, హ్యూమా ఖురేషీ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఓ యాక్షన్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఇప్పుడు కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకునేందుకు సిద్ధమవుతోంది. దీని కోసం ముంబయిలో ప్రత్యేకంగా కొన్ని సెట్లు సిద్ధం చేస్తోంది చిత్ర బృందం. అందులోనే ఈనెలాఖరు నుంచి యశ్, కియారాలపై రొమాంటిక్ సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు సమాచారం. దాదాపు 45రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాయకానాయికల లవ్‌ట్రాక్‌తో పాటు మిగిలిన ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు తెలిసింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశముంది.


శనయా కపూర్

విక్రాంత్ సరసన సంజయ్ కపూర్ కుమార్తె?


విక్రాంత్

'ట్వెల్త్ ఫెయిల్' విజయం తర్వాత కథల ఎంపికలో జోరు ప్రదర్శిస్తున్నారు బాలీవుడ్ కథానాయకుడు విక్రాంత్ మాస్సే. ఆయన ప్రధాన పాత్రలో 'ఆంఖోన్ కి గుస్తాఖియాన్' అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. దీన్ని సంతోష్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో విక్రాంత్‌కు జోడీగా సంజయ్ కపూర్ కుమార్తె శనయా కపూర్‌ను ఎంపిక చేసిందట చిత్రబృందం. ఇప్పటికే ఈ విషయంపై ఆమెతో చర్చలు పూర్తయినట్లు సమాచారం. విక్రాంత్ సరసన నటించడానికి ఆమె చాలా ఉత్సాహంగా ఉందని, ఈ నెలాఖరులో చిత్రీకరణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మ్యూజికల్ లవ్ స్టోరీగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో అంధ సంగీతకారుడిగా కనిపించనున్నారు విక్రాంత్. ప్రస్తుతం ఆయన నటించిన 'ది సబర్మతీ రిపోర్ట్' విడుదలకు సిద్ధంగా ఉంది.


వాణీ కపూర్


అనుకోకుండా కలిసిన ఇద్దరి మధ్య ప్రేమ

'బేఫిక్రే', 'వార్' చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ కథానాయిక వాణీ కపూర్. తాజాగా ఈమె కథానాయకుడు ఫవాద్ ఖాన్‌తో 'అబీర్ గులాల్' చిత్రంలో నటించనుంది. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. దీనిని ఆర్తీ ఎస్‌బాగ్డి తెరకెక్కిస్తున్నారు. వివేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ లండన్‌లో ప్రారంభించినట్లు తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా తెలిపింది చిత్రబృందం. అనుకోకుండా కలిసిన ఇద్దరి వ్యక్తుల మధ్య ప్రేమ చిగురించిన నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ఇందులో మాళవిక అరోరా, రిధి డోగ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న ఈ చిత్రం 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

రొమ్ము పరీక్షకు ఏఐ తోడు

ఇది రొమ్ముక్యాన్సర్ అవగాహన మాసం

మహిళల్లో రొమ్ముక్యాన్సర్ పెద్ద సమస్య. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకారం మనదేశంలో ప్రతి లక్ష మంది మహిళల్లో 25.8 మంది దీంతో బాధపడుతున్నారు. అధునాతన చికిత్సలు అందుబాటులోకి వస్తున్నప్పటికీ ఏటా సుమారు 75వేల మంది మహిళలు దీనికి బలవుతున్నారు. పట్టణాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. జబ్బును తొలిదశలోనే గుర్తిస్తే ఈ మరణాలను చాలావరకు తగ్గించుకోవచ్చు. ఇందుకు మామోగ్రామ్ ముందస్తు పరీక్షలు (స్క్రీనింగ్) ఎంతగానో ఉపయోగపడతాయి. కానీ నిపుణులైన రేడియాలజిస్టుల కొరత కారణంగా 25% క్యాన్సర్లను అసలు గుర్తించటమే లేదు. ఇక్కడే కృత్రిమ మేధ (ఏఐ) కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. మానవ విషయగ్రహణ నైపుణ్యాలను అనుకరించే ఇది క్యాన్సర్ వంటి సంక్లిష్ట జీవ సంబంధ లోపాలను.. ఆ మాటకొస్తే మనిషి మెదడు పోల్చుకోలేని లోపాలనూ గుర్తించగలదు. అదీ అత్యంత కచ్చితంగా. రేడియేషన్ ప్రమాదం లేని థర్మల్ ఇమేజింగ్ పరిజ్ఞానమూ మరో ఆశా కిరణంగా వెలుగు చూస్తోంది. అన్ని వయసుల వారికీ ఉపయోగపడగల ఇదిప్పుడు కృత్రిమ మేధతోనూ జత కడుతుండటం విశేషం.



రొమ్ముక్యాన్సర్ గుర్తింపు, నిర్ధరణలో మామోగ్రఫీ అత్యంత కీలకం. సాధారణంగా ఒక మామోగ్రామ్‌ను క్షుణ్నంగా పరిశీలించి నార్మలా? సమస్యనా? అనేది నిర్ణయించటానికి ఎంత లేదన్నా గంటయినా పడుతుంది. అలాంటిది పెద్దఎత్తున నిర్వహించే ముందస్తు పరీక్షల్లో అన్ని మామోగ్రామ్‌లను పరిశీలించాలంటే? తక్కువలో తక్కువగా ఒక నిమిషం వేసుకున్నా లక్ష మామోగ్రామ్‌లను చూడటానికి లక్ష నిమిషాలైనా పడుతుంది. అంత సమయం ఎవరి దగ్గరా ఉండదు. ఆల్గోరిథమ్‌లతో కూడిన కృత్రిమ మేధతో ఇలాంటి ఇబ్బందులను తొలగించుకోవచ్చు. నిజానికి చాలామందిలో మామోగ్రామ్ మామూలుగానే ఉంటుంది. వెయ్యిమందిని తీసుకుంటే సుమారు ముగ్గురిలోనే తేడాలు కనిపిస్తుంటాయి. అంటే 997 మందిలో నార్మల్‌గా లేదూ క్యాన్సర్ రహిత మార్పులుండొచ్చు. అలాగని అన్ని మామోగ్రామ్‌లను పరిశీలించకుండా ఉండలేం. రొమ్ముక్యాన్సర్ ఆనవాళ్లు గల ఒకరిద్దరిని గుర్తించాలన్నా అన్నింటినీ చూడాల్సిందే. అంత సమయం, శక్తి, ఏకాగ్రత మనిషి మెదడుకు ఉండదు. అలసి పోతుంది. తప్పులు జరగొచ్చు. అదే కృత్రిమ మేధ సాయం తీసుకుంటే ఇది చిటికెలో పూర్తవుతుంది. ఇప్పటికే ఇలాంటి ప్రయత్నాలు మనదగ్గర మొదలయ్యాయి. బెంగళూరు, ముంబయి నగరాల్లోని ఏఐ ఆధారిత నిర్ధరణ కేంద్రాలు ఇతోధికంగా తోడ్పడుతున్నాయి. అక్కడి నుంచే మారుమూల ప్రాంతాలకూ సేవలందిస్తున్నాయి.



డా॥ డి.రఘునాథరావు
ప్రొఫెసర్, మెడికల్ ఆంకాలజీ
ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ
రెడ్ హిల్స్, హైదరాబాద్

ఎలా పనిచేస్తుంది?

కృత్రిమ మేధకు శిక్షణ ముఖ్యం. ఇది మన మెదడు మాదిరిగానే ఆయా విషయాలను 'నేర్చుకుంటుంది'. రొమ్ముక్యాన్సర్‌ను గుర్తించే ఏఐ వ్యవస్థలకు ముందు లక్షల కొద్దీ మామోగ్రామ్ చిత్రాలను చూపించి, దృశ్యాల తీరును (విజువల్ ప్యాటర్న్) విశ్లేషించటం.. ఏది సాధారణమో, ఏది అసాధారణమో? గుర్తించేలా నేర్పిస్తారు. వీటి ఆధారంగా అది కొత్తగా తీసిన మామోగ్రామ్‌లను పరిశీలించి, ఫలితాలు తెలియ జేస్తుంది. ముమ్మందు తలెత్తే మార్పులనూ అంచనా వేయగలదు. ప్రాథమిక ఆల్గోరిథమ్‌ల ఆధారంగా ఏఐ తనకు అవసరమైన ఆల్గోరిథమ్‌లను తానే సృష్టించుకుంటుంది మరి. ఇలా సొంతంగానే చిత్రాల్లోని తీరును (ప్యాటర్న్) గుర్తిస్తుంది. రైల్వే స్టేషన్‌లో ఒక తల్లి, తన పిల్లాడిని ఒడిలో వేసుకొని నిద్రించిందనుకోండి. చుట్టుపక్కల రణగొణధ్వనులున్నా పిల్లాడు ఏడిస్తే ఆ గొంతును వెంటనే గుర్తుపట్టేస్తుంది కదా. మనం కూడా చుట్టూ బోలెడంత మంది మాట్లాడుతున్నా తెలిసిన వారి గొంతును ఇట్టే పసిగడతాం. వేలాది ఫొటోల మధ్యలో కూడా మన ఆత్మీయులు ఫొటోలను వెంటనే పోల్చుకుంటాం. దీన్నే ప్యాటర్న్ రికగ్నిషన్ అంటారు. అంటే మన మెదడులో అప్పటికే నిక్షిప్తమైన విషయాన్ని వెలికి తీసి, అది ఇదేనని చెప్పట మన్నమాట. మామోగ్రామ్‌లను చదివే కృత్రిమ మేధ కూడా ఇలా విజువల్ ప్యాటర్న్ రికగ్నిషన్‌తో క్యాన్సర్ ఆనవాళ్లను గుర్తిస్తుంది. మనుషుల కన్నా లోతుగా, గాఢంగా చిత్రాలను విశ్లేషిస్తుంది.

రెండు రకాలుగా..

రొమ్ముక్యాన్సర్ ముందస్తు పరీక్షల్లో కృత్రిమ మేధ రెండు రకాలుగా ఉపయోగపడుతుంది. **ఒకటి–** మామోగ్రామ్‌లను వడపోసి నార్మల్‌గా ఉన్నవాటిని పక్కన పెట్టేయటం. నిమిషంలోనే ఇది పూర్తవుతుంది. దీంతో ఎవరికి క్యాన్సర్ లేదో వెంటనే తెలిసిపోతుంది. సమస్య లేనివారు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకోవచ్చు. భయం, ఆందోళన తగ్గుతాయి. అనవసరంగా బయాప్సీ చేయటం తప్పుతుంది. **రెండు–** తేడాలను పసిగట్టడం. ఇది తేడాగా ఉన్నవాటిని గుర్తించి.. మరోసారి పరిశీలించమని రేడియాలజిస్టుకు సూచిస్తుంది. 'నాకిలా అనిపించింది, మీరు ధ్రువీకరించండి' అని చెబుతుంది. దీంతో రేడియాలజిస్టుకు అనవసర శ్రమ తప్పుతుంది. తేడాలు గల మామోగ్రామ్‌లను అరగంటలోనే పరిశీలించి, క్యాన్సర్ ఉందో లేదో నిర్ధరించొచ్చు. ఈ విషయాన్నీ కృత్రిమ మేధ నేర్చుకుంటుంది. నిపుణులు నిర్ధరించిన విషయాన్ని గ్రహించి, మళ్లీ ఆ తప్పు చేయకుండా జాగ్రత్త పడుతుంది. ముమ్మందు స్కాన్లలో అలాంటి మార్పులు కనిపించినప్పుడు అప్రమత్తమవుతుంది. వాటిని అబ్‌నార్మల్‌గా గుర్తించి, పరిశీలన కోసం సిఫారసు చేస్తుంది. ఇలా ప్రతిసారీ తన మేధను మెరుగుపరచుకుంటూనే వస్తుంది. అందువల్ల భవిష్యత్తులో ఇది ఆరోగ్యరంగంలో మరిన్ని విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనుందని భావిస్తున్నారు.

- కృత్రిమ మేధ పరిజ్ఞానం ఒక్క మామోగ్రామ్‌లకే పరిమితం కాదు. బయాప్సీ పరీక్షల్లో ఫలితాలనూ ఇలాగే విశ్లేషించగలదు. ఆయా నమూనాలో క్యాన్సర్ కణాలు ఉన్నాయో, లేవో చిటికెలో చెప్పగలదు.

ఎంత కచ్చితం?

కచ్చితత్వం విషయంలో కృత్రిమ మేధ మనిషి మెదడునూ అధిగమిస్తుండటం ఆశ్చర్యకరం. ఇది క్యాన్సర్ కాదనే విషయాన్ని ఎలాంటి అనుమానం లేకుండా 100% కచ్చితత్వంతో చెప్పేస్తుంది. క్యాన్సర్ అవుననే విషయాన్ని చెప్పటంలో 3 శాతమే విఫలం కాగలదు. మనిషి మెదడుకు ఇంత గొప్పగా అంచనా వేసే సామర్థ్యం లేదనే చెప్పుకోవచ్చు. 30, 40 ఏళ్ల శిక్షణ పొందిన నిపుణులు సైతం 80% మాత్రమే సరిగ్గా అంచనా వేయగలరు. అందువల్ల పరీక్షల నిపుణులకు ఏఐ ఎంతగానో ఉపయోగపడుతుంది. నిర్ధరణ విషయంలో కఠినమైన శ్రమను తప్పిస్తుంది.

పాత చిత్రాలతో పోలిక

స్కాన్ చిత్రాల్లో రంగు, ఛాయ, కణజాల సాంద్రతలను బట్టి ఏఐ చాలా అస్పష్టంగా ఉండే మార్పులనూ గుర్తిస్తుంది. అప్పుడే తీసిన మామోగ్రామ్‌ను పాత వాటితో పోల్చి కొత్త మార్పులను కూడా పసిగట్టగలదు. ఉదాహరణకు- మూడేళ్ల కిందట క్యాన్సర్ లేదు. ఇప్పుడు బయట పడిందనుకోండి. అప్పట్లో దాని ఛాయలు ఉన్నాయేమో చూడమన్నా చూసి గుర్తిస్తుంది. అలాగే ఎవరికైనా ముమ్మందు క్యాన్సర్ వచ్చే అవకాశాలను కూడా అంచనా వేయగలదు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు రూపొందించిన మిరాయ్ అనే ఆల్గోరిథమ్ అత్యంత తీవ్రమైన క్యాన్సర్ తలెత్తే అవకాశాన్ని రెండేళ్ల ముందే పసిగట్టగలదు.

మనదేశంలోనూ వాడకం

సామూహిక ముందస్తు పరీక్షల్లో ఇప్పటికే మనదేశంలో నాలుగైదు సంస్థలు కృత్రిమ మేధను వాడుకుంటున్నాయి. సుదూర ప్రాంతాల్లో చేసే పరీక్షలను బెంగళూరుకు పంపించి, అక్కడి రేడియాలజిస్టులతో నిర్ధరించే విధానమూ కొనసాగుతోంది. మామోగ్రామ్ చేయించుకొని, గదిలోంచి బయటకు వచ్చినప్పుడే ఫలితాన్ని తెలియజేస్తున్నాయి. నార్మల్ అయితే తదుపరి పరీక్ష కోసం వస్తే సరిపోతుంది. తేడా ఉన్నట్టయితే రేడియాలజిస్ట్ ధ్రువీకరిస్తారు. తదనంతర పరీక్షలు చేస్తారు. బెంగళూరుకు చెందిన టెలీరాడ్ టెక్ సంస్థ రూపొందించిన మామోఅసిస్ట్ అనే ఏఐ టూల్ దీనికి ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇది తొలిదశ రొమ్ముక్యాన్సర్‌ను గుర్తించగలదు. మామోగ్రామ్‌లను విశ్లేషించి, మార్పులను గమనిస్తే ధ్రువీకరణ, నిర్ధరణ కోసం రేడియాలజిస్ట్‌కు పంపిస్తుంది. బయాప్సీ విషయంలోనూ- ఈశాన్య రాష్ట్రాల్లో సేకరించే నమూనాల ఇమేజ్‌లను ముంబయిలోని టాటా మెమోరియల్ ఆసుపత్రిలో కృత్రిమ మేధ సాయంతో పరీక్షిస్తున్నారు. నార్మల్, అబ్‌నార్మల్‌ను ఇట్టే గుర్తించగలుగుతున్నారు. దీంతో చాలా సమయం ఆదా అవుతోంది. కచ్చితత్వమూ మెరుగవుతోంది.

థర్మల్ ఇమేజింగ్ సాయమూ..

మామోగ్రామ్‌ను ఎక్స్‌రే యంత్రంతో తీస్తారు. అవసరమైతే దీనికి సోనోగ్రఫీ జత చేస్తారు. అయితే అందరిలో.. ముఖ్యంగా రొమ్ముకణజాలం మందంగా గలవారిలో ఇది క్యాన్సర్ ఆనవాళ్లను పట్టుకోలేకపోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో థర్మోగ్రఫీ కొత్త విధానంగా ముందుకొస్తోంది. ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల సాయంతో వేడి తీరుతెన్నులను గుర్తించి, వాటిని దృశ్యాలుగా మార్చటం దీని ప్రత్యేకత. చిన్న కప్పులా ఉండే దీన్ని రొమ్ము మీద పెడితే అన్ని వైపుల నుంచి దృశ్యాలు తీస్తుంది. అయితే ఇది నిర్ధరణ కోసం కాదు. రొమ్ముక్యాన్సర్ ఆనవాళ్లను గుర్తించే అనుబంధ పరీక్ష సాధనంగానే ఉపయోగపడుతుందని గుర్తించాలి.

ఎలా పనిచేస్తుంది?



క్యాన్సర్ ఉన్నచోటుకు రక్త ప్రసరణ ఎక్కువగా అవుతుంది. క్యాన్సర్ తనకు అవసరమైన పోషకాలను తీసుకోవటానికి, వృద్ధి చెందటానికి కొత్తగా రక్తనాళాలను సృష్టించుకుంటుంది. వీటిని గుర్తించటం ద్వారానే థర్మోగ్రఫీ పనిచేస్తుంది. కణితి సృష్టించుకున్న కొత్త రక్తనాళాలు ప్రకాశవంతమైన ఎర్రటి లేదా తెల్ల మచ్చగా కనిపిస్తాయి. మిగతా భాగమంతా నీలి లేదా నలుపు రంగులో ఉంటుంది.

ఏంటీ ప్రయోజనం?

ఇందులో రేడియేషన్ బెడద ఉండదు. మామోగ్రామ్ పరీక్షలో మాదిరి అసౌకర్యం ఉండదు. చేత్తోనే పరికరాన్ని పట్టుకొని, రొమ్ము మీద పెడతారు. అప్పుడది చిత్రాలను తీసి, మొబైల్ ఫోన్‌కు పంపిస్తుంది. ఈ దృశ్యాలు కృత్రిమ మేధ ఆధారిత నిర్ధరణ కేంద్రానికి వెళ్తాయి. కేవలం 2 నిమిషాల్లోనే ఫలితం తెలుస్తుంది. తేడాలున్నట్టయితే మామోగ్రఫీ లేదా సోనోగ్రఫీ.. లేదూ రెండు అవసరమని చెబుతుంది. రొమ్ముకణజాలం మందంగా ఉన్నవారికైనా, నెలసరి నిలిచిన మహిళలకైనా దీన్ని చేయొచ్చు. ఇది 3 మి.మీ. సైజు క్యాన్సర్లనైనా పట్టుకోగలదు. దీనిపై ఇంకా అధ్యయనాలు సాగుతున్నాయి. పెద్దఎత్తున ప్రజారోగ్య సేవలకు వాడుకోవచ్చని తేలితే విస్తృతంగా అందుబాటులోకి వచ్చే అవకాశముంది. దీనికి రేడియేషన్‌కు సంబంధించి ఎలాంటి అనుమతులూ అవసరం లేదు. ఎక్కడి శిబిరాలకైనా తీసుకెళ్లొచ్చు. నిపుణులైన రేడియాలజిస్ట్ అవసరం లేదు. మామూలు శిక్షణ తీసుకున్న ఎవరైనా పరీక్ష చేయొచ్చు. వేగంగా పరీక్షలు నిర్వహించొచ్చు. చవక కూడా.

మెదడుకో లక్ష్యం!

మెదడును చురుకుగా ఉంచుకోవాలని అనుకుంటున్నారా? మతిమరుపు (డిమెన్షియా) బారిన పడకూడదని భావిస్తున్నారా? అయితే ఒక లక్ష్యం, ఉద్దేశంతో జీవించటం అలవాటు చేసుకోండి. లక్ష్యం కోసం జీవిస్తున్నామని భావించేవారికి డిమెన్షియా వచ్చే అవకాశం తక్కువగా ఉంటున్నట్టు చాలా అధ్యయనాలు సూచిస్తున్నాయి. తమ జీవితం అర్థవంతమైందని భావించేవారికి డిమెన్షియా ముప్పు 35% తక్కువని ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీకి చెందిన కాగ్నిటివ్ సైకాలజిస్ట్ యాంజెలీనా సుటిన్, బృందం అధ్యయనంలో బయటపడింది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం వల్ల కలిగే ప్రయోజనంతో సమానంగా ఈ ముప్పు తక్కువగా ఉండటం గమనార్హం. జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని ప్రయత్నించేవారి మెదడు మరింత చురుకుగా ఉంటున్నట్టు మరో అధ్యయనంలోనూ బయటపడింది. వీరు జ్ఞాపకశక్తి, పదాల ఉచ్చారణ (ఉదాహరణకు- ఒక నిమిషంలో వీలైనన్ని జంతువుల పేర్లు చెప్పటం) వంటి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుంటున్నట్టు వెల్లడైంది. జీవితంలో లక్ష్య సాధన కోసం కృషి చేసేవారికి అల్జీమర్స్ రావటం ఆరేళ్లు ఆలస్యమవుతున్నట్టూ మరికొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఒక లక్ష్యం గలవారితో పోలిస్తే ఏ లక్ష్యమూ లేనివారి నాడీ కణాల్లో అస్తవ్యస్త మార్పులు ఉంటున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్-మ్యాడిసన్ పరిశోధకుల మరో అధ్యయనంలో వెల్లడైంది. అంటే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నవారితో పోలిస్తే వీరి మెదడు అంత ఆరోగ్యంగా లేదన్నమాట. వీరిలో నాడీ కణాల చుట్టూరా ఉండే రక్షణ పొర (మైలిన్) క్షీణించిందని పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా నేర్చుకోవటానికి, జ్ఞాపకశక్తికి తోడ్పడే హిప్పోక్యాంపస్ భాగంలోని నాడీ కణాల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయని వివరిస్తున్నారు. నిజానికి జీవన లక్ష్యాన్ని నిర్వచించటం అంత తేలిక కాదు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, ఒక ఉద్దేశంతో సాగే భావనగా దీన్ని చెప్పుకోవచ్చు. అది ఉపయోగపడేదీ, గౌరవప్రదమైందీ, దయతో కూడినదై ఉండాలి. అలాగని మరీ గొప్ప గొప్ప లక్ష్యాలే కానక్కర్లేదు. చిన్న చిన్నవైనా పెద్ద ప్రభావమే చూపిస్తాయి. కాబట్టి మంచి లక్ష్యంతో ముందుకు సాగితే మెదడునూ కాపాడుకోవచ్చు.

గర్భిణి నిద్రతో బిడ్డలు హుషారు



పుట్టబోయే పిల్లలు హుషారుగా, చురుకుగా ఉండాలని కోరుకుంటున్నారా? అయితే గర్భం ధరించినప్పుడు కంటి నిండా నిద్రపోయేలా చూసుకోండి. రాత్రిపూట 7 గంటల కన్నా తక్కువసేపు నిద్రించే గర్భిణులకు పుట్టే పిల్లలకు ఎదుగుదల సమస్యలు వచ్చే అవకాశమున్నట్టు చైనా పరిశోధనలో బయటపడింది. వీరికి మాట్లాడటం, ఇతరులతో కలవటం, కదలికలు, విషయ గ్రహణ నైపుణ్యాలు అబ్బటం ఆలస్యమవుతున్నట్టు బయటపడింది. హార్మోన్ల మార్పులు, అసౌకర్యం, తరచూ మూత్ర విసర్జనకు లేవటం, వికారం వంటి వాటితో గర్భిణుల్లో చాలామంది నిద్ర పట్టక ఇబ్బంది పడుతుంటారు. ఇది ఇన్సులిన్ నిరోధకత, గర్భిణి మధుమేహానికి దారితీసే అవకాశమున్నట్టు గత అధ్యయనాల్లోనూ వెల్లడైంది. గర్భిణి మధుమేహంతో నెలలు నిండక ముందే కాన్పు, గుర్రపువాతం, అత్యవసర సిజేరియన్, బిడ్డ రక్తంలో గ్లూకోజు తగ్గటం వంటి దుష్ప్రభావాలు ముంచుకొచ్చే ప్రమాదముంది. ఇవే కాకుండా పిల్లల్లో ఎదుగుదలతో ముడిపడిన సమస్యల ముప్పూ పెరుగుతున్నట్టు తాజా అధ్యయనంలో బయట పడింది. తగినంత నిద్రపోని గర్భిణులకు పుట్టిన పిల్లల్లో మెదడు, అవయవాల మధ్య సంకేతాలను చేరవేసే వ్యవస్థలు సరిగా అభివృద్ధి చెందటం లేదని తేలింది. దీంతో విషయగ్రహణ సామర్థ్యాలు, ప్రవర్తన, నేర్చుకునే నైపుణ్యాలు కొరవడుతున్నాయి. ఈ ధోరణి మగ పిల్లల్లో మరింత ఎక్కువగా ఉండటం గమనార్హం.

సొరియాసిస్ గుట్టు రట్టు!



ఎర్రటి మచ్చలు, తెల్లటి పొలుసులతో దీర్ఘకాలం వేధించే సొరియాసిస్ గుట్టు బయటపడింది. దీన్ని హెప్సిడిన్ హార్మోన్ ప్రేరేపిస్తున్నట్టు అంతర్జాతీయ పరిశోధకుల బృందం నిర్వహించిన అధ్యయనం గట్టిగా సూచిస్తోంది. అందువల్ల హెప్సిడిన్‌ను సొరియాసిస్‌కు బలమైన కారకంగా పరిగణిస్తున్నారు. సాధారణంగా ఈ హార్మోన్ క్షీరదాల్లో ఐరన్ మోతాదులను పర్యవేక్షిస్తుంటుంది. ఆహారం నుంచి ఎంత ఐరన్‌ను గ్రహించుకోవాలి, తర్వాత దాన్ని శరీరంలోకి ఎంత విడుదల చేయాలనే దాన్ని నియంత్రిస్తుంది. ఐరన్ మనకు చాలా కీలకం. ఇది ఒంట్లో రక్తం ద్వారా ఆక్సిజన్‌ను సరఫరా చేయటంతో పాటు చర్మ ఆరోగ్యానికీ తోడ్పడుతుంది. గాయాలను మాన్పటం, కొలాజెన్ ఉత్పత్తి, రోగనిరోధక వ్యవస్థ పనితీరు వంటి అత్యావశ్యక పనుల్లోనూ పాలు పంచుకుంటుంది. కానీ చర్మంలో ఐరన్ మోతాదులు పెరిగితే మాత్రం హానికరంగా పరిణమిస్తుంది. అతి నీలలోహిత సూర్యకాంతి దుష్ప్రభావాలను పెంచుతుంది. కణాలు ఇబ్బడి ముబ్బడిగా వృద్ధి చెందే సొరియాసిస్ వంటి దీర్ఘకాల సమస్యలకూ దారితీస్తుంది. సొరియాసిస్ బాధితుల చర్మ కణాల్లో ఐరన్ ఎక్కువ మొత్తంలో ఉంటున్నట్టు చాలాకాలం క్రితమే బయటపడింది. అయితే దీనికి కారణమేంటి? సొరియాసిస్‌కూ దీనికీ సంబంధమేంటి? అనేవి తెలియరాలేదు. ఇందుకు హెప్సిడిన్ హార్మోన్ కారణం కావొచ్చని ఇప్పుడు తేలింది. ఆరోగ్యవంతుల్లో ఇది కాలేయంలో ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. సొరియాసిస్ బాధితుల్లో చర్మంలోనూ పుట్టుకొస్తున్నట్టు తాజా అధ్యయనంలో బయటపడింది. సొరియాసిస్ జీవితాన్నే మార్చివేసే చర్మ సమస్య. దీని బారినపడ్డ వారు శారీరకంగానే కాదు.. మానసికంగానూ ఇబ్బంది పడుతుంటారు. ఇది ఇతరత్రా తీవ్ర సమస్యలకూ దారితీస్తుంది. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. చర్మంలో హెప్సిడిన్ హార్మోన్ మోతాదులను సరిచేయగల కొత్త చికిత్సలతో ఎంతోమందికి ప్రయోజనం కలుగుతుందని పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా చర్మంతో పాటు గోళ్లు, కీళ్లనూ ప్రభావితం చేసే తీవ్రమైన, మందులకు లొంగని పశ్చులర్ సొరియాసిస్‌తో బాధపడేవారికిది ఎంతో మేలు చేయగలదని భావిస్తున్నారు.

వ్యాయామం వారాంతాల్లోనైనా..



రోజూ వ్యాయామం చేయటం కుదరడం లేదా? కనీసం వారాంతాల్లోనైనా చేయండి. రోజూ చేసే వ్యాయామంతో సమానంగా ఇదీ ప్రయోజనాలు కల్పించే అవకాశముందని మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్ పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనంలో భాగంగా చేతికి యాక్సిలరోమీటర్లతో కూడిన పరికరాలు ధరించిన సుమారు 90వేల మంది ఆరోగ్య వివరాలను విశ్లేషించారు. వీరిలో రోజూ వ్యాయామం చేసేవారు, వారాంతాల్లో చేసేవారు, అంతగా చేయనివారిని బృందాలుగా విభజించారు. వారానికి 150 నిమిషాల కన్నా తక్కువగా శ్రమ చేసేవారిని అంతగా వ్యాయామం చేయని వర్గంలో చేర్చారు. అందరిలోనూ మానసిక, జీర్ణకోశ, నాడీ సమస్యలతో పాటు మొత్తం 678 జబ్బుల తీరుతెన్నులను పరిశీలించారు. అంతగా వ్యాయామం చేయనివారితో పోలిస్తే- రోజూ చేసేవారితో పాటు వారాంతాల్లో చేసేవారిలోనూ 200కు పైగా జబ్బుల ముప్పు తక్కువగా ఉంటున్నట్టు తేలింది. వ్యాయామ ప్రయోజనాలు అధిక రక్తపోటు, మధుమేహం జబ్బుల విషయంలో మరింత బలంగా ఉండటం విశేషం. రోజూ వ్యాయామం చేసేవారికి అధిక రక్తపోటు ముప్పు 28%, వారాంత వీరులకు 23% తక్కువగా ఉంటోంది. అదే మధుమేహం ముప్పయితే వరుసగా 46%, 43% వరకూ తగ్గుతోంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారితో సమానంగా వారాంత వీరుల్లోనూ ప్రయోజనాలు కనిపించటానికి కారణమేంటి? వ్యాయామ తీరు కన్నా ఎంత వ్యాయామం చేశారనేది కారణం కావొచ్చని భావిస్తున్నారు. వారాంతాల్లో వ్యాయామం చేసేవారికి గుండె, రక్తనాళాల జబ్బుల ముప్పు తక్కువనే విషయం ఇప్పటికే తెలుసు. అయితే వీరికి కిడ్నీ జబ్బుల దగ్గరి నుంచి మూడ్ సమస్యల వరకూ ఇతరత్రా జబ్బుల ముప్పూ తక్కువేనని తాజా అధ్యయనం సూచిస్తోంది.

పక్షవాతం బాధితులకూ బ్రెయిన్ స్టిమ్యులేషన్!



పక్షవాతం, మెదడుకు దెబ్బ తగలటం వల్ల బలహీనపడిన చేతికి డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్‌తో సత్వరం బలం చేకూరుతున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు గుర్తించారు. కోతుల్లోనే కాకుండా మనుషుల్లోనూ ఇది బాగా పని చేస్తున్నట్టు పరీక్షల్లో తేలింది. ఇతర నాడీ సమస్యల్లో ఇప్పటికే బ్రెయిన్ స్టిమ్యులేషన్ విధానాన్ని వాడుతున్నారు. ఇది పక్షవాతం బాధితుల్లోనూ చలన లోపాలను సరిచేయటానికి ఉపయోగపడుతున్నట్టు తేలటం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. చేయి చచ్చుబడితే రోజువారీ పనులు బాగా దెబ్బతింటాయి. మెదడుకు దెబ్బ తగలటం, పక్షవాతం మూలంగా చేయి కదల్చ లేనివారికి ప్రస్తుతం సమర్థ పరిష్కార మార్గాలేవీ లేవు. అందుకే మెదడును ప్రేరేపించే నాడీపరిజ్ఞానాల మీద వైద్యరంగంలో ఆసక్తి పెరుగుతోంది. దెబ్బలు, పక్షవాతానికి గురైనప్పుడు మెదడులో గాయాలవుతాయి. ఇవి కదలికలను నియంత్రించే భాగం, కండరాల మధ్య నాడీ అనుసంధానాలను అస్తవ్యస్తం చేస్తాయి. దీంతో కాళ్లూ చేతుల వంటివి పాక్షికంగా లేదా పూర్తిగా చచ్చుబడొచ్చు. ఇక్కడే డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ ప్రక్రియ ఆదుకుంటోంది. బలహీనపడినప్పటికీ ప్రస్తుతమున్న అనుసంధానాలను ప్రేరేపించటానికిది తోడ్పడుతుంది. ఈ విధానంలో శస్త్రచికిత్స చేసి, మెదడులోని ఆయా భాగాల్లో చిన్న చిన్న ఎలక్ట్రోడ్లను అమర్చుతారు. ఇవి విద్యుత్ ప్రచోదనాలను వెలువరిస్తూ దెబ్బతిన్న మెదడు పనితీరును సరిచేస్తాయి. పార్కిన్సన్స్ వంటి జబ్బుల చికిత్సలో డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్‌ను చాలాకాలంగా వాడుతున్నారు. దీంతో ఎంతోమందికి కొత్త జీవితం లభిస్తోంది. దీని సురక్షత, కచ్చితత్వం విషయంలో వచ్చిన అధునాతన పురోగతి మూలంగా ఇప్పుడిది పక్షవాతం వంటి జబ్బులతో బాధపడే వారిలోనూ మెరుగైన కదలికలకు తోడ్పడేలా మారుతుండటం విశేషం.

ఆరోగ్యం కోసమే కాదు ఆయుష్షు కోసమూ తినండి!

ఆయుర్దాయం పెంచుకోవాలని ఎవరికి ఉండదు? అయితే ఎంతకాలం జీవిస్తున్నామనేదే కాదు.. ఎంత ఆరోగ్యంగా జీవిస్తున్నామన్నదీ ముఖ్యమే. వీటిని కొంతవరకు జన్యువులు నిర్ణయిస్తాయి. కానీ మనం ఎలా జీవిస్తున్నామనేదీ కీలకమే. అంటే ఎంత వ్యాయామం చేస్తున్నాం? ఎంతసేపు నిద్రస్తున్నాం? అతిగా మద్యం లేదా పొగ తాగుతున్నామా? ఎలా తింటున్నాం? వంటివన్నీ ఆయుష్షు మీద ప్రభావం చూపుతాయి. వీటిల్లో ఆహారం పాత్ర గణనీయమైంది. ఏదో ఒక పదార్థం కన్నా మొత్తంగా ఆహార పద్ధతే ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఆహార అలవాట్లు, దీర్ఘకాల ఆరోగ్యం, ఆయుష్షు మధ్య సంబంధాల మీద పరిశోధకులు చాలాకాలంగా అధ్యయనాలు చేస్తూనే ఉన్నారు. మరి అవేం సూచిస్తున్నాయో చూద్దామా.



ప్రొటీన్ ప్రాధాన్యం

ప్రొటీన్ తక్కువగా తీసుకునేవారితో పోలిస్తే ఎక్కువగా తినేవారు ఎక్కువ కాలం జీవిస్తున్నట్టు.. వృద్ధాప్యంలో బలంగా, ఆరోగ్యంగా ఉంటున్నట్టు పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే ఓ తిరకాసుంది. పప్పులు, గింజ పప్పులు, నిండు గింజ ధాన్యాల వంటి శాకాహారం నుంచి లభించే ప్రొటీన్ ఎక్కువ మేలు చేస్తుండటం గమనార్హం. అదే మాంసం, మాంసం ఉత్పత్తుల నుంచి లభించే ప్రొటీన్‌తో అంత ప్రయోజనం కనిపించటం లేదు. కండరాలు, ఎముకలు బలంగా ఉండటంలో ప్రొటీన్ పాత్ర కీలకం. వయోధికులు చురుకుగా ఉండటానికి.. కింద పడిపోవటం, ఎముకలు విరగటాన్ని నివారించుకోవటానికిది తోడ్పడుతుంది. 65 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసు గలవారికి రోజుకు ప్రతి కిలో శరీర బరువుకు సుమారు 0.22 నుంచి 0.27 గ్రాముల ప్రొటీన్ అవసరం. ఉదాహరణకు- 68 కిలోల బరువుంటే సుమారు 68 నుంచి 81 గ్రాముల ప్రొటీన్ తీసుకోవాలన్నమాట. ఈ మోతాదును ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం చిరుతిండి, రాత్రి భోజనం.. ఇలా రోజంతా విభజించుకొని తీసుకుంటే శరీరం బాగా గ్రహిస్తుంది.

క్యాల్షియం, విటమిన్ డి సైతం

ప్రొటీన్‌తో పాటు క్యాల్షియం, విటమిన్ డి కూడా తగినంత లభించేలా చూసుకోవాలి. వయసు మీద పడుతున్న కొద్దీ ఎముకల పటుత్వం తగ్గకుండా ఉండటానికివి తప్పనిసరి. పాలు, మజ్జిగ, పెరుగు, ఛీజ్, టోఫుల్లో క్యాల్షియం దండిగా ఉంటుంది. తృణధాన్యాలు, చిక్కుళ్లు, ఆకుకూరలతోనూ లభిస్తుంది. విటమిన్ డి కావాలంటే చర్మానికి తగినంత ఎండ తగిలేలా చూసుకోవాలి. చేపలు, పుట్ట గొడుగులు, గుడ్లతోనూ కొద్దిగా పొందొచ్చు. ఈ పోషకాలను ఆహార, విహారాల ద్వారా లభించేలా చూసుకోవటమే ఉత్తమం. ఒకవేళ వీటిల్లో ఏదైనా మరీ తక్కువగా ఉంటే మాత్రలు వేసుకోవచ్చు. అయితే ముందుగా డాక్టర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని మరవరాదు.

మంచి కొవ్వుల దన్ను

గింజపప్పులు, పలుకులు, అవకాడో.. వేరుశనగ నూనె, నువ్వుల నూనె, ఆలివ్ నూనె వంటి నూనెల్లోని మంచి కొవ్వులు మరణం ముప్పు తగ్గటానికి తోడ్పడుతున్నట్టు పరిశోధనలు సూచిస్తున్నాయి. అదే మాంసం, మాంసం ఉత్పత్తుల్లోని కొవ్వులతో మరణం ముప్పు పెరుగుతోందని చెబుతున్నాయి. సాల్మన్, టూనా, సార్‌డైన్స్ వంటి చేపల్లోని ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు మెదడు ఆరోగ్యానికి, ఆయుష్షు పెరగటానికి తోడ్పడతాయి.

పాలీఫెనాల్స్ మేలు

పండ్లు, కూరగాయలు, నిండు గింజ ధాన్యాలు, గింజపప్పులు, పప్పులు, చిక్కుళ్లు, తృణధాన్యాలు, సోయా వంటి వాటిల్లో ఫ్లేవనాయిడ్లు, ఫెనోలిక్ ఆమ్లాలు, లిగ్నన్ల లాంటి పాలీఫెనాల్స్ దండిగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకర వృద్ధాప్యానికి దన్నుగా నిలుస్తాయని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. చాలా పాలీఫెనాల్స్ ఒంట్లో యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఇవి విశృంఖల కణాలను (ఫ్రీ ర్యాడికల్స్) కట్టడి చేస్తాయి. పాలీఫెనాల్స్‌లో వాపు ప్రక్రియను నిలువరించే గుణాలు కూడా ఉంటాయి. ఫలితంగా క్యాన్సర్లు, గుండెజబ్బులు, మధుమేహం, నాడీక్షీణత సమస్యల ముప్పు తగ్గుతుంది.

అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్స్ హాని

బర్గర్లు, పిజ్జాలు, పఫ్స్, కేక్స్ వంటి బేకరీ పదార్థాలు (అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్).. కూల్‌డ్రింకులకు దూరంగా ఉండటం మంచిది. వీటిల్లో పిండి పదార్థాలు, చక్కెరలు పెద్దమొత్తంలో ఉంటాయి. ఇవి త్వరగా జీర్ణమవుతాయి. దీంతో రక్తంలో గ్లూకోజు మోతాదులు ఉన్నట్టుండి పెరుగుతాయి. క్రమంగా మధుమేహం, గుండెజబ్బుల ముప్పు ఎక్కువవుతుంది. చాలా అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్స్‌లో సోడియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది అధిక రక్తపోటుకు దారితీస్తుంది.

పైలట్ అయ్యేదెలా?





ఇంటర్మీడియట్ (ఎంపీసీ) చదివాను. పైలట్ అవ్వాలనుంది. ఎన్‌డీఏ, ఏఎఫ్ క్యాట్ పరీక్షలతో కాకుండా ఇతర అవకాశాలున్నాయా? ఈ కోర్సుకు పెద్ద మొత్తంలో ఫీజవుతుందా? - తులసి

■ పైలట్ అవ్వాలంటే ఇంటర్మీడియట్ మ్యాథ్స్, ఫిజిక్స్‌లతో పూర్తిచేసి 18 సంవత్సరాల వయసు నిండి, పూర్తి మెడికల్ ఫిట్‌నెస్‌తో ఉండాలి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా కాకుండా పైలట్ అవ్వాలంటే.. విశ్వసనీయత ఉన్న శిక్షణ సంస్థను ఎంచుకొని, పైలట్ శిక్షణను విజయవంతంగా పూర్తిచేయాలి.

ఈ శిక్షణలో ఏరో డైనమిక్స్, ఎయిర్ రెగ్యులేషన్స్, ఏవియేషన్ మీటియొరాలజీ, నావిగేషన్, ఎయిర్ క్రాఫ్ట్ జనరల్ అండ్ టెక్నికల్ నాలెడ్జ్, ఫ్లైట్ పర్ఫార్మెన్స్ అండ్ ప్లానింగ్ లాంటి అంశాలపై అవగాహన, పరిజ్ఞానం పెంపొందించుకోవాలి. వీటితోపాటు కనీసం 200 గంటల ఫ్లైయింగ్ అనుభవమూ అవసరం. కోర్సు పూర్తి అయిన తరువాత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి.

మనదేశంలో కమర్షియల్ పైలట్ అవ్వడానికి 40 లక్షల నుంచి 60 లక్షల రూపాయల వరకు అవసరం కావొచ్చు.. శిక్షణ సంస్థ స్థాయిని బట్టి ఈ మొత్తం ఇంకా పెరగొచ్చు. మంచి కమర్షియల్ పైలట్ అవ్వాలంటే కమర్షియల్ పైలట్ లైసెన్స్‌తోపాటు, నిబద్ధత, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్, మానసిక ప్రశాంతత, మానసిక స్థిరత్వం, శారీరక ఆరోగ్యం చాలా ముఖ్యం.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

మారిటైమ్ యూనివర్సిటీలో..

ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ .. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్/నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
● డిప్యూటీ రిజిస్ట్రార్ ● ప్రొఫెసర్ ● సీనియర్ టెక్నీషియన్ ● రిసెర్చ్ అసిస్టెంట్
విభాగాలు: ఓషన్, డ్రెడ్జింగ్, మెరైన్, నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, పీహెచ్‌డీతోపాటు పని అనుభవం.
వయసు: ప్రొఫెసర్ పోస్టులకు 65 ఏళ్లు; డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులకు 64 ఏళ్లు; మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. ఎంపిక: స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15-10-2024.
రిసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూ: 09-10-2024.
వేదిక: ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ, విశాఖపట్నం క్యాంపస్, పంగలి గ్రామం, టెక్కలిపాలెం, సబ్బవరం, విశాఖపట్నం.
వెబ్‌సైట్: www.imu.edu.in/imunew/recruitment

వాక్ ఇన్స్

సీఆర్‌ఐడీఏలో యంగ్ ప్రొఫెషనల్స్

హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్‌కు చెందిన సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ (సీఆర్‌ఐడీఏ).. 4 యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/ డిగ్రీ (అగ్రికల్చర్ సైన్స్)తో పాటు పని అనుభవం.
వయసు: 21 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
వేతనం: నెలకు రూ.30,000.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీ: 18-10-2024.
వేదిక: సీఆర్‌ఐడీఏ, సంతోష్‌నగర్, సైదాబాద్ పోస్టు, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://www.icar-crida.res.in/

ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లో..

ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆయిల్ ఇండియా లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన 40 ఇంజినీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● ఎలక్ట్రీషియన్: 18 ● మెకానిక్: 02
● అసోసియేట్ ఇంజినీర్: 20
అర్హత: పదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమాతో పాటు పని అనుభవం.
వయసు: 24 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: అసోసియేట్ ఇంజినీర్ పోస్టులకు నెలకు రూ.19,500; మిగతా పోస్టులకు రూ.16,640.
ఎంపిక: ప్రాక్టికల్ టెస్ట్, స్కిల్ టెస్ట్/ పర్సనల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీలు: ఎలక్ట్రీషియన్ పోస్టులకు 21-10-2024; మెకానిక్ పోస్టులకు 23-10-2024; అసోసియేట్ ఇంజినీర్ పోస్టులకు 25-10-2024.
వేదిక: ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఆఫీస్, నెహ్రూ మైదాన్, ఆయిల్ ఇండియా కార్పొరేషన్ లిమిటెడ్, దులియాజాన్.
వెబ్‌సైట్: https://www.oil-india.com/

ఎన్ఎంఎల్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులు

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన ఝార్ఖండ్, జంషెడ్‌పూర్‌లోని నేషనల్ మెటలర్జికల్ ల్యాబొరేటరీ (ఎన్ఎంఎల్).. 49 తాత్కాలిక పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● ప్రాజెక్ట్ అసిస్టెంట్-1: 02
● ప్రాజెక్ట్ అసిస్టెంట్-2 : 22
● ప్రాజెక్ట్ అసోసియేట్-1: 18
● ప్రాజెక్ట్ అసోసియేట్-2: 05
● సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 02
అర్హత: పదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ (కెమిస్ట్రీ/ మ్యాథమెటిక్స్/ ఫిజిక్స్/ కంప్యూటర్ సైన్స్/ఐటీ), బీఈ/బీటెక్ (మెటలర్జీ/ కెమికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్) ఎంఎస్సీతో పాటు పని అనుభవం.
వయసు: సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 40 ఏళ్లు; మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ అసిస్టెంట్-1 పోస్టులకు రూ.18,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్-2 పోస్టులకు రూ.20,000; ప్రాజెక్ట్ అసోసియేట్-1 పోస్టులకు రూ.25,0000-రూ.31,000; ప్రాజెక్ట్ అసోసియేట్ -2 పోస్టులకు రూ.28,0000-రూ.35,000; సీనియర్ పీఏటీ పోస్టులకు రూ.42,000.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీలు: అక్టోబరు 15, 16.
వేదిక: సీఎస్ఐఆర్-ఎన్ఎంఎల్, బర్మామైన్స్, జంషెడ్‌పూర్ (ఝార్ఖండ్).
వెబ్‌సైట్: https://nml.res.in/


కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

రైల్వేలో కొలువుల జాతర!

14,298 టెక్నీషియన్ ఖాళీలు
ఐటీఐతో 13,206 పోస్టులు

రైల్వే నియామకాలు నిరుద్యోగులకు వరుసగా శుభవార్తలు అందిస్తున్నాయి. ఈసారి గ్రేడ్-3 టెక్నీషియన్ పోస్టుల వంతు. మార్చి నెలలో ఆర్ఆర్‌బీ గ్రేడ్-1, గ్రేడ్-3 టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి ప్రకటన వెలువడింది. ఈ రెండు విభాగాల్లోనూ 9144 ఖాళీలు ప్రకటించారు. తాజాగా వీటిని 14,298కి పెంచారు. కొత్తగా చేర్చిన 5154 ఉద్యోగాలు గ్రేడ్-3లోనే ఉన్నాయి. దీంతో ఈ విభాగంలో పోస్టుల సంఖ్య 13,206కు పెరిగింది.



పదో తరగతి తర్వాత నిర్దేశిత ట్రేడుల్లో ఐటీఐ పూర్తిచేసినవారు గ్రేడ్-3 పోస్టులకు పోటీ పడొచ్చు. గతంలో దరఖాస్తు చేసుకోనివారికీ అవకాశమిచ్చారు. అలాగే గత అభ్యర్థులు ఏదైనా మార్పులూ చేసుకోవచ్చు. పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ టెస్టులతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు ఆకర్షణీయ వేతనం అందుకోవచ్చు.

టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులు వేల సంఖ్యలో పెరగడం, వీటికి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం నిరుద్యోగులకు డబుల్ ధమాకా. అర్హతలు, ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. నియామకాలు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ)ల వారీ ఉంటాయి. పరీక్ష అందరికీ ఉమ్మడిగానే నిర్వహిస్తారు. అభ్యర్థులు ఏదో ఒక ఆర్ఆర్‌బీ పోస్టుకే దరఖాస్తు చేసుకోవాలి. అందులోని జోన్ల ప్రాధాన్యాన్ని ఎంచుకోవాలి. ఈ పరీక్షను తెలుగు మాధ్యమంలోనూ రాసుకోవచ్చు. తాజా అభ్యర్థులు గ్రేడ్-3 పోస్టులకే దరఖాస్తు చేసుకోగలరు. గ్రేడ్-1 పోస్టుల సంఖ్యలో మార్పు లేదు.

పరీక్ష: ఆన్‌లైన్‌లో వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కు తగ్గిస్తారు. వంద ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 90 నిమిషాలు. మ్యాథమెటిక్స్ 25, జనరల్ ఇంటలిజెన్స్ అండ్ రీజనింగ్ 25, జనరల్ సైన్స్ 40, జనరల్ అవేర్‌నెస్‌లో 10 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి.

అర్హతకు: అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్‌లు 40, ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీలు 30, ఎస్టీలు 25 మార్కులు పొందాలి. ఇలా అర్హులైనవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక చేసిన అభ్యర్థుల ధ్రువ పత్రాలు పరిశీలించి, వైద్య పరీక్షలు నిర్వహించి, ఉద్యోగానికి తీసుకుంటారు.

గ్రేడ్-3 సిలబస్

మ్యాథమేటిక్స్: నంబర్ సిస్టం, బాడ్మాస్, డెసిమల్స్, భిన్నాలు, కసాగు, గసాభా, రేషియో అండ్ ప్రొపోర్షన్, శాతాలు, మెన్సురేషన్, కాలం-పని, కాలం-దూరం, బారు, చక్ర వడ్డీలు, లాభ నష్టాలు, ఆల్జీబ్రా, చలనజ్యామితి, త్రికోణమితి, ప్రాథమిక సాంఖ్యకశాస్త్రం, మూతలు, వయసు లెక్కలు, గడియారాలు, క్యాలెండర్లు, పైప్స్ అండ్ సిస్టర్న్.

జనరల్ ఇంటలిజెన్స్ అండ్ రీజనింగ్: అనాలజీలు, ఆల్ఫాబెటికల్ అండ్ నంబర్ సిరీస్, కోడింగ్ అండ్ డీకోడింగ్, మ్యాథమేటికల్ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, సిలాజిజం, జంబ్లింగ్, వెన్ డయాగ్రాం, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ సఫిషియన్సీ, కన్‌క్లూజన్స్ అండ్ డెసిషన్ మేకింగ్, పోలికలు-భేదాలు, అనలిటికల్ రీజనింగ్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్- ఆర్గ్యుమెంట్సు, అజంప్షన్స్.

జనరల్ సైన్స్: పదో తరగతి సిలబస్ స్థాయిలో.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్ అంశాల్లో ప్రశ్నలు వస్తాయి.

జనరల్ అవేర్‌నెస్: సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు, సంస్కృతి, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు, ఎకనామిక్స్, పాలిటిక్స్, ఇతర ముఖ్యమైన అంశాలపై తాజా పరిణామాలపై అభ్యర్థి అవగాహనను పరిశీలిస్తారు.

గ్రేడ్-3 సన్నద్ధత

◆ ప్రకటనలో సిలబస్ వివరాలు పేర్కొన్నారు. వాటిని క్షుణ్నంగా పరిశీలించాలి.
◆ ఏదైనా విభాగంలోని ఒక అంశాన్ని తీసుకుని రోజు మొత్తం కేటాయించుకోవచ్చు. ప్రాథమికాంశాల నుంచి ప్రారంభించి, పూర్తిగా చదవాలి. అందులో వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. అలాగే ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి.
◆ వ్యవధిలోగా సిలబస్ మొత్తం చదువుకుంటూ, మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. అనంతరం పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పరీక్ష కోణంలో అలోచించి, ఏ అంశాలకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకోవాలి. మళ్లీ చదవడం, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించడం అవసరం.
◆ వీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఫలితాలు విశ్లేషించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. కనీసం 60 మార్కులు పొందేలా సాధన చేయాలి.
◆ రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేయటం మేలు.
◆ ప్రతి ప్రశ్నకు 54 సెకన్ల సమయం దక్కుతుంది. కొన్నింటికి ఈ వ్యవధి సరిపోకపోవచ్చు. అందువల్ల వేగం, కచ్చితత్వం ప్రాధాన్యాన్ని గ్రహించాలి. మెలకువలు పాటించి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
◆ సన్నద్ధత కోసం పుస్తకాలను పరిమితంగానే ఎంపిక చేసుకుని, వాటినే ఎక్కువ సార్లు చదువుకుంటే గరిష్ఠ ప్రయోజనం దక్కుతుంది.
◆ మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రశ్నలకు ఆబ్జెక్టివ్ అరిథ్‌మెటిక్ -ఆర్ఎస్ అగర్వాల్ పుస్తకం సరిపోతుంది. ఈ విభాగంలో త్రికోణమితి, ఆల్జీబ్రా.. మొదలైన అంశాల కోసం పదో తరగతి గణిత పుస్తకాన్ని బాగా చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేయాలి.
◆ జనరల్ ఇంటలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగానికి ఆర్ఎస్ అగర్వాల్ రీజనింగ్ పుస్తకం లేదా ఏదైనా తీసుకోవచ్చు. అయితే ఏ పుస్తకం చదివినప్పటికీ పరీక్షలో పేర్కొన్న అంశాలకే పరిమితమై, వాటినే బాగా సాధన చేయాలి.
◆ జనరల్ సైన్స్‌పై ప్రత్యేక దృష్టి అవసరం. వంద మార్కుల పరీక్షలో ఈ విభాగానికే 40 కేటాయించారు. విజేతగా నిలవడానికి ఇందులో రాణించడం తప్పనిసరి. అందువల్ల వీలైనన్ని ఎక్కువ మార్కులు పొందాలి. ఇందుకోసం 8,9,10 తరగతుల భౌతిక, రసాయన, జీవశాస్త్రం పుస్తకాలు క్షుణ్నంగా చదవాలి. ముఖ్యాంశాలను నోట్సుగా రాసుకుని పరీక్షకు ముందు మరోసారి వీటిని మననం చేయాలి. అలాగే ఈ విభాగంలో ఎన్‌సీఈఆర్‌టీ, పాలిటెక్నిక్ పాత, మాదిరి ప్రశ్నలు బాగా చదివితే గరిష్ఠ మార్కులు అవకాశం దక్కుతుంది.
◆ జనరల్ అవేర్‌నెస్ కోసం ఏదైనా పత్రికను చదివి ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలకు చెందిన తాజా వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే సరిపోతుంది.

ముఖ్య వివరాలు

పోస్టు: టెక్నీషియన్ గ్రేడ్-3
ఖాళీలు: పాతవి 8052, కొత్తగా చేర్చిన 5154తో కలిపి 13,206. (బ్లాక్ స్మిత్, బ్రిడ్జ్, క్యారేజ్ అండ్ వాగన్, క్రేన్ డ్రైవర్, డీజిల్ (ఎలక్ట్రికల్), డీజిల్ (మెకానికల్), ఎలక్ట్రికల్, ఈఎంయూ, ఫిట్టర్, రెఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, పర్మనెంట్ వే, రివటర్, ఎస్ అండ్ టీ, ట్రాక్ మెషీన్, టర్నర్, వెల్డర్ ఇలా 17 ట్రేడులు/విభాగాల్లో ఉన్నాయి.
కొత్తగా ప్రకటించిన పోస్టులన్నీ రైల్వే వర్క్‌షాపులు, ప్రొడక్షన్ యూనిట్లకు చెందినవి. ఈ పోస్టులన్నీ 22 విభాగాలు/ట్రేడుల్లో ఉన్నాయి.
విద్యార్హత: పదో తరగతి తర్వాత సంబంధిత ట్రేడులు/విభాగాల్లో ఐటీఐ. కొన్నింటికి పది తర్వాత నిర్దేశిత ట్రేడుల/విభాగాల్లో అప్రెంటిస్‌షిప్ పూర్తిచేసుకున్నవారూ అర్హులే. వీటిలో టెలికమ్యూనికేషన్ విభాగం ఖాళీలకు ఇంటర్ ఎంపీసీ వాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: జులై 1, 2024 నాటికి 18-33 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)కు మూడేళ్లు, దివ్యాంగులకు కేటగిరీ ప్రకారం పది నుంచి పదిహేనేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.
వేతనం: గ్రేడ్-3 టెక్నీషియన్ అవకాశం వచ్చినవారికి లెవెల్-2 లో రూ.19,900 మూల వేతనంతో డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు దక్కుతాయి. అన్నీ కలిపి మొదటి నెల నుంచే సుమారు రూ.40 వేల జీతం అందుకోవచ్చు. అనుభవం, అంతర్గత పరీక్షలతో గ్రేడ్-2, గ్రేడ్-1 టెక్నీషియన్లుగా పదోన్నతులు పొందవచ్చు.
దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 16
దరఖాస్తు ఫీజు: ఇంతకుముందు చెల్లించినవారికి లేదు. తాజా అభ్యర్థులైతే.. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్‌జెండర్, ఈబీసీలకు రూ.250. వీరు సీబీటీకి హాజరైతే బ్యాంకు ఛార్జీలు మినహాయించి, మిగిలిన ఫీజు వెనక్కి చెల్లిస్తారు. ఇతర వర్గాల వారికి ఫీజు రూ.500. వీరు సీబీటీకి హాజరైతే రూ.400లో బ్యాంకు ఛార్జీలు మినహాయించి మిగిలినవి వెనక్కి ఇస్తారు.
పరీక్షలు: డిసెంబరు 11 నుంచి 26 వరకు నిర్వహిస్తారు.
వెబ్‌సైట్: https://rrbsecunderabad.gov.in/

హాల్‌లో 44 పోస్టులు

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)... ఒప్పంద ప్రాతిపదికన 44 పోస్టులను భర్తీ చేయనుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. స్క్రీనింగ్ టెస్టు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.



విభాగాలు: ఫైనాన్స్, ఫైర్, ఫైట్ ఆపరేషన్ అండ్ సేఫ్టీ, హెచ్ఆర్, పబ్లిక్ రిలేషన్స్ అండ్ మీడియా కమ్యూనికేషన్, కంపెనీ సెక్రటరీ, ఇంటిగ్రేటెడ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.
1. డిప్యూటీ జనరల్ మేనేజర్ (గ్రేడ్-7)-1: డిగ్రీ, ఫ్లైట్ సేఫ్టీ కోర్సు పూర్తిచేయాలి. ఆర్మీలో ఉద్యోగానుభవం ఉండాలి.
2. మేనేజర్ (గ్రేడ్-4)-4: ఇంజినీరింగ్ డిగ్రీ/ టెక్నాలజీ పాసవ్వాలి. ఆర్మీలో ఉద్యోగానుభవం ఉండాలి.
3. డిప్యూటీ మేనేజర్ (గ్రేడ్-3)-25: ఇంజినీరింగ్ డిగ్రీ/ టెక్నాలజీ చదవాలి.
● ఫైనాన్స్ విభాగంలో ఈ పోస్టుకు.. సీఏ/ ఇన్‌స్టిట్యూట్ డిగ్రీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా/ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నుంచి పూర్తి చేయాలి.
● హెచ్ఆర్ విభాగంలో.. హ్యూమన్ రిసోర్సెస్/ పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ లేబర్ మేనేజ్‌మెంట్/ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్ స్పెషలైజేషన్స్‌తో పీజీ డిగ్రీ లేదా పీజీ డిప్లొమా పూర్తిచేయాలి.
● పీఆర్/ మీడియా కమ్యూనికేషన్ విభాగంలో.. డిగ్రీతోపాటు.. జర్నలిజం కమ్యూనికేషన్/ జర్నలిజం మాస్ కమ్యూనికేషన్/ కమ్యూనికేషన్/ జర్నలిజం/ మాస్ కమ్యూనికేషన్/ బ్రాడ్‌కాస్ట్ జర్నలిజం/ మీడియా కమ్యూనికేషన్/ పబ్లిక్ రిలేషన్స్‌లో పీజీ డిగ్రీ లేదా పీజీ డిప్లొమా చేయాలి. నాలుగేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.
4. ఆఫీసర్ (గ్రేడ్-2)-14: పీఆర్/ మీడియా కమ్యూనికేషన్ విభాగంలో ఆఫీసర్ పోస్టులకు డిప్యూటీ మేనేజర్ పీఆర్/ మీడియా కమ్యూనికేషన్‌కు పేర్కొన్న విద్యార్హతలే వర్తిస్తాయి.
● ఆఫీసర్ (కంపెనీ సెక్రటరీ) పోస్టుకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా నిర్వహించే అసోసియేట్ మెంబర్‌షిప్ ఎగ్జామినేషన్ పాసవ్వాలి.
● ఫైర్ ఆఫీసర్ పోస్టుకు.. నేషనల్ ఫైర్ సర్వీసెస్ కాలేజ్, నాగ్‌పూర్ నిర్వహించే ఫైర్ ఇంజినీరింగ్ బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేయాలి. లేదా ఫైర్ ఇంజినీరింగ్/ టెక్నాలజీలో బాచిలర్ డిగ్రీ చేయాలి. లేదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ ఇంజినీరింగ్, యూకే నిర్వహించే అసోసియేట్ మెంబర్‌షిప్/ మెంబర్‌షిప్ ఎగ్జామినేషన్ పాసవ్వాలి. లేదా ఫిజిక్స్ కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులతో బీఎస్సీ 60 శాతం మార్కులతో పాసవ్వాలి. దీంతో పాటు నేషనల్ ఫైర్ సర్వీసెస్ కాలేజ్ (నాగ్‌పూర్)/ నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ) హైదరాబాద్ నిర్వహించే.. 22 వారాల డివిజనల్ ఆఫీసర్స్ కోర్సు పూర్తిచేయాలి. నాలుగేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: ఆఫీసర్ (గ్రేడ్-2) పోస్టులకు 30 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్ (గ్రేడ్-3) పోస్టులకు 35 ఏళ్లు, మేనేజర్ (గ్రేడ్-4) పోస్టులకు 38 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ (గ్రేడ్-7) పోస్టులకు 47 ఏళ్లు మించకూడదు. గరిష్ఠ వయసులో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు.
ఎంపిక: దరఖాస్తుల్లో తెలిపిన విద్యార్హతలు, అనుభవాల ఆధారంగా అభ్యర్థులను 1:10 నిష్పత్తిలో షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
● ఇంటర్వ్యూ తేదీ, సమయం, చిరునామా వివరాలను అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా తెలియజేస్తారు. ఇంటర్వ్యూకు ఎంపికైనవారి వివరాలను హాల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.
● ఇంటర్వ్యూలో అర్హత సాధించినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.
వేతనం: ఆఫీసర్ (గ్రేడ్-2) పోస్టులకు నెలకు రూ.40,000-1,40,000; డిప్యూటీ మేనేజర్ (గ్రేడ్-3) పోస్టులకు నెలకు రూ.50,000-1,60,000; మేనేజర్ (గ్రేడ్-4) పోస్టులకు నెలకు రూ.60,000-1,80,000; డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులకు రూ.90,000-2,40,000 వేతనం ఉంటుంది.
దరఖాస్తుకు చివరి తేదీ: 30.10.2024
వెబ్‌సైట్: http://www.hal-india.co.in/

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్‌ ఫ్రమ్‌ హోమ్
అర్బనో ఇన్ఫోటెక్ ప్రై.లి.లో

1. ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్
నైపుణ్యాలు: జబల్.ఐవో, పోస్ట్‌జీఎస్‌క్యూఎల్, నెక్స్ట్.జేఎస్, నోడ్.జేఎస్, రియాక్ట్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/557ec3

2. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్
నైపుణ్యాలు: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా స్ట్రక్చర్స్, మెషిన్ లెర్నింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, పైథాన్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/cbb80d

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: ట్రైబ్ కన్సల్టెన్సీ
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కేన్వా, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్ స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/bb520e
వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 31

మార్కెటింగ్ కాపీ అండ్ నెట్‌వర్కింగ్
సంస్థ: నీల్‌రాజ్ పాటిల్
నైపుణ్యాలు: కాపీరైటింగ్, ఈమెయిల్, లింక్డ్ ఇన్ మార్కెటింగ్, మార్కెటింగ్ క్యాంపెయిన్స్
స్టైపెండ్: రూ.2,000 (వారానికి)
దరఖాస్తు గడువు: అక్టోబరు 30
☛ internshala.com/i/abde8e

బృందంతో లాభాలెన్నో!




తరగతులకు హాజరై శ్రద్ధగా పాఠాలు వినాలి. అర్థంచేసుకుంటూ చదివి.. జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని.. పరీక్షల్లో రాయాలి. ఇవన్నీ సాధారణంగా ఒంటరిగానే చేస్తుంటాం కదా... మరి బృందంగా ఏర్పడి చదవాల్సిన (గ్రూప్ స్టడీ) అవసరం ఏముంటుందని అనుకుంటున్నారా? అయితే ఇది చదవండి.

పాఠాలలోని ముఖ్యాంశాలు అర్థం కానప్పుడు స్టడీ గ్రూప్‌లోని సభ్యుల సహాయం తీసుకోవచ్చు. వాళ్లు మనకు సులువుగా అర్థమయ్యేలా చెప్పొచ్చు. కొన్నిసార్లు మీకు తెలిసిన అంశాన్ని కూడా ఇతరులకు వివరించి చెప్పొచ్చు. దీంతో ఒక విషయాన్ని స్పష్టంగా వివరిస్తూ చెప్పే నైపుణ్యం మీకు మెరుగ్గా అలవాటు అవుతుంది. నేర్చుకునే క్రమంలో ఇలా కొత్త విధానాలను తెలుసుకోవచ్చు కూడా.

❖ తెలిసిన విషయాలను బృంద సభ్యులతో పంచుకోవడం అలవాటు చేసుకోగలుగుతారు. కొన్ని అసైన్‌మెంట్లు పూర్తిచేసే క్రమంలో కలిసికట్టుగా పనిచేయగలుగుతారు. సందేహాలూ నివృత్తి చేసుకోగలుగుతారు. కొందరు విద్యార్థులు తరగతిలో అందరి ముందూ సందేహాలను అడగడానికి సంకోచిస్తారు. అలాంటివాళ్లు బృంద సభ్యుల సహకారంతో సందేహాలను తీర్చుకోగలుగుతారు.
❖ పనులను విభజించుకుంటూ లక్ష్యసాధనకు ప్రయత్నించవచ్చు. దాంతో ఒత్తిడి మొత్తం ఒక్కరి మీదే పడకుండా ఉంటుంది. బాధ్యతను అందరూ కలిసి పంచుకున్నట్టు అవుతుంది.
❖ బృంద సభ్యులు ఎలా ఉండాలనే విషయంలోనూ సందేహాలు వస్తుంటాయి. కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన, పరిజ్ఞానాన్ని నలుగురితో పంచుకోవాలనే ఉద్దేశం, లక్ష్య సాధనకు కష్టపడే తత్వం లాంటి లక్షణాలు ఉన్నవాళ్లను సభ్యులుగా ఎంచుకోవాలి.
❖ మరి బృందంలో ఎంతమంది ఉండాలి? సభ్యులు మరీ ఎక్కువగా ఉంటే.. కొందరు మాత్రమే బృంద కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. మిగిలిన వాళ్లు మౌనంగా ఉండిపోతారు. అలాగని తక్కువమంది ఉన్నా ఇబ్బందే. ఆరేడుగురు కలిసి బృందంగా ఏర్పడితే ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా అన్ని పనుల్లో భాగం పంచుకోగలుగుతారు.
❖ ప్రతివారం తప్పనిసరిగా సభ్యులందరూ కలిసేట్టుగా ప్రణాళిక వేసుకుంటే ఫలితం ఉంటుంది. అలాగే పరీక్షల ముందు ఎక్కువసార్లు కలిసినా ఇబ్బంది ఉండదు.
❖ ముఖ్యంగా పండగలు, పరీక్షల ముందు వచ్చే సెలవుల్లో సభ్యులందరూ తరచూ కలుసుకోవడం కుదరకపోవచ్చు. హాస్టళ్లలో ఉండేవాళ్లు సొంత ఊళ్లకు వెళ్లిపోవచ్చు. అలాంటప్పుడు సాంకేతిక సాయం తీసుకోవచ్చు. ముఖ్యమైన డాక్యుమెంట్లు, డిజిటల్ ఫ్లాష్‌కార్డులను షేర్ చేసుకోవచ్చు. వీడియో కాన్ఫరెన్సింగ్ పెట్టుకోవచ్చు కూడా.

సూర్యుడి నుంచి భూమి గ్రహించే సౌరశక్తిని సూర్యపుటం అంటారు. అయితే సూర్యపుటం అనేది అన్నివేళలా ఒకే విధంగా ఉండదు. ఇది అక్షాంశాన్ని, కాలాన్ని బట్టి అక్కడున్న భౌతిక భౌగోళిక పరిస్థితులను బట్టి మారుతూ ఉంటుంది. వేసవి, శీతాకాల ఆయనాంతాలు, సౌర స్థిరాంకం, దాన్ని ప్రభావితం చేసే అంశాలపై పరీక్షల్లో ప్రశ్నలు వస్తుంటాయి. వీటిపై పోటీపరీక్షార్థులు దృష్టిసారించాలి.



ఆరు నెలలు ఉత్తరంలో వెలుగు... దక్షిణంలో చీకటి!

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జాగ్రఫీ

సూర్యపుటం - విస్తరణ

విషవత్తులు

సూర్య కిరణాలు మార్చి 21, సెప్టెంబరు 23 తేదీల్లో భూమధ్యరేఖపై నిట్టనిలువుగా పడతాయి. ఈ రెండు రోజుల్లో ప్రపంచమంతటా రాత్రింబవళ్లు సమానంగా ఉంటాయి. అంటే పగటి సమయం 12 గంటలు, రాత్రి సమయం 12 గంటలుగా ఉంటాయి.

- సెప్టెంబరు 23న ఉత్తరార్ధగోళంలో శరదృతువు, దక్షిణార్ధగోళంలో వసంత రుతువు ఉంటాయి.
- మార్చి 21న ఉత్తరార్ధగోళంలో వసంత రుతువు, దక్షిణార్ధగోళంలో శరదృతువు ఉంటాయి.
- మార్చి 21 తరువాత సూర్యుడు భూమధ్యరేఖ మీద నుంచి ఉత్తరం వైపుగా తన ప్రయాణం కొనసాగిస్తాడు. జూన్ 21న 23 1/2° ఉత్తర అక్షాంశంగా పిలిచే కర్కటకరేఖపై సూర్యకిరణాలు లంబంగా పడతాయి.

శీతకాల ఆయనాంతం

సెప్టెంబరు 23 తర్వాత సూర్యుడు భూమధ్యరేఖ మీద నుంచి దక్షిణంగా తన ప్రయాణం కొనసాగిస్తాడు.

- దక్షిణంగా కదిలిన సూర్యుడు డిసెంబరు 22 నాటికి మకరరేఖపైకి చేరతాడు. అంటే మకరరేఖపై డిసెంబరు 22న సూర్యకిరణాలు లంబంగా పడతాయి.
- దక్షిణ ధ్రువం సూర్యుడివైపు వాలి ఉండటంతో డిసెంబరు 22న సూర్యకిరణాలు మకరరేఖపై నిట్టనిలువుగా పడతాయి. ఈ కారణంగా దక్షిణార్ధగోళంలో ఎక్కువ భాగం కాంతి పొందుతుంది. అందువల్ల దక్షిణార్ధగోళంలో వేసవికాలం తీవ్రంగా ఉండి, పగటికాలం ఎక్కువగా, రాత్రి సమయం తక్కువగా ఉంటాయి. ఇందుకు భిన్నంగా ఉత్తరార్ధగోళంలో ఉంటుంది. భూమి స్థితి ఈ విధంగా ఉండటాన్ని శీతాకాల ఆయనాంతం అంటారు.
- మకరరేఖ (23 1/2° దక్షిణ అక్షాంశం) ఆస్ట్రేలియా ఖండం మధ్యగా వెళ్తోంది. ఈ అక్షాంశంపై సూర్యకిరణాలు డిసెంబరు 22న నిట్టనిలువుగా పడటంతో వీరికి డిసెంబరు మాసంలో వేసవికాలం ఉంటుంది. అందువల్ల ఆస్ట్రేలియా ప్రజలు వేసవి కాలంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకుంటారు.

వసంత రుతువు విషవత్తు - మార్చి 21
వేసవి ఆయనాంతం - జూన్ 21
శరదృతువు విషవత్తు - సెప్టెంబరు 23
శీతాకాల ఆయనాంతం - డిసెంబరు 22

- బౌర్, ఫిలిప్స్ అనే పరిశోధకులు తమ పరిశోధనల ద్వారా ఆ నాలుగు తేదీల్లో సూర్యపుటంలో వచ్చే మార్పులను వివరించారు.

వేసవి ఆయనాంతం

జూన్ 21న ఉత్తరార్ధగోళం సూర్యుడివైపు వంగి ఉండటం వల్ల కర్కటకరేఖ మీద సూర్యకిరణాలు నిట్టనిలువుగా పడి ఈ ప్రాంతాలు ఎక్కువ వేడిని గ్రహిస్తాయి.

- ఉత్తర ధ్రువం సూర్యుడివైపు వంగి ఉండటం వల్ల ఆర్కిటిక్ వలయం నుంచి ఉత్తర ధ్రువం వరకు పగటికాలం నిరంతరంగా 6 నెలలు ఉంటుంది. దీనివల్ల ఉత్తరార్ధగోళంలో ఎక్కువ ప్రాంతం సూర్యుడి నుంచి కాంతిని పొందుతుంది. అందువల్ల భూమధ్యరేఖకు ఉత్తరంగా ఉన్న ప్రాంతంలో వేసవి కాలం ఏర్పడుతుంది.
- కర్కటకరేఖ భారతదేశ భూభాగం మధ్యగా వెళ్తోంది. అందువల్ల మన దేశంలో మార్చి నుంచి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభమై మే నెల వరకు అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయి.
- ఉత్తరార్ధగోళంలో జూన్ 21న పగటి కాలం అత్యధికంగా, రాత్రి నిడివి అతితక్కువగా ఉంటాయి. ఇదే సమయంలో దక్షిణార్ధగోళంలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటాయి. పగటి సమయం కంటే రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది. భూమి స్థితి ఈ విధంగా ఉండటాన్ని వేసవి ఆయనాంతం అంటారు.

పగటికాల వ్యత్యాసం:

ఒక రోజులో పగటికాలం అనేది అక్షాంశం, రుతువుల ఆధారంగా మారుతూ ఉంటుంది. భూమధ్యరేఖ వద్ద రాత్రింబవళ్లు ఇంచుమించు సమానంగా ఉంటాయి.

- భూమధ్యరేఖ నుంచి ధ్రువాల వైపు వెళ్లే కొద్దీ రాత్రింబవళ్ల కాలంలో వ్యత్యాసం కనిపిస్తుంది.
- ఉత్తర ధ్రువ ప్రాంతంలో ఆరు నెలలు పగటికాలం ఉంటే, అదే సమయంలో దక్షిణ ధ్రువం వద్ద ఆరు నెలల పాటు చీకటిగా ఉంటుంది. ఈ తారతమ్యాల వల్ల సూర్యపుటం, సౌరస్థిరాంకం మారుతూ ఉంటాయి.
- అక్షాంశం, రుతువుల మార్పిడి వల్ల పగటి సమయం వేసవికాలంలో ఎక్కువగా, శీతాకాలంలో తక్కువగా ఉంటుంది. కాబట్టి వేసవి కాలంలో సూర్యపుటం ఎక్కువగా ఉంటుంది.
- భూమధ్య రేఖా ప్రాంతానికి, ధ్రువ ప్రాంతానికి మధ్య సూర్యపుటంలోను, సౌరస్థిరాంకంలోనూ వ్యత్యాసం ఉంటుంది.

వివిధ అక్షాంశాల్లో పగటికాల వ్యత్యాసం:

అక్షాంశం (డిగ్రీలు):	0	17	31	41	58.5	63.4	66.5	67.4	69.8	78.2	90
పగటికాలం (గంటల్లో):	12	13	14	15	178	20	24	1 నెల	2 నెలలు	4 నెలలు	6 నెలలు



రచయిత
పి.కె. వీరాంజనేయులు
విషయ నిపుణులు

వాతావరణం పారదర్శకత:

భూమి చుట్టూ తొడుగులా ఉన్న గాలిపొరను 'వాతావరణం' అంటారు.

- సూర్యుడి నుంచి భూమి మీదకు ప్రసరించే సూర్యకిరణాలు వాతావరణం నుంచి పయనించి భూమిని చేరతాయి.
- వాతావరణం అనేది పారదర్శకంగా ఉంటే ఏ విధమైన ఆటంకం లేకుండా సౌరశక్తి 100% భూమి మీదకు ప్రసరిస్తుంది. అయితే వాతావరణంలో దుమ్ము, ధూళి, నీటి ఆవిరి, సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండటం వల్ల వాతావరణం స్వచ్ఛతను కోల్పోతుంది.
- పరావర్తనం ద్వారా, గ్రహించడం ద్వారా, వెదజల్లడం ద్వారా సౌరపుటాన్ని వాతావరణం ప్రభావితం చేస్తుంది.

పరావర్తనం ద్వారా నష్టపోయే సౌరశక్తి మొత్తం:

1. మేఘాల పరావర్తనం ద్వారా 20%
2. వాతావరణ పరావర్తనం ద్వారా 6%
3. భూఉపరితల పరావర్తనం ద్వారా 4%

- మొత్తం సౌరశక్తిలో భూమి పరావర్తనం చేసే సౌరశక్తి 30%. దీన్నే ఆల్బిడో అంటారు. తాజాగా కురిసిన మంచుకు అత్యంత ఆల్బిడో ఉంటుంది.

గ్రహించడం ద్వారా నష్టపోయే సౌరశక్తి:

- మేఘాలు గ్రహించడం ద్వారా 3%
- వాతావరణం గ్రహించడం ద్వారా 16%

సౌర స్థిరాంకం/ సూర్యపుటాన్ని ప్రభావితం చేసే అంశాలు

అక్షాంశం:

భూమిని చేరుతున్న సూర్యపుటం అన్నిచోట్లా ఒకేవిధంగా ఉండకపోవడానికి ప్రధానమైన కారణం అక్షాంశం. భూమి సూర్యుడి చుట్టూ తిరిగేటప్పుడు 23 1/2° వాలి తిరుగుతుంది. అందుకే భూమిపై పడే సూర్యకిరణాలు భూగోళమంతటా ఒకే విధంగా పడవు. ఇవి భూమధ్యరేఖ వద్ద లంబంగా, ధ్రువాల వద్ద ఏటవాలుగా పడతాయి.

- భూమధ్యరేఖ నుంచి ఉత్తరంగా గానీ, దక్షిణంగా గానీ వెళ్లేకొద్దీ సూర్యకిరణాలు ఏటవాలుగా పడతాయి. కాబట్టి ఉష్ణోగ్రత తగ్గుతూ ఉంటుంది.
- భూమిపై పడే లంబకిరణాలు తక్కువ స్థలాన్ని ఆక్రమించి ఎక్కువ వేడిని కలిగిస్తాయి. ఈ లంబకిరణాలు వాతావరణంలో తక్కువ దూరం పయనిస్తాయి. తక్కువ వేడిని కోల్పోతాయి.
- ఏటవాలు కిరణాలు భూమిపై ఎక్కువ ప్రాంతాన్ని ఆక్రమిస్తాయి. కానీ తక్కువ వేడిని కలిగిస్తాయి. ఈ ఏటవాలు కిరణాలు వాతావరణంలో ఎక్కువ దూరం పయనిస్తాయి. కాబట్టి ఎక్కువ వేడిని కోల్పోతాయి.
- ఏటవాలు కిరణాలు వాతావరణ పొరల్లో ఎక్కువ దూరం పయనించేటప్పుడు వాతావరణంలోని నీటి ఆవిరి, దుమ్ము కణాలు మొదలైనవి ఎక్కువ వేడిని గ్రహిస్తాయి.

సౌరదినం: ఒకరోజులో భూమి గ్రహించే సగటు సూర్యపుటాన్ని సౌరదినం అంటారు.

☛ భూమధ్యరేఖ ప్రాంతంలో సంవత్సరానికి సరాసరి సౌరదినాలు 350 వరకు ఉండగా, ధ్రువ ప్రాంతాల వద్ద సౌరదినాలు 150 వరకు ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. సూర్యుడి ఉపరితల ఉష్ణోగ్రత ఎంత?
1) 6000°C 2) 4000°C
3) 100000°C 4) 500000°C

2. సూర్యుడి అంతర్ నిర్మాణంలోని ఏ పొర నుంచి మనకి వెలుతురు, వేడి వస్తున్నాయి?
1) కరోనా 2) క్రోమోస్ఫియర్
3) ఫోటోస్ఫియర్ 4) కోర్

3. అపహేళి సమయంలో సూర్యుడికి, భూమికి మధ్య దూరం....
1) 147 M. km 2) 152 M. km
3) 149.5 M. km 4) 165.5 M. km

4. అధిక ఆల్బిడో కలిగిన గ్రహం
1) భూమి 2) శుక్రుడు 3) గురుడు 4) బుధుడు

5. చంద్రమండలం నుంచి చూసేవారికి భూమి ఏ రంగులో కనిపిస్తుంది?
1) నీలం 2) నలుపు
3) నారింజ 4) నారింజ, పసుపు రంగుల కలయిక

6. వేసవి ఆయనాంతం ఎప్పుడు వస్తుంది?
1) జూన్ 21 2) డిసెంబరు 22
3) మార్చి 21 4) సెప్టెంబరు 23

7. ఒక రోజులో భూమి గ్రహించే సగటు సూర్యపుటాన్ని ఏమంటారు?
1) సౌరస్థిరాంకం 2) సూర్యకాంతి
3) సౌర దినం 4) కాంతి సంవత్సరం

8. వేసవి కాలంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకునే దేశం?
1) అమెరికా 2) ఆస్ట్రేలియా
3) బ్రిటన్ 4) పెరు

9. వాతావరణం సూర్యకాంతిని, వేడిని గ్రహించే ప్రక్రియను ఏమంటారు?
1) వహనక్రియ 2) సంవహన క్రియ
3) ఉష్ణ సమతౌల్యం 4) సౌర స్థిరాంకం

10. సౌర స్థిరాంకంలో మేఘాల వాటా...
1) 3% 2) 16%
3) 6% 4) 4%

సమాధానాల కోసం క్యూఆర్ స్కాన్ చేయండి

434 Word of the Day

Horrendous

Telugu meaning: భయంకరమైన, దారుణమైన

English meaning: The word horrendous is an adjective that describes something extremely unpleasant or terrible.

Synonyms: Terrible, Awful

Antonyms: Wonderful, Pleasant

Usage: 1. The conditions in the prison were horrendous, with little food and unsanitary living spaces.
2. They witnessed a horrendous car accident on the highway that caused heavy traffic.

Latest Updates

Apprentice Posts

Oil and Natural Gas Corporation (ONGC) Limited invites applications for engagement as Apprentices in the trade/ disciplines. The total no. of posts is 2236. The last date for online applications is 25 October 2024.

SIDBI, Lucknow

Small Industries Development Bank of India (SIDBI), Lucknow invites applications for the Consultant Credit Analyst, Accounts and Tax Consultant (ATC) posts on contract basis. The total number of posts is 22. Eligible candidates can apply online before 10 October 2024.


Did You Apply..?

Today (October 8) is the last date for the following Posts/ Scholarships

- 33 Non Teaching posts in Central University of Jharkhand (CUJ), Ranchi. *Qualification:* 10th, 10+2, Diploma, B.Sc., B.E/ B.Tech. along with work experience.
- Law Officer posts in IOCL, Delhi. *Qualification:* LLB degree.
- UPSC - Engineering Services Exam 2025. *Qualification:* Degree/ Diploma (Engineering), M.Sc, Master's Degree in relevant discipline.
- Educator, Helper posts in DWCWE, Srisatyasai District. *Qualification:* 7th class, 10th class, Degree, B.Ed., Diploma in relevant discipline with experience.
- Protection Officer, Educator posts in WD and CW Dept., Eluru District. *Qualification:* 7th Class, 10th Class, Degree, PG, MBBS, Certificate Course with experience.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (సైన్స్ అండ్ టెక్నాలజీ)



☛ ఒక పెద్ద వస్తువు చుట్టూ తిరిగే మరొక వస్తువునే ఉపగ్రహం అంటారు. సూర్యుడికి భూమి.. భూమికి చంద్రుడు ఉపగ్రహాలు. ఇవి సహజసిద్ధమైనవి.

☛ భూ కక్ష్యలో తిరిగే మానవ నిర్మిత యంత్రాలూ ఉపగ్రహాలే. ఇవి కృత్రిమమైనవి. వీటిని వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు. కమ్యూనికేషన్స్, వాతావరణ సూచన, నావిగేషన్, భూ పరిశీలన, ఖనిజ వనరుల అన్వేషణ, టీవీ ప్రసారాలు మొదలైన అనేక రకాల సేవలు వీటిద్వారా అందుతున్నాయి.

☛ ఉపగ్రహాల నిర్మాణం, వర్గీకరణ, వాటి అనువర్తనాలు మొదలైన వివరాలు ఈ-బుక్‌లో ఉన్నాయి.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

Current Affairs



India has successfully conducted three flight tests of the indigenously developed Very Short Range Air Defence System (VSHORADS) missiles at the Pokhran firing ranges in Rajasthan on 5 October 2024.

- VSHORADS is a man-portable air defence system designed and developed indigenously by Research Centre Imarat (RCI) in collaboration with other DRDO laboratories and Indian industry partners.

The celebration of the 92nd anniversary of the Indian Air Force (IAF) began in Marina Beach, Chennai on 6 October 2024. The theme for this year (2024) is Sashakt, Saksham, Atmanirbhar (Potent, Powerful, Self-reliant).

Vera Voronova from Kazakhstan and Ysabel Agustina Calderón Carlos from Peru have been selected for the MIDORI Prize for Biodiversity 2024. They have been recognised for their outstanding contributions to conservation and sustainability.

- The MIDORI Prize for Biodiversty was established in 2010 by the AEON Environmental Foundation.

World Teachers' Day is observed every year on October 5 to honour our teachers' crucial role to build the future of a country. This day was established by United Nations Educational, Scientific and Cultural Organization (UNESCO) in 1994.

- **2024 theme:** 'Valuing teacher voices: towards a new social contract for education.'

For more Current Affairs: Scan QR code

Bank Exams
Quantitative Aptitude

Approximations

Directions (Qs. 1 - 29): *What approximate value should come in place of the question mark (?) in the following questions (You are not expected to calculate the exact value.)*

1. $[(\sqrt{530} \times 36.003) \div 47.987] \times ? = 5863.10376$
A) 640 B) 750 C) 340 D) 360 E) 680

2. $63.9872 \times 9449.8780 \div 243.003 = (?)^2$
A) 60 B) 75 C) 90 D) 40 E) 50

3. 18% of 609 + 27.5% of 450 = ?
A) 220 B) 233 C) 267 D) 248 E) 274

4. $(3.2)^2 + (9.8)^2 + (8.13)^2 + (4.24)^2 = ?$
A) 190 B) 194 C) 188 D) 198 E) 170

5. $\sqrt{8938} \times (5.96)^2 = ?$
A) 3050 B) 3780 C) 2340 D) 3400 E) 3950

6. $52001 \div 61 \times 29 = ? \times 41$
A) 700 B) 600 C) 500 D) 550 E) 680

7. $96.996 \times 9.669 + 0.96 = ?$
A) 860 B) 870 C) 1020 D) 940 E) 1100

8. $459.008 + 3.0056 \times 88.862 = ?$
A) 738 B) 725 C) 695 D) 752 E) 666

9. $(9117.88 - 8021.85 + 903.92) \times 12 = 1500 \times ?$
A) 12 B) 8 C) 16 D) 22 E) 4

10. $1299 \div 19.99 \times 25.01 + 400.01 = ?$
A) 2025 B) 2300 C) 1925 D) 2200 E) 1700

11. $\sqrt{1024.002} \div 3.996 \div 9.98 + 29 = ?$
A) 3 B) 9 C) 30 D) 90 E) 80

12. 89.988% of 699.9 + 50.002% of 999.99 – 170.015 = ?
A) 990 B) 900 C) 920 D) 960 E) 860

13. $(16.993)^2 + (25.98)^2 - (3558.99 + 3244.89) \div (6.01)^2 = ?$
A) 667 B) 767 C) 776 D) 676 E) 432

14. 79.99% of 899.99 + $(16.02)^2 \times 3.99 \times x = (10.97)^3 - 98.96$
A) 1 B) 1.5 C) 0.5 D) 2 E) 0

15. 64.9% of 801 – 230.17 = ? – 25.012% of 783.96
A) 486 B) 406 C) 546 D) 620 E) 720

16. 0.75% of 90 + 0.55% of 80 = ?
A) 1.725 B) 1.475 C) 1.325 D) 1.115 E) 0.995

17. 17% of 760 + 57% of 78.99 + 77.77 = ?
A) 238 B) 242 C) 248 D) 252 E) 256

18. $561204 \times 58 = ? \times 55555$
A) 606 B) 646 C) 556 D) 716 E) 586

19. $43931.03 \div 2111.02 \times 401.04 = ?$
A) 8800 B) 7600 C) 7400 D) 9000 E) 8345

20. $\sqrt{624.995} + (4.9989)^2 = ? \div \frac{1}{4.9900865}$
A) 180 B) 34 C) 44 D) 250 E) 15

21. $23.001 \times 18.999 \times 7.998 = ?$
A) 4200 B) 3000 C) 3500 D) 4000 E) 2500

22. $136 \div \left(\frac{3}{8} \times \frac{2}{7} \times \frac{5}{3}\right) = ?$
A) 750 B) 760 C) 770 D) 780 E) 790

23. 40% of 600 – 250.17 = ? – 80% of 900
A) 800 B) 500 C) 710 D) 650 E) 550

24. $(340 \times 9.98) \div 6.4001 + 1245.15 = ?$
A) 1766 B) 1776 C) 1676 D) 1876 E) 1806

25. $888888 \div 88 \div 8 = ?$
A) 1263 B) 70600 C) 1526 D) 80800 E) 1047

26. 1.05% of 2500 + 2.2% of 440 = ?
A) 37.50 B) 35.93 C) 370.25 D) 372.50 E) 350.72

27. $4433.764 - 2211.993 - 1133.467 + 3377.442 = ?$
A) 4466 B) 4377 C) 3633 D) 4144 E) 3344

28. $1884.88 \div 144.921 + 6.99 + (?)^2 = 69.09$
A) 3 B) 4 C) 5 D) 6 E) 7

29. $499.99 + 1999 \div 39.99 \times 50.01 = ?$
A) 3200 B) 2700 C) 3000 D) 2500 E) 2400

Scan the QR code for Key

These model questions were prepared by subject experts of ***RACE Institute*** *Hyderabad*

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



■ భారత మహిళల క్రికెట్ జట్టు ఇటీవల చెన్నైలో ఏ జట్టుతో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో తొలిరోజు ఏకంగా 525 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది? (టెస్టు క్రికెట్ (పురుషులు కలిపి) చరిత్రలోనే మొదటిరోజు అత్యధిక పరుగులు చేసిన జట్టుగా భారత మహిళల జట్టు నిలిచింది. ఈ మ్యాచ్‌లో భారత క్రికెటర్ షెఫాలీ వర్మ టెస్టుల్లో తొలి శతకాన్నే ద్విశతకంగా మార్చింది. 194 బంతుల్లో 205 పరుగులు చేసి మహిళల టెస్టుల్లో అత్యంత వేగంగా ద్విశతకం సాధించిన క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది.) **జ:** దక్షిణాఫ్రికా

■ 18వ, ప్రస్తుత లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏ రాష్ట్రంలోని 'కోట' స్థానం నుంచి బీజేపీ తరఫున ఎంపీగా గెలుపొందారు? (మాడభూషి అనంతశయనం అయ్యంగార్, గుర్‌దయాళ్ సింగ్ ధిల్లాన్, బలరాం జాఖడ్, జీఎంసీ బాలయోగి తర్వాత రెండోసారి స్పీకర్ పదవి చేపట్టిన వ్యక్తిగా ఓం బిర్లా రికార్డు సృష్టించారు. తొలి విడతలో అయిదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకుని వరుసగా రెండోసారి స్పీకర్ పదవి చేపట్టిన తొలివ్యక్తి బలరాం జాఖడ్ కాగా ఓం బిర్లా ఆ కోవలో రెండో వ్యక్తి.) **జ:** రాజస్థాన్

■ చంద్రుడి అవతలి వైపు భాగంలోని మట్టిని భూమి పైకి సురక్షితంగా చేర్చిన మొదటి దేశంగా ఏది రికార్డు సృష్టించింది? **జ:** చైనా

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

ప్రతి సబ్జెక్టు లేదా పాఠాన్ని అధ్యయనం చేయడానికి నిర్ణీత కాలాన్ని కేటాయించుకోవాలి. ఆ టైమ్‌లోగా పూర్తిచేయడానికి ప్రయత్నించాలి. ఆ విధంగా చేస్తే ఒక క్రమంలో సిలబస్ ప్రిపరేషన్ సాగుతుంది. రివిజన్‌కు అవసరమైనంత సమయం దొరుకుతుంది.

డీఎస్సీ/టెట్ - 2024
ఇంగ్లిష్ మెథడాలజీ

TENTH Social Studies



Because of hilly and rocky nature

The Population

2 Marks

1) Define sex ratio?

A: It is the ratio of males to females in a population.

2) How can we group the population of a nation?

A: The population of a nation is generally grouped into three broad categories.
1. Children (Below 15 years)
2. Working Age (15-59 years)
3. Aged (Above 59 years)

Q&A

3) Why does Arunachal pradesh have the least density of population?

A: Arunachal pradesh has the least density of population because of hilly and rocky nature of the terrain.

4 Marks

4) Mention the reasons behind the low female population in India?

A: 1. Low literacy rate.
2. Gender discrimination in our socity.
3. Lack of medical facilities.
4. Poverty.
5. Not providing nutritious food.
6. Parental attitude.

5) Write some reasons for population growth in India?

A: 1. Improvement in medical facilities.
2. Decrease of death rate.
3. Increase of Birth rate.
4. Emoployment availability was increased.
5. Increase of irrigation facility.
6. A decline in fancies.

Some More Important Questions

6 Marks

1) Which factors influence the changing population size?
2) What are the major problemes faced by the goverments when the population was increased day by day?
3) Give some examples of this discriminations.
4) How many kinds of migrations are there?


For Answers

G. Vishwaprasad

అర్థవంతమైన గుణధర్మాల అమరిక!

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ

మెడికల్ షాపులో వందల రకాల మందులు ఉన్నా, అడిగిన మెడిసిన్ వెంటనే దుకాణదారుడు తెచ్చి ఇచ్చేస్తాడు. సూపర్ బజార్‌లో ఏ వస్తువు కావాలంటే దాని దగ్గరకు నేరుగా వెళ్లిపోవచ్చు. కారణం ఆ మందులైనా, ఈ వస్తువులైనా ఒక క్రమంలో అమరి ఉంటాయి. అందుకే తేలిగ్గా అందుబాటులో ఉంటాయి. అదే విధంగా రసాయన శాస్త్రంలో అనేక రకాల మూలకాలు ఉన్నాయి. లక్షణాలను, గుణధర్మాలను అనుసరించి శాస్త్రవేత్తలు వాటిని వర్గీకరించారు. మూలకాలను అర్థం చేసుకోవడానికి, కొత్తవాటిని కనిపెట్టడానికి ఆ విభజన ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో పరీక్షల కోణంలో ముఖ్యమైన మూలకాల వర్గీకరణ గురించి అభ్యర్థులు తెలుసుకోవాలి. అందులోని వివిధ నియమాలనూ అర్థం చేసుకోవాలి.



మూలకాల వర్గీకరణ


భౌతిక రసాయన మార్పుల ద్వారా ఏదైనా పదార్థాన్ని అంతకంటే మరింత సూక్ష్మ పదార్థంగా విభజించలేకపోతే అదే మూలకం అని రాబర్ట్ బాయిల్ నిర్వచించాడు. 1661లో కేవలం 13 మూలకాలకు సంబంధించిన సమాచారం మాత్రమే అందుబాటులో ఉంది. 18వ శతాబ్దం చివరి నాటికి లెవోఇజర్ కాలంలో మరో 11; 1865 నాటికి దాదాపు 63 మూలకాలను కనుక్కున్నారు. 1940 నాటికి సహజ వనరుల నుంచి 91 మూలకాలు కనుక్కున్నారు. మరో 17 కృత్రిమంగా తయారుచేశారు. ప్రస్తుతం వాటి సంఖ్య 118.

డాబర్‌నీర్ త్రిక సిద్ధాంతం: ఈయన జర్మన్ రసాయన శాస్త్రవేత్త. ఒకే రకమైన రసాయన ధర్మాలున్న మూడేసి మూలకాల సమూహాలను గుర్తించి వాటిని త్రికం అని పేర్కొన్నాడు. 'ప్రతి త్రికంలో మధ్య మూలకం పరమాణు భారం మిగిలిన రెండు మూలకాల పరమాణు భారాల సరాసరికి దాదాపు సమానంగా ఉంటుంది.' అని డాబర్‌నీర్ ప్రతిపాదించాడు. దీన్నే 'డాబర్‌నీర్ త్రిక సిద్ధాంతం' అంటారు.

ఉదా: Li, Na, K; Ca, Sr, Ba; Cl, Br, I డాబర్‌నీర్ త్రికాలు

పరిమితులు: * డాబర్‌నీర్ కాలం నాటికి తెలిసిన మూలకాలన్నింటిని త్రికాలుగా అమర్చలేకపోయాడు. * ఈ సిద్ధాంతం అత్యధిక లేదా అత్యల్ప ద్రవ్యరాశులున్న మూలకాలకు వర్తించలేదు. * పరమాణు ద్రవ్యరాశిని కచ్చితంగా కొలిచే పరికరాలు అభివృద్ధి చెందిన తర్వాత ఈ సిద్ధాంతం కచ్చితమైందిగా నిలవలేకపోయింది.

న్యూలాండ్స్ అష్టక నియమం : జాన్ న్యూలాండ్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త 1865లో మూలకాలను, వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు అవి 7 గ్రూపులుగా ఏర్పడతాయని కనుక్కున్నాడు. ఆ విధంగా ఏర్పడిన గ్రూపుల్లో ఉండే మూలకాలు ఒకేవిధమైన రసాయన ధర్మాలతో ఉంటాయని గమనించాడు. దీని ఆధారంగా ఆయన అష్టక నియమాన్ని ప్రతిపాదించాడు.



లెవోఇజర్


అష్టక నియమం: మూలకాలను వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు వాటి ధర్మాలు నిర్ణీత వ్యవధుల్లో పునరావృతమవుతాయి. ఒక మూలకం నుంచి మొదలుపెడితే ప్రతి ఎనిమిదో మూలకం ధర్మాలు మొదటి మూలక ధర్మాలను పోలి ఉంటాయి. దీన్నే 'న్యూలాండ్స్ అష్టక నియమం' అంటారు. **ఉదా:** F, Na, Mg, Al, Si, P, S, Cl

* న్యూలాండ్స్ మూలకాల పట్టికలో హైడ్రోజన్‌తో మొదలుపెడితే ఎనిమిదో మూలకమైన ఫ్లోరిన్, ఆ తర్వాత ఎనిమిదో మూలకమైన క్లోరిన్‌లు ఒకేరకమైన ధర్మాలను ప్రదర్శిస్తాయి.

పరిమితులు: * న్యూలాండ్స్ ఒకేగడిలో రెండు మూలకాలను పొందుపరిచాడు. **ఉదా:** కోబాల్ట్, నికెల్ * పూర్తిగా భిన్నమైన ధర్మాలున్న కొన్ని మూలకాలను ఒకే గ్రూపులో అమర్చాడు. **ఉదా:** కోబాల్ట్, నికెల్, పెల్లాడియం, ప్లాటినం లాంటి వాటి ధర్మాలకు భిన్నంగా ఉన్న హాలోజన్ మూలకాలైన ఫ్లోరిన్ క్లోరిన్, బ్రోమిన్, అయోడిన్‌లను అమర్చాడు. * ఇతడి అష్టక నియమం కాల్షియం వరకు సరిగ్గానే వర్తించింది. * కాల్షియం కంటే ఎక్కువ పరమాణు ద్రవ్యరాశి ఉన్న మూలకాలకు ఇది వర్తించలేదు. * న్యూలాండ్స్ మూలకాల రసాయన ధర్మాల్లో ఆవర్తన క్రమాన్ని సంగీత స్వరాల్లోని ఆవర్తనంతో పోల్చాడు. ఉదాహరణకు భారతీయ సంగీతంలో ఒక స్కేలులో ఏడు సంగీత స్వరాలుంటాయి. ఎనిమిదో స్థానం తిరిగి మొదటి స్వరం (స) పునరావృతమవుతుంది. అవి స, రి, గ, మ, ప, ద, ని, స. * న్యూలాండ్స్ పట్టిక 56 మూలకాలకు మాత్రమే పరిమితమైంది. కొత్తగా కనిపెట్టబోయే మూలకాలకు ఎలాంటి ఖాళీలను విడిచిపెట్టలేదు.




డాబర్‌నీర్



న్యూలాండ్స్

మెండలీఫ్ ఆవర్తన పట్టిక: మెండలీఫ్ అనే రష్యన్ శాస్త్రవేత్త అప్పటి వరకు తెలిసిన మూలకాలను, వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చి.. 8 నిలువు వరుసలు, 7 అడ్డ వరుసలుగా ఏర్పాటు చేశాడు. * నిలువు వరుసలను గ్రూపులుగా, అడ్డవరుసలను పీరియడ్లుగా పేర్కొన్నాడు. * గ్రూపులను ఎ, బి అనే ఉప గ్రూపులుగా విభజించాడు. * గ్రూపుల్లోని మూలకాలు ఒకే రసాయన ధర్మాలను ప్రదర్శిస్తాయి. * ఉప గ్రూపుల్లో మూలకాల రసాయన ధర్మాలు దాదాపు దగ్గర సంబంధాన్ని కలిగి ఉంటాయి.

* మెండలీఫ్ తన ఆవర్తన పట్టిక అమరికలో లభ్యంకాని మూలకాలకు ఖాళీ గదులను విడిచిపెట్టాడు. అలాగే భవిష్యత్తులో కనుక్కోబోయే మూలకాలకు తాత్కాలిక పేర్లను సూచించాడు. **ఉదా:** * ఎకా బోరాన్ - స్కాండియం * ఎకా అల్యూమినియం - గాలియం * ఎకా సిలికాన్ - జెర్మేనియం. * గాలియం అనే మూలకం అరచేతిలో పెట్టుకుంటే కరిగిపోతుందని ముందుగానే ఊహించి చెప్పాడు. * ఇప్పటి వరకు చెల్లాచెదురుగా ఉన్న వంటశాల లాంటి రసాయన శాస్త్రానికి మెండలీఫ్ పట్టిక ఒక చక్కని అమరిక ఇచ్చింది. * మెండలీఫ్ రసాయన శాస్త్రానికి చేసిన కృషికి 101వ మూలకానికి మెండలీవియం అని పేరుపెట్టారు.



మెండలీఫ్

పరిమితులు: * మెండలీఫ్ తన పట్టికలో అధిక పరమాణు భారం ఉన్న మూలకాన్ని (టెలూరియం Te-127) తక్కువ పరమాణుభారం ఉన్న మూలకం (అయోడిన్ I - 126) కంటే ముందు వరుసలో ఉంచాడు. * ఇతడు ఒకే గ్రూపుల్లో విభిన్న ధర్మాలున్న మూలకాలను ఏర్పాటు చేశాడు.


ఉదా: 1A గ్రూపు మూలకాలైన Li, Na, K లాంటి వాటిని 1B గ్రూప్ మూలకాలైన Cu, Au, Ag లాంటి వాటితో ఏర్పాటు చేశాడు.

* అదేవిధంగా 6A గ్రూపు మూలకాలైన క్లోరిన్ (అలోహం)ను 6B గ్రూపు మూలకానికి చెందిన Mn (లోహం)తో ఏర్పాటు చేశాడు.



రచయిత: చంటి రాజుపాలెం

కుంభవృష్టి కురిపించే మేఘాల రారాజు!



ద్రవ్యరాశి కలిగిన వాయువులతో కూడిన పొర వాతావరణం. ఇది ట్రోపో, స్ట్రాటో, మీసో, థర్మో, ఎక్సో అనే అయిదు ప్రధాన ఆవరణాలతో ఉంటుంది. అవన్నీ సూర్యుడి నుంచి వచ్చే తీవ్రమైన, హానికర కిరణాలను అడ్డుకుంటూ, వడపోస్తూ భూమిపై జీవనయోగ్య పరిస్థితులు కొనసాగే విధంగా చేస్తాయి. మేఘాలు, గాలి, వర్షం తదితర ప్రకృతి పరిణామాలకు కూడా అవే కారణం. వీటి పరిధి, స్వభావం, వాతావరణంలోని వాయువుల శాతాలు, వాటి వల్ల మానవాళికి, జీవావరణ వ్యవస్థలకు కలుగుతున్న ప్రయోజనాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఒక్కో ఆవరణంలో ఉండే ఉష్ణోగ్రత, సాంద్రత, పీడనం, వివిధ రకాల మేఘాలు ఏర్పడే విధానం, వాటి ప్రభావాల గురించి తెలుసుకోవాలి.

డీఎస్సీ/టెట్ - 2024: జాగ్రఫీ

వాతావరణం

1. కిందివాటిలో ట్రోపో ఆవరణానికి సంబంధించి సరికానిది గుర్తించండి.
   1) ఈ ఆవరణం భూ పటలం నుంచి సరాసరి 13 కి.మీ. ఎత్తువరకు విస్తరించి ఉంటుంది.
   2) దీన్ని మిశ్రమ ఆవరణం అంటారు.
   3) ఈ ఆవరణం భూమధ్యరేఖ ప్రాంతంలో 18 కి.మీ. వరకు విస్తరించి ఉంటుంది.
   4) ఈ ఆవరణం ఎత్తు భూమధ్యరేఖ వద్ద ఎక్కువగా, ధ్రువాల వద్ద తక్కువగా ఉంటుంది.
2. కిందివాటిలో స్ట్రాటో ఆవరణానికి సంబంధించి సరైన సమాధానం గుర్తించండి.
   1) ఈ ఆవరణాన్ని ఓజోన్ ఆవరణం అని కూడా అంటారు.
   2) ఈ ఆవరణంలో ఎత్తుకు వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి.
   3) ఈ ఆవరణంలో దిగువ భాగాన విమానయానానికి అత్యంత అనుకూలంగా ఉంటుంది.
   4) పైవన్నీ
3. కిందివాటిలో మీసోస్ఫియర్‌కు సంబంధించి సరికాని సమాధానం గుర్తించండి.
   1) ఈ ఆవరణంలోకి ఖగోళ వస్తువులు ప్రవేశించగానే పేలిపోతాయి.
   2) ఈ ఆవరణాన్ని బాహ్య ట్రోపో ఆవరణం అంటారు.
   3) ఈ ఆవరణంలో ఎలాంటి మేఘాలు ఏర్పడవు.
   4) ఈ ఆవరణంలో నోక్టిలూసెంట్ మేఘాలు ఏర్పడతాయి.
4. కిందివాటిని జతపరచండి.

ఎ) ట్రోపో ఆవరణం	1) ఐనో ఆవరణం
బి) స్ట్రాటో ఆవరణం	2) నోక్టిలూసెంట్ మేఘాలు
సి) మీసో ఆవరణం	3) ఓజోన్ ఆవరణం
డి) థర్మో ఆవరణం	4) అలజడి ఆవరణం

   1) ఎ-1, బి-2, సి-3, డి-4
   2) ఎ-3, బి-2, సి-1, డి-4
   3) ఎ-4, బి-3, సి-2, డి-1
   4) ఎ-4, బి-1, సి-3, డి-2
5. కిందివాటిని సరిచూడండి.
   ప్రతిపాదన (A): థర్మో ఆవరణంలో ఉష్ణోగ్రతలు పెరగడం ద్వారా అక్కడి వాయువులు అయాన్లుగా మారతాయి.
   కారణం (R): థర్మో ఆవరణాన్ని ఐనో ఆవరణం అని కూడా అంటారు.
   1) A, R లు రెండూ సరైనవే.
   2) A సరైంది, R సరైంది కాదు.
   3) A, R లు రెండూ సరికావు.
   4) A సరైంది కాదు, R సరైంది.
6. కిందివాటిలో ఎక్సో ఆవరణం గురించి సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఈ ఆవరణంపై భూ గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉంటుంది.
   బి) దీన్ని బాహ్య ఆవరణం అని కూడా అంటారు.
   సి) ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉంటాయి.
   డి) ఈ ఆవరణంలో పదార్థం ప్లాస్మాస్థితిలో ఉంటుంది.
   1) ఎ, బి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, డి 4) పైవన్నీ
7. కిందివాటిలో వాతావరణంలోని ఆవరణాలకు సంబంధించి సరికానిది గుర్తించండి.
   1) వాతావరణంలోని మొదటి మూడు ఆవరణాలను కలిపి సమరూప ఆవరణాలు అంటారు.
   2) వాతావరణంలో ఐనోస్ఫియర్, థర్మోస్ఫియర్‌లను కలిపి బహురూప ఆవరణం అంటారు.
   3) అరోరా బోరియాలిస్, అరోరా ఆస్ట్రాలిస్ అనే ధ్రువ కాంతులు ఎక్సో ఆవరణంలో ఏర్పడతాయి.
   4) స్ట్రాటో ఆవరణం 80 కి.మీ. వరకు విస్తరించి ఉంటుంది.
8. కిందివాటిలో ట్రోపో ఆవరణానికి సంబంధించి సరైంది?
   1) మొత్తం వాతావరణంలో 75% ఈ ఆవరణంలోనే కేంద్రీకృతమై ఉంటుంది.
   2) ఈ ఆవరణంలో ద్రవీభవనం, బాష్పీభవనం, అవపాతం లాంటి వాతావరణ మార్పులు జరుగుతాయి.
   3) ఆ ఆవరణం పైభాగంలో అత్యంత వేగమైన జెట్ స్ట్రీమ్స్ ఉంటాయి.
   4) పైవన్నీ
9. కిందివాటిని సరిచూడండి.
   ప్రతిపాదన (A): వాతావరణంలో ఎత్తుకు వెళ్లేకొద్దీ ప్రతి 165 మీటర్లకు 1 ^{o}C ఉష్ణోగ్రత తగ్గుతుంది.
   కారణం (R): వాతావరణంలో ఈ విధమైన ఉష్ణోగ్రత తగ్గుదలను సాధారణ క్షీణత క్రమం అంటారు.
   1) A, R లు రెండూ సరికావు.
   2) A సరైంది, R సరికాదు.
   3) A సరికాదు, R సరైంది.
   4) A, R లు రెండూ సరైనవి.
10. కిందివాటిని జతపరచండి.

వాతావరణంలోని వాయువులు	శాతం
ఎ) నైట్రోజన్	1) 0.3%
బి) ఆక్సిజన్	2) 0.9%
సి) ఆర్గాన్	3) 20.9%
డి) కార్బన్ డై ఆక్సైడ్	4) 78%

   1) ఎ-1, బి-2, సి-3, డి-4
   2) ఎ-3, బి-1, సి-2, డి-4
   3) ఎ-4, బి-3, సి-2, డి-1
   4) ఎ-3, బి-2, సి-1, డి-4
11. కిందివాటిని సరిచూడండి.
   ప్రతిపాదన (A): అనేక రకాల వాయువులు భూమి చుట్టూ కేంద్రీకృతమవడానికి కారణం భూమికి ఉండే గురుత్వాకర్షణ శక్తి.
   కారణం (R): భూమి కేంద్రకంలో నికెల్, ఫెర్రస్ మూలకాల వల్ల కలిగే అయస్కాంతత్వం కారణంగా భూమికి గురుత్వాకర్షణ శక్తి వస్తుంది.
   1) A, R లు రెండూ సరికావు.
   2) A, R లు రెండూ సరైనవి.
   3) A సరైంది, R సరికాదు.
   4) A సరికాదు, R సరైంది.
12. కిందివాటిలో మేఘాలకు సంబంధించిన సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) క్యుములోనింబస్ మేఘాలు అతిపెద్దవిగా, నలుపు రంగులో ఉంటాయి. వీటినే మేఘాల రారాజు అంటారు. కుంభవృష్టికి ఇవే కారణం.
   బి) నోక్టిలూసెంట్ మేఘాలు మీసో ఆవరణంలో ఖగోళ ధూళి వల్ల ఏర్పడతాయి.
   సి) సిర్రస్ మేఘాలు మేఘాలు స్ట్రాటో ఆవరణం వద్ద ఏర్పడతాయి.
   డి) స్ట్రాటస్ మేఘాలు కొండలు, గుట్టలపై కనిపిస్తూ వేగంగా కదులుతుంటాయి.
   1) ఎ, బి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, సి 4) సి, డి
13. కిందివాటిలో వాతావరణ లక్షణాలకు సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) వాతావరణంలో ప్రతి వాయువుకు కొంత బరువు ఉంటుంది.
   బి) వాతావరణం ఒక గాజులా పారదర్శకంగా పనిచేస్తుంది.
   సి) వాతావరణం కంటికి కనిపించదు. ఇది అగోచరం.
   డి) వాతావరణానికి కచ్చితమైన రంగు, రుచి, వాసన లాంటివి ఉండవు.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
14. కిందివాటిలో మీసో ఆవరణానికి సంబంధించి సరికాని వాక్యాన్ని గుర్తించండి.
   ఎ) ఈ ఆవరణంలో వాయువులు దాదాపుగా నిశ్చలంగా ఉంటాయి.
   బి) ఈ ఆవరణాన్ని రసాయనిక ఆవరణం అని కూడా అంటారు.
   సి) ఈ ఆవరణం పై భాగంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా పెరుగుతాయి.
   డి) ఈ ఆవరణంలో సిర్రస్ మేఘాలు ఏర్పడతాయి.
   1) ఎ, బి 2) బి, సి
   3) సి, డి 4) డి, ఎ
15. కిందివాటిలో థర్మోస్ఫియర్‌కు సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఈ ఆవరణంలో వాయువుల సాంద్రత అత్యల్పంగా ఉంటుంది.
   బి) ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతాయి.
   సి) ఈ ఆవరణంలో వాయువులు అయాన్లుగా మారి రేడియో తరంగాలను భూమి మీదకు పరావర్తనం చెందిస్తాయి.
   డి) ఈ ఆవరణం సమాచార వ్యవస్థకు అత్యంత అనుకూలంగా ఉంటుంది.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) సి, డి, ఎ 4) ఎ, బి, సి, డి
16. స్ట్రాటో ఆవరణానికి సంబంధించి, సరికాని వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఈ ఆవరణంలో పదార్థం నాలుగో రూపమైన ప్లాస్మా స్థితిలో ఉంటుంది.
   బి) ఈ ఆవరణంపై భూ గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉంటుంది.
   సి) ఈ ఆవరణాన్ని సమాచార ఆవరణం అంటారు.
   డి) ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు క్రమేణా తగ్గుతాయి.
   1) ఎ, బి, సి, డి 2) డి మాత్రమే
   3) ఎ, బి 4) సి మాత్రమే
17. కిందివాటిలో సిర్రస్ కుటుంబ మేఘాలకు సంబంధించి, సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఇవి అత్యంత ఎత్తులో స్ట్రాటో ఆవరణంలో ఏర్పడతాయి.
   బి) ఇవి ఒక పలుచని పొరలాగా వ్యాపించి ఉంటాయి.
   సి) సిర్రో స్ట్రేటస్ మేఘాలు తుపానులు వచ్చేముందు వస్తాయి.
   డి) ఇవి సరాసరిగా 6000 మీటర్ల నుంచి 12,000 మీటర్ల ఎత్తులో ఏర్పడతాయి.
   1) ఎ, బి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు
18. స్ట్రాటస్ కుటుంబ మేఘాలకు సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) స్ట్రాటస్ మేఘాలు సాధారణంగా కొండలపై, గుట్టలపై ఏర్పడతాయి.
   బి) ఇవి చాలా వేగంగా, చురుకుగా కదులుతాయి.
   సి) స్ట్రాటో క్యుములస్ మేఘాలు బూడిద రంగులో ఉండి అలలుగా విస్తరించి ఉంటాయి.
   డి) స్ట్రాటో నింబస్ మేఘాలు దాదాపుగా నలుపు రంగులో విస్తరించి ఉంటాయి.
   1) ఎ, బి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
19. కిందివాటిలో వాతావరణానికి సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఇది శబ్దాలు, వాసనలను ఒక చోట నుంచి మరొక చోటుకు మోసుకెళుతుంది.
   బి) వాతావరణం బరువు కూడా ఉంటుంది.
   సి) వాతావరణంలో వాయువులు, నీటిఆవిరి, దుమ్ము, ధూళి కణాలు ఉంటాయి.
   డి) ఇది భూమి, సూర్యుడి నుంచి వెలువడే ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరిస్తుంది.
   1) ఎ, బి 2) సి, డి
   3) ఎ, బి, సి, డి
   4) బి, సి, డి



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-3; 2-1; 3-3; 4-3; 5-1; 6-3; 7-4; 8-4; 9-4; 10-3; 11-2; 12-2; 13-3; 14-3; 15-4; 16-1; 17-3; 18-4; 19-3.

రైల్వేజోన్‌కు శ్రీకారం

- డిసెంబరులో విశాఖలో ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన
- ప్రధాని చేతుల మీదుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ప్రధాని మోదీతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ.. ఏపీ విజన్‌పై చర్చ
- రైల్వే, ఐటీ ప్రాజెక్టులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సుదీర్ఘ చర్చ


ప్రధాని మోదీకి జ్ఞాపిక అందిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు. చిత్రంలో రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, తెదేపా లోక్‌సభాపక్ష నేత శ్రీకృష్ణదేవరాయలు, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, దిల్లీ: అమరావతికి ప్రపంచబ్యాంకు ద్వారా నిధులు సమకూర్చడానికి, పోలవరం తొలిదశ పనులు పూర్తి చేయడానికి ఇప్పటికే ఆమోదముద్ర వేసిన కేంద్ర ప్రభుత్వం.. విభజన హామీల్లో ముఖ్యమైన రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికీ పచ్చజెండా ఊపింది. డిసెంబరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా విశాఖపట్నంలో దీనికి శంకుస్థాపన జరగనుంది. ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లతో భేటీ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాన్ని ఎన్డీయే కూటమి ఎంపీలతో చెప్పారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం సాయంత్రం దిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే ప్రధాని మోదీని కలిశారు. సుమారు గంటా పదిహేను నిముషాలపాటు ఈ భేటీ సాగింది. ఈ సందర్భంగా చంద్రబాబు అమరావతి, పోలవరం నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వ సాయం, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం, ఇటీవల సంభవించిన వరదల కారణంగా జరిగిన నష్టాన్ని సరిదిద్దడానికి కేంద్ర సాయం గురించి చర్చించారు. కేంద్ర ప్రభుత్వ వికసిత భారత్- 2047 విజన్‌కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడానికి ఆంధ్రా-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని ప్రధానితో చెప్పారు. స్వాతంత్ర్య శతవసంతాలు నిర్వహించుకునే 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల స్థాయికి, తలసరి ఆదాయాన్ని 43 వేల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ లక్ష్య సాధన కోసం కేంద్రం నుంచి తగిన సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. రాష్ట్రాభివృద్ధికి అతి ముఖ్యమైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను మంజూరు చేయాలని కోరారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనను ఆంధ్రప్రదేశ్‌లో మరింత మందికి విస్తరించేందుకు వీలుగా చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు సాయం చేయడానికి ప్రధాని సానుకూలంగా స్పందించినట్లు సీఎంఓ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది.

చంద్రబాబుతో రైల్వే మంత్రి భేటీ

ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. రైల్వే మంత్రి దిల్లీలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసం 1-జన్‌పథ్‌కే వచ్చి చంద్రబాబుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ఐటీ, సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుపైనా సమాలోచనలు జరిపారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ నైపుణ్యాలు, డిజిటల్ అక్షరాస్యత పెంపొందించడానికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏర్పాటు చేయండి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సెమీకండక్టర్ పరిశ్రమలను ఏపీకి రప్పించడానికి అనుకూలమైన వాతావరణం కల్పించండి. ఉన్నతశ్రేణి ఉద్యోగాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల వాటా పెంచడానికి వీలుగా ఫ్యాబ్రికేషన్ సౌకర్యాలను ఏపీకి తీసుకురండి. అంతర్జాతీయ సౌజన్యంతో రాష్ట్రంలో డేటా రాయబార కార్యాలయం ఏర్పాటు చేయండి. డ్రోన్, సీసీటీవీ టెక్నాలజీలను ప్రోత్సహించే విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని స్టార్టప్‌లకు మద్దతివ్వండి. 2034కల్లా పేదరికం లేని రాష్ట్ర లక్ష్యాన్ని చేరుకోవడానికి మీ శాఖపరంగా చేయూతనివ్వండి' అని మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

విశాఖ- అమరావతి కొత్త లైను మంజూరు చేయండి

రాష్ట్రంలో రైల్వే మౌలిక వసతుల మెరుగుదలపైనా చంద్రబాబు అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించారు. 'వాల్తేర్ డివిజన్‌ను యథావిధిగా ఉంచుతూనే విభజన చట్టంలో చెప్పిన దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చండి. విశాఖపట్నం- అమరావతి మధ్య కొత్త రైల్వేలైన్ మంజూరు చేసి రెండేళ్లలోపు పూర్తి చేయండి. మచిలీపట్నం- అమరావతి మధ్య కొత్త లైన్ మంజూరు చేయండి. ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం అంతటా రైల్వే అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు వీలుగా హౌడా-చెన్నై లైన్ సామర్థ్యాన్ని పెంచండి. నమోభారత్ కింద విశాఖ-నెల్లూరు మధ్య రైలు అనుసంధానాన్ని మెరుగుపరచండి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల నుంచి అమరావతికి హైస్పీడ్ రైల్వే కారిడార్లను అభివృద్ధి చేయండి. అమృత్‌భారత్ స్టేషన్ స్కీం కింద ప్రకటించిన రైల్వేస్టేషన్ల అభివృద్ధిని ప్రాధాన్యతాక్రమంలో చేపట్టండి. నరసాపురం- మచిలీపట్నం- రేపల్లె- బాపట్ల మధ్య కొత్త రైల్వేలైన్ మంజూరు చేయడంతోపాటు, ఈ లింక్‌ను బాపట్ల దగ్గర కోల్‌కత్తా- చెన్నైలతో అనుసంధానించండి' అని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలన్నింటిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న.. కొత్త రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం ఏర్పాటు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నందుకు కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపినట్లు చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు. డిసెంబరుకల్లా కొత్త రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన జరుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రైల్వే శాఖ రూ.73,743 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు రైల్వే మంత్రి చెప్పారని వెల్లడించారు. ఇందులో హౌవ్‌డా- చెన్నై మధ్య నిర్మిస్తున్న 4 వరుసల లైన్ రాష్ట్రం గుండా సాగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 73 రైల్వేస్టేషన్లను ఆధునికీకరిస్తున్నారని, మరికొన్ని రైళ్లను ప్రవేశపెట్టబోతున్నారని చెప్పారు.

ఎంపీల పనితీరుకు గ్రేడింగ్

ఈ సమావేశాల అనంతరం చంద్రబాబు దిల్లీలోని తన అధికార నివాసంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, ఎంపీలకు విందు ఇచ్చారు. ఎంపీల పనితీరును అడిగి తెలుసుకున్నారు. 'పార్లమెంటులో హాజరు నుంచి సభలో జరిగే చర్చల్లో పాల్గొన్న విధానం, రాష్ట్రానికి కేంద్ర నిధులు రాబట్టడంలో చేసిన కృషి, రాష్ట్ర సమస్యల పరిష్కారంలో మీరు పోషిస్తున్న పాత్ర ఇవన్నీ మదించి, గ్రేడింగ్ ఇస్తాం. ఏపీ భవన్ అధికారులతో కలిసి సమస్యల పరిష్కారం కోసం మీరంతా చొరవ తీసుకోవాలి. మూడునెలలకోసారి సమీక్షించి, అన్ని అంశాలపై చర్చిస్తా. ప్రతి ఎంపీ తమ పార్లమెంటు నియోజకవర్గంపై విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి. విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారమవుతుంది. రాష్ట్రానికి భవిష్యత్తులో హైస్పీడ్ రైలు కారిడార్ వస్తుంది. ఎంపీలంతా కొత్త ఆలోచనలతో రావాలి. ప్రతి అంశాన్ని నాతో పంచుకోవాలి' అని ఆయన ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ప్రధానమంత్రి రాష్ట్రం పట్ల చాలా సానుకూలతతో ఉన్నారని చంద్రబాబు వారితో వ్యాఖ్యానించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇటీవల నారావారిపల్లిలో పర్యటించినప్పుడు తన దృష్టికి వచ్చిన విషయాలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. 'మా ఊరి గురించి అంతా ఇన్వెస్టిగేషన్ చేశావన్నమాట' అని ఆయన నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

నేడు పలువురు మంత్రులతో భేటీ

చంద్రబాబు మంగళవారం కేంద్ర మంత్రులు అమిత్‌షా, నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, నిర్మలా సీతారామన్, హర్‌దీప్‌సింగ్ పూరీలను కలవనున్నారు. వరద సాయం, అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల అభివృద్ధి, విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం, రాష్ట్రంలో పెట్రోలియం రిఫైనరీ ఏర్పాటు, బడ్జెట్‌లో ప్రకటించిన పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి గురించి చర్చించనున్నారు.

పోలవరానికి శుభవార్త

- రూ.2,800 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- ఇందులో రూ.2 వేల కోట్లు అడ్వాన్స్‌గా, రూ.800 కోట్లు బకాయిల కింద మంజూరు!
- ఎన్డీయే 3.0లో వేగంగా, సానుకూల నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం శుభవార్త వినిపించింది. రూ.2,800 కోట్ల నిధులు విడుదల చేసింది. ఏ పద్దు కింద ఈ మొత్తాన్ని విడుదల చేసిందో స్పష్టమైన సమాచారం రాలేదు. పాత బిల్లుల రీయింబర్స్‌మెంట్ కింద రూ.800 కోట్లు, అడ్వాన్సుగా పనులు చేపట్టేందుకు రూ.2,000 కోట్లు ఇచ్చినట్లుగా ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. 2014లో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం నిధులు రీయింబర్స్ చేస్తూ వస్తోంది. అంటే తొలుత రాష్ట్ర ప్రభుత్వం తన నిధులు ఖర్చుచేసి పనులు చేయిస్తే, ఆ బిల్లులు పంపించాక కేంద్రం పరిశీలించి, దశల వారీగా నిధులు విడుదల చేస్తూ వస్తోంది. జగన్ ప్రభుత్వంలోనూ అడ్వాన్సుగా నిధులు ఇవ్వాలని పదేపదే కోరినా ఆ ప్రయత్నాలు ఫలించలేదు. అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు తొలిసారిగా అంగీకారం తెలిపిన మోదీ సర్కారు.. సోమవారం ఆ మాట నిలబెట్టుకుంది.

తాజా డీపీఆర్ ఆమోదంతో...

రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక తర్వాత పోలవరం ప్రాజెక్టు సాకారం దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. రూ.30,436 కోట్లతో ప్రాజెక్టు కొత్త డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం నెలరోజుల కిందటే ఆమోదించింది. దీంతో గతంలో ఇచ్చిన నిధులు పోనూ రూ.12,157 కోట్లు కేంద్రం నుంచి అదనంగా పొందేందుకు వీలు చిక్కింది. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి, ఈ నిధులు అడ్వాన్సుగా ఇచ్చేందుకు అంగీకరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.6వేల కోట్లు, వచ్చే ఏడాది రూ.6,157 కోట్లు మంజూరు చేసేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రూ.7 వేల కోట్ల వరకు అవసరమని పోలవరం అధికారులు చెబుతున్నారు.

బకాయిలే రూ.1,615.47 కోట్లు

పోలవరంలో చేసిన పనులకు సంబంధించి కేంద్రం నుంచి రూ.1,615.47 కోట్ల బకాయిలు రాష్ట్రానికి రావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం రూ.1,615.47 కోట్ల విలువైన పనులు చేసినప్పటికీ, అందులో గుత్తేదారులకు చెల్లించిన మొత్తం రూ.800 కోట్లే. పైగా పాత డీపీఆర్ ప్రకారం ఆ నిధులు ఇచ్చేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ప్రస్తుతం కొత్త డీపీఆర్ ఆమోదం పొందడంతో అందులో నిధులు తీసుకునేందుకు వెసులుబాటు కలిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చెల్లించి, బిల్లులు కూడా సమర్పించిన రూ.800 కోట్లు రీయింబర్స్ చేసినట్లు తెలుస్తోంది. అలాగే రూ.2,000 కోట్లు తక్షణమే అడ్వాన్స్‌గా కావాలని అడిగినందున ఆ మొత్తమూ ఇచ్చి ఉంటారని పోలవరం అధికారులు భావిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమయ్యాక కేంద్రం నుంచి ఇంత వేగంగా సానుకూల నిర్ణయాలు తీసుకోవడం, నిధులు మంజూరు కావడం ఇదే తొలిసారని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.


రేపు తెదేపాలో చేరనున్న మోపిదేవి, బీద మస్తాన్‌రావు

ఈనాడు, అమరావతి: వైకాపాకు, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మోపిదేవి వెంకటరమణరావు, బీద మస్తాన్‌రావు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఇద్దరు నేతలూ పసుపు కండువాలు కప్పుకోనున్నారు. ఆగస్టు 29న వారిద్దరూ ఎంపీ పదవులకు, వైకాపాకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తర్వాత మోపిదేవి తన అనుచరులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి.. చర్చించారు.


సింహ వాహనంపై త్రిశూలధారియైన శ్రీ మహాచండీ అమ్మవారు

శ్రీమహాచండీ రూపంలో దుర్గమ్మ

ఈనాడు, అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గమ్మ సోమవారం మహాలక్ష్మి, మహాకాళీ, మహాసరస్వతీ కలిసిన త్రిశక్తి స్వరూపిణి అయిన శ్రీ మహాచండీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీమహాచండీదేవిని దర్శించుకున్నారు. ఇప్పటివరకూ ఐదు రోజుల్లో మూడున్నర లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున 4గంటల నుంచి రాత్రి 11వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తున్నారు. శరన్నవరాత్రి వేడుకల్లో నిత్యం రాష్ట్రంలోని వివిధ ఆలయాల నుంచి సారె తీసుకొచ్చి దుర్గమ్మకు సమర్పిస్తున్నారు. సోమవారం శ్రీకాళహస్తి దేవస్థానం నుంచి సారెను తీసుకొచ్చి అందజేశారు.



స్కందమాత అలంకారంలో పూజలందుకుంటున్న అమ్మవారు

స్కందమాత అలంకారంలో శ్రీశైల అమ్మవారు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఐదో రోజు సోమవారం శ్రీభ్రమరాంబాదేవి భక్తులకు స్కందమాత అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీస్వామిఅమ్మవార్లు శేష వాహనంపై కొలువుదీరారు. ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల సందడి, కళాకారుల నృత్య ప్రదర్శన మధ్య శ్రీగిరి పురవీధుల్లో శ్రీస్వామిఅమ్మవార్లకు నేత్రశోభితంగా గ్రామోత్సవం జరిగింది.


టాక్ ఆధ్వర్యంలో జరిగిన చేనేత బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

లండన్‌లో చేనేత బతుకమ్మ ఉత్సవాలు

టాక్ ఆధ్వర్యంలో నిర్వహణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్(టాక్) ఆధ్వర్యంలో సోమవారం లండన్‌లో చేనేత బతుకమ్మ, దసరా ఉత్సవాలు భారీఎత్తున జరిగాయి. బ్రిటన్ నలుమూలల నుంచి రెండు వేల మందికి పైగా తెలుగు వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక హౌన్‌స్లో మేయర్ కారెన్ స్మిత్, భారత సంతతికి చెందిన మాజీ ఎంపీ వీరేంద్ర శర్మ, భారత హైకమిషన్ ప్రతినిధి అజయ్ కుమార్ ఠాకుర్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, కౌన్సిలర్లు ప్రీతమ్ గ్రేవాల్, అజ్మీర్ గ్రేవాల్, ప్రభాకర్ ఖాజా, ప్రవాస సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు గౌరీదేవి పూజలు నిర్వహించారు. బతుకమ్మ ఆటపాటలతో చేసిన నృత్యాలు అలరించాయి.



కెనడాలో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

కెనడాలోని హాలిఫ్యాక్స్ నగరంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మ్యారిటైం తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు అక్కడ నివసించే తెలంగాణ కుటుంబాల మహిళలు కుటుంబ సమేతంగా పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలంతా భక్తిశ్రద్ధలతో గౌరీపూజ చేసి.. పూలతో బతుకమ్మలను పేర్చారు. మహిళలు సంప్రదాయసిద్ధంగా ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది.

'యువగళం'లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం

ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఆదాయం లేని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాల కోసం నెలకు రూ.పది వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మిగిలిన ప్రతి హామీని అమలు చేస్తామని ఎక్స్ వేదికగా సోమవారం స్పష్టం చేశారు. "గతంలో బ్రాహ్మణులు వారి సమస్యలను నా దృష్టికి తెచ్చారు. ఆనాడే ఆర్థిక సాయాన్ని రూ.పది వేలకు పెంచుతానని హామీ ఇచ్చాను. నేడు అమలు చేశాను. దీని వల్ల సుమారు 5,400 చిన్న ఆలయాల్లో దేవుడికి ఎలాంటి అవాంతరం లేకుండా పూజాదికాలు జరుగుతాయి' అని లోకేశ్ పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు 75% హాజరు తప్పనిసరి

ఏపీ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికాశుక్లా

ఈనాడు డిజిటల్, అమరావతి: ఇంటర్మీడియట్ విద్యార్థుల హాజరుపై స్పష్టతనిస్తూ బోర్డు కార్యదర్శి కృతికాశుక్లా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి, రెండో ఏడాది చదివే రెగ్యులర్ విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. 75% కంటే తక్కువ ఉంటే అపరాధ రుసుము చెల్లించాలని పేర్కొన్నారు. '60-65% ఉంటే రూ.2వేలు, 65-70% ఉంటే రూ.1,500, 70-75% ఉంటే రూ.1,000 అపరాధ రుసుము చెల్లించాలి. 60 శాతం కంటే తక్కువ హాజరు ఉంటే.. సైన్సు విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయడానికి అనర్హులు. ఆర్ట్స్ విద్యార్థుల్ని ప్రైవేట్ క్యాండిడేచర్ కింద పరిగణనలోకి తీసుకుని పరీక్షలకు అనుమతిస్తారు' అని తెలిపారు. ఒకేషన్ విద్యార్థులకూ ఇది వర్తిస్తుందన్నారు.

ఇసుకకు ఎక్కువ ధర వసూలు చేస్తే చర్యలు

మచిలీపట్నం, న్యూస్‌టుడే: ప్రజలు కోరుకున్నట్లుగా ఈ నెల 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 184 రీచ్‌లలో ఇసుక అందుబాటులోకి తెస్తున్నట్లు ఏపీ గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రతి ఏడాది దాదాపు 3 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుందని, బోట్స్‌మ్యాన్ సొసైటీలు, పట్టా భూముల నుంచి ఇసుక తీసుకోవచ్చన్నారు. రోబో సాండ్‌ను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ వసూలు చేస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వన్యప్రాణుల రక్షణ జీవన విధానంలో భాగమవ్వాలి

- వన్యప్రాణి వారోత్సవంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్


వన్యప్రాణి వారోత్సవంలో తాబేళ్ల బొమ్మలతో కూడిన స్టాల్ వద్ద ఫొటో తీస్తున్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు డిజిటల్, అమరావతి: 'వన్యప్రాణుల రక్షణ జీవన విధానంలో భాగం కావాలి. నల్లమల అడవిలో జీవించే చెంచులు వన్యప్రాణులను దేవుళ్లుగా భావిస్తారు. పెద్దపులిని పెద్దమ్మగా, ఎలుగుబంటిని లింగమయ్యగా, అడవి పందిని బంగారు మైసమ్మగా, రేసు కుక్కను బవరమ్మగా కొలుస్తారు. పురాణాల్లో సైతం మత్స్య, కూర్మ, వరాహ అవతారాలకు విశిష్టత ఉంది. వన్యప్రాణుల రక్షణ గురించి పురాణ గాథలు మనకు చెప్పే విలువలు ఇవి' అని ఏపీ ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో సోమవారం నిర్వహించిన 70వ వన్యప్రాణి వారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'వసుధైక కుటుంబంలో సమస్త జీవకోటికీ చోటు ఉంది. మనకున్న సాంకేతికత, విజ్ఞానంతో ఇతర జీవులకంటే ఉన్నతంగా ఉన్నాం. మనపై ఆధారపడిన, మనతో జీవనం సాగించే ఇతర జీవరాశులన్నింటినీ రక్షించుకుంటేనే మనిషి జీవితం సాఫీగా సాగుతుంది. వన్యప్రాణులు, సముద్ర జీవులు, ఇతర జీవరాశి మనుగడలో ఉంటేనే మనిషికి స్వచ్ఛమైన గాలి, నీరు అందుతుంది' అని చెప్పారు. 'సముద్ర జీవుల్ని రక్షించడానికి ప్రత్యేకంగా ఓ సంస్థ పనిచేయడం సంతోషంగా ఉంది. సముద్ర తాబేళ్ల రక్షణ కోసం వారు చేస్తున్న కృషి ప్రశంసనీయం. వీరిలో మత్స్యకారులు కూడా ఉన్నారు. కొన్ని అవసరాల కోసం సముద్ర జీవులను వేటాడుతున్నాం. వేటాడే మనిషే వాటి జాతిని పెంచేందుకు కూడా ఆలోచించాలి. లేకుంటే భవిష్యత్తు తరాలకు ఈ అరుదైన సంపదను ఇవ్వలేం' అని తెలిపారు. 'పిల్లలకు ప్రకృతి, పర్యావరణ అవసరాలను తెలియజేయాలి. మన వంతుగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. మొక్కలు నాటాలి' అని పిలుపునిచ్చారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పవన్ కల్యాణ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రారంభించి, తిలకించారు. వన్యప్రాణుల విశేషాలతో కూడిన పుస్తకం, సముద్ర జీవ సాక్ష్యం యాప్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి, సీనియర్ అధికారులు ఎ.కె.నాయక్, ఆర్.పి.ఖజురియా, డాక్టర్ శ్రీధర్, రేవతి, రాహుల్ పాండే, శాంతిప్రియ పాండే పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాలో ప్రేమోన్మాది కిరాతకం

- బాలిక ఇంటిపై అర్ధరాత్రి కత్తితో దాడి
- బాలిక సహా ఆమె తల్లిదండ్రులకు గాయాలు


జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రేమించను అన్న పాపానికి బాలిక ఇంటికెళ్లి ఆమెతో పాటు తల్లిదండ్రులపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడో కిరాతకుడు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలంలోని ఓ గ్రామంలో బాలిక కుటుంబంపై జరిగిన ఈ రాక్షస కాండ సంచలనం రేపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక గతంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంది. ఆ సమయంలో మండలంలోని రాజోలు పంచాయతీ పరిధి రెడ్లపాలేనికి చెందిన కుంచాల భార్గవ్‌రెడ్డి తనను ప్రేమించాలంటూ ఆమె వెంటపడ్డాడు. విషయం తెలిసి బాలిక తల్లిదండ్రులు ఆమెను చదువు మాన్పించి, ఇంటి వద్దే ఉంచారు. కుమార్తె పెళ్లి చేయాలని కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. విషయం తెలిసిన భార్గవ్‌రెడ్డి తనకు దక్కని బాలిక, ఇంకెవరికీ దక్కకూడదని భావించాడు. ఆదివారం అర్ధరాత్రి గ్రామానికే చెందిన ఓ బాలుడి సాయంతో బాలిక ఇంటికి వెళ్లాడు. నిద్ర లేచిన ఆమె తల్లిదండ్రులు ఎవరని ప్రశ్నించగా, అంతలోనే వెంట తెచ్చుకున్న కత్తితో వారిపై దాడి చేశారు. బాలిక తండ్రి ఛాతీ, వీపుపై కత్తితో పొడిచాడు. అడ్డొచ్చిన బాలిక, ఆమె తల్లికీ గాయాలయ్యాయి. వీరి అరుపులు విని ఇరుగుపొరుగు వారు నిద్ర లేచి పరుగెత్తుకొచ్చారు. వారి రాకను గమనించిన నిందితుడు.. బాలుడితో కలిసి పారిపోయాడు. క్షతగాత్రులను స్థానికులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నిందితులు పరారీలో ఉన్నారని ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

ఫోన్‌కు అందుబాటులో లేని పోలీసులు?

ఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు చెరుకుపల్లి ఠాణాకు పలుమార్లు ఫోన్ చేశామని, నేరుగా ఎస్సై సెల్‌ఫోన్‌కు చేసినా ఎవరూ స్పందించలేదని గ్రామస్థులు వాపోయారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం వారు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. తహసీల్దార్ పద్మావతి, రేపల్లె గ్రామీణ సీఐ సురేశ్‌బాబు అక్కడికి వచ్చి, ఆందోళనకారులతో మాట్లాడారు. 24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో తగిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు రాస్తారోకోను విరమించారు.

శ్రీవారి సేవలో జస్టిస్ దుప్పల వెంకటరమణ


సర్వభూపాల వాహనం ఎదుట మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, కుమార్తె సాత్విక. చిత్రంలో తితిదే ఈవో శ్యామలరావు తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన సర్వభూపాల వాహన సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ పాల్గొన్నారు. కుటుంబసభ్యులతో కలిసి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారిని దర్శించుకున్నారు. తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.